ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

శ్రీకాకుళం

: fb.com/vaartha Digital

Published from Srikakulam ,Visakhapatnam, Vijayawada, Hyderabad,Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem,

26-8-2026 బుధవారం సంపుటి: 32 సంచిక: 207 పేజీలు: 16 వెల: 6.50

భారత్ ప్రజాస్వామ్యానికి బిఎల్‌ఒలే పునాది

కులగణనలో 'ఓపన్‌ఎండెడ్' వద్దు

5లో



వెలిగొండ శంకుస్థాపన కార్యక్రమంలో సిఎం చంద్రబాబు (ఫైల్)

# 30 యేళ్ల సంకల్పం నెరవేరింది!

## వెలిగొండ 'వెలుగుల దండ'

### జలసిరులు - అభివృద్ధికి రెక్కలు

**'ఎక్స్' వేదికగా తన భావాలను వ్యక్తం చేసిన చంద్రబాబు**

**31న ప్రాజెక్టును ప్రారంభించబోతున్నాం: సిఎం వెల్లడి**

**విజయవాడ, ఆగస్టు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రతి రైతు పొలానికి నీరు... ప్రతి యువకుడికి ఉపాధి... ప్రతి కుటుంబానికి భరోసా కల్పించాలని సిబిఎన్ అనే నేను సంకల్పించినట్టు 'ఎక్స్' వేదికగా ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. ఇంటింటికి కుళాయి ద్వారా పశ్చిమ ప్రకాశం జిల్లా ప్రజలను ఫ్లోరైడ్ సమస్యకు శాశ్వత సమస్య చూపిస్తామంటూ భరోసా ఇచ్చారు, ఈ పోస్టులోనే 30యేళ్ల క్రితం వెలిగొండ ప్రాజెక్టుకు తాను శంకుస్థాపన చేసిన ఫొటోను జత చేసారు. వెలిగొండ ప్రాజెక్ట్‌కు శంకుస్థాపన చేసింది నేనే, ప్రారంభిస్తుంది తానేనని వ్యాఖ్యానించారు. ఎన్నో అవాంతరాలు, అడ్డంకులు,సవాళ్లు, సమస్యలను అధిగమించి భగీరథ ప్రయత్నంతో, గొప్ప సంకల్పంతో వెలిగొండ ఫేజ్-1ను పూర్తి చేసినట్లు వివరించారు. తద్వారా కరువునేలకు కృష్ణమ్మ జలాలను అందించబోతున్నామని తెలిపారు. "తీవ్ర కరువు ప్రాంతంగా, అత్యంత వెనుకబాటుతనంతో ఉన్న ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రజల జీవితాలు మార్చేందుకు 30 యేళ్ల క్రితం తీసుకున్న సంకల్పం నేడు సాకారమైంది. ఉమ్మడి రాష్ట్రంలో నాడు ముఖ్యమంత్రిగా >>2


మంగళవారం న్యూఢిల్లీలో చిరాగ్ పాశ్వాన్ నుంచి అవార్డు అందుకుంటున్న సెర్ప్ అధికారి

# 'సెర్ప్'కు అవార్డు

**విజయవాడ,ఆగస్టు 25.ప్రభాతవార్త ప్రతినిధి:** సీడ్ క్యాపిటల్ మరియు హైయ్యర్ ఆర్డర్ ఎంటర్ప్రైజెస్ రుణాలు అందచేయడంలో, గ్రామీణ పేదరిక నిర్మూలనసంస్థ(సెర్ప్), ఆంధ్ర ప్రదేశ్‌కు జాతీయ స్థాయి అవార్డును మంగళవారం కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ న్యూఢిల్లీలో అందజేశారు. ఈ నెల ఆగస్టు 24, 25 తేదీలలో కేంద్ర ఆహార శుద్ధి పరిశ్రమల మంత్రిత్వ శాఖ, ఇండియా హేబిటేడ్ సెంటర్ న్యూఢిల్లీలో నిర్వ >>2

# అఖండ గోదారిని ఆరాధించేలా పుష్కరాలు

భక్తులకు అత్యుత్తమ సౌకర్యాలు, పవిత్రతకు పెద్దపీట

10 కోట్ల మంది పుణ్య స్నానాలు చేస్తారని అంచనా

181 కొత్త ఘాట్ల నిర్మాణం సహా 440 ఘాట్ల అభివృద్ధి

మొత్తం రూ.4,026 కోట్ల వ్యయంతో 4,932 పనులు

గోదావరి పుష్కరాలపై సిఎం చంద్రబాబు సమీక్ష


మంగళవారం సచివాలయంలో గోదావరి పుష్కరాలపై సమీక్ష జరుపుతున్న సిఎం చంద్రబాబు

**విజయవాడ, ఆగస్టు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రకృతి ఆరాధన, ఆధ్యాత్మిక చింతన మమేకం చేస్తూ గోదావరి పుష్కరాలు నిర్వహించాలని సిఎం చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. ఎక్కడా పవిత్రత దెబ్బతినకుండా, భక్తులకు సమస్యలు తలెత్తకుండా ఇప్పటి నుంచే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వచ్చే యేడాది జూన్ 26 నుంచి జులై 7వరకు 12 రోజుల పాటు పుష్కరాలు అత్యంత వైభవంగా జరపాలని చెప్పారు. పుష్కరాలు కేవలం ప్రభుత్వం నిర్వహించడమే కాదని, స్థానిక ప్రజలను భాగస్వాములను చేయాలన్నారు. పుష్కరాల్లో భాగంగా రూ.4,026 కోట్లతో చేపట్టిన 4,932 పనులకు సంబంధించి పురోగతిపై సచివాలయంలో మంగళవారం ముఖ్యమంత్రి సమీక్షించారు. పుష్కరాలకు ఇంకా 10 నెలల సమయమే ఉన్నందున త్వరితగతిన అన్ని పనులు ప్రారంభించి సకాలంలో పూర్తి చేయాలన్నారు. పనుల నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడొద్దని స్పష్టం చేశారు. అయితే ఈ పనులకు సంబంధించి ఇప్పటికే రూ.899 కోట్లు ఆర్థిక శాఖ కేటాయింపులు జరిగాయని అధికారులు ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి తెలిపారు. వీటిలో పట్టణాభివృద్ధి, ఆర్అండ్‌బి, జల వనరులు, విద్యుత్, పంచాయతీ రాజ్ శాఖలకు >>2


మంగళవారం సచివాలయంలో జూడా ప్రతినిధులతో సత్యకుమార్ యాదవ్

# జూడాల సమ్మె విరమణ

- మంత్రి సత్యకుమార్‌తో జూడా ప్రతినిధుల చర్చలు
- జూడాల డిమాండ్లపై సానుకూలంగా, సానుభూతితో పరిశీలిస్తాం
- స్టైపెండ్ పెంపుపై ఉన్నతస్థాయి అధికారుల కమిటీ
- త్వరలోనే జూడా ప్రతినిధులతో సమావేశం
- రిటైర్మెంట్ వయసు పెంపుపైనా పునఃపరిశీలన
- నాన్ క్లినికల్ పోస్టుల్లో ఎంఎస్సీ, పిహెచ్‌డి అభ్యర్థుల అంశాన్ని పరిశీలిస్తాం
- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ హామీ
- రెండు వారాల్లోగా నిర్ణయం తీసుకోండి
- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

**విజయవాడ,ఆగస్టు 25,ప్రభాతవార్తప్రతినిధి:** డాక్టర్ల (జూడా) డిమాండ్లపై రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిమితులను దృష్టిలోఉంచుకుని.. ఇతర రాష్ట్రాల్లో జూనియర్ డాక్టర్లకు అందుతున్న స్టైపెండ్, ఇతర ప్రయోజనాలను పరిశీలించి తగిన నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. దక్షిణాది రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటక, కేరళ, తెలంగాణల్లో వీరికి అందుతున్న స్టైపెండ్ తదితర అంశాలను రాష్ట్రంలో అమలవుతున్న విధానంతో పోల్చి ఇప్పటికే కూలంకషంగా చర్చించామన్నారు. రాష్ట్ర సచివాలయం లోని తన ఛాంబర్‌లో మంగళవారంనాడు జూడా ముఖ్య ప్రతినిధులు మంత్రి సత్య కుమార్, కార్యదర్శి జి వీర పాండియన్ ను కలిశారు. సమ్మెను విరమించి విధుల్లోనికి వెళ్లడం ప్రారంభించినట్లు ప్రతినిధులు మంత్రికి తెలియజేశారు. ఈ సందర్భంగా వారికి మంత్రి కృతజ్ఞతలు >>2

# పోక్సో కేసులో నిందితుడికి 20యేళ్ల జైలు

**రూ.5 వేల జరిమానా**

**కాకినాడ ప్రత్యేక కోర్టు తీర్పు**

**రాజమహేంద్రవరం(అర్బన్), ఆగస్టు 25 ప్రభాతవార్త:** మైనర్ బాలికపై అఘాయిత్యానికి పాల్పడిన కేసులో నిందితుడికి కాకినాడ ప్రత్యేక పోక్సో న్యాయస్థానం కఠిన శిక్ష విధిస్తూ మంగళవారం తీర్పు విలువరించింది. నేరం రుజువు కావడంతో చిర్రా ఆనంద్ కుమార్ అనే వ్యక్తికి 20యేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, రాజమహేంద్రవరం రూరల్ మండలం కొలమూరు గ్రామానికి చెందిన 16యేళ్ల బాలికను పెళ్లి చేసుకుంటానని నమ్మించి నిందితుడు అఘాయిత్యానికి పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు అప్పటి రాజానగరం ఎస్ఐ యు.వి.ఎస్. నాగబాబు కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తులో ఈస్ట్‌జోన్ డిఎస్పీ ఎ.టి.వి. రవికుమార్ శాస్త్రీయ ఆధారాలు, వైద్య నివేదికలు, 164 సిఆర్‌పిసి ప్రకారం నమోదైన వాంగ్మూలాలను సేక >>2

# 'పవర్'లో ఏపి నం.1

- 175 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యమే లక్ష్యం
- రాష్ట్రవ్యాప్తంగా గ్రీన్‌ఎనర్జీలో 22 క్లస్టర్ల అభివృద్ధి
- సుజ్లాన్ భాగస్వామ్యంతో యువతకు నైపుణ్య శిక్షణ
- అనంతపురం అంటే కియా కార్లు, ఫైటర్ జెట్లు, రెన్యువల్ ఎనర్జీ
- ఐటి, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్ స్పష్టీకరణ
- కణేకల్లులో పవన విద్యుత్ ప్రాజెక్టులకు శంకుస్థాపన


మంగళవారం హులికెర వద్ద నిర్వహించిన సభలో మాట్లాడుతున్న మంత్రి లోకేష్

**రాయదుర్గం, ఆగస్టు 25 ప్రభాతవార్త:** పునరుత్పాదక ఇంధన రంగంలో ఎపిని నంబర్ వన్‌గా నిలబెట్టడమే మన లక్ష్యమని, సుజ్లాన్ పవన విద్యుత్ ప్రాజెక్ట్ ఎపి నూతన అధ్యాయానికి నాంది అని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. అనంతపురం జిల్లా రాయదుర్గం నియోజకవర్గం కణేకల్లు మండలం హులికెర వద్ద సుజ్లాన్ విండ్ ఎనర్జీ ప్రాజెక్టులకు శంకుస్థాపన అనంతరం నిర్వహించిన సభలో మంత్రి లోకేష్ మాట్లాడుతూ, విండ్ ఎనర్జీ రంగంలో మన దేశం సత్తా చాటిందన్నారు. "ప్రస్తుత ప్రాజెక్టులు మొత్తం 1,325 మెగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యం. సుమారు రూ.10వేల కోట్ల పెట్టుబడి, 4 వేలకు పైగా ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలను తీసుకురానున్నాయి. మనం నిర్మించే ప్రతి మెగా వాట్ చివరికి మన యువతకు అవకాశంగా మారాలి. ఎపిలో సుజ్లాన్‌కు ఇప్పటికే సుమారు 1,600 మెగావాట్ల స్థాపిత సామర్థ్యం ఉంది. మరో 2,700 మెగావాట్లు అభివృద్ధి, నిర్మాణ దశలో ఉన్నాయి. అనంతపురం ప్రాంతంలో సుమారు 1,300 మెగావాట్ల కొత్త పవన విద్యుత్ ప్రాజెక్టులు అభివృద్ధి దశలో ఉన్నాయ్లు అని వివరించారు.

**సౌర, పవన విద్యుత్, నిల్వ సాంకేతికతలు కలిసి పనిచేయాలి**

"ఆంధ్రప్రదేశ్‌కు పవన విద్యుత్ భవిష్యత్ ఇంధన మిశ్రమంలో కీలక భాగం. భారతదేశంలో సూర్యరశ్మి సమృద్ధిగా ఉంది. పగటి సమయంలో >>2

# తాటి వనం.. తీరానికి రక్షణ కవచం

- గ్రేట్ గ్రీన్ వాల్ రెండో అంచెలో తుపాను గాలి నిరోధక వ్యవస్థగా తాటి చెట్లు
- తాటి గింజల సేకరణ, నాటే ప్రక్రియ ప్రారంభం
- 5,499 హెక్టార్ల విస్తీర్ణంలో 55 లక్షల తాటి గింజలు నాటడం లక్ష్యం
- సీజన్ ప్రారంభంలోనే 13 లక్షల తాటి గింజలు సేకరించిన అటవీ శాఖ
- తాటి వనాల ఏర్పాటు ప్రక్రియలో ప్రజలంతా భాగస్వాములు కావాలి
- ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖల మంత్రి పవన్ కల్యాణ్ పిలుపు



**విజయవాడ, ఆగస్టు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** సుదీర్ఘ తీర ప్రాంతానికి సహజ రక్షణ కవచం ఏర్పాటు దిశగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖల మంత్రి పవన్ కల్యాణ్ తీసుకున్న గ్రేట్ గ్రీన్ వాల్ సంకల్పంలో కీలకమైన తాటి వనాల ఏర్పాటు ప్రక్రియ మొదలయ్యింది. తాటి కాయల సీజన్ ప్రారంభం కావడంతో తాటి గింజల సేకరణ, నాటే కార్యక్రమానికి రాష్ట్ర అటవీ శాఖ శ్రీకారం చుట్టింది. గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ నిర్మాణంలో ప్రకృతి విపత్తుల సమయంలో గాలి నిరోధక వ్యవస్థగా తాటి వనాలు తీర ప్రాంత గ్రామాలకు తీవ్ర గాలుల నుంచి రక్షణ కల్పించనున్నాయి. మూడంచెల గ్రేట్ గ్రీన్‌వాల్ ఏర్పాటు ప్రక్రియలో తాటి వనాల ఏర్పాటుకు ఎంతో ప్రాముఖ్యత ఉంది.

ఉప్పు నీరు, హోరు గాలులతో ఉండే తీర ప్రాంతాల కఠిన వాతావరణ పరిస్థితులకు తాటి చెట్టు అత్యంత అనుకూలమైన వృక్ష జాతి. ఉప్పు నేలలు, ఇసుక, బురకతో కూడిన తీర ప్రాంత ఒండ్రు నేలల్లో సైతం పెరిగే సామర్థం తాటి చెట్టుకు ఉంది. ఎత్తుగా పెరిగే జాతి కావడంతో బలమైన సముద్ర గాలులకు సహజ నిరోధక వ్యవస్థగా పని చేస్తుంది. అంతే కాదు బలమైన తాటి వేర్లు నేలను గట్టిగా పట్టి ఉండడం వల్ల తీర ప్రాంతాల్లో కోత >>2

# పట్టణాల అభివృద్ధికి యుకె సహకారం

మునిసిపాలిటీల్లో రూ.40 వేల కోట్లతో మౌలిక వసతుల కల్పన

ప్రపంచస్థాయి సాంకేతికత వినియోగం

వరల్డ్ క్లాస్ స్మార్ట్, లివబుల్ సిటీగా అమరావతి అభివృద్ధి

యుకె- ఎపి ప్రభుత్వాల మధ్య కీలక ఒప్పందం: మంత్రి నారాయణ


మంగళవారం అమరావతిలో మంత్రి నారాయణ సమక్షంలో మున్సిపల్ శాఖ - యుకె ప్రభుత్వాల మధ్య కీలక ఒప్పంద దృశ్యం

**విజయవాడ. ఆగస్టు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ పట్టణాభివృద్ధిని అంతర్జాతీయ నైపుణ్యం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, సుస్థిర మౌలికవసతులతో మరింత ముందుకు తీసుకెళ్లే దిశగా రాష్ట్రప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. పట్టణాభివృద్ధి, మౌలిక సదుపాయాల రంగాల్లో దీర్ఘకాలిక సహకారం కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం- యునైటెడ్ కింగ్డమ్ ప్రభుత్వం మధ్య అవగాహన ఒప్పందం మంగళవారం అమరావతిలో కుదిరింది. వెలగపూడిలోని సచివాలయంలో నిర్వ >>2

# శ్రీశైలంలో విషాదం

అన్నదాన సత్రంలో ఐదుగురు ఆత్మహత్య

మృతులంతా ఒకే కుటుంబ సభ్యులు

సత్యసాయి జిల్లా బత్తలపల్లి వాసులు

ఆర్థిక ఇబ్బందులతోనే బలవన్మరణం

పోలీసుల ప్రాథమిక విచారణలో వెల్లడి

**శ్రీశైలం ప్రాజెక్టు, ఆగస్టు 25 ప్రభాతవార్త:** శ్రీశైల క్షేత్రంలో వడ్డెర ప్రైవేట్ అన్నదాన సత్రంలో ఒకే కుటుంబ సభ్యులు ఐదు మంది ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మంగళవారం వెలుగు చూసింది. మృతులు సత్యసాయి జిల్లా బత్తలపల్లి గ్రామానికి చెందిన కుటుంబం. గతనెల 28న ఓ ఆటోలో వచ్చి వడ్డెర సత్రంలో రూమ్ 11ను తీసుకుని ఉంటున్నారు. అప్పటినుండి ప్రతిరోజు సత్రంలో భోజనానికి రావడం, బయట తిరగడం ఆలయానికి వెళ్లిరావడం చేస్తున్నారు. అయితే గత మూడు రోజులుగా రూమ్ నుండి ఎవరు బయటకు రాకపోవడం, పైగా దుర్వాసన రావడంతో సత్రం నిర్వాహకులు కిటికీలోనుంచి చూడగా ఉరివేసుకున్న దృశ్యాలుచూసి కంగుతిన్నారు. వెంటనే సత్రం నిర్వాహకులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. >>2



ఆంధ్రప్రదేశ్ లోకాయుక్తగా జస్టిస్ మల్లిఖార్జున రావుతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్.వేదికపై సిఎం చంద్రబాబు నాయుడు

# లోకాయుక్తగా జస్టిస్ మల్లిఖార్జున రావు

**లోక్‌భవన్‌లో ప్రమాణస్వీకారం చేయించిన గవర్నర్**

**సిఎం చంద్రబాబు, మంత్రులు, హైకోర్టు జడ్జిలు, డిజిపి హాజరు**

**విజయవాడ, ఆగస్టు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ లోకాయుక్తగా నియమితులైన హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ తల్లాప్రగడ మల్లిఖార్జునరావుతో ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో లోక్ భవన్ దర్బార్ హాల్‌లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రమాణ >>2

26-8pg2exHMNWJQE.qxd:26-8pg2exHMNWJQE.qxd 1/1/02 6:13 AM Page 1






విండ్ ఎనర్జీ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రులు నారా లోకేష్, పయ్యావుల కేశవ్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, సుజ్లాన గ్రూప్ కో ఫౌండర్, వైస్ చైర్మన్ గిరీష్ తంతి తదితరులు

# 'పవర్‌'లో ఎపి నం.1

>> సౌర విద్యుత్ కీలక పాత్ర పోషిస్తుంది. కానీ ప్రతి సాయంత్రం సూర్యుడు అస్తమిస్తాడు. మన ఆర్థిక వ్యవస్థ మాత్రం ఆగదు. సాయంత్రం 6 గంటలకైనా మన ఇళ్లకు విద్యుత్ అవసరం ఉంటుంది. మన పరిశ్రమలు పనిచేస్తూనే ఉంటాయి. మన ఆసుపత్రులు పనిచేస్తూనే ఉంటాయి. మన డేటా సెంటర్లు ప్రతి క్షణం సమాచారాన్ని ప్రాసెస్ చేస్తూనే ఉంటాయి. అందుకే సౌర, పవన విద్యుత్, నిల్వ సాంకేతికతలు కలిసి పనిచేయాలి. ఆంధ్రప్రదేశ్ దేశంలోని అతిపెద్ద డేటా సెంటర్ పర్యావరణ వ్యవస్థల్లో ఒకదాన్ని నిర్మిస్తున్నందున ఇది మరింత కీలకంగా మారుతోంది. మేం 6.5 గిగావాట్ల డేటా సెంటర్ సామర్థ్యాన్ని అభివృద్ధి చేస్తున్నాం. ఈ డిజిటల్ మౌలిక వసతులకు అవసరమైన విద్యుత్‌ను అందించేందుకు సుమారు 25 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన అవకాశాన్ని సృష్టించవచ్చు' మంత్రి లోకేష్ పేర్కొన్నారు.

**175 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యం లక్ష్యం**

"మా విజన్ కేవలం విద్యుత్‌తో ఆగిపోదు. క్లీన్ ఎనర్జీని గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియాగా మార్చాలని మేం కోరుకుంటున్నాం. గ్రీన్ డేటా సెంటర్ల ద్వారా ఎఐ ఆర్థిక వ్యవస్థకు విద్యుత్ అందించాలని కోరుకుంటున్నాం. చివరికి క్లీన్ ఎనర్జీకి సౌది అరేబియాగా ఎపిని తీర్చిదిద్దాలన్నదే మా అంతిమ లక్ష్యం. వివిధ రూపాల్లో స్వచ్ఛ ఇంధనాన్ని ప్రపంచానికి ఎగుమతి చేయగల రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దాలి. మనకు పునరుత్పాదక ఇంధన సామర్థ్యం ఉంది. సుదీర్ఘ సముద్ర తీరం ఉంది. రాష్ట్ర స్థాయిలో 175 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఈ లక్ష్యాన్ని సాధించడంలో సుజ్లాన్ వంటి సంస్థలు కీలక పాత్ర పోషించనున్నాయి' అని మంత్రి లోకేష్ వివరించారు.

**సుజ్లాన్ భాగస్వామ్యంతో 12వేల మంది యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ**

"ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, సుజ్లాన్ కలిసి 12వేల మంది యువతకు, అందులో 25శాతం మహిళలకు ప్రాతినిధ్యం ఉండేలా గ్రీన్ ఎనర్జీ ఉద్యోగాల కోసం శిక్షణ అందిస్తున్నాయి. ఉరవకొండ, విజయవాడలోని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు పునరుత్పాదక ఇంధన రంగానికి అవసరమైన ఇంజనీర్లు, సాంకేతిక నిపుణులను సిద్ధం చేస్తున్నాయి. రేపటి కంపెనీలు నైపుణ్యం ఉన్న ప్రాంతాలకే వస్తాయి. ఆ అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ఆంధ్రప్రదేశ్ యువత సిద్ధంగా ఉండేలా చూడటం మన బాధ్యత. భారతదేశ స్వచ్ఛ ఇంధన భవిష్యత్తు కోసం శిక్షణ పొందుతున్న యువ ఇంజనీర్లు, సాంకేతిక నిపుణుల ద్వారా స్వర్గీయ 'తులసి తంతి' వారసత్వం మరోసారి కొనసాగుతోంది' అని మంత్రి పేర్కొన్నారు.

**20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యం**

"ఒక్క కియా పరిశ్రమ ఎన్ని కుటుంబాల్లో వెలుగు నింపిందో నేను పాదయాత్రలో స్వయంగా చూశాను. అప్పుడే 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలి అనే లక్ష్యంగా పెట్టుకున్నాను. ప్రపంచమంతా తిరిగి కంపెనీలను తీసుకువస్తున్నాం. ప్రధానమంత్రి నరేంద్రమోడీకూడా రాష్ట్రానికి కంపెనీలను తీసుకురావడానికి సహకరిస్తు న్నారు. కంపెనీలను తీసుకురావడం మా బాధ్యత. ఆ అవకాశాలను అందిపుచ్చుకోవడం యువత బాధ్యత. మీ పని తీరుబట్టే మరిన్ని కంపెనీలు ఎపికి వస్తాయి. పరిశ్రమలతో నేరుగా అనుసంధానం చేసి, యువతకు అవసరమైన నైపుణ్యాలను నేర్పించాలని కోరుతున్నాం' అని మంత్రి లోకేష్ అన్నారు.

**మన భవిష్యత్ మనమే నిర్మించుకుందాం..**

"ప్రభుత్వం, పరిశ్రమలు, యువత కలిసి పనిచేసినప్పుడు ఎంత అద్భుత ఫలితాలు వస్తాయో మనం చూస్తున్నాం. పరిశ్రమలు పెట్టుబడులు, సాంకేతికతను తీసుకువస్తాయి. ఈ రోజు మనం కేవలం పవన విద్యుత్ ప్రాజెక్టులకు భూమిపూజ చేయడం లేదు. ఇంధనం, తయారీ, సాంకేతికత, ప్రతిభ ఆధారంగా నిర్మించబోయే కొత్త పారిశ్రామిక ఆంధ్రప్రదేశ్‌కు పునాది వేస్తున్నాం. భవిష్యత్తు కోసం మనం ఎదురుచూడబోం. స్వచ్ఛ ఇంధనం, కొత్త పరిశ్రమలు, కొత్త ఉద్యోగాలు, కొత్త నైపుణ్యాలతో భవిష్యత్తును మనమే నిర్మించబోతున్నాం' అని మంత్రి చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, అనంతపురం ఎంపి అంబికా జీ.లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, అమిలినేని సురేంద్రబాబు, దగ్గుపాటి వెంకటప్రసాద్, సుజ్లాన్ గ్రూప్ కో ఫౌండర్, వైస్ ఛైర్మన్ గిరీష్ తంతి, సిఇఒ అజయ్ కపూర్, అడ్వైజర్ విబి రావు, టాటా పవర్ ఎండి, సిఇఒ సంజయ్ బంగా, సుజ్లాన్ గ్రూప్ డైరెక్టర్ రంజిత్ సిన్హా అభయ్ సిన్హా పర్మార్, ఎన్ఆర్ఇడిసిఎపి లిమిటెడ్ విసి, మేనేజింగ్ డైరెక్టర్ ఎమ్.కమలాకర బాబు, టోరెంట్ పవర్ డైరెక్టర్ జిగీష్ మెహతా, వారీ ఎనర్జీస్ సిఎండి హితేష్ దోషి, జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పాల్గొన్నారు.

# జస్టిస్ మల్లిఖార్జున రావు

>> స్వీకారం చేయించారు. ఎడి ముఖ్య కార్యదర్శి జె. శ్యామలరావు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు, ఆ తర్వాత లోకాయుక్త రిజిస్ట్రార్ ఆంధ్రప్రదేశ్ లోకాయుక్తగా హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ తల్లాప్రగడ మల్లిఖార్జునరావును నియమిస్తూ గవర్నర్ జారీ చేసిన అపాయింట్‌మెంట్ వారెంట్‌ను చదివి వినిపించారు. అనంతరం, ఆంధ్రప్రదేశ్ లోకాయుక్త జస్టిస్ (రిటైర్డ్) తల్లాప్రగడ మల్లిఖార్జునరావును గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభినందించి పుష్పగుచ్ఛాలు అందించారు. ఈ కార్యక్రమంలో మంత్రి వాసంశెట్టి సుభాష్, హైకోర్ట్ న్యాయమూర్తులు, డిజిపి హరీష్ కుమార్ గుప్తా, గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి. అనంతరాము, అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, ఎపి శాసనసభ సెక్రటేరియట్ సెక్రటరీ జనరల్ పసన్నకుమార్ సూర్యదేవర న్యాయశాఖఅధికారులు, ఇతర ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పోక్సో కేసులో నిందితుడికి 20యేళ్ల జైలు

>> రించి చార్జిషీట్ దాఖలు చేశారు. సిఐ వీరయ్య గౌడ్ దర్యాప్తును పర్యవేక్షి ంచారు. కోర్టు విచారణలో ప్రాసిక్యూషన్ తరఫున స్పెషల్ పిపి పి. శ్రీదేవి సమర్థవంతంగా వాదనలు వినిపించారు. సాక్ష్యాధారాలను కోర్టులో ప్రవేశపెట్టడంతో నిందితుడిపై నేరం రుజువైంది. పోస్కో చట్టంలోని సెక్షన్ 3 ఆర్ /డబ్ల్యు 4(2) కింద 20యేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.5 వేల జరిమానా విధించారు. జరిమానా చెల్లించకపోతే అదనంగా మరో మూడు నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాలి. ఐపిసి 363 కింద మూడు నెలల సాధారణ జైలు, రూ.500 జరిమానా విధించారు. ఈ రెండు జైలుశిక్షలు ఏకకాలంలో అమలుకానున్నాయి. జరిమానా మొత్తాన్ని అప్పీల్ గడువు అనంతరం బాధితురాలికి పరిహారంగా అందించాలని కోర్టు ఆదేశించింది.



సముద్రతీర ప్రాంతాల్లో తాటి వనాల కోసం విత్తనాలు నాలుగుతున్న అటవీశాఖ సిబ్బంది

# తీరానికి రక్షణ కవచం

>> నిరోధక వ్యవస్థగా కూడా ఉంటుంది. పక్షులు, కొన్ని రకాల సరిస్పృపాలకు ఆవాసంగా ఉండే తాటి చెట్లు జీవ వైవిధ్యానికి ప్రతీకగా ఉంటాయి. వాతావరణ మార్పుల ప్రభావాన్ని కూడా తట్టుకోగల శక్తి తాటి చెట్టు సొంతం. అందుకే పవన్ కల్యాణ్ రూపొందించిన మూడంచెల గ్రేట్ గ్రీన్ వాల్ ప్రణాళికల్లో మొదటి అంచె మడ అడవులకు, రెండో అంచె తాటి వనాలకు ప్రాధాన్యత ఇచ్చారు.

రాష్ట్రవ్యాప్తంగా తీర ప్రాంతం వెంబడి 5,499 హెక్టార్ల పరిధిలో తాటి వనాల ఏర్పాటును లక్ష్యంగా ఉప ముఖ్యమంత్రి ప్రతిపాదించారు. అందుకు దాదాపు 55 లక్షల తాటి గింజలు అవసరం అవుతాయని అటవీ శాఖ భావిస్తోంది. ఈ యేడాది తాటి కాయల సీజన్ మొదలైన నాటి నుంచి ఇప్పటి వరకు గ్రామీణ ప్రజలు, వివిధ వ్యవస్థల భాగస్వామ్యంతో 13 లక్షల తాటి గింజలు సేకరించారు. ఇప్పటికే 1 లక్ష 65 వేల తాటి గింజలను పంచాయతీరాజ్, రెవెన్యూ శాఖలు, స్కూలు విద్యార్థులు, ప్రజల భాగస్వామ్యంతో నాటే ప్రక్రియను రాష్ట్ర అటవీ శాఖ ఆధ్వర్యంలో పూర్తిచేశారు. ఈ సీజన్‌లో పవన్ కల్యాణ్ నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలన్న బలమైన సంకల్పంతో ముందుకు వెళ్తున్నట్టు ఆ శాఖ అధికారులు స్పష్టం చేశారు.

# పట్టణాల అభివృద్ధికి యుకె సహకారం

>> హించిన కార్యక్రమంలో పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్, యుకె ప్రభుత్వ డిపార్ట్‌మెంట్ ఫర్ బిజినెస్ అండ్ ట్రేడ్ గవర్నమెంట్ పార్ట్‌నర్‌షిప్స్ డిప్యూటీ డైరెక్టర్ చాజ్ వాలియా ఒప్పందంపై సంతకాలు చేశారు. పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి మంత్రి పి. నారాయణ నాయకత్వంలో ఎపి ప్రతినిధి బృందం, యుకె ప్రతినిధి బృందం కార్యక్రమంలో పాల్గొన్నాయి. ఈ సందర్భంగా మంత్రి పి. నారాయణ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్, యుకె డిపార్ట్‌మెంట్ ఆఫ్ బిజినెస్ అండ్ ట్రేడ్‌తో అవగాహన ఒప్పందం చేసుకున్నామని తెలిపారు. అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను మరింత మెరుగ్గా అభివృద్ధి చేయడమే ఈ ఒప్పందం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. రాష్ట్రంలోని నగరాలను లివబుల్ సిటీలుగా, స్మార్ట్ సిటీలుగా అభివృద్ధి చేయడానికి యుకె సహకారం అందించనుందని తెలిపారు. బెస్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్లానింగ్, సస్టైనబుల్ సిటీస్ డెవలప్‌మెంట్, టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్మేషన్, ఇంటిగ్రేటెడ్ అర్బన్ మొబిలిటీ వంటి రంగాల్లో ప్రత్యేకంగా సహకారం అందనుందని చెప్పారు. యుకెలోని వివిధ కంపెనీల బెస్ట్ ఎక్స్‌పర్టైజ్‌ను ఆంధ్రప్రదేశ్‌కు తీసుకురావడం, ప్రపంచస్థాయి టెక్నాలజీ, బెస్ట్ ప్రాక్టీసెస్‌ను రాష్ట్రంలో అమలు చేయడం ఈ భాగస్వామ్యం ద్వారా సాధ్యమవుతుందని మంత్రి తెలిపారు.

లండన్‌కు చెందిన నార్మన్ ఫోస్టర్ అండ్ పార్ట్‌నర్స్ అమరావతి ఐకానిక్ టవర్స్, అసెంబ్లీ, హైకోర్టు డిజైన్‌లో భాగస్వామ్యం కావడం ఇప్పటికే ఉన్న సహకారానికి నిదర్శనమన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు అవసరమైన సాంకేతిక సహకారం అందించేందుకు యుకె ప్రతినిధులు ముందుకు వచ్చారని, యుకె డిప్యూటీ హై కమిషనర్, బిజినెస్ విభాగం డైరెక్టర్ జనరల్ సహా ప్రతినిధులు అమరావతికి వచ్చి రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో చర్చలు జరిపారని మంత్రి తెలిపారు. సిఎం చంద్రబాబు నాయుడు సూచనల మేరకే యుకె ప్రభుత్వంతో చర్చలు జరిపి ఈఅవగాహన ఒప్పందం చేసుకున్నామని మంత్రి పేర్కొన్నారు. అమరావతితో పాటు రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి కూడా ఈ సహకారం ఉపయోగపడనుంది.

**నాలుగు ప్రధాన రంగాల్లో సహకారం..**

ఆంధ్రప్రదేశ్- యుకె భాగస్వామ్యం ప్రధానంగా మౌలిక వసతుల ప్రణాళిక, సుస్థిర పట్టణాభివృద్ధి, సాంకేతిక పరిజ్ఞాన బదిలీ-ఆవిష్కరణలు, సమగ్ర పట్టణ రవాణా వ్యవస్థలపై కొనసాగనుంది. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ప్రాజెక్టుల ప్రణాళిక, ప్రాధాన్యత క్రమం, ఆర్థిక సాధ్యాసాధ్యాల అంచనా, పెట్టుబడులకు అనుకూలమైన బిజినెస్ కేసుల రూపకల్పన, ప్రాజెక్ట్ డిజైన్, ప్రోగ్రామ్ మేనేజ్‌మెంట్, అమలు వంటి అంశాల్లో ఇరు ప్రభుత్వాలు కలిసి పనిచేయనున్నాయి. రాష్ట్రంలోని నగరాలను మెరుగైన అర్బన్ స్ట్రక్చర్‌తో స్మార్ట్, లివబుల్ సిటీలుగా తీర్చిదిద్దేందుకు యుకె నైపుణ్యాన్ని వినియోగించుకోనున్నారు.

**అమరావతి అభివృద్ధిలో యుకె నైపుణ్యం**

అమరావతి అభివృద్ధిలో యుకె సంస్థలతో ఇప్పటికే ఏర్పడిన అనుసంధానాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. లండన్‌కు చెందిన ఫోస్టర్ + పార్ట్‌నర్స్ సంస్థ అమరావతి ప్రభుత్వ సముదాయంలోని అసెంబ్లీ, హైకోర్టు, సచివాలయ భవనాల రూపకల్పనలో భాగస్వామ్యం కావడం ఇరు పక్షాల మధ్య ఉన్న సహకారానికి ఉదాహరణగా నిలుస్తోంది. అమరావతి తదుపరి దశ అభివృద్ధిలో పట్టణ ప్రణాళిక, సుస్థిర మౌలిక వసతులు, పట్టణ రవాణా, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ప్రాజెక్టుల రూపకల్పన, అమలు తదితర రంగాల్లో యుకె నైపుణ్యాన్ని మరింతగా వినియోగించుకునే అవకాశాలను పరిశీలించనున్నారు. అమరావతి రివర్‌ఫ్రంట్, పట్టణ పునరుద్ధరణ, మిశ్రమ వినియోగ అభివృద్ధి వంటి రంగాల్లోనూ అంతర్జాతీయ అనుభవాన్ని వినియోగించుకునే అవకాశాలు ఉన్నాయి.

**ఆధునిక సాంకేతికతకు ప్రాధాన్యం..**

సాంకేతిక పరిజ్ఞాన బదిలీ, ఆవిష్కరణలకు ఈ ఒప్పందంలో ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. ఇంటెలిజెంట్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్స్ బిల్డింగ్ ఇన్ఫర్మేషన్ మోడలింగ్, డిజిటల్ ట్విన్స్, ఆధునిక నిర్మాణ సాంకేతికతలు, పరిశోధన-అభివృద్ధి వంటి రంగాల్లో సహకారం అందించనున్నారు.యుకెలోని వివిధ సంస్థల అత్యుత్తమ నైపుణ్యం, సాంకేతిక పరిజ్ఞానం, బెస్ట్ ప్రాక్టీసెస్‌ను రాష్ట్రానికి తీసుకురావడం ద్వారా ప్రభుత్వ సంస్థల సామర్థ్యాన్ని పెంచడం, నిపుణుల మధ్య జ్ఞాన మార్పిడిని ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎపి సిఆర్‌డిఎ కమిషనర్ విజయ రామరాజు, ఎపి సిఆర్‌డిఎ అదనపు కమిషనర్ రాహుల్, సిడిఎంఎ, ఆంధ్రప్రదేశ్ మెట్రో రైల్ కార్పొరేషన్‌కు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు. యుకె ప్రతినిధి బృందంలో దక్షిణాసియా ట్రేడ్ కౌన్సిలర్ మార్క్ బిరెల్, డిప్యూటీ హై కమిషనర్ గారెత్ విన్ ఓవెన్, నేషనల్ లీడ్-ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రిషికేష్ చందా, సౌత్ ఇండియా రీజినల్ హెడ్-ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రోహిత్ చంద్రగిరి, గవర్నమెంట్ పార్ట్‌నర్‌షిప్స్ డిప్యూటీ డైరెక్టర్ చాజ్ వాలియా పాల్గొన్నారు.

# జూడాల సమ్మె విరమణ

>> తెలిపారు. అనంతరం తనను కలిసిన విలేకరులతో మంత్రి సత్య కుమార్ మాట్లాడుతూ జూనియర్ డాక్టర్లు ప్రధానంగా స్టైపెండ్ పెంపుతో పాటు రిటైర్మెంట్ వయసు పెంచకూడదని జూడా ప్రతినిధులు ఇంతకుముందు డిమాండ్ చేశారని మంత్రి తెలిపారు. రిటైర్మెంట్ వయసు పెంపు అంశంపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేశారు. కొన్ని ప్రాంతాల్లో వైద్యుల లభ్యత తగ్గుతున్న నేపథ్యంలో ఆ అంశాన్ని కేవలం పరిశీలన మాత్రమే చేశామని చెప్పారు. జూడాల డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని దీనిపై మరోసారి పునఃపరిశీలన చేస్తామని వెల్లడించారు.

**స్టైపెండ్ పెంపు అంశంపై కమిటీ పరిశీలన**

స్టైపెండ్ పెంపు అంశంపై ప్రత్యేకంగా కమిటీని ఇప్పటికే ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. ఆరోగ్యశాఖ కార్యదర్శి వీరపాండియన్ ఆధ్వర్యంలో కమిటీ పనిచేస్తుందని చెప్పారు. ఒకటి రెండు రోజుల్లో జూడా సంఘాల నాయకులతో కమిటీ సమావేశమై వారి డిమాండ్లపై చర్చిస్తుందని తెలిపారు. ప్రభుత్వం ఆర్థిక పరిమితులు, అందుబాటులో ఉన్న వనరులు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారం తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు.

**నాన్ క్లినికల్ పోస్టులపైనా పునఃపరిశీలన**

నాన్ క్లినికల్ విభాగాల్లో ఎంఎస్సీ, పీహెచ్‌డీ అర్హత కలిగిన వారిని నియమించే అంశంపైనా మరోసారి పునఃపరిశీలన చేస్తామని మంత్రి చెప్పారు. ఈ విషయంలో ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదన్నారు. జాతీయ వైద్య కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా కొత్త వైద్య కళాశాలలను త్వరగా ప్రారంభించాల్సిన అవసరం ఏర్పడిందని, అందులో భాగంగానే నోటిఫికేషన్లు జారీ చేసినట్లు తెలిపారు. వాటికి తగిన స్పందన రాని పరిస్థితుల్లో కొన్నిచర్యలు తీసుకోవాల్సి వచ్చిందన్నారు. ఈ అంశంపైనా జూడాల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని పునఃపరిశీలిస్తామని స్పష్టం చేశారు.

**సింఎం దృష్టికి తీసుకెళ్లి నిర్ణయం**

జూడాల సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు సత్యకుమార్ తెలిపారు. ప్రభుత్వం వారి డిమాండ్ల పట్ల సానుకూలంగా ఉందని చెప్పారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, ప్రభుత్వ పరిమితులపై జూడా నాయకులకు కూడా అవగాహన ఉందన్నారు. అందువల్ల ఇరువర్గాల మధ్య చర్చల ద్వారా సమస్యకు పరిష్కారం కనుగొనే ప్రయత్నం జరుగుతుందని పేర్కొన్నారు. 9,500 మంది వైద్యుల సేవలు కీలకంరాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో దాదాపు 9,500 మంది జూడాలు సేవలు అందిస్తున్నారని మంత్రి తెలిపారు. పేద, సామాన్య ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రులపై ఆధారపడుతున్నారని, ముఖ్యంగా అత్యవసర వైద్య సేవల్లో జూడాల పాత్ర కీలకమని చెప్పారు. సమ్మె కారణంగా అత్యవసర వైద్య సేవలకు ఇబ్బందులు తలెత్తే పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని జూడాలు మానవతా దృక్పథంతో సమ్మె విరమించడం అభినందనీయమన్నారు.

ప్రజల ఆరోగ్య ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని సమ్మె విరమించిన జూడా నాయకులకు, డాక్టర్లందరికీ మంత్రి సత్యకుమార్ మరోసారి కృతజ్ఞతలు తెలిపారు. వారి సమస్యలను పరిష్కరించే విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరిస్తుందని స్పష్టం చేశారు.

# జూనియర్ డాక్టర్ల సమ్మెపై హైకోర్టులో విచారణ

## సమ్మె విరమిస్తున్నట్లు న్యాయస్థానానికి తెలిపిన జూడాలు

**వియవాడ. ఆగస్టు 25,ప్రభాతవార్తప్రతినిధి:** జూనియర్ డాక్టర్ల సమ్మెపై దాఖలైన పిటిషన్‌పై ఎపి హైకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా సమ్మె విరమిస్తున్నట్లు జూడాల సంఘం ప్రకటించింది. ఈ మేరకు హైకోర్టుకు నివేదించింది. ఈ సందర్భంగా తమ డిమాండ్లు పరిష్కరించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని జూడాల సంఘం అభ్యర్థించింది. దీంతో రెండు వారాల్లో నిర్ణయం తీసుకో వాలని హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. దీంతో సమ్మె విరమిస్తున్నట్లు హైకోర్టుకు జూడాల సంఘం నివేదించింది. ఆంధ్రప్రదేశ్ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ (ఎపి జూడా) ఆధ్వర్యంలో ఈనెల 11న తొలిదశ, 12 నుంచి రెండోదశ ఆందోళనలు కొనసాగాయి. అత్యవసర సేవలు మాత్రమే అందిస్తూ 16వ తేదీ వరకు నిరసనలు తెలిపారు. 15 స్టైపెండ్ పెంచాలన్న జూడాల డిమాండ్‌కు ప్రభుత్వం తలొగ్గకపోవడంతో 17 నుంచి మూడో దశ ఆందోళనలో భాగంగా అత్యవసరంతో పాటు అన్నిసేవలూనిలిపివేసి సమ్మెను తీవ్రతరం చేశారు.

# గోదారిని ఆరాధించేలా పుష్కరాలు

>> సంబంధించి అత్యధిక పనులు ఉన్నాయి. ఇందులో తూర్పు గోదావరి జిల్లాలో 1,869, పశ్చిమ గోదావరి జిల్లాలో 625, కోనసీమ జిల్లాలో 1,501, ఏలూరు జిల్లాలో 426, కాకినాడ జిల్లాలో 321, పోలవరం జిల్లాలో 190 పనులు చేపడుతున్నారు. అయితే ఈ పనుల పూర్తికి అవసరమైన నిధుల సమీకరణపై అధికారులు దృష్టి పెట్టాలని, కేంద్ర సాయం కూడా తీసుకోవాలని అధికారులకు సిఎం సూచించారు.

**2027 పుష్కరాలకు భారీగా భక్తులు..**

2015 మహా పుష్కరాల్లో ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 4.86 కోట్ల మంది భక్తులు పుణ్య స్నానాలు చేయగా. 2027లో 8 నుంచి 10 కోట్ల మంది గోదావరి పుష్కరాలకు తరలి వస్తారని అంచనా వేస్తున్నట్టు అధికారులు వివరించారు. రోజుకు సుమారు కోటి మంది పుణ్య స్నానాలు చేసే అవకాశం ఉందన్నారు. రద్దీని తట్టుకునేలా మొత్తం 440 ఘాట్లు సిద్ధం చేస్తున్నామన్నారు. వీటిలో ప్రస్తుతం ఉన్న 259 ఘాట్లను అభివృద్ధి చేయడంతో పాటు అదనంగా 181 కొత్త ఘాట్లను నిర్మిస్తున్నామన్నారు. తూర్పుగోదావరి జిల్లాలో 82 ఘాట్లు, పశ్చిమగోదావరి జిల్లాలో 40 ఘాట్లు, కోనసీమ జిల్లాలో 175 ఘాట్లు, ఏలూరు జిల్లాలో 44 ఘాట్లు, కాకినాడ జిల్లాలో 88 ఘాట్లు, పోలవరం జిల్లాలో 11 ఘాట్లు అభివృద్ధి చేస్తున్నట్టు తెలిపారు.

**టెంపుల్ టూరిజంపై ప్రత్యేక దృష్టి**

గోదావరి పరివాహక ప్రాంతంలో ఎన్నో పుణ్యక్షేత్రాలు ఉన్నాయని... పిఠాపురంలో శక్తి పీఠం సహా పంచారామాల్లో 4 క్షేత్రాలు, ఇంకా ద్వారకా తిరుమల, అన్నవరం, వాడపల్లి, అంతర్వేది వంటి ప్రధాన ఆలయాలను కలుపుతూ టూరిజం సర్క్యూట్‌గా అభివృద్ధి చేయాలని సీఎం అధికారులకు సూచించారు. పుష్కరాలకు వచ్చే భక్తులు పర్యాటక, ఆధ్యాత్మిక ప్రాంతాలను సందర్శించేందుకు వీలుగా హోం స్టేలను ప్రోత్సహించాలని సూచించారు. కొత్తగా హోటళ్ల నిర్మాణం చేపట్టేవారికి త్వరితగతిన అనుమతులు ఇవ్వాలన్నారు. 'రాజమహేంద్రవరంలో వివిధ కార్యక్రమాల నిర్వహణ కోసం కన్వెన్షన్ సెంటర్ నిర్మించాలి. దేశ విదేశాల్లో ప్రముఖులు అందరికీ గోదావరి పుష్కరాలకు ఆహ్వానం అందించాలి. రాష్ట్ర విశిష్టత తెలిసేలా, ప్రతిష్ట పెరిగేలా చేసేందుకు ఇదొక అవకాశంగా భావించాలి. కూచిపూడి ఈవెంట్ వంటివి భారీ తరహాలో నిర్వహించేలా దేవాదాయపర్యాటక శాఖలు ప్రణాళికలు రూపొందించాలి. పోలవరం ప్రాజెక్టును సందర్శించేలా రహదారుల నిర్మాణం జరగాల్సి ఉంది. హేవ్‌లాక్ బ్రిడ్జి, సమీపంలో దీవుల అభివృద్ధి పనులు పూర్తి చేయాలి.' అని నిర్దేశించారు.

**రద్దీ నిర్వహణకు ఎఐ వినియోగం**

ఈసారి పుష్కరాల్లో భద్రత, రద్దీ నిర్వహణకు ఎఐ ఆధారిత క్రౌడ్ అనలిటిక్స్, సిసిటివి ఎంట్రీఎగ్జిట్ మానిటరింగ్, డ్రోన్ సర్వైలెన్స్, క్యూఆర్ ఆధారిత వాహన గుర్తింపు, డీసెంట్రలైజ్డ్ డిప్లాయ్‌మెంట్ సిస్టమ్ వంటి సాంకేతికత వినియోగిస్తున్నట్టు అధికారులు తెలిపారు. వైద్య సేవల పరంగానూ ఎటువంటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. అంబులెన్స్‌లు, ఫస్ట్ ఎయిడ్, మెడికల్ క్యాంపులు నిర్వహిస్తామని చెప్పారు. 30 పీల్డ్ ఆస్పత్రులను తాత్కాలిక ప్రాతిపదికన ఏర్పాటు చేసి, వాటికి అనుబంధంగా ల్యాబ్‌లు సిద్ధం చేస్తున్నామని సిఎం చంద్రబాబు తెలిపారు.

**మోడల్ పుష్కర పంచాయతీగా ముని కూడలి..**

గోదావరి నదీ పరివాహక జిల్లాల్లోని 260 గ్రామ పంచాయతీలలో 50 గ్రామ పంచాయతీలను మోడల్ పుష్కర పంచాయతీలుగా అభివృద్ధి చేయ తలపెట్టారు. తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలంలోని ముని కూడలిని పైలట్ మోడల్ పుష్కర పంచాయతీగా ఎంపిక చేశారు. కొవ్వూరు- పోలవరం మీదుగా పట్టిసీమ రోడ్డు, సీతానగరం నుంచి సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజ్ వరకు తీగ రోడ్డు, అలాగే అవెన్యూ ప్లాంటేషన్, బ్యూటిఫికేషన్... సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజ్‌నుంచి కొవ్వూరువరకు రోడ్లు అభివృద్ధిచేయనున్నారు. రాజమహేంద్రవరం- పోలవరం మధ్య జాతీయ రహదారి అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. పుష్కరాలు కాలుష్య రహితంగా చేసేందుకు 487 గ్రీన్ ఎనర్జీ బస్సులు వినియోగించనున్నారు. అలాగే 11 బస్‌స్టేషన్లను ఆధునీకరిస్తున్నారు. నదిలో భక్తుల భద్రతకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నారు. 2,697 రెస్క్యూ బోట్లు సిద్ధం చేయడంతో పాటు, 8,955 శిక్షణ పొందిన ఈతగాళ్లను పుష్కరాల సమయంలో నియమించనున్నారు.

**అఖండ గోదావరికి పుష్కర ఏర్పాట్లు**

గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించడంతో పాటు, దేశ, విదేశాల నుంచి వచ్చే భక్తులు, పర్యాటకులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రపంచస్థాయి మౌలిక వసతులు, రవాణా, పారిశుధ్యం, తాగునీరు, వైద్య సేవలు, భద్రత, వసతి, సాంకేతిక పరిజ్ఞానంతో సమగ్ర ఏర్పాట్లను అద్భుతంగా చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు స్పష్టంచేశారు. గోదావరి జన్మస్థానం నుంచి సముద్ర సంగమం వరకు అనేక ఉప నదులు, వాగులు, ఏరులు కలుస్తున్నందున 'అఖండ గోదావరి' పేరుతో పుష్కరాలు నిర్వహించే అంశాన్ని పరిశీలించాలని సిఎం సూచించారు.

# శ్రీశైలంలో విషాదం

>> ఆత్మకూరు డి.ఎస్.పి రామాంజి నాయక్ సంఘటన స్థలానికి చేరుకొని తలుపులు తెరచి చూడగా బాత్రూమ్‌లో ముగ్గురు మహిళలు, మెయిన్ రూమ్‌లో ఫ్యాన్‌కు ఇద్దరు పురుషులు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. మృతులను సుధాకర్(36), గోగుల ఆదిలక్ష్మి 50), మల్లేశ్వరి(45), శ్రీదేవి(33), మణికంఠ(15)గా గుర్తించారు. ఆత్మహత్యకు ఆర్థిక ఇబ్బందులే కారణంగా పోలీసులు భావిస్తున్నారు. ముగ్గురు అక్కలలో ఇద్దరుఅక్కలకు పెళ్లిళ్లయిన భర్తలు వదిలేయడం, ఒక అక్కకు పెళ్లి చేయకపోవడం తీవ్ర అప్పులు కావడంతో ఓ అక్క కొడుకుతో సహా మొత్తం ఐదు మంది శ్రీశైలం వచ్చి ఆత్మహత్య చేసుకున్నట్లుగా పోలీసుల ద్వారా సమాచారం తెలుస్తుంది.విషయం తెలుసుకున్న శ్రీశైల దేవస్థానం చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు, ఇఒ ఎం.శ్రీనివాసరావు ఆత్మహత్య చేసుకున్న సత్రంలోని రూమును పరిశీలించారు. మృతుల వివరాలను డిఎస్పీ రామాంజి నాయక్‌తో అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ శ్రీశైలం క్షేత్రంలో ఒకే కుటుంబం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని, ఆర్థిక ఇబ్బందులు ఉన్న ప్రభుత్వం ద్వారా పరిష్కరించుకోవాలని అన్నారు.

## వారం - వర్జ్యం

26-08-2026, బుధవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
శ్రావణ మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, శుక్లపక్షం, మఖకార్తె
తి.త్రయోదశి ఉ.7.58
న.శ్రవణ రా.12.46
వ.తె.5.00-ఉ.6.42
దు.ఉ.11.44-మ.12.34
రాహు మ.12.00-మ.1.30
శుభ ఉ.7.00-ఉ.8.00

## వార్తాఫలం

**మేషం** : క్రీడారంగంలోని వారికి అనుకూలంగా ఉంటుంది. ఆవేశాన్ని కలిగి ఉంటారు. కష్టాలు ఎప్పుడు వంటరిగా రావు.

**వృషభం** : ప్రభుత్వపరమైన పనులు సానుకూల పడతాయి. పోటీ పరీక్షలలో విజయం సాధిస్తారు. ఇంటాబయట ప్రోత్సాహం.

**మిథునం** : ప్రయోజనాలను పరిరక్షించుకోవడానికి మీ ఆత్మసాక్షికి విరుద్ధంగా ఓ కార్యక్రమాన్ని చేపడతారు. ఆహ్వానాలు.

**కర్కాటకం** : ఖచ్చితమైన ప్రణాళికలను రూపొందించు కుంటారు. నూతన కార్యక్రమాలకు శ్రీకారంచుడతారు. వస్తువులు కొనుగోలు.

**సింహం** : ఆర్థిక లావాదేవీలు లాభసాటిగా సాగుతాయి. సోదరుల ద్వారా విలువైన సమాచారం అందుకుంటారు.

**కన్య** : అనుకోని ఆహ్వానాలు ఆశ్చర్యపరుస్తాయి. కొత్త వస్తువులు, వస్త్రాలు కొనుగోలు చేస్తారు. బంధువుల సలహాలు తీసుకుంటారు.

**తుల** : ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది. కోపతాపాలకు దూరం వుండండి. వాహనాలు కొనుగోలు యత్నాలు.

**వృశ్చికం** : వృత్తి, వ్యాపారాలలో మార్పులు వుంటాయి. ఆర్థికపరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది. వస్త్రా లాభం.

**ధనుస్సు** : మనోనిబ్బరంతో ముందడుగు వేసి ముఖ్యమైన వ్యవహారాలు పూర్తి చేస్తారు. కోపతాపాలకు దూరంగా వుండండి.

**మకరం** : వ్యాపారాలను ప్రారంభించడానికి గాను కావలసిన వనరులను సమకూర్చుకునే యత్నాలను ప్రారంభిస్తారు.

**కుంభం** : వృత్తి, వ్యాపారాలలో మార్పులు వుంటాయి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. నూతన వ్యక్తులతో పరిచయాలు.

**మీనం**: భాగస్వామ్య వ్యాపారాలలో అభివృద్ధిని సాధిస్తారు. జీవిత భాగస్వామి సహాయం సహకారాలను అందుకుంటారు. ధనలాభం.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# సంకల్పం నెరవేరింది!

>> 1996 మార్చి 5న వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశాను. మూడు దశాబ్దాల తర్వాత అదే ప్రాజెక్టును నా చేతుల మీదుగా ప్రారంభిస్తున్నాను. 10.7 టిఎంసిల నీటిని నల్లమల సాగర్‌కు రిలీజ్ చేయబోతున్నాం. ఈ చారిత్రక ఘట్టానికి ఈ నెల 31వ తేదీ మార్కాపురం జిల్లా వేదిక కాబోతోంది. ఫేజ్-1తో 1.19 లక్షల ఎకరాలకు, ఫేజ్-2తో 3.283 లక్షల ఎకరాలకు సాగునీరు. అలాగే లక్షలాది మందికి మంచి నీటితో తరతరాలుగా కరువుతో పోరాడిన ప్రజలకు ఉపశమనం కల్పించడమే మా లక్ష్యం' అని సిఎం చంద్రబాబు పేర్కొన్నారు. "వెలిగొండ జలవిజయంతో కరువు ప్రాంతంలో కృష్ణమ్మతో జలహారతి ఇస్తున్నాం. నెర్రలు బారిన నేలను కృష్ణా జలాలతో తడపబోతున్నాం. ఈ నెల 31వ తేదీ నుంచి మొదలయ్యే వెలిగొండ జలసిరులుతో ఈ ప్రాంత అభివృద్ధికి రెక్కలు తొడుగుతుంది. ఈ జలంతో జీవం జీవితం... సాగు-బాగు. పశ్చిమ ప్రకాశం ప్రజల ఎన్నో యేళ్ల కల అయిన మార్కాపురంజిల్లాను ఏర్పాటు చేసి ఆ ఆకాంక్షను నెరవేర్చాం. రాయలసీమ, ఉమ్మడి ప్రకాశం జిల్లాలను హార్టికల్చర్ హబ్‌గా చేసేందుకు రూ.లక్ష కోట్ల పెట్టుబడులతో త్వరలో పనులు ప్రారంభిస్తున్నాం. నేషనల్ హైవేలు, పోర్టులతో ఈ ప్రాంతానికి లాజిస్టిక్స్ లోటు లేకుండా చేస్తున్నాం. బెంగుళూరు- అమరావతి హైవే, రామాయపట్నం పోర్టులతో వాణిజ్య, పారిశ్రామిక అభివృద్ధికి కొత్త ద్వారాలు తెరుస్తున్నాం అన్నారు.

# 'సెర్ప్'కు అవార్డు

>> హించిన దేశవ్యాప్త పిఎం ఎఫ్ఎంఈ కాంక్లేవ్ నందు ఈ అవార్డును బహుకరించారు. ప్రైమ్ మినిస్టర్ ఫార్మలైజేషన్ మైక్రో ఎంటర్ప్రైజెస్ సీడ్ క్యాపిటల్ కాంపోనెంట్ కింద ఆమోదించబడిన పనితీరు ప్రమాణాల ఆధారంగా స్వయం సహాయక సంఘ మహిళలకు అందిస్తున్న సేవలు, నిధుల వినియోగం, యూనిట్ల అభివృద్ధి తదితర అంశాల్లో వివిధ రాష్ట్రాల గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థల పనితీరును కేంద్ర ఆహార శుద్ధి మంత్రిత్వ శాఖ మూల్యాంకనం చేసింది. ఈ మూల్యాంకనంలో సెర్ప్ ఎపి సమగ్ర పనితీరు ఆధారంగా ఉత్తమ పనితీరు కనబరిచిన విజేతల్లో ఒకటిగా ఎంపికైంది. ఈ సందర్భంగా కేంద్ర ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమల శాఖ మంత్రి చిరాగ్ పాస్వాన్ చేతుల మీదుగా ఆంధ్రప్రదేశ్ తరఫున జీవనోపాధుల విభాగపు డైరెక్టర్ డాక్టర్ శివ శంకర ప్రసాద్, అదనపు డైరెక్టర్ కె సరళ , కన్సల్టెంట్ రమ్య ఈ అవార్డును స్వీకరించారు.ఎస్ హెచ్ జి మహిళలకు సీడ్ కాపిటల్ ద్వారా, పీఎం ఎఫ్ఎంఈ పథకం ద్వారా సబ్సిడీతో కూడిన రుణాలను బ్యాంకుల ద్వారా అందించి, మహిళలను ఎంటర్ ప్రెన్యూర్స్ గా తీర్చిదిద్దడానికి సెర్ప్ చేసిన కృషిని ఈ సందర్భంగా పలువురు అభినందించారు. ఈ అవార్డు రాష్ట్రంలోని మహిళా ఎంటర్ ప్రెన్యూర్స్ ని మరింత ప్రోత్సాహాన్ని అందించడంతో పాటు, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాల పెంపు, మహిళల ఆర్థిక సాధికారత మరియు గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి దోహదపడుతుందని సెర్ప్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి కరుణ వాకాటి తెలిపారు.

26-8pg7exHMNWJQE.qxd:26-8pg7exHMNWJQE.qxd 1/1/02 6:24 AM Page 1



# ఉచితాలకు వ్యతిరేకం

- ప్రభుత్వాలు ఉచితాలకు స్వస్తి పలకాలి
- విద్య, వైద్యం ఉచితంగా అందించాలి
- విద్యార్థులు నైపుణ్యం పెంపొందించుకోవాలి
- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు



**వింజమూరు(నెల్లూరు), ఆగస్టు 25 ప్రభాతవార్త:** విద్యార్థులు కేవలం డిగ్రీలకే పరిమితం కాకుండా దేశ ప్రగతికి ఉపయోగపడేలా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని భారత మాజీ ఉపరాష్ట్రపతి, పద్మవిభూషణ్ ముప్పవరపు వెంకయ్య నాయుడు పిలుపునిచ్చారు. మంగళవారం వింజమూరులోని వైఆర్ జూనియర్ కళాశాల స్వర్ణోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేసి విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో విద్యను అభ్యసించి, పట్టుదలతో లక్ష్యాలను సాధించి దేశానికి సేవ చేయాలన్నారు. ఉపాధ్యాయ వృత్తి ఒక పవిత్ర ధర్మమని, అధ్యాపకులు తమ ప్రవర్తనతో, వాత్సల్యంతో విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. స్వర్ణభారతి ట్రస్ట్ ద్వారా సెల్ ఫోన్ రిపేరింగ్, టీవీ, రిఫ్రిజిరేటర్, మోటార్ రివైండింగ్, నర్సింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ వంటి వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నామని, దీని వల్ల యువత సొంత కాళ్లపై నిలబడుతున్నారని తెలిపారు. కేవలం సాధారణ డిగ్రీల వల్ల ఉపయోగం లేదని, వృత్తి విద్యా విధానం వల్లనే నిజమైన ఉపాధి లభిస్తుందని స్పష్టం చేశారు. పిల్లల్లో చిన్నప్పటి నుంచే దేశభక్తి, సమయపాలన, మన కట్టు బొట్టు, ఆటపాటలపై గౌరవం పెంపొందించాలన్నారు. వేషభాషలు, కులమతాలు వేరైనా మనమంతా భారతీయులమనిగర్వించాలన్నారు. తెలుగు భాషను తప్పక నేర్పించాలని, తెలుగు మీడియంలో చదువుకున్న వారు సైతం సుప్రీంకోర్టు న్యాయమూర్తుల స్థాయికి ఎదిగారని గుర్తు చేశారు. పిల్లలు పెద్దలతో ఎక్కువ సమయం గడపాలని సూచించారు. ప్రభుత్వాలు నడిపే పెద్దలు ప్రజలను ఉచితాల నుంచి దారి మళ్లించాలని వెంకయ్య నాయుడు సూచించారు.

"నేను ఉచితాలకు వ్యతిరేకం. ప్రభుత్వం వద్ద డబ్బులు లేకపోతే ఉచితాలు ఎలా ఇస్తారు? అడిగినా, అడగకపోయినా అన్నీ ఫ్రీ ఇవ్వడం సరికాదు. ఫ్రీ ఇవ్వాల్సి వస్తే విద్య, వైద్యం మాత్రమే ఉచితంగా ఇవ్వాలి. రోడ్లు, కరెంటు, మంచినీరు, రైతుకు 24 గంటల విద్యుత్, ఆసుపత్రిలో వైద్యుడు, మందులు ఉండేలా చూడాలి" అని అన్నారు. బస్సుల్లో అందరికీ ఉచితం కాకుండా అంగవైకల్యం కలిగిన వారికి మాత్రమే ఇవ్వాలని, స్వాతంత్ర్యం వచ్చి 80 ఏళ్లైనా ఇంకా ఉచితాలు ఇవ్వడం అర్థరహితమన్నారు. దేశ ప్రజల కోసం ప్రధాని మోడీ ఏటా రూ.82 వేల కోట్లు ఖర్చు చేసి పేదలకు బియ్యం అందిస్తున్నారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు అమరావతి రాజధాని కావడం మనందరి అదృష్టమని, దానికి గొప్ప చరిత్ర ఉందని అన్నారు. దానిపై ఇంకా కొందరు రాజకీయం చేయడం సరికాదని, మన పూర్వీకులను గౌరవించుకోవడం మన సంప్రదాయమని పేర్కొన్నారు.

## విద్యుదాఘాతంతో ఒకరి మృతి

**దగదర్తి, (నెల్లూరు) ఆగస్టు 25 ప్రభాతవార్త:** మండలంలోని దుండిగం గ్రామంలో విద్యుత్ షాక్‌కు గురై కాప దామోదర్ (47) అనే వ్యక్తి మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దుండిగం ప్రజలు, అధికారుల వివరాల ప్రకారం దామోదర్ తన ద్విచక్ర వాహనాన్ని గ్రామంలోని రహదారి వద్ద ఉంచి, సమీప బీడు పొలాల్లో సుమారు ఎనిమిది అడుగుల ఎత్తులో వెళ్తున్న 11 కేవీ విద్యుత్ వైర్ల వద్ద మృతి చెంది ఉన్నాడు 11 కెవి వైర్లను చూసుకోకుండా చెయ్యి తగిలి మృతి చెంది ఉంటాడా లేక అతనే వైర్లు తాకి మృతి చెంది ఉంటాడా అని అనుమానంతో వ్యక్తం చేస్తూ దుండిగం ప్రజలు చెప్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ మహేంద్ర తెలిపారు. మృతుడికి భార్య, ఒక కుమారుడు ఉండగా, నెల్లూరులో ఇంటర్ చదువుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

## క్రీడా కార్యక్రమాల వద్ద పటిష్ట భద్రతా చర్యలు

### అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై ప్రత్యేక నిఘా





**తిరుపతి, ఆగస్టు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతి జిల్లా కేంద్రంలో జరుగుతున్న అమరావతి ఛాంపియన్ స్పోర్ట్స్ మీట్ నేపథ్యంలో క్రీడాకారులకు పూర్తిభద్రత కల్పిస్తున్నారు. తిరుపతిలోని తారకరామ స్టేడియం, వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, పద్మావతి విశ్వవిద్యాలయం పరిసర ప్రాంతాల్లో తిరుపతి జిల్లా పోలీసులు శక్తి బృందాలను మోహరించి ప్రత్యేక గస్తీ నిర్వహిస్తున్నారు. శాప్స్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు సూచనలతో క్రీడా కార్యక్రమాలకు హాజరయ్యే విద్యార్థులు, మహిళలు, ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఆయా ప్రాంతాల్లో శక్తి బృందాలు నిరంతరం పర్యటిస్తూ అపరిచితులు, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచుతున్నాయి. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా మహిళ అదనపు ఎస్పీ ఎం. శ్రీలత పర్యవేక్షణలో ముందస్తు భద్రతా చర్యలు చేపట్టారు. తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు ఆదేశాల మేరకు ప్రజల భద్రత, మహిళలు-చిన్నారుల రక్షణకు జిల్లా వ్యాప్తంగా పోలీసుల గస్తీ, నిఘా అవగాహన కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతున్నాయి.

## సుప్రీంకోర్టులో వైఎస్సార్సీపీకి ఎదురుదెబ్బ

**విజయవాడ, ఆగస్టు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** వైఎస్సార్సీపీ నేత లేళ్ల అప్పిరెడ్డి దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ప్రభుత్వ ఆదేశాలతో తమ సోషల్ మీడియా ఖాతాలు నిలిపివేశారని, అలాగే కర్నూలు, గుంటూరు జిల్లాల్లోని 4 కేసులపై వైఎస్సార్సీపీ అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. అయితే ఈ పిటిషన్‌ను విచారించేందుకు జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ షీల్‌నాగు ధర్మాసనం నిరాకరించింది. ఏవైనా అభ్యంతరాలు ఉంటే హైకోర్టును ఆశ్రయించాలని సూచించింది.

## స్క్రబ్బర్ స్కామ్ నిందితుల రిమాండ్ పెంపు

**విజయవాడ, ఆగస్టు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** మాషా అల్లా స్క్రబ్బర్ స్కామ్‌లో నిందితుల రిమాండ్ గడువు నేటితో ముగిసింది. వారిని అధికారులు వర్చువల్ విధానంలో విజయవాడ కోర్టు ముందు ప్రవేశపెట్టారు. కేసును విచారించిన న్యాయమూర్తి, ఆ నిందితుల రిమాండ్‌ను కూడా సెప్టెంబర్ 8 వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ కేసులో నిందితులు పలువురి స్క్రబర్ల విక్రయాలు ఇతర అంశాలపై మోసగించి, రూ.కోట్లు కొల్లగొట్టారు. దాంతో నిందితులపై పోలీసుల కేసు నమోదు చేసారు. నిందితులపై ఇతర జిల్లాల్లోను కేసులున్నాయి. ప్రస్తుతం వీరు రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు.

## సాయికృష్ణ కేసు నిందితుల రిమాండ్ పొడిగింపు

**విజయవాడ, ఆగస్టు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** సాయికృష్ణ అదృశ్యం కేసులో నిందితుల జ్యుడీషియల్ కస్టడీ నేటితో ముగిసింది. దీంతో రిమాండ్‌లో ఉన్న నాగరాజు సహా ఇతర నిందితులను అధికారులు వర్చువల్ విధానంలో విజయవాడ కోర్టులో హాజరుపరిచారు. విచారణ జరిపిన న్యాయమూర్తి, వారి రిమాండ్‌ను సెప్టెంబర్ 8 వరకు పొడిగిస్తూ ఆదేశాలు జారీ చేశారు. సాయికృష్ణ కృష్ణలంక పోలీసు స్టేషన్‌లో లాకప్‌డెత్ అయ్యాడు. ఈ విషయాన్ని నిందితుల రిమాండ్ రిపోర్టులో సిట్ స్పష్టం చేసింది. ఈ కేసులో నిందితులందరిని పోలీసులు కోర్టు కస్టడీకి తీసుకుని విచారించారు. ప్రస్తుతం వీరంతా రిమాండ్‌లో ఉన్నారు.

## ఉమెన్ ఎపిఎల్ వేలం

**విజయవాడ, ఆగస్టు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** ఉమెన్ ఆంధ్రా ప్రీమియర్ లీగ్ వేలం విజయవాడలో కొనసాగుతుంది. 191 మంది క్రీడాకారిణులు ఈ వేలంలో పాల్గొన్నారు. జనాలుగు ఫ్రాంఛైజీలు ఒక్కొక్కటి రూ.15 లక్షలతో ప్లేయర్లను కొనుగోలు చేసేందుకు వీలుగా ఈ వేలం సాగుతుంది. ఈ లీగ్‌కు అంబాసిడర్‌గా మిథాలీరాజ్ వ్యవహరిస్తారు. సెప్టెంబర్ 15 నుంచి 26 వరకు మంగళగిరిలో డబ్ల్యూఏపీఎల్ మ్యాచ్‌లు జరగనున్నాయి. ఈ వేలంలో అమరావతి ఈ ఛాంపియన్స్ ఫ్రాంచైజీ పలువురు కీలక క్రీడాకారిణులను సొంతం చేసుకుంది. హేమసాయి రమ్యను రూ.55 వేలకు, కర్రి సాయిపూజితను రూ.50 వేలు, నక్కా సనాను రూ.45 వేలు, ఓరుగంటి సాహితీశ్రీని రూ.40 వేలకు దక్కించుకుంది. బి.సాయిదీప్తి, తాళ్లూరి మల్లిక, బొద్దుపల్లి తనిష్కను, సహస్రారెడ్డిని ఒక్కొక్కరినీ రూ.30 వేలకు దక్కించుకుంది. ఈ వేలంలో అమరావతి ఈఛాంపియన్స్ ఫ్రాంచైజీ పలువురు కీలక క్రీడాకారిణులను సొంతం చేసుకుంది. విశాఖకు చెందిన షబ్నంను రూ.1.30 లక్షలకు ఆ జట్టు కొనుగోలు చేసింది. నీరగట్టు అనూషను అత్యధికంగా రూ.2.10 లక్షలకు దక్కించుకుంది. అలాగే బ్యాటర్ పరసా రంగలక్ష్మిని రూ.లక్షకు సొంతం చేసుకుంది. వికెట్ కీపర్ కాట్రగడ్డ దీక్షను రూ.1.90 లక్షలకు ఈఛాంపియన్స్ కొనుగోలు చేసింది.

# వెలిగొండ ప్రాజెక్టుకు జలకళ

# మార్కాపురం జిల్లాలో సంబరాలు

- మార్కాపురం పట్టణంలో భారీ ట్రాక్టర్ల ర్యాలీ



**మార్కాపురం, ఆగస్టు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** మూడు దశాబ్దాల నిరీక్షణకు ఐదు రోజుల్లోపు తెరపడనుంది.. కరువు దుర్భిక్షంతో అల్లాడిపోతున్న పశ్చిమ ప్రాంతంలో త్వరలో కృష్ణమ్మ పరవళ్ళు తొక్కనుంది. వెలిగొండ టన్నెల్స్ ద్వారా కృష్ణా జలాలను నల్లమల్ల సాగర్‌లోకి విడుదల చేసేందుకు కూటమి ప్రభుత్వం శరవేగంగా అడుగులు వేస్తుంది. కృష్ణమ్మ జలకళతో పశ్చిమ ప్రాంత ప్రజల కష్టాలు తీరిపోనున్న రోజులు దగ్గరలో రానున్నాయి. వెలిగొండ రెండవ టన్నుల కోసం అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పోరాటం చేశారు. సైకిల్ యాత్ర, రిలే నిరాహార దీక్షలు చేపట్టి మొదటి టన్నుల వల్ల ప్రజలు జరుగుతున్న అన్యాయంపై అలుపెరగని పోరాటం చేశారు. ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. రెండవ టన్నుల అవశ్యకతను గుర్తించిన అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం రెండవ టన్నెల్ మంజూరు చేసింది. అయితే రెండవ టన్నెల్ కోసం అహర్నిశలు పోరాటం చేసి సాధించారు.త్వరలో విడుదల కానున్న వెలిగొండ నీటి విడుదల తో మార్కాపురం జిల్లా రూపురేఖలు మారిపోనున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని మార్కాపురం పట్టణంలో మంగళవారం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి నేతృత్వంలో భారీ ట్రాక్టర్ల ర్యాలీ నిర్వహించారు. ఈ నెల 31వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు వెలిగొండ ప్రాజెక్టు కు ప్రారంభోత్సవం చేయనున్న సందర్భంగా కృతజ్ఞత ర్యాలీ నిర్వహించారు. మార్కెట్ యార్డ్ నుండి ప్రారంభమైన ట్రాక్టర్ల ర్యాలీ కాలేజీ రోడ్, దోర్నాల బస్టాండ్, అమ్మవారి శాల, గడియార స్తంభం సెంటర్, కంభం బస్టాండ్, కోర్టు సెంటర్, పూల సుబ్బయ్య కాలనీ మీదుగా శ్రీ అల్లూరు పోలేరమ్మ దేవస్థానం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కూటమినేతలు దేవస్థానంలో రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు పేరుమీద ప్రత్యేక పూజలు నిర్వహించారు. చంద్రబాబునాయుడు నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని అమ్మవారిని వేడుకున్నారు.

**నేడు భారీ బైక్ ర్యాలీ** బుధవారం సాయంత్రం నాలుగు గంటలకు శ్రీశ్రీ అల్లూరి పోలేరమ్మ దేవస్థానం నుండి శ్రీశ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి వారి ఆలయం వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహిస్తామని నియోజకవర్గంలోని తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు, జనసేన నాయకులు కార్యకర్తలు, బిజెపి నాయకులు కార్యకర్తలు వేల సంఖ్యలో బైకులతో విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నియోజకవర్గ పోల్ మేనేజ్మెంట్ క్లస్టర్ ఇంచార్జ్ కందుల రామిరెడ్డి పిలుపునిచ్చారు. ఈ ట్రాక్టర్ ర్యాలీలో జనసేన నియోజకవర్గ ఇన్చార్జ్ ఇమ్మడి కాశీనాథ్, బిజెపి నియోజకవర్గ ఇన్చార్జి పి.వి కృష్ణారావు, టిడిపి యువ నాయకులు, ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తనయుడు కందుల విగ్నేష్ రెడ్డి, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.గోపాల కృష్ణారావుకు ఘన వీడ్కోలు

**విజయవాడ, ఆగస్టు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వేణుతురుమల్లి గోపాల కృష్ణారావుకు హై కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్ సమక్షంలో ఫుల్ బెంచ్ ఘన వీడ్కోలు పలికింది.హైకోర్టు న్యాయమూర్తి గోపాల కృష్ణారావు పదవీ విరమణ చేయనున్న సందర్భాన్ని పురస్కరించుకుని మంగళవారం హై కోర్టు మొదటి కోర్టు హాల్లో ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హై కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్ మాట్లాడుతూ జస్టిస్ గోపాల కృష్ణారావు నిబద్ధత కలిగిన న్యాయమూర్తని కొనియాడారు.జస్టిస్ గోపాల కృష్ణారావు ఉమ్మడి కృష్ణా జిల్లా చల్లపల్లిలో 1964 ఆగస్టు30న జన్మించారని, చల్లపల్లి, మచిలీపట్నంల్లో పాఠశాల, కళాశాల విద్యను పూర్తి చేశారన్నారు. 1989వ సంవత్సరంలో బార్ కౌన్సిల్ సభ్యుడిగా, న్యాయవాదిగా ప్రాక్టీస్ ప్రారంభించారని తెలిపారు. 1994లో ఏపీ జ్యుడీషియల్ సర్వీసెస్‌లో ఉత్తీర్ణులై జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారన్నారు. జనవరి 2023లో హై కోర్టు అదనపు న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించారని, 2024 ఆగస్టులో ఏపీ హై కోర్టు శాశ్వత న్యాయమూర్తిగా నియామకం అయ్యారన్నారు. జస్టిస్ గోపాల కృష్ణారావు తన పదవీ కాలంలో అనేక కీలకమైన తీర్పులను వెలువరించారని తెలిపారు. తదుపరి జిల్లా, సెషన్స్ జడ్జీగా వివిధ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారన్నారు. పదవీ విరమణ అనంతరం జస్టిస్ గోపాల కృష్ణారావు శేష జీవితం ఆయురారోగ్యాలతో ప్రశాంతంగా గడవాలని కోరుకుంటున్నామని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్ ఆకాంక్షించారు. పదవీ విరమణ చేయునున్న జస్టిస్ గోపాల కృష్ణారావు మాట్లాడుతూ ఉద్యోగ నిర్వహణలో సహాయ సహకారాలు అందించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. తన విద్యార్థి దశ నుండి న్యాయవాదిగా, న్యాయమూర్తిగా ఉన్నత శిఖరాలను చేరుకోవడానికి ప్రతి దశలోనూ ఉత్తమ సలహాలు అందించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు. అంతకు ముందు అదనపు సొలిసిటర్ జనరల్ చల్లా ధనుంజయ్, అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, ఎపి హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులు ప్రభునాథ్ వాసిరెడ్డి జస్టిస్ గోపాల కృష్ణారావుకు పదవీ విరమణ శుభాకాంక్షలు తెలుపుతూ తమ అనుభవాలను పంచుకున్నారు.




హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.గోపాల కృష్ణారావుకు వీడ్కోలు కార్యక్రమంలో ప్రసగంగిస్తున్న సీజె జస్టిస్ లీసా గిల్

# స్థానిక సంస్థల ఎన్నికలు స్వేచ్ఛగా జరిగితే వైసిపిదే విజయం

- కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజల తీర్పు ఖాయం: వైఎస్ జగన్



**విజయవాడ, ఆగస్టు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** స్థానిక సంస్థల ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగితే వైసిపిదే విజయమని, కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలు స్పష్టమైన తీర్పు ఇస్తారని ఆ పార్టీ అధినేత, మాజీ సిఎం వైఎస్ జగన్ ధీమా వ్యక్తం చేశారు. పార్టీ ముఖ్యనేతలతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని, రాబోయే స్థానిక ఎన్నికలపై దిశానిర్దేశం చేస్తూ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఎన్నికలు కేవలం గెలుపోటములకు సంబంధించినవి మాత్రమే కావని, క్షేత్రస్థాయిలో పార్టీ కోసం శ్రమిస్తున్న కార్యకర్తలకు అండగా నిలబడాల్సిన కీలక సమయమని జగన్ పేర్కొన్నారు. గతంలో జరిగిన ఎంపిటిసి, జడ్‌పిటిసి, మున్సిపాలిటీ ఎన్నికల్లో అధికార దుర్వినియోగం, దౌర్జన్యాలు చూశామన్నారు. ఈసారి ప్రతి స్థానంలోనూ సమర్థులైన, బలమైన అభ్యర్థులను పోటీకి దింపాలని సూచించారు. అవసరమైతే నాయకులు ఏ నియోజకవర్గంలోనూ పోటీ లేకుండా ఏకగ్రీవాలకు తావు ఇవ్వకూడదని, ఒకవేళ ఎక్కడైనా ఏకగ్రీవాలు జరిగితే అక్కడి కోఆర్డినేటర్లు భవిష్యత్తులో అసెంబ్లీ అభ్యర్థులుగా కొనసాగలేరని హెచ్చరించారు. పార్టీ కేడర్ బలోపేతం కోసం 14 నుంచి 15 లక్షల క్యూఆర్ కోడ్ ఆధారిత గుర్తింపు కార్డులు సిద్ధమయ్యాయని, సెప్టెంబరు 5 నుంచి మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయి సమావేశాలు నిర్వహించి వీటిని పంపిణీ చేయనున్నట్లు వైఎస్ జగన్ వెల్లడించారు. 'వెన్నుపోటు పార్టీ - వెన్నుపోటు పాలన' అనే నినాదంతో గ్రామ స్థాయిలో వైసిపి- కూటమి పాలన మధ్య ఉన్న వ్యత్యాసాన్ని వివరిస్తూ ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలను రక్షించుకోవడానికి నియోజకవర్గ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు లీగల్, మీడియా సెల్స్‌ను బలోపేతం చేయాలని... అవసరమైతే కేసులు హైకోర్టు వరకు తీసుకెళ్లేలా సమన్వయ వ్యవస్థ ఉండాలని తెలిపారు. అలాగే సోషల్ మీడియాను పూర్తి ఎ ా ం ఖ ల ్లో ఉపయోగించుకోవాలని, జగన్ 2.0 సూపర్ యాప్ యూట్యూబ్, ఎక్స్ వంటి వేదికల ద్వారా నిజాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని కోరుతూ, రాజకీయ ఒత్తిళ్లతో చట్టవిరుద్ధంగా వ్యవహరించే అధికారుల పేర్లను డిజిటల్ బుక్‌లో నమోదు చేసి, భవిష్యత్తులో చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నాయకులు తమ ఈగోలను పక్కనపెట్టి, రాబోయే 60- 70 రోజులు నియోజకవర్గాల్లోనే ఉంటూ స్థానిక ఎన్నికల్లో పార్టీ విజయం కోసం కృషి చేయాలని జగన్ పిలుపునిచ్చారు.

## ఎఇఇ నియామక పరీక్షకు 81 శాతం హాజరు

**తిరుపతి, ఆగస్టు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎస్‌పిడిసిఎల్ పరిధిలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి నిర్వహిస్తున్న నియామక పరీక్షల్లో ఘూడవ రోజు మంగళవారం 81 శాతం హాజరయ్యారు. ఎస్‌పిడిసిఎల్ పరిధిలోని 27 పరీక్షా కేంద్రాల్లో ఉదయం నిర్వహించిన ఎలక్ట్రానిక్స్ పరీక్షకు మొత్తం 5,120 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా 4,040 మంది ఈ పరీక్షకు హాజరయ్యారని, అదేవిధంగా మధ్యాహ్నం జరిగిన టెలికాం పరీక్షకు 4,764 మంది హాజరు కావాల్సి ఉండగా, 3,967 మంది అభ్యర్థులు హాజరయ్యారని ఎస్పీడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి తెలిపారు, పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టడంతో ఈ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగాయని తెలియజేశారు.

## ఎసిబి డిఎస్పీ పేరుతో సైబర్ మోసం



**తిరుపతి(క్రైమ్), ఆగస్టు 25 ప్రభాతవార్త:** ఎసిబి అదికారి పేరుతో తిరుపతిలోని ఓ విశ్రాంత అధికారిని నమ్మించి సైబర్ నేరస్తుడు రూ.2 లక్షలు నగదు బదలీ చేసుకున్నాడు. ఈ ఉదంతంపై అలిపిరి పోలీసులు కేసు నమోదు చేశారు. కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్‌లో డిప్యూటీ సిటీ ప్లానర్‌గా పనిచేసి పదవీ విరమణ పొందిన తిరుపతికి చెందిన వై. వెంకటరమణకు ఐదురోజుల క్రిందట గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి తాను ఎసిబి డిఎస్పీగా పరిచయం చేసుకున్నాడు. ఈయన సర్వీసులో ఉన్న సమయంలో లంచాలు తీసుకున్నట్లు ఫిర్యాదులు వచ్చాయని, రూ.5 లక్షలు చెల్లించకపోతే ఉన్నతాధికారులకు నివేదిక పంపి పెన్షన్ ప్రయోజనాలను నిలిపివేయిస్తామని బెదిరించాడు. బెదిరింపులకు భయపడిన బాధితుడు సైబర్ నేరస్థుడు సూచించిన ఫోన్ నంబర్‌కు ఆన్‌లైన్ ద్వారా రూ.2 లక్షలు బదలీ చేశాడు. మళ్ళీ మరో రూ.3లక్షలు చెల్లించాలంటూ మరుసటి రోజు మరో నంబర్ నుండి ఫోన్ చేసి వేధించడంతో సైబర్ మోసానికి గురైనట్లు గుర్తించాడు. బాధితుడు అలిపిరి పోలీస్ స్టేషన్‌లో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు అలిపిరి పోలీసులు సంబంధిత సైబర్ నేరం, మోసం తదితర వర్తించే చట్టపరమైన సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సైబర్ క్రైమ్ విభాగం సహకారంతో నిందితులను గుర్తించి, వారి కదలికలు ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన వివరాలను సేకరించి, నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందం దర్యాప్తు కొనసాగిస్తోంది.

## తిరుపతి రైల్వే స్టేషన్ డైరెక్టర్ సత్యనారాయణకు సీనియర్ డిసిఎంగా పదోన్నతి




**తిరుపతి, ఆగస్టు 26ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతి రైల్వే స్టేషన్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న కుప్పాల సత్యనారాయణకు గుంతకల్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ (సీనియర్ డిసిఎం)గా పదోన్నతి లభించింది. సీనియర్ డీసీఎంగా బాధ్యతలు స్వీకరించడంతో బాటు తిరుపతి రైల్వే స్టేషన్ డైరెక్టర్‌గా కూడా తన సేవలనుకొనసాగించనున్నారు. కుప్పాల సత్యనారాయణ రైల్వే శాఖలో స్టేషన్ మాస్టర్‌గా తన ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించారు. అనంతరం స్టేషన్ మాస్టర్, విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ తదితర కీలక హోదాల్లో బాధ్యతలు నిర్వహించారు. రైల్వే శాఖ నుండి డిప్యూటేషన్‌పై సిబిఐలో రెండేళ్లపాటు విధులు నిర్వర్తించారు. అనంతరం తిరిగి రైల్వే శాఖలో చేరి లైజన్ ఆఫీసర్‌గా, సికింద్రాబాద్ హెడ్‌క్వార్టర్స్‌లో చీఫ్ కమర్షియల్ మేనేజర్‌గా, తిరుపతి రైల్వే స్టేషన్ డైరెక్టర్‌గా వివిధ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారు.



## క్యూర్ పరిధిలో టిజి సేఫ్ దాడులు

### 15 టన్నుల నాణ్యతలేని ఆహారవస్తువుల జప్తు

### పలు సంస్థలకు నోటీసులు, ఒక దుకాణం లైసెన్స్ రద్దు

**హైదరాబాద్, ఆగస్టు 25, ప్రభాతవార్త:** కల్తీ ఆహార వస్తువులపై ఉక్కుపాదం మోపేందుకు సర్కారు కొత్తగా ఏర్పాటు చేసిన రాష్ట్ర స్టాండర్డ్స్ అ థారిటీ ఫర్ ఫుడ్ అండ్ ఎసెన్షియల్ డ్రగ్స్ (టిజి సేఫ్) మంగళవారం నాడు క్యూర్ (ఓఆర్ఆర్) పరిధిలో వ్యాపారాలు నిర్వహిస్తున్న దుకాణాలు, వ్యాపార సంస్థలపై పెద్ద ఎత్తున దాడులు నిర్వహించింది. ఈ నెల 22వ తేదీన మొదటి సారిగా దాడులు నిర్వహించిన టిజి సేఫ్ మూడు రో జుల వ్యవధిలో మరోదఫా దాడులు చేబట్టింది. కల్తీ ఆహార వస్తులను గుర్తించి తొలగించడం, గడువు ముగిసిన ఆహార ఉత్పత్తుల విక్రయాలను అడ్డుకోవడం వంటి అంశాలను పరిగణలోకి తీసుకున్న టిజి సేఫ్ అధికారులు ఈ దాడులు నిర్వహించారు. టిజి సేఫ్ కమిషనర్ అవినాష్ మొహంతి ఆధ్వర్యంలో జరిగిన ఈ దాడుల్లో 15 బృందాలు పాల్గొనగా 32 చోట్ల తనిఖీలు జరిగాయి. దాడుల సందర్భంగా అనేకచోట్ల ఆహార వ స్తువుల విక్రయాల కేంద్రాల వద్ద పరిశుభ్రత లేకపోవడం వెలుగు చూసింది. గడువు ముగిసిన వస్తువులను అమ్ముతున్న వైనం రట్టయ్యింది. ఆ హార వస్తువులను నిలువ వుంచే పద్దతులు సవ్యంగా లేక పోవడం గుర్తించారు. కుళ్లిపోయిన కూరగాయలను మంచివిగా చెబుతూ అమ్ముతున్న ట్లు గుర్తించారు. ఫుడ్ సేఫ్టీ నిబంధనలు చాలాచోట్ల కనిపించలేదు. ఆహార వస్తువుల ప్యాకింగ్ అనేకచోట్ల సవ్యంగా లేదు. 35 ఆహార వస్తువుల శ్యాంపుల్స్ సేకరించగా బాచుపల్లిలో బర్ఫీఘర్ స్వీట్ షాప్‌లో కనీస ప్రమాణాలు లేకుండా మిఠాయిలు తయారు చేస్తున్నందు కు దీని లైసెన్స్‌ను రద్దు చేశారు. 12 దుకాణాల ప్రమాణాలు సరిగ్గా లేకపోవడంతో వాటిని వెంటనే మెరుగు పరచుకోవాలని నోటీసులు ఇచ్చారు. నాలుగు దుకాణాలకు షోకాజ్ నోటీసులు ఇచ్చారు. దాడుల సందర్భంగా నాణ్యత లేకుండా వున్న 15 టన్నుల ఆహార వస్తువులను టిజి సే ఫ్ అధికా రులు జప్తు చేశారు. వీటి విలువ 30 లక్షల రూపాయలు వుంటుందని అధికారులు తెలిపారు.

# అబద్ధాదలు చెప్పి పెళ్ళి చేసారు, నా గొంతు కోసారు

- మాజీ మంత్రి జోగి రమేష్ కుటుంబంపై కోడలు మేఘన సంచలన ఆరోపణలు



**విజయవాడ, ఆగస్టు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** మాజీ మంత్రి జోగి రమేశ్ కుటుంబ వ్యవహారం ఏపీలో సంచలనంగా మారింది. జోగి కుటుంబంపై కోడలు మేఘన సంచలన ఆరోపణలు చేశారు. అన్నీ తెలిసే తన గొంతు కోశారంటూ ఆమె కన్నీటి పర్యంతమయ్యారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ ఇప్పటి వరకు అండగా నిలిచిన మీడియాకు ధన్యవాదాలు తెలియజేశారు. తనకు జరిగిన అన్యాయాన్ని అందరికీ తెలిపేందుకు మీడియా ముందుకు వచ్చినట్లు చెప్పారు. ఇలాంటి రోజు వస్తుందని, ఆడపిల్లగా ఇలా మాట్లాడాల్సి రావడం చాలా బాధగా ఉందని ఆవేదన చెందారు. "నాకు జరిగిన అన్యాయాన్ని ఎదుర్కొని గట్టిగా నిలబడ్డాను. ఈరోజు ఈ పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కొన్నందుకు గర్వంగా ఫీలవుతున్నా. జోగి రమేశ్, వారి కుటుంబ సభ్యులు నాపై నిందలు వేస్తున్నారు. 2025 మేలో జోగి రమేశ్ కుమారుడు రాజీవ్‌తో నాకు పెళ్లి చేశారు. మా నాన్న నా సంతోషం కోసం ఎంతో కష్టపడి ఈ పెళ్లి జరిపారు. జోగి రమేశ్ మీద నమ్మకంతో వారింటికి కోడలుగా పంపారు. అందరి ఆడపిల్లలాగా ఎన్నో ఆశలతో ఆ ఇంట్లో అడుగు పెట్టాను. కొన్ని రోజులకే నన్ను ఇబ్బందులు పెట్టడం ప్రారంభించారు. ఇద్దరి మధ్య విభేదాలు వచ్చి విడిపోవడం అనేది సహజం. కానీ రాజీవ్‌కు ఉన్న ప్రాబ్లమ్ ఆ కుటుంబ సభ్యులు అందరికీ తెలుసు. అయినా నాకు అతనితో పెళ్లి చేసి, తెలిసి తెలిసి అమ్మాయి గొంతు కోయడం అనేది పెద్ద నేరం. జోగి రమేశ్‌కు కూడా ఒక కూతురు ఉంది. ఆమెకు ఇలా జరిగితే ఏం చేస్తారు. అసలు లోపం ఉందని తెలిసి నాతో ఎలా పెళ్లి చేశారో జోగి రమేశ్ చెప్పాలి. మా ఇద్దరి మధ్య గొడవలు రావడం వల్లే విడిపోయారని జోగి రమేశ్ చెబుతున్నారు. అసలు మా ఇద్దరి మధ్య ఎటువంటి గొడవ వచ్చిందో ఆయన చెప్పాలి. అసలు విషయాన్ని పక్కదారి పట్టించేందుకే జోగి రమేశ్ నిన్న మీడియాతో మాట్లాడారు. వాస్తవాలు తెలియజేయాలనే నేడు నేను మీడియా ముందుకు వచ్చాన్ను అని చెప్పుకొచ్చారు. జోగి రమేశ్ నిన్న సింపథీ కోసం, రాజకీయం కోసం మాట్లాడినట్లుగా ఉంది. అసలు వాస్తవాలు ఏమిటో నేను పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో వివరించాను. త్వరలోనే అన్ని విషయాలు అందరికీ తెలుస్తాయి. మా వివాహం జరిగిన తర్వాత ఉన్న ఇబ్బందులను మా మావయ్య, అత్తయ్యకే వివరించాను. సమస్యలను పరిష్కరించకుండా అదనపు కట్నం తేవాలంటూ మా అత్తయ్య నన్ను హింసించింది. మాకు పొలిటకల్ బ్యాక్ గ్రౌండ్ ఉంది. తాము చెప్పిందే చేయాలని బెదిరించారు. అదనపుకట్నం తీసుకువస్తే నువ్వు హ్యాపీగా ఉంటావు.. అప్పడే అతనికి ఫీలింగ్స్ వస్తాయని అత్త మాట్లాడింది. తల్లి స్థానంలో ఉన్న శకుంతల, అర్థం చేసుకోకుండా నన్నే తప్పు బట్టారు. మా పెళ్లికి ముందు హిందువులమని చెప్పి మాకు పెళ్లి చేశారు. కానీ వారి కుటుంబం మొత్తం క్రిస్టియన్స్, ఇంట్లో హిందూ పూజలు అస్సలు చేయరు. నేను చిన్ననాటి నుంచి హిందూ పూజలు చేయడం అలవాటు. నేను వారింటికి వెళ్లిన తర్వాత కూడా ఒక్క హిందూ దేవుళ్ల ఫొటో కూడా లేదు. నేను దేవుళ్ల ఫొటో తెచ్చి పూజ చేస్తుంటే అడ్డుకుని కొట్టారు. ఎవరి నమ్మకం వాళ్లది.. కానీ మాకు క్రిస్టియన్ మతం తీసుకున్నట్లు కూడా చెప్పలేదు. హిందువులమే అని చెప్పి... మాకు ఆ ప్రకారం పెళ్లి చేశారు.. అంటే ఇది కూడా మోసం చేయడం కాదా. ఎవరినో కలిస్తే.. నడిపిస్తున్నారని చెబుతున్నారు. కానీ మా వద్ద ఇంకా చాలా ఆధారాలు ఉన్నాయి.. వాటిని కూడా త్వరలోనే బయట పెడతా అని తెలిపారు. అత్తగా ఉన్న శకుంతల అనేక రకాలుగా నన్ను ఇబ్బందులు పెట్టారు. కొడుకు లోపం గురించి మాత్రం మాట్లాడకుండా నిందలు నా పై మోపుతున్నారు. నేను పూజలు చేసుకునే సమయంలో అడ్డుకుని.. చేతిలో ఉన్న హారతి, అగర్ బత్తీలు లాగి పడేశారు. మీ దేవుళ్లు కూడా ఒక దేవుళ్లేనా... ఇవన్నీ ఆవేదన వ్యక్తం చేశారు.

# కులగణనలో 'ఓపెన్‌ఎండెడ్' వద్దు



## కులాల డ్రాప్‌డౌన్ జాబితా చేర్చండి

## ప్రధాని మోడీకి ఖర్గే, రాహుల్ సంయుక్త లేఖ

### తెలంగాణ, బీహార్‌ల విధానాన్ని అనుసరించాలని సూచన

**న్యూఢిల్లీ, ఆగస్టు 25:** కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి ఒక సంయుక్త లేఖ రాశారు. జనాభా లెక్కలలో కుల సమాచారాన్ని సేకరించడానికి ప్రతిపాదించిన 'ఓపెన్‌ఎండెడ్' విధానం వల్ల ఒకే కులాన్ని వేర్వేరు పేర్లతో నమోదు చేసే అవకాశం ఉందని, తద్వారా డేటా తప్పుగా మారే అవకాశం ఉందని కాంగ్రెస్ నేతలు హెచ్చరించారు. దానికిబదులుగా, ఫారంలో "కులాల డ్రాప్‌డౌన్ జాబితా"ను చేర్చాలని వారు కోరారు. "ఖచ్చితమైన డేటా లేకుండా భారత దేశంలో సామాజిక న్యాయ విధానాలను సమర్థ వంతంగా రూపొందించలేము" అని పేర్కొంటూ కుల గణనను సరిగ్గా నిర్వహిస్తేనే వివిధ కులాల సంఖ్యా బలం, సామాజిక ఆర్థిక స్థితిపై ఖచ్చితమైన అంచనా సాధ్యమవుతుందని ఆ లేఖలో పేర్కొన్నారు. "జనాభా గణన సమయంలో కుల వివరాలను నమోదు చేయడానికి ప్రభుత్వం 'అపరిమితమైన' ప్రశ్నల విధానాన్ని ఎంచుకుంది, ఇది తప్పుదోవ పట్టించే పద్ధతి. ఈ పద్ధతి ప్రకారం, ఒక వ్యక్తి తన కులానికి ఏ పేరు చెప్పినా, అది ఉన్నది ఉన్నట్లుగానే నమోదు చేయబడుతుంది" అని ఖర్గే, రాహుల్‌గాంధీ అభిప్రాయపడ్డారు. దేశంలోని వివిధ ప్రాంతాలలో ఒకే కులాన్ని తరచుగా వేర్వేరు పేర్లు, ఉప కులాలు, భాషా వైవిధ్యాలతో పిలుస్తారని గుర్తుచేశారు. ఒకే కులానికి చెందిన వారిని వేర్వేరు పేర్లతో నమోదు చేస్తే, "ఒకే కులం వేలాది విభిన్న నమోదులుగా విడిపోయే అవకాశం ఉంది" అని హెచ్చరించారు. "దీనివల్ల లక్షలాది కుల పేర్లు పుట్టుకొస్తాయి, కుల గణన నుండి పొందిన మొత్తం డేటాసెట్ నిరుపయోగంగా మారుతుంది" అని కాంగ్రెస్ నాయకులు ఎత్తి చూపారు. ఒక వర్గం కచ్చితమైన జనాభా గణనను నమోదు చేయకపోతే, "వారి స్థితిపై చేసే ఏ అంచనా అయినా అనివార్యంగా లోపభూయిష్టంగా ఉంటుంది" అనిపేర్కొన్నారు. "ఇది వెనుకబడిన, అత్యంత వెనుకబడిన, ఇతర అణగారిన వర్గాలకు నష్టం కలిగిస్తుంది. అంతేకాకుండా విద్య, ఉపాధి, సంక్షేమ పథకాలు, సామాజిక న్యాయానికి సంబంధించిన నిర్ణయాలపై కూడా ప్రభావం చూపుతుంది. అన్నింటికన్నా ముఖ్యంగా, ఈ పద్ధతి భారతదేశంలోని ఒబిసి జనాభా వాస్తవ పరిమాణాన్ని వెల్లడించడంలో విఫలమవుతుంది. ఎందుకంటే ఈ జనాభా లెక్కలలో 'వెనుకబడిన తరగతి' అనే పదాన్నే చేర్చలేదు" అని ఆ లేఖలో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే "కులాల డ్రాప్‌డౌన్ జాబితా"ను రూపొందించాలని కాంగ్రెస్ నాయకులు సూచించారు. "షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల గణన కోసం ఉపయోగించే పద్ధతి ఇది. సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతుల వంటి ప్రభుత్వ జాబితాలు, భారత మానవ శాస్త్ర సర్వే (ఆంత్రోపాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా) నుండి సేకరించిన సమాచారం ఆధారంగా ఇలాంటి జాబితాను సులభంగా రూపొందించవచ్చు" అని పేర్కొన్నారు.

తెలంగాణ, బీహార్‌లలో నిర్వహించిన కుల సర్వేలలో కూడా ఇదే విధానాన్ని అనుసరించారని, కేంద్ర ప్రభుత్వం కూడా అదే విధానం అనుసరించాలని సూచించారు. "ప్రస్తుత పద్ధతిలో కుల గణన నిర్వహించడాన్ని తాము అంగీకరించము. ప్రభుత్వం ప్రస్తుత ప్రశ్నాపత్రాన్ని రద్దు చేసి, రాజకీయ పార్టీలు, నిపుణులు, ప్రజలతో సంప్రదించిన తర్వాత కొత్తదాన్ని రూపొందించాలి" అని డిమాండ్ చేశారు.



# రంగంలోకి 'మాలిస్'

## అమెరికా ఆవిష్కరించిన తాజా ఆయుధం

## 463 కి.మీ దూరం నుంచే కూల్చేసే శక్తివంతమైన క్షిపణి

**వాషింగ్టన్, ఆగస్టు 25:** ఆధునిక యుద్ధ వ్యూహాలపై పదునుపెడుతోన్న అమెరికా తాజాగా సరికొత్త ఆయుధాన్ని సిద్ధం చేసింది. సుదూరం నుంచే శత్రు ముప్పును ఛేదించేలా సరికొత్త ఎయిర్–టు–ఎయిర్ క్షిపణిని యుఎస్ నేవీ ఆవిష్కరించింది. 'మాలిస్'గా పిలిచే ఈ దీర్ఘశ్రేణి క్షిపణి వందల కిలోమీటర్ల దూరం నుంచే విమానాలను కూల్చగలదని అగ్రరాజ్యం చెబుతోంది. ఇంతకీ ఏమిటీ క్షిపణి? దీని ప్రత్యేకలేమిటి?

**మాలిస్.. 'రేంజ్' వేరు**

మాలిస్ క్షిపణి సాంకేతిక పేరు ఎఐఎం–424 ఎల్‌ఆర్‌ఎఎం. రేథియాన్ సంస్థతో కలిసి అమెరికా నైకాదళం అత్యాధునిక ఎయిర్–టు–ఎయిర్ క్షిపణిని అభివృద్ధి చేసింది. పొడవు 4.11 మీటర్లు.. 680 కిలోల బరువుండే ఈ క్షిపణిలో సాలిడ్ ప్రొపెల్లెంగ్ రాకెట్ మోటార్ ప్రొపల్షన్ అమర్చారు. దీని సాంకేతికతను యుఎస్ నేవీ పూర్తిగా బయటపెట్టనప్పటికీ.. శత్రువు టార్గెట్‌ను గుర్తించిన వెంటనే.. దాన్ని కూల్చివేసేలా రూపొందించారు. 250 నాటికల్ మైళ్ల (463 కిలోమీటర్ల) దూరంలో ఉండే లక్ష్యాలను ఇది ఛేదించగలదు. గగనతల లక్ష్యాలను టార్గెట్ చేసే క్షిపణుల్లో ఇదే ఇప్పటివరకు అంత్యంత లాంగ్ రేంజ్ మిసైల్. దీంతో అమెరికా యుద్ధ విమానాలు లక్ష్యాలకు చేరువగా వెళ్లాల్సిన పని ఉండదు. అప్పుడు యుద్ధ క్షేత్రంలో అగ్రరాజ్యం వైపు తక్కువ నష్టం ఉంటుందని నిపుణులు పేర్కొంటున్నారు.

**ఏ యుద్ధవిమానాల్లో వాడుతారు?**

ఎఐఎం–424 క్షిపణిని ప్రధానంగా ఎఫ్–35సి యుద్ధ విమానాల కోసం డిజైన్ చేశారు. దీంతోపాటు ఎఫ్/ఎ–18ఇ/ఎఫ్ సూపర్ హార్నెట్ ఫైటర్ జెట్లలోనూ వీటిని అమర్చేందుకుకూడా పరీక్షలు జరుపుతున్నారు. ఇటీవల జరిగిన టెస్ట్ ఈవెంట్‌లో ఈ క్షిపణులను యుద్ధ విమానాలకు అమర్చిన ఫొటోలను అమెరికా నేవీ విడుదల చేసింది. మరోవైపు, చైనా కూడా ఇలాంటి దీర్ఘశ్రేణి క్షిపణులపై దృష్టి పెట్టింది. వేల మైళ్ల దూరంలో ఉన్న గగనతల లక్ష్యాలను ఛేదించే హైపర్‌సోనిక్ గ్లైడ్ వెహికల్స్‌ను తయారుచేస్తున్నట్లు సమాచారం. ఈ క్షిపణులు దాదాపు 2,414 కిలోమీటర్ల దూరం ప్రయాణించగలవని అంచనా. అంటే.. చైనా నుంచి అమెరికా గగనతాన్ని లక్ష్యంగా చేసుకోవచ్చని సమాచారం. అయితే, ఈ క్షిపణికి సంబంధించిన వివరాలు ఇంకా బయటకు రాలేదు. ప్రస్తుతం బీజింగ్ వద్ద కనీసం 3,150 బాలిస్టిక్ క్షిపణులు, 300 గ్రౌండ్‌క్రూజ్ మిసైళ్లు ఉన్నాయని అంచనా.



# మహిళలకూ కమాండో శిక్షణ

## ఎన్‌ఎస్‌జి కీలక నిర్ణయం

**న్యూఢిల్లీ, ఆగస్టు 25:** భారతదేశ ఉగ్రవాద నిరోధక వ్యవస్థలో మహిళల కార్యాచరణ సామర్థ్యాలను బలోపేతం చేసే లక్ష్యంతో, మనేసర్‌లోని నేషనల్ సెక్యూరిటీ గార్డ్ (ఎన్‌ఎస్‌జి) శిక్షణా అకాడమీ, రాష్ట్ర పోలీసు బలగాలు, కేంద్ర సాయుధ పోలీసు బలగాల (సిఎపిఎఫ్) మహిళా సిబ్బంది కోసం మొట్టమొదటి మహిళా కమాండో కన్వర్షన్ కోర్సు (ఎంసిసిసి)ను ప్రారంభించింది. ఈ కార్యక్రమాన్ని 'నారీ శక్తి'లో ఒక కొత్త మైలురాయిగా అభివర్ణిస్తూ, ఉగ్రవాద నిరోధక కార్యకలాపాలలో క్లిష్టమైన ప్రత్యేక పాత్రలకోసం మహిళా సిబ్బందిని సిద్ధం చేయడమే ఈ కోర్సు లక్ష్యమని ఎన్‌ఎస్‌జి పేర్కొంది. శారీరకంగా దృఢంగా, సాంకేతికంగా నైపుణ్యం కలిగి, కార్యాచరణకు సిద్ధంగా ఉన్న మహిళా కమాండోలను అభివృద్ధి చేయడానికి ఈ 12 వారాల ఇంటెన్సివ్ కోర్సును రూపొందించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో కఠినమైన శారీరక కండిషనింగ్, ఆయుధాల నిర్వహణ, మార్క్‌మ్యాన్‌షిప్, వ్యూహాత్మక జోక్యం, బందీల రక్షణ, ఉగ్రవాద నిరోధక కార్యకలాపాలకు సంబంధించిన ఇతర ప్రత్యేక అంశాలు ఉంటాయి. వివిధ భద్రతా దళాల నుండి ఎంపిక చేయబడిన మహిళా సిబ్బందికి, దళం ప్రత్యేక ఉగ్రవాద నిరోధక నైపుణ్యాన్ని విస్తరించడం ద్వారా, వ్యక్తిగత నైపుణ్యాభివృద్ధికి అతీతంగా వెళ్లడమే ఎన్‌ఎస్‌జి శిక్షణా అకాడమీ ఉద్దేశ్యం. ఎన్‌ఎస్‌జి ప్రకారం, ఈ కోర్సు శిక్షణ పొందిన కార్యాచరణ సిబ్బంది విస్తృత సమూహాన్ని సృష్టించడంలో సహాయపడుతుంది. అదే సమయంలో, ఉమ్మడి వృత్తిపరమైన ప్రమాణాలను ప్రోత్సహిస్తూ, భారతదేశ భద్రతా వ్యవస్థలో పాలుపంచుకుంటున్న వివిధ దళాల మధ్య పరస్పర సహకారాన్ని బలోపేతం చేస్తుంది.

# బీహార్ సిఎం ఇల్లు ముట్టడి యత్నం

## ఉద్రిక్తంగా మారిన పాట్నా వీధులు



**పాట్నా, ఆగస్టు 25:** బీహార్ రాజధాని పాట్నా రోడ్లు మంగళవారం రణరంగాన్ని తలపించాయి. వందలాది మంది విద్యార్థులు, నిరుద్యోగ అభ్యర్థులు తమ ఆగ్రహాన్ని వ్యక్తంచేస్తూ ముఖ్యమంత్రి సమ్రాట్ చౌధరి నివాసాన్ని ముట్టడించేందుకు దూసుకెళ్లారు. బీహార్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే 70వ పరీక్షను వెంటనే రద్దు చేయాలని, ప్రశ్నాపత్రాల లీకేజీలు, పరీక్షల నిర్వహణలో జరుగుతున్న అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ అభ్యర్థులు ఈ ఆందోళన చేపట్టారు. ఉదయం 10 గంటల ప్రాంతంలో చారిత్రాత్మక గాంధీ మైదాన్ నుంచి ప్రారంభమైన ఈ నిరసన ర్యాలీ క్రమంగా తీవ్రరూపం దాల్చింది. నిరసనకారులు ముఖ్యమంత్రి నివాసంవైపు దూసుకెళ్లకుండా పోలీసులు మార్గమంతటా భారీగా బారికేడ్లను ఏర్పాటు చేసినప్పటికీ, ఆగ్రహంతో ఉన్న విద్యార్థులు వాటిని తోసుకుంటూ ముందుకు సాగారు. బారికేడ్లను బద్దలు కొట్టుకుని వస్తున్న అభ్యర్థులను అడ్డుకునేందుకు పోలీసులు శతవిధాలా ప్రయత్నించడంతో అక్కడ తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. నిరసనకారులను చెదరగొట్టడానికి పోలీసులు పలుచోట్ల లాఠీఛార్జ్ చేయడంతోపాటు వాటర్ కెన్లను ప్రయోగించారు. అయినా సరే వెనక్కి తగ్గనివిద్యార్థులు, పోలీసుల హెచ్చరికలను దాటుకుంటూ సిఎం నివాసానికి చేరువగా వెళ్లడం విశేషం. నిజానికి పట్నాలోని గర్దానీబాగ్ ప్రాంతంలో పోటీపరీక్షలు, ఉద్యోగనియామకాలకు సంబంధించి అభ్యర్థులు కొద్దిరోజులుగా నిరంతర నిరసనలు తెలుపుతున్నారు. నిరసనకారుల ప్రతినిధులతో ప్రభుత్వం సోమవారం జరిపిన చర్చలు సానుకూలంగానే ముగిసినప్పటికీ, తమ ప్రధాన డిమాండ్లు నెరవేరేవరకు వెనక్కి తగ్గేది లేదని అభ్యర్థులు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలోనే గాంధీమైదాన్ నుంచి సిఎం నివాసానికి మార్చ్‌ను ప్రకటించి అమలు చేశారు. ప్రభుత్వం తరఫున కేవలం జూనియర్ అధికారులతో మాట్లాడించి విషయాన్ని దాటవేస్తున్నారని, ఈసారి నేరుగా ముఖ్యమంత్రే తమతో చర్చలు జరపాలని విద్యార్థి నేత సౌరవ్‌కుమార్ స్పష్టంచేశారు. తమ తరఫున ఒక ప్రతినిధి బృందాన్ని సిఎం లేదా విద్యాశాఖమంత్రి వద్దకు పంపడానికి సిద్ధంగా ఉన్నామని, వారిద్దరూ తప్ప వేరే ఏఅధికారితోనూ మాట్లాడేది లేదని, సిఎం నుంచి అధికారిక ప్రకటన వస్తేనే నిరసన విరమిస్తామని విద్యార్థి నాయకులు తేల్చిచెప్పారు. ఒకవైపు అభ్యర్థుల ఆందోళనలు ఉధృతంగా సాగుతుండగానే, మరోవైపు బీహార్ ప్రభుత్వం విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం విద్యార్థి సహయోగ్ శివిర్ పేరిట ఒక నూతన కార్యక్రమాన్ని ప్రకటించింది. ప్రభుత్వం ఎంతటి సంక్షేమ కార్యక్రమాలు ప్రకటించినప్పటికీ, 70వ బిపిఎస్‌సి పరీక్ష అక్రమాలపై కచ్చితమైన చర్యలు తీసుకునేవరకు పోరాటాన్ని ఆపేది లేదని నిరుద్యోగులు భీష్మించుకూర్చోవడంతో ఉత్కంఠ కొనసాగుతూనే ఉంది.

# మా వద్ద రెండు సంవత్సరాల ప్రణాళిక ఉంది

## అమెరికా ఆంక్షలకు ఇరాన్ కౌంటర్



**టెహ్రాన్, ఆగస్టు 25:** ఇరాన్‌పై కొన్ని నెలలుగా దాడులు చేసిన అమెరికా ఇప్పుడు ఆర్థికంగా వెన్నువిరిచే ప్రయత్నాలు మొదలుపెట్టింది. అంతర్జాతీయంగా ఇరాన్‌కున్న ఆర్థిక సంబంధాలను తెంచేయడమే లక్ష్యంగా అగ్ర రాజ్యం కొత్త ఆంక్షలను ప్రకటించింది. టెహ్రాన్‌తో సంబంధాలు కొనసాగిస్తూ, నగదు అక్రమ చలామణిలో దానికి తోడ్పడే దేశాలను డాలరు వ్యవస్థ నుంచి దూరం చేస్తామని యుఎస్ ఆర్థిక స్కాట్ బెసెంట్ ప్రకటించారు. దీనికి ఇరాన్ దీటుగా స్పందించింది. ట్రంప్ ప్రభుత్వం విధించిన ఆంక్షలను ఎదుర్కోవడానికి తమ వద్ద రెండేళ్ల ప్రణాళికఉందని, ప్రతీకార చర్యలు తప్పవని బదులి చ్చింది. ఇరాన్‌పై ఆంక్షలు విధించడం కొత్తేంకాదు. ఇరాన్‌కు ప్రపంచదంతో ఉన్న ఆర్థిక జీవనాధారాన్ని తెగ్గొట్ట డమే తాజా ఆంక్షల లక్ష్యమని బెసెంట్ ప్రకటించారు. అయితే యుఎస్ నుంచి ఎదురయ్యే ఒత్తిడిని తమ వాణిజ్య భాగస్వాములు గట్టిగా వ్యతిరేకిస్తారని టెహ్రాన్ వ్యక్తం చేసింది. ఈ మేరకు ఆ దేశ పార్లమెంట్ స్పీకర్ గాలిబఫ్ స్పందించారు. ఇతర దేశాలతో ఇరాన్‌కున్న సంబంధాలను తెగ్గొట్టే స్థితిలో అమెరికా లేద న్నారు. 'అమెరికన్ల ప్రగల్భాలను ఎవరూనమ్మరు. అమెరికా ఆంక్షల ప్రకటనను పరిగణనలోకి తీసుకోబోమని మా వాణిజ్య భాగస్వాములు ఇప్పటికే మాకు సందేశాలు పంపారు' అని పేర్కొన్నారు.

# రెండువారాల్లోగా లొంగిపోవాలి...

## తరుణ్ తేజ్‌పాల్‌కు సుప్రీం ఆదేశం

**న్యూఢిల్లీ, ఆగస్టు 25:** అత్యాచారం కేసులో దోషిగా తేలిన మాజీ తెహెల్కా ఎడిటర్ తరుణ్ తేజ్‌పాల్‌కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. లొంగిపోవడం నుంచి మినహాయింపు కోరుతూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు మంగళవారం తిరస్కరించింది. రెండు వారాల్లోగా లొంగిపోవాలని ఆదేశించింది. తేజ్‌పాల్ పిటిషన్‌పై జస్టిస్ అలోక్ అరాధే నేతృత్వంలోని సింగిల్ జడ్జి బెంచ్ సోమవారం విచారణ పూర్తి చేసి తీర్పును రిజర్వ్ చేసింది. తేజ్‌పాల్ తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్, గోవా ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్‌మెహతా వాదనలు వినిపించారు. తేజ్‌పాల్ అప్పీల్‌ను విచారణకు స్వీకరించాలంటే ముందుగా ఆయన లొంగిపోయినట్లు ధ్రువీకరించే సర్టిఫికెట్ సమర్పించాల్సి ఉంటుందని లేదంటే లొంగిపోవడం నుంచి మినహాయింపు కోరుతూ ప్రత్యేక పిటిషన్ దాఖలు చేయాలని తుషార్ మెహతా వాదించారు. సుప్రీంకోర్టు రూల్స్, 2013తో పాటు గత తీర్పులను ఆయన ప్రస్తావించారు. అయితే కపిల్ సిబల్ మాత్రం గోవా ప్రభుత్వం ప్రస్తావించిన సుప్రీంకోర్టు నిబంధనలు ఈ కేసుకు వర్తించవని వాదించారు. బాంబే హైకోర్టు ఇప్పటికే తేజ్‌పాల్‌కు నాలుగు వారాల గడువు ఇచ్చిందని, అప్పటివరకు ఆయనకు కోర్టు రక్షణ ఉందని తెలిపారు. ఆగస్టు 31న రెగ్యులర్ బెంచ్ ముందు కేసును విచారణకు లిస్ట్ చేయాలని కోరారు. ఈనెల 6న బాంబే హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ తేజ్‌పాల్ ఆగస్టు 20న సుప్రీంకోర్టును ఆశ్రయించారు. 2021లో గోవా సెషన్స్ కోర్టు ఇచ్చిన నిర్దోషి తీర్పును బాంబే హైకోర్టు కొట్టివేసి తేజ్‌పాల్‌ను అత్యాచారం కేసులో దోషిగా తేల్చింది.

# భారత్ ప్రజాస్వామ్యానికి బిఎల్‌ఒలే పునాది

## కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్

### ఎన్నికల యంత్రాంగం ప్రపంచంలోనే అతిపెద్ద కుటుంబంగా అభివర్ణన



**లక్నో, ఆగస్టు 25:** భారత ప్రజాస్వామ్యానికి 'బూత్ స్థాయి అధికారులు' (బిఎల్‌ఒ) పునాది వంటివారని ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేష్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం లక్నోలో నిర్వహించిన సమావేశంలో ఆయన బిఎల్‌ఒలతో ముచ్చటించారు. ఈ సమావేశం అనంతరం విలేకరులతోమాట్లాడుతూ, ఎన్నికల ప్రక్రియలో బిఎల్‌ఒల కీలక పాత్రను, వారి అంకితభావాన్ని, పారదర్శకతను ప్రశంసించారు. "బిఎల్‌ఒలు భారత ప్రజాస్వామ్యానికి పునాది. ప్రతి బూత్ స్థాయి అధికారి తమ బూత్ పరిధిలోని ఓటర్లకు తమ పారదర్శకత, అంకితభావం ద్వారా సుపరిచితులు మాత్రమే కాదు, దేశవ్యాప్తంగా, ప్రపంచవ్యాప్తంగాకూడా గుర్తింపు, గౌరవం పొందుతున్నారు" అని సిఇసి జ్ఞానేష్ కుమార్‌అన్నారు. బిఎల్‌ఒల అనుభవాలను తెలుసుకోవడం, వారిసూచనలను స్వీకరించడమే ఈ సమావేశం ముఖ్య ఉద్దేశమని ఆయన తెలిపారు. సుమారు 97 కోట్ల మంది ఓటర్లు ఉన్న భారతదేశాన్ని, దేశ ప్రజాస్వామ్య వ్యవస్థ, ఎన్నికల యంత్రాంగం భారీ స్థాయిని నొక్కి చెబుతూ, జ్ఞానేష్ కుమార్ దీనిని "ప్రపంచంలోనే అతిపెద్ద కుటుంబం"గా అభివర్ణించారు.

ఇఎల్‌సి 2.0, ఇసిఐఎన్‌ఇటి ప్రాంతీయ సదస్సులో సిఇసి జ్ఞానేష్ కుమార్ మాట్లాడుతూ, వివిధ స్థాయిలలోని ఎన్నికల అధికారులను అనుసంధానించే వేదికగా ఇసిఐఎన్‌ఇటి ప్రాముఖ్యతను ఆయన వివరించారు. సుమారు నాలుగు, ఐదు నెలల క్రితం ప్రారంభించిన ఈ యాప్, ఈ యేడాది చివరి నాటికి భారతదేశంలోని అతిపెద్ద అప్లికేషన్లలో ఒకటిగా నిలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రపంచంలోని అనేక ప్రధాన ప్రాంతాల మొత్తం ఓటర్ల జనాభా కంటే భారతదేశ ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉందని జ్ఞానేష్ కుమార్ పేర్కొన్నారు. "భారత దేశంలో సుమారు 97 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. ఈ సంఖ్య కేవలం ఒక గణాంకం మాత్రమే కాదు, ఇది చాలా ముఖ్యమైనది. అమెరికా, కెనడా, దక్షిణ అమెరికా, మొత్తం ఐరోపా, మొత్తం ఆఫ్రికా, ఆగ్నేయాసియా దేశాల ఓటర్ల సంఖ్యను కలిపినా, అప్పటికీ సుమారు ఎనిమిది కోట్ల మంది ఓటర్లు మిగిలే ఉంటారు. మీరు అటువంటి భారీ ప్రజాస్వామ్యంలో భాగం. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద కుటుంబం" అని పునరుద్ఘాటించారు. లోక్‌సభ ఎన్నికల సమయంలో ఎన్నికల సంఘం నిర్వహించే భారీ స్థాయి కార్యకలాపాల గురించి కూడా జ్ఞానేష్ కుమార్ ప్రస్తావించారు. "ప్రపంచంలోనే అతిపెద్ద ప్రభుత్వమైన భారత ప్రభుత్వం 65 లక్షల మందికి ఉపాధి కల్పిస్తుండగా, అతిపెద్ద ప్రైవేట్ సంస్థ అయిన వాల్‌మార్ట్ సుమారు 20 లక్షల మందికి ఉపాధినిస్తోంది. లోక్‌సభ ఎన్నికల సమయంలో, 1.8 కోట్ల మంది సిబ్బందితో కలిసి పనిచేసే భారత ఎన్నికల సంఘం (ఇసిఐ) ప్రపంచంలోనే అతిపెద్ద సంస్థగా మారుతుంది" అని ఆయన అన్నారు.

# ఇక పైలట్లకు ప్రతి యేటా డోప్ టెస్టులు

## కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు

**న్యూఢిల్లీ, ఆగస్టు 25:** ఇకపై పైలట్లకు ప్రతి యేడాది డోప్ టెస్టులు నిర్వహించనున్నట్లు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు మంగళవారం వెల్లడించారు. ప్రస్తుతం ఈ అంశంపై డిజిసిఎ దృష్టి సారించిందని, దీనికి సంబంధించి ఇప్పటికే ఉన్న నిబంధనల్ని పరిశీలిస్తోందని మంత్రి అన్నారు. అలాగే, కొత్త నిబంధనల రూపకల్పనపై దృష్టి సారించిందని తెలిపారు. ఇటీవల ఎయిరిండియా విమానం గాలిలో ఉండగా, కుదుపులకు గురైన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో పలువురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. దీనికి గల కారణాలపై విచారించగా పైలట్ గంజాయి సేవించినట్లు తేలింది. పైలట్లు మత్తులో ఉండటం వల్ల విమాన ప్రయాణికుల ప్రాణాలకు ముప్పు ఉంటుంది. అందువల్ల పైలట్లు ఇలా నిషేధిత డ్రగ్స్ తీసుకోకుండా చర్యలు తీసుకోవాలని, అలాంటి వారిని గుర్తించేందుకు డోప్ టెస్టులు నిర్వహించాలని కేంద్రం భావిస్తోంది.

# దేశీయ పరిశ్రమలకే డిఆర్‌డిఒ క్షిపణి టెక్నాలజీ

## రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్



**న్యూఢిల్లీ, ఆగస్టు 25:** ఆయుధాల తయారీలో స్వయం సమృద్ధి సాధించే దిశగా భారత్ చేస్తున్న ప్రయత్నాలకు పెద్ద ఊతం లభించింది. దేశీయంగా ఉత్పత్తి చేసేందుకు వీలుగా, డిఆర్‌డిఒ అభివృద్ధి చేసిన అన్ని సంప్రదాయ క్షిపణి వ్యవస్థల సాంకేతికతను దేశీయ పరిశ్రమలకు బదిలీ చేయడానికి రక్షణ శాఖ ఆమోదం తెలిపింది. ఈ సాంకేతికత బదిలీ (టిఒటి) భారతీయ కంపెనీల భాగస్వామ్యాన్ని పెంచడంలో సహాయపడుతుందని పేర్కొంది. "రక్షణ రంగంలో 'ఆత్మనిర్భరత' (స్వయం సమృద్ధి) లక్ష్యాన్ని సాధించే దిశగా ఒక కీలక అడుగుగా, డిఆర్‌డిఒ అభివృద్ధి చేసిన అన్ని సంప్రదాయ క్షిపణి వ్యవస్థల సాంకేతికతను దేశీయంగా ఉత్పత్తి చేసేందుకు భారతీయ పరిశ్రమలకు బదిలీ చేయడానికి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆమోదం తెలిపారు" అని రక్షణ శాఖ 'ఎక్స్' వేదికగా తెలిపింది. రష్యా వంటి దేశాల నుండి ఆయుధాల దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించుకోవడం, దేశంలో బలమైన రక్షణ తయారీ రంగాన్ని నిర్మించడం లక్ష్యంగా కేంద్రం ఈ చర్య చేపట్టింది.

"ఈ సాంకేతికత బదిలీ, భారతీయ పరిశ్రమలు తమ అర్హతలు, ధ్రువీకరణలు, నియంత్రణ నిబంధనలకు అనుగుణంగా స్వదేశీ ఉత్పత్తిని చేపట్టేలా చేయడం ద్వారా రక్షణ రంగ వ్యవస్థలో వాటి భాగస్వామ్యాన్ని పెంచడంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుందని" కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా రాసుకొచ్చారు. దేశీయ తయారీ పరిశ్రమ సామర్థ్యాలను మెరుగుపరచడం, రక్షణ పారిశ్రామిక పునాదిని బలోపేతం చేయడం, సరఫరా గొలుసులో ఎంఎస్‌ఎంఇలు, అలాగే ఇతర సాంకేతిక భాగస్వాముల భాగస్వామ్యాన్ని కల్పించడం తమ లక్ష్యమని పేర్కొన్నారు. "ఈ విధానం క్షిపణి వ్యవస్థల అభివృద్ధి నుండి పారిశ్రామిక ఉత్పత్తికి విజయవంతమైన పరివర్తనను సాధ్యం చేస్తుంది. అధునాతన రక్షణ వ్యవస్థల అభివృద్ధి, తయారీ కోసం భారతీయ పరిశ్రమ సామర్థ్యాలను వినియోగించుకోవడంలో డిఆర్‌డిఒ చేస్తున్న నిరంతర కృషిని ఇది ప్రతిబింబిస్తుంది" అని పేర్కొన్నారు.

# సంక్షిప్త వార్తలు

## చైనా ఉపాధ్యక్షుడు హన్‌జెంగ్‌తో అజిత్ దోవల్ భేటీ



**బీజింగ్, ఆగస్టు 25:** జాతీయ భద్రతా సలహాదారు అజిత్‌దోవల్ ప్రస్తుతం చైనాలో పర్యటిస్తున్నారు. మంగళవారం ఆయన చైనా ఉపాధ్యక్షుడు హన్‌జెంగ్‌తో భేటీ అయ్యారు. చైనా విదేశాంగమంత్రి, కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ చైనా సెంట్రల్ కమిటీ సభ్యుడు వాంగ్‌యి ఆహ్వానం మేరకు అజిత్ దోవల్ అక్కడ పర్యటిస్తున్నారు. చైనాకు చెందిన వివిధ ప్రజా ప్రతినిధులతో భేటీలో భాగంగా చైనా ఉపాధ్యక్షుడు హన్‌జెంగ్‌తో భేటీ అయ్యారు. రెండు దేశాల మధ్య శాంతి నెలకొల్పే అంశాలతోపాటు, సరిహద్దు వివాదంపైకూడా చర్చలుజరిపారు. సరిహద్దులో వివాదాలు, ఉద్రిక్త పరిస్థితులు నెలకొనకుండా చూడటమే లక్ష్యంగా ఈ భేటీ జరిగింది. అలాగే, ఆర్థిక, రాజకీయ అంశాలతో పాటు ఇతర ద్వైపాక్షిక అంశాలపై కూడా చర్చించారు.

## ఢిల్లీలో నిరసనలపై ఇక ప్రత్యేక నిఘా

**న్యూఢిల్లీ, ఆగస్టు 25:** ఢిల్లీలో వరుసగా జరుగుతున్న నిరసనలు, వాటి వల్ల తలెత్తే శాంతి భద్రతల సమస్యపై ఢిల్లీ పోలీసులు ప్రత్యేక దృష్టి సారించబోతున్నారు. ఈ నిరసనల్ని ముందుగా గుర్తించేందుకు ఇంటెలిజెన్స్ వ్యవస్థను మరింత పటిష్టంచేయాలని పోలీసులు భావిస్తున్నారు. ఇందుకోసం స్పెషల్ బ్రాంచ్ పోలీసులు శ్రీకారంచుట్టారు. ఇటీవల జంతర్ మంతర్‌వద్ద సిజెపి నిరసన సందర్భంగా తలెత్తిన ఘర్షణల నేపథ్యంలో ఇంటెలిజెన్స్ వ్యవస్థను మరింతపటిష్టం చేయాల్సిందిగా ఢిల్లీపోలీస్ కమిషనర్ ఆదేశించారు.

## డేరాబాబాకు 17వ సారి పెరోల్

**రోహ్‌తక్, ఆగస్టు 25:** అత్యాచారం కేసులో దోషిగా తేలిన డేరా సచ్చా సౌదా చీఫ్ గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్ అలియాస్ డేరా బాబాకు మరోసారి పెరోల్ దొరికింది డేరా బాబా అత్యాచారం కేసులో 20 యేళ్ల జైలు శిక్ష అనుభవిస్తున్న ఆయనకు మరో 21 రోజుల పెరోల్ మంజూరైంది. 2017లో శిక్ష పడిన తర్వాత ఇది ఆయనకు ఇది 17వ తాత్కాలిక విడుదల కావడం గమనార్హం. హర్యానాలోని రోహ్‌తక్ సునారియా జైలు నుంచి ఈ రోజు తెల్లవారుజామున రామ్ రహీమ్ బయటకు వచ్చారు. పెరోల్ కాలంలో సిర్సాలోని డేరా సచ్చా సౌదా ప్రధాన కార్యాలయంలో ఆయన ఉండనున్నారు.

## ఢిల్లీలో 2,300 దాటిన స్వైన్‌ఫ్లూ కేసులు

**న్యూఢిల్లీ,ఆగస్టు 25:** దేశ రాజధాని ఢిల్లీలో స్వైన్‌ఫ్లూ కేసుల సంఖ్య 2,300 దాటిందని ఢిల్లీ ఆరోగ్యశాఖ మంత్రి పంకజ్ సింగ్ వెల్లడించారు. కేసులు పెరుగుతున్నప్పటికీ ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భారత వైద్య పరిశోధనా మండలి డైరెక్టర్ జనరల్ డాక్టర్ రాజీవ్ బహల్ స్పష్టం చేశారు. ఇవి వారానికొకసారి నమోదయ్యే సాధారణ గణాంకాల్లో భాగమేనని బహల్ తెలిపారు. ప్రస్తుతం నమోదవుతున్న హెచ్‌వన్‌ఎన్‌వన్ వైరస్ 2009లో కనిపించిన సాధారణ స్ట్రెయిన్‌నేనని, ఇందులో కొత్తదనం ఏమీ లేదని చెప్పారు. ఇప్పుడు దీనిని స్వైన్‌ఫ్లూ అని కాకుండా సీజనల్ ఫ్లూగా పరిగణిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

## స్వరాష్ట్రంలో చేపల మార్కెట్‌కు ప్రధాని మోడీ పేరు!




**సూరత్, ఆగస్టు 25:** గుజరాత్‌లోని సూరత్‌లో ఓ చేపల మార్కెట్‌కు ప్రధాని మోడీ పేరు పెట్టడంపై వివాదం చెలరేగింది. నాన్‌పురాలోని లక్కడ్‌కోట్ ప్రాంతంలో కొత్తగా నిర్మించిన హోల్‌సేల్ చేపల మార్కెట్ ప్రవేశద్వారం దగ్గర 'శ్రీ నరేంద్ర మోడీ హోల్‌సేల్ ఫిష్ మార్కెట్' పేరుతో ఓ బోర్డును ఏర్పాటు చేశారు. అందులో ప్రధాని మోడీ ఫొటోతో పాటు సూరత్ ఫిష్ మర్చంట్ అసోసియేషన్ పేరు కూడా ఉంది. దీనిపై కొందరు స్థానిక చేపల వ్యాపారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రధాని మోడీ శాఖాహారి కావడంతో ఆయన పేరును చేపల మార్కెట్‌కు పెట్టడం సరైన నిర్ణయం కాదని కొందరు వ్యాపారులు ప్రశ్నించారు.

# పిఎం సూర్యఘర్ యోజనతో విద్యుత్ పొదుపు

- ప్రతి కుటుంబానికి ప్రయోజనం చేకూరాలి
- రచ్చుమర్రిలో సోలార్ రూఫ్‌టాప్ ప్లాంట్ పరిశీలన



పీఎం సూర్యఘర్ సోలార్‌ను పరిశీలిస్తున్న మంత్రులు గొట్టిపాటి రవికుమార్, నిమ్మల రామానాయుడు

**మంత్రాలయం, ఆగస్టు 25 ప్రభాతవార్త;** పిఎం సూర్యఘర్ యోజనతో విద్యుత్ పొదుపు ప్రతి కుటుంబానికి ప్రయోజనం చేకూరాలని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. మంగళవారం మంత్రాలయం మండలం రచ్చుమర్రి గ్రామంలో లబ్ధిదారుడు అజయ్‌కుమార్ పీఎం సూర్యఘర్ యోజన ద్వారా ఏర్పాటు చేసుకున్న సోలార్ రూఫ్‌టాప్ ప్లాంట్‌ను రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, రాష్ట్ర జలవనరులశాఖ, కర్నూలు జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు పరిశీలించారు. ఈ సందర్భంగా సోలార్ రూఫ్‌టాప్ ప్లాంట్ ఏర్పాటు, దాని పనితీరు, సామర్థ్యం, లబ్ధిదారులకు అందుతున్న ప్రయోజనాలు, ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ తదితర అంశాలను మంత్రులు అధికారులను, లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. సోలార్ రూఫ్‌టాప్ ప్లాంట్ల ఏర్పాటులో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ సూచించారు. సోలార్ ప్యానెళ్లు, ఇన్వర్టర్లు, ఇతర పరికరాలు అత్యున్నత ప్రమాణాలతో ఉండేలా చూడాలని, ఏర్పాటు చేసిన ప్లాంట్లు కనీసం 20 సంవత్సరాల పాటు సమర్థవంతంగా పనిచేసేలా నాణ్యతా ప్రమాణాలు పాటించాలని స్పష్టం చేశారు. పీఎం సూర్యఘర్ యోజన ప్రధాన ఉద్దేశ్యం ప్రతి కుటుంబానికి సౌర విద్యుత్ ద్వారా విద్యుత్ ఖర్చును తగ్గించడం, స్వచ్ఛమైన ఇంధన వినియోగాన్ని ప్రోత్సహించడం అని మంత్రి పేర్కొన్నారు. పథకం ద్వారా లబ్ధిదారులకు వాస్తవ ప్రయోజనం అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. రచ్చుమర్రి గ్రామంలో ఏర్పాటు చేసిన సోలార్ రూఫ్‌టాప్ ప్లాంటట్2 కిలో వాట్ల సామర్థ్యంతో ఉందని అధికారులు వివరించారు. ఈ పథకం కింద అర్హత కలిగిన లబ్ధిదారులకు 60 శాతం వరకు సబ్సిడీ అందుతున్నట్లు తెలిపారు. లబ్ధిదారులకు సోలార్ రూఫ్‌టాప్ ప్లాంట్ల ఏర్పాటులో ఏపీఎస్పీడీసీఎల్ ద్వారా అవసరమైన సహకారం, మార్గదర్శకత్వం, సహాయక సేవలు అందిస్తున్నట్లు అధికారులు తెలెఇపారు. పథకం అమలులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా లబ్ధిదారులకు అవసరమైన సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని మంత్రులు సూచించారు. పీఎం సూర్యఘర్ యోజనను ప్రజలు సద్వినియోగం చేసుకుని సౌర విద్యుత్ వినియోగాన్ని పెంచుకోవాలని, తద్వారా విద్యుత్ పొదుపుతో పాటు పర్యావరణ పరిరక్షణ కూడా సహకరించాలని మంత్రులు కోరారు. ఈ కార్యక్రమంలో మంత్రాలయం ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి, ఆదోని ఆర్డీఓ అరుణదేవి, విద్యుత్‌శాఖ ఎస్ఈ ప్రదీప్‌కుమార్, టిడిపి జిల్లా అధ్యక్షులు గుడిసె కృష్ణమ్మ, జోన్-5 ఇన్‌చార్జి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 28నప్రభుత్వ ఉద్యోగులరాష్ట్రస్థాయి సదస్సు



**విజయవాడ, ఆగస్టు 25 (ప్రభాతవార్త):** ఉద్యోగుల సమస్యలు, తమకు రావాల్సిన వేతన బకాయిల సాధన కోసం రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు చేపట్టనున్న ఉద్యమానికి తరలిరావాలని ఎ.పి. ఎన్.జి.ఒ, రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల సంఘ నాయకులకు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల అమరావతి జె.ఎ.సి. విజ్ఞప్తిచేసింది. ఉద్యమంలో భాగంగా ఈ నెల 28వ తేదీన విజయవాడలో నిర్వహించనున్న రాష్ట్ర సదస్సుకు ఎ.పి. ఎన్.జి.ఒ, రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల సంఘ నాయకులనుజె.ఎ.సి సభ్యులు మంగళవారం కలిసి ఆహ్వానించారు. ఐక్య ఉద్యమాలకు పిలుపునిచ్చిన ఎ.పి.జె.ఎ.సి. అమరావతి, చైర్మన్ బొప్పరాజు ఆధ్వర్యంలో నాయకుల బృందం విజయవాడ ఎ.పి. ఎన్.జి.ఒ భవన్ కి వెళ్లి రాష్ట్ర అధ్యక్షుడు, ఎ.పి.జె.ఎ.సి. చైర్మన్ ఏ.విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి రమణలను కలసి ఉద్యోగుల, ఉపాధ్యాయులు, పెన్షనర్ల దీర్ఘకాలిక సమస్యలను వివరించారు. ప్రధానంగా ఉద్యోగులబకాయిలపై ప్రభుత్వం గత రెండేళ్లుగా స్పందించనందున, ఎ.పి.జె.ఎ.సి. అమరావతి ఉద్యమ కార్యాచరణకు వివరించారు. ఈసందర్భంగా బొప్పరాజు గారు మాట్లాడుతూ ఏ ప్రభుత్వాలైనా ఉద్యోగ సంఘాలతో చర్చలు జరిపిన వెంటనే నిర్ణయాలు వెల్లడిస్తాయని, కానీ కూటమి ప్రభుత్వం గత నెల 22వ తేదీన చర్చలు జరిపి నెల రోజులు దాటినప్పటికీ ఎటువంటి నిర్ణయాలు ప్రకటించలేదని, ఇది చాలా బాధాకరమని, కాబట్టి ఉద్యోగులు అందరూ గతంలో మాదిరి రెండు జేఏసీ లు కలిసి ఉద్యమం చేయాలని కోరుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బొప్పరాజుతో పాటు సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదర రావు, ఉద్యమ కమిటీ అధ్యక్షుడు టి వి ఫణి పేర్రాజు, కోశాధికారి తిమ్మసర్తి నాగేశ్వరావు, మహిళా విభాగం రాష్ట్ర చైర్ పర్సన్ పారే లక్ష్మి ్మ, సెక్రటరీ జనరల్ పొన్నూరు విజయలక్ష్మి ్మ, వి.ఆర్.ఒ.లసంఘం రాష్ట్ర ప్రధాన కార్య దర్శి జి.అనుపమ, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు బత్తిన రామకృష్ణ, రాజధాని నగర అధ్యక్షుడు రవి ప్రసాద్,ప్రధానకార్యదర్శి మందపాటి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

# గల్లంతైన మత్స్యకారుల కోసం గాలింపు ముమ్మరం

- 15 కోస్ట్‌గార్డ్ నౌకలు, నాలుగు హెలికాప్టర్లతో విస్తృత సెర్చ్ ఆపరేషన్
- మయన్మార్, బంగ్లాదేశ్ సముద్ర అధికారులకు సమాచారం



**విజయవాడ, ఆగస్టు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** అమలాపురం ప్రాంతానికి చెందిన గల్లంతైన ఏడుగురు మత్స్యకారుల ఆచూకీ కోసం చేపట్టిన గాలింపు చర్యలను మరింత ముమ్మరం చేసినట్లు రాష్ట్ర వ్యవసాయ, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో భారత తీర రక్షక దళం నౌకాదళం, ఇతర సంబంధిత విభాగాలు సమన్వయంతో విస్తృత సెర్చ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అమలాపురం పార్లమెంట్ సభ్యులు హరీష్ బాలయోగి మంగళవారం కేంద్ర రక్షణ మంత్రిని కలిసి గల్లంతైన మత్స్యకారుల కోసం కొనసాగుతున్న గాలింపు చర్యలపై చర్చించిన అనంతరం కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ భారత తీర రక్షక దళాన్ని మరింత అప్రమత్తం చేసిందని మంత్రి తెలిపారు. ఐసీజీ ప్రధాన కార్యాలయంలోని డిప్యూటీ డైరెక్టర్ జనరల్ (ఆపరేషన్స్) ఆదేశాల మేరకు కోల్‌కతాలోని తూర్పు, ఈశాన్య కమాండ్లను కూడా కార్యాచరణలోకి తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. గాలింపు పరిధిని విస్తరించి, ఆపరేషన్‌ను వేగవంతం చేసేందుకు సమీప సముద్ర జలాల్లో ఉన్న 15 ఐసీజీ నౌకలు, నాలుగు హెలికాప్టర్లను మంగళవారం రంగంలోకి దించినట్లు మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు. మెరైన్ రెస్క్యూ కోఆర్డినేషన్ సెంటర్ ఆధ్వర్యంలో ఎలక్ట్రానిక్ నిఘా ఏకకాలంలో కొనసాగుతోందన్నారు. గల్లంతైన పడవకు సంబంధించిన సమాచారం లేదా ఆచూకీ లభించే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని మయన్మార్, బంగ్లాదేశ్ సముద్ర అధికారులను కూడా అప్రమత్తం చేసినట్లు తెలిపారు. పడవ విదేశీ జలాల్లోకి కొట్టుకుపోయి ఉండవచ్చనే అవకాశంతో పాటు, ఇంజిన్‌లో సాంకేతిక లోపం కారణంగా సముద్రంలో ఎక్కడైనా నిలిచిపోయి ఉండవచ్చన్న కోణంలోనూ భారత తీర రక్షక దళం పరిశీలన జరుపుతోందని మంత్రి వివరించారు. ఎంఆర్‌సీసీ చేపడుతున్న ఎలక్ట్రానిక్ నిఘాతో పాటు వివిధ సముద్ర అధికారుల నుంచి అందుతున్న సమాచారాన్ని ఎప్పటికప్పుడు విశ్లేషిస్తున్నట్లు చెప్పారు. సముద్ర ప్రవాహాలు, గాలుల దిశ, వేగం, వాతావరణ పరిస్థితులతో పాటు మత్స్యకారులు సాధారణంగా చేపల వేటకు వెళ్లే మార్గాలను పరిగణనలోకి తీసుకుని గాలింపు కొనసాగిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. డైమండ్ హార్బర్, సుందర్‌బన్స్‌తో పాటు పరిసర సముద్ర ప్రాంతాల్లోనూ సెర్చ్ ఆపరేషన్‌ను విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

# దొంగల కుటుంబం

**నెల్లూరు క్రైం, ఆగస్టు 25, ప్రభాతవార్త - వైద్యం:** రైల్వే రక్షణ, ప్రయాణికుల భద్రతను ధ్యేయంగా మలుచుకుని నెల్లూరు ప్రభుత్వ రైల్వే పోలీసులు భారీ విజయం సాధించారు. రైళ్లలో దొంగతనాలకు పాల్పడుతున్న ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ఘరానా దొంగలను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి భారీ మొత్తంలో సొత్తును రికవరీ చేశారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను మంగళవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రైల్వే డీఎస్పీ జి. మురళీధర్ వెల్లడించారు. ఆయన తెలిపిన సమాచారం మేరకు ఇటీవల కాలంలో రైళ్లలో జరుగుతున్న దొంగతనాలపై రైల్వే పోలీసులు రైల్వే ఐజీ రాజకుమారి ఆదేశాల మేరకు పూర్తి స్థాయిలో దృష్టి సారించారు. అందులో భాగంగా డీఎస్పీ జి. మురళీధర్ పర్యవేక్షణలో నెల్లూరు రైల్వే సీఐ ఎ. సుధాకర్, గూడూరు ఎస్ఐ ఎం. నారాయణ, నెల్లూరు ఎస్ఐ ఎన్. హరి చందనలతో కూడిన మూడు స్పెషల్ టీమ్‌లను ఏర్పాటు చేశారు. ఈ ప్రత్యేక బృందాలు గూడూరు, బొగ్గులదిబ్బకు చెందిన ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. తాళ్ళూరు అనిల్ కుమార్, తాళ్ళూరు సునీల్, షేక్ కాలేషా అనే ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా అరెస్ట్ అయిన ముగ్గురూ కూడా ఒకే కుటుంబానికి చెందినవారు కావడం గమనార్హం. వీరికి తల్లిదండ్రుల సరైన ఆదరణ లేకపోవడం, స్థిర నివాసం లేకపోవడంతో చిన్నతనంలోనే చెడు వ్యసనాలకు బానిసలయ్యారు. జల్సాల కోసం, సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో దొంగతనాలను వృత్తిగా మార్చుకున్నారు. వీరంతా పాత నేరస్తులు కాగా, గతేడాది ప్రకాశం జిల్లా ఇంకొల్లు పోలీస్ స్టేషన్, గూడూరు రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మొత్తం నాలుగు దొంగతనం కేసులు నమోదై ఉన్నాయి.

# తిరుమల సమాచారం

## మహాపూర్ణాహుతితో ముగిసిన పవిత్రోత్సవాలు



**తిరుమల, ఆగస్టు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** కలియుగవైకుంఠం తిరుమలలో ఆనందనిలయంలోని సంపంగి ప్రాకారంలో మలయప్పస్వామి ఉత్సవ మూర్తులకు 3రోజులు జరిగిన పవిత్రోత్సవాలు మంగళవారం సాయంత్రం మహాపూర్ణాహుతితో ముగిశాయి. ఉదయం తిరుమలేశుని ఆలయం లోపల సంపంగి ప్రాకారంలో వేడుకగా శ్రీదేవిభూదేవిసమేత మలయప్పస్వామి యాగశాలలో హోమాలు వైదిక కార్యక్రమాలను ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, చందనం, పసుపు, కొబ్బరిజలం తదితర సుగంధ ద్రవ్యాలతో విశేషంగా అభిషేకం చేశారు. సాయంత్రం మహాపూర్ణాహుతి సమర్పించారు. అనంతరం ఉభయదేవేరులతో మలయప్పస్వామి ఆలయ నాలుగుమాఢవీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమాల్లో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి దంపతులు, ప్రధాన అర్చకుడు వేణుగోపాల దీక్షితులు, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, ఆలయ పేష్కార్ రామకృష్ణ, విఎస్‌ఒ అల్లం సురేంద్ర, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

## 28న గోవిందరాజస్వామి ఆలయంలో శ్రావణ ఉపకర్మ



**తిరుమల, ఆగస్టు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతి గోవిందరాజస్వామి ఆలయంలో 28వ తేదీ శ్రావణ ఉపకర్మను ఆగమోక్తంగా భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఉదయం 6.30 గంటలకు గోవిందరాజస్వామి, శ్రీ కృష్ణస్వామిని మంగళవాయిద్యాల నడుమకపి లతీర్థంలోని ఆళ్వార్‌తీర్థానికి ఊరేగింపుగా తీసుకువెళతారు. అక్కడ స్వామివారికి శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం, ఆస్థానం నిర్వహిస్తారు. అనంతరం సాయంత్రం 4.30 నుండి 6.30 గంటల వరకు ఆర్.ఎస్. మాడ వీధిలోని వైఖానసాచార్యుల ఆలయంలో భూసమేత గోవిందరాజస్వామికి ఆస్థానం నిర్వహించనున్నారు. అనంతరం స్వామివారు తిరిగి ఆలయానికి చేరుకుంటారు. శ్రావణ పౌర్ణమి పర్వదినాన నిర్వహించే ఈ పవిత్ర శ్రావణ ఉపకర్మలో భక్తులు పాల్గొని స్వామివారి దివ్య మంగళానుగ్రహాన్ని పొందాలని టిటిడి కోరింది.

## ఆర్టీసీ విద్యుత్ బస్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

**తిరుపతి, ఆగస్టు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆర్టీసి విద్యుత్ బస్సులు నడుపుతున్న డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం తక్షణమే పరిష్కరించాలని ఆర్టీసి విద్యుత్ బస్సుల డ్రైవర్స్ యూనియన్ సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కార్మికశాఖ డిప్యూటీ కమిషనర్ సురేష్ కుమార్‌కి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఎస్ జయచంద్ర, రాష్ట్ర కమిటీ సభ్యుడు జి.బాలసుబ్రహ్మణ్యంతో బాటు డ్రైవర్‌లు పాల్గొన్నారు. ప్రధాన కార్యదర్శి మునీంద్ర, అధ్యక్షుడు మునయ్య, కోశాధికారి యువరాజు, కేవీస్ నాయక్, వి. సోమశేఖర్, పీకే రెడ్డి, యు.విజయకుమార్, ఎం. ప్రవీణ్, సి. సోమశేఖర్, వి. హేమంత్, సి. అనిల్ కుమార్, బి. వినోద్ కుమార్, ఎస్కె మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

# వేళాపాళా లేని సర్వదర్శనం టోకెన్లు జారీ !

- ఆఫ్‌లైన్‌లో టైమ్‌స్లాట్ కోటాకోసం భక్తుల అవస్థలు
- అర్ధరాత్రి దాటాక గంటన్నరలోపే మూసివేత




**తిరుమల, ఆగస్టు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనానికి దేశ వ్యాప్తంగా భక్తులు భారీగా తరలివస్తున్నారు. రోజురోజుకూ పెరుగుతున్న సామాన్యభక్తుల తాకిడితో తిరుపతిలో ఆఫ్‌లైన్‌లో టిటిడి జారీచేస్తున్న సమయ నిర్దేశిత సర్వదర్శనం టోకెన్లుకు వేళాపాళా లేకుండా పోయింది. ఈ టోకెన్లు ఎప్పుడు జారీచేస్తారో.. ఎప్పుడు అయిపోతాయో అనే సమాచారం కూడా తెలియకుండా భక్తులు అవస్థలు పడుతున్నారు. రద్దీ పెరిగితే ఈ టోకెన్లు జారీకి సమయం సందర్భం లేకపోతోంది. అధికారుల ఇష్టారాజ్యంగా మారిందనేది భక్తుల నుండి వినిపిస్తున్న విమర్శలు. రోజువారీగా 10వేల సర్వదర్శనం టోకెన్లు, 2వేలు దివ్యదర్శనం టోకెన్లు (శ్రీవారి మెట్టు మార్గం) విడుదల చేస్తున్నారు. ఈ టోకెన్లుకోసం దాదాపు ఏడెనిమిది గంటల సమయం తిరుపతిలోని ఆర్టీసి బస్టాండ్ సమీపంలోని శ్రీనివాసం వసతిసముదాయం, రైల్వేస్టేషన్ సమీపంలోని విష్ణునివాసంతోబాటు అలిపిరి భూదేవి కాంప్లెక్స్‌లోని కౌంటర్ల వద్ద భక్తులు బారులు తీరి ఉంటారు. భక్తుల రద్దీ పెరిగితే టిటిడి తలనొప్పిని తగ్గించుకునేందుకు ఈ టోకెన్లు ఎప్పుడు బడితే అప్పుడు జారీ చేస్తుండటం జరుగుతోంది. సాధారణంగా తిరుపతిలో ఆఫ్‌లైన్ కౌంటర్లలో మధ్యాహ్నం 1గంట ప్రాంతంలో ఈ సమయనిర్దేశిత సర్వదర్శనం టోకెన్లు జారీ చేయాల్సి ఉంది. ఈ టోకెన్లు అందుకున్న భక్తులు ఆ రోజుగానీ, మరుసటిరోజుగానీ తిరుమలకు చేరుకోవచ్చు. అయితే వీరికి ఎలాంటి వసతి సౌకర్యం గదులు కేటాయించరు. భక్తులు ఆలయం ముందుగానీ, తిరుమలలోనే పార్కుల్లో, ఖాళీస్థలాల్లో, కాటేజీల వద్ద, యాత్రికుల వసతి సముదాయాల్లో విశ్రాంతి తీసుకునే వెసలుబాటు ఉంది. ఇలా రోజుకు 12వేలమంది వరకు సామాన్యభక్తులు ఆఫ్‌లైన్‌లో టోకెన్లు పొంది తిరుమలకు వస్తుంటే ఎలాంటి టోకెన్లు, దర్శన టిక్కెట్లు లేని భక్తులు 30వేలమంది వరకు వస్తున్నారనేది టిటిడి అంచనా. అయితే తిరుమలలో వసతి మాత్రం వీరికి కేటాయించరు. **ఆఫ్‌లైన్‌కు పెరుగుతున్న డిమాండ్:**సాధారణంగానే తిరుమలకు దేశం నలుమూలల నుండి భక్తులు తరలివస్తున్నారు. మరీ వారాంతంలో ఈ భక్తుల సంఖ్య 50వేల మంది వరకు ఉంటుంది. వారాంతంలోనూ 10వేల సర్వదర్శనం టోకెన్లు మాత్రమే జారీచేస్తుండటంతో మిగిలిన వాళ్ళు సాధారణ సర్వదర్శనంపై ఆధారపడుతున్నారు. ఇలా రద్దీపెరిగితే 24గంటల పైగా భక్తులు నిరీక్షణ తప్పడంలేదు. ఇక లక్షలాదిమంది భక్తులు తమ ఇష్టదైవాన్ని శ్రీవేంకటేశ్వరస్వామిని మరింత దగ్గరగా తనివితీరా వీక్షించాలని తపన పడుతుంటారు. అలాంటి వారికి ఆలయంలోపల బంగారువాకిలిలో జయవిజయుల వరకే మహాలఘు దర్శనం చేసి పంపుతున్నారు. ఆఫ్‌లైన్‌లో జారీచేస్తున్న టైమ్‌స్లాట్ టోకెన్ల కోసం ఇప్పటికీ సమయం సందర్భం లేకుండా ఉండటంతో క్యూలైన్లలో బారులుతీరిన భక్తులు గంట సమయంలోనే ఈ టోకెన్లన్నీ జారీ అయిపోతున్నాయి. దీన్నిబట్టి సామాన్యభక్తులు స్వామివారి దర్శనానికు ఎంతటి ఆసక్తి చూపుతున్నారనేది తెలుస్తుంది. టిటిడి కూడా ఎప్పటికప్పుడు భక్తులకు సంతృప్తికర, సులభ దర్శనం చేయించేందుకు కసరత్తు చేస్తోంది. ప్రతిరోజూ తిరుమలకు చేరుకుని స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు 90వేల మంది వరకు ఉండటం విశేషం. టిటిడి పాలకమండలి, అధికారులు సామాన్యభక్తులకు దేవుని దర్శనమ్ మరింత తక్కువసమయంలో సంతోషంగా చేయించాలనే తపనతో వినూత్నంగా ఆలోచన చేస్తున్నా ఆచరణలో మాత్రం అమలుకు నోచుకోవడం లేదు. టోకెన్లతో కొండకు వచ్చినా సాధారణ సర్వదర్శనమ్‌లోనే వైకుంతమ్ 2నుండి, రద్దీ పెరిగితే ఆలయం వెలుపల క్యూలైన్ల నుండి ప్రవేశించాల్సిన కష్టం భక్తులకు తప్పడంలేదు.

# శ్రీ రాఘవేంద్రస్వామి సన్నిధిలో రాష్ట్ర మంత్రులు

## ఆశీర్వదించిన పీఠాధిపతి



**మంత్రాలయం, ఆగస్టు 25 ప్రభాతవార్త;** మంత్రాలయంలోని ప్రసిద్ధ శ్రీ గురు రాఘవేంద్రస్వామి మఠాన్ని కర్నూలు జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు, రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే డాక్టర్ బి.వి.జయనాగేశ్వరరెడ్డి, మంత్రాలయం టిడిపి ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి, టిడిపి జిల్లా అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ, జోన్-5 ఇన్‌చార్జి శ్రీనివాసరెడ్డి మంగళవారం భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రులు శ్రీ గురు రాఘవేంద్రస్వామివారి బృందావనాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు, ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం మఠం పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ సుబుదేంద్రతీర్థ స్వామివారు మంత్రులకు శేషవస్త్రం కప్పి, ఫల మంత్రాక్షింతలు, తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. రాష్ట్ర ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవించాలని, రాష్ట్రం అన్ని రంగాల్ల మరింత అభివృద్ధి సాధించాలని స్వామివారిని ప్రార్థించినట్లు మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. మంత్రులు మఠం దర్శనానికి ముందుగా మంచాలమ్మ గ్రామదేవతను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజల శ్రేయస్సు, జిల్లాభివృద్ధి, సుఖ సంతోషాల కోసం ప్రార్థనలు చేశారు.

# దుర్గమ్మవారి సేవలో నూతన ఏపీ లోకాయుక్త



**ఇంద్రకీలాద్రి, ఆగస్టు 25, ప్రభాతవార్త:** ఇంద్రకీలాద్రిపై అమ్మవారిని నూతన ఏపీ లోకాయుక్త జస్టిస్ టి. మల్లికార్జున రావు తన కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయ డీఈఓ కిషోర్ కుమార్ అమ్మవారి శేష వస్త్రం, ప్రసాదాలు మరియు అమ్మవారి చిత్రపటాన్ని అందించారు. వేద పండితులు వారికి వేదాశీర్వచనం అందించారు. **- నిత్యాన్నదాన పథకానికి విరాళం:** దుర్గమ్మవారి ఆలయంలో జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి రు.1,00,150ల విరాళాన్ని బాపట్ల జిల్లా పేటేరు గ్రామంకు చెందిన భావన రుషి మంగళవారం అందించారు. దాతలకు దుర్గమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసిన అనంతరం ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

# ఫొటో జర్నలిస్టు నైపుణ్యం, శ్రమ కలగలిసిన కళాకారుడు

- సి.ఆర్. మీడియా అకాడమీ ఛైర్మన్ సురేశ్ కుమార్

**విజయవాడ, ఆగస్టు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** ఫొటో జర్నలిస్టు నైపుణ్యం,శ్రమ కలగలిసిన కళాకారుడని సి.ఆర్. మీడియా అకాడమీ ఛైర్మన్ ఆలపాటి సురేశ్ కుమార్ పేర్కొన్నారు. ఫొటో కాంటెస్ట్2026 అవార్డుల ప్రధానోత్సవం మంగళవారం విజయవాడ ప్రెస్ క్లబ్‌లో ఘనంగా నిర్వహించారు. సి.ఆర్.మీడియా అకాడమీ, ఎపి స్టేట్ క్రియేటివ్ అండ్ కల్చరర్ కమీషన్ ఈ కార్యక్రమ నిర్వహణకు తోడ్పాటునందించాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఒక ఫొటో వార్తకు ప్రాణం పోస్తుందనడం అతిశయోక్తి కాదన్నారు. ఒకఅంశాన్ని చిత్రం(ఫొటో)తో పాటు వివరించడం సంఘటనను పాఠకులకు మరింత చేరువ చేస్తుందన్నారు. తమ నలభై యేళ్ళ జర్నలిస్టు అనుభవంలో ఫిల్మ్ కెమెరాలు, డిజిటల్ కెమెరాలు, చివరికి స్మార్ట్ ఫోన్ కెమెరాలు వాడకం చూశామని, అన్ని దశల్లోనూ ఫొటోల నాణ్యత ఒకేలా ఉందని చెప్పలేమన్నారు. ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో ఫొటోగ్రఫీ రంగంలో కూడా విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయని, దానిపై ఫొటో జర్నలిస్టులు నూతన, సాంకేతిక తను అలవర్చుకోవాలని సూచించారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి రోజూ 530 కోట్ల ఫొటోలు తీస్తున్నట్లు ఒక సర్వేలో వెల్లడైందన్నారు. ఇదంతా స్మార్ట్ ఫోన్ల వల్లనే సాధ్యం అవుతోందన్నారు. అయితే, సాధారణ ఫొటోలు, వార్తల కోసం తీసే ఫొటోలతోపాటు కళాత్మక ఫొటోగ్రఫీని ప్రోత్సహించాలని ఆయన సూచించారు. గతంలో "ఇలస్ట్రేటెడ్ వీక్లీ"వంటి పత్రికలు కళాత్మక ఫొటోగ్రఫిని, ఫొటో జర్నలిస్టులను ప్రోత్సహించేవన్నారు. తాను క్లిక్ మనిపించిన ఫొటోను మనస్సుతో అనుభూతి చెంది, ఆనందించడం ఫొటో జర్నలిస్టులందరికీ అనుభవంలో ఉంటుందన్నారు. సంఘటనకు అతి చేరువలో వుండి, ఓపిగ్గా నిరీక్షించడం ద్వారా ఫొటో జర్నలిస్టులు ఎన్నో చారిత్రాత్మక ఫొటోలు తీయగలిగారన్నారు. రెండో ప్రపంచ యుద్ధం ముగింపును సూచించే ప్రసిద్ధ ఫొటో అలాంటి వాటిలో ఒకటని ఆయన గుర్తు చేశారు. సమాజంలోని మార్పులను ప్రజల జీవన విధానాన్ని, ప్రకృతి అందాలను కళ్లకు కట్టినట్లు చూపించడంలో ఫొటోగ్రఫీకి ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. సమాజంలో జరిగే సంఘటనలను భవిష్యత్తు తరాలకు భద్రపరచడంలో ఫొటో జర్నలిస్టుల పాత్ర కీలకమన్నారు.

## శ్రీశైలంలో క్యూకాంప్లెక్సు

**శ్రీశైలం ప్రాజెక్ట్, ఆగస్టు 25 ప్రభాతవార్త:** శ్రీశైల దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షులు పోతుగుంట రమేష్‌నాయుడు అధ్యక్షతన ధర్మకర్తల మండలి 10వ సమావేశం పరిపాలన భవనంలో నిర్వహించారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు పాల్గొనగా, సమావేశంలో మొత్తం 18 అంశాలు చర్చించారు. వీటిలో 15 అంశాలు ఆమోదించారు. మిగతా 3 అంశాలను వాయిదా వేశారు. సమావేశ ప్రారంభంలో ధర్మకర్తల మండలి అధ్యక్షుడు పోతుగుంట రమేష్‌నాయుడు మాట్లాడుతూ క్షేత్రపరిధిలో మౌలిక సదుపాయాల కల్పనకు మరిన్ని చర్యలు తీసుకుంటామన్నారు. సామాన్య భక్తులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు అవసరమైన సదుపాయాలను కల్పిస్తామన్నారు. శ్రీశైలం క్షేత్రాన్ని దర్శించే సామాన్య భక్తుల సౌకర్యాల కల్పనకే ప్రాధాన్యత ఇస్తామన్నారు. ముఖ్యంగా క్షేత్రాన్ని దర్శించే ప్రతీ భక్తుడిని ఒక అతిథిగా భావిస్తున్నామన్నారు. అందుకు అనుగుణంగా ఆయా సౌకర్యాల కల్పనను చేపడతామని వివరించారు. సర్వదర్శనం క్యూలైన్లలోని భక్తుల సౌకర్యార్థం ప్రతీ శని,ఆది, సోమవారాలలో ఉదయం, మధ్యాహ్నవేళలో శ్రీస్వామివారి స్పర్శదర్శనాన్ని పూర్తిగా నిలుపుదల చేయడం జరిగిందన్నారు. సామాన్య భక్తులకు ఇబ్బందులు లేకుండా కేవలం రాత్రి వేళలో మాత్రమే శ్రీస్వామివారి స్పర్శదర్శనం కల్పిస్తున్నామన్నారు. భక్తుల సౌకర్యార్థం నిర్మించతలపెట్టిన క్యూకాంప్లెక్సు నిర్మాణ పనులను వీలైనంత త్వరలో ప్రారంభిస్తామన్నారు. ఇప్పటికే ఈ నిర్మాణానికి సంబంధించిన డి.పి.ఆర్ దాదాపుగా పూర్తి కావచ్చిందన్నారు. మొత్తం ఒకేసారి 12వేల మంది భక్తులు వేచివుండే విధంగా 3 అంతస్తులుగా ఈ క్యూకాంప్లెక్సు నిర్మించాలని భావిస్తున్నామన్నారు. ఈ నెల 29 నుంచి 31 వరకు సిద్ధవట ఆలయంలో నూతన ధ్వజప్రతిష్ఠా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు.

## బ్రహ్మోత్సవాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యత

**తిరుమల, ఆగస్టు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని భక్తులకు పరిశుభ్రమైన వాతావరణం, నాణ్యమైన ఆహారం అందించేందుకు టిటిడి ఆరోగ్యశాఖ ముందస్తు చర్యలు చేపట్టింది. టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి ఆదేశాల మేరకు తిరుమలలోని ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ఇకపై ప్రతి మంగళవారం "క్లీనింగ్ డే" ప్రత్యేకంగా నిర్వహించాలని నిర్ణయించింది. ఇటీవల ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల పరిసరాల్లో అపరిశుభ్రత నెలకొంటోందని భక్తుల నుంచి ఫిర్యాదులు అందుతున్న నేపథ్యంలో డిప్యూటీ ఇఒ సోమన్నారాయణ ఆదేశాల మేరకు ఆరోగ్యశాఖ అధికారులు ఈ విధానాన్ని అమలు చేస్తున్నారు. వారం రోజుల పాటు వ్యాపార కార్యకలాపాలు నిర్వహించే దుకాణాల పరిసరాల్లో పేరుకుపోయే వ్యర్థాలు, మురికి తదితరాలను తొలగించి పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి మంగళవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లను మూసివేసి సంపూర్ణంగా శుభ్రం చేసుకోవాలని నిర్వాహకులకు సూచించారు.

## భక్తుల భద్రతకు అధిక ప్రాధాన్యతనివ్వాలి



**తిరుమల, ఆగస్టు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలకొండపై రానున్న శ్రీవారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని భక్తులకు సురక్షితమైన సౌకర్యవంతమైన రవాణా సేవలు అందించాలని తిరుపతి జిల్లా రవాణాశాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ సూచించారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలకు తిరుపతికి దేశం నలుమూలల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున జీపులు, సుమోలు, టాక్సీ డ్రైవర్లు బాధ్యతాయుతంగా, క్రమశిక్షణతో భద్రతకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ విధులు నిర్వహించాలని తెలిపారు. ప్రయాణికుల నుండి అధిక చార్జీలు వసూలు చేయడం, అనుమతించిన ప్రయాణికుల సంఖ్యకు మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం, వాహనాలను నిర్లక్ష్యంగా నడపడం వంటి చర్యలకు పాల్పడరాదని స్పష్టం చేశారు. తిరుమల పోలీస్, తిరుపతి జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో జీపులు, సుమోలు, టాక్సీ డ్రైవర్లు వివిధ స్టాండ్‌ల అసోసియేషన్ సభ్యులతో సమన్వయ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా రవాణా శాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్, తిరుపతి ట్రాఫిక్ డిఎస్పీ కొండయ్య, అలిపిరి ఎవిఎస్‌ఒ రమేష్‌కృష్ణ, ట్రాఫిక్ సిఐ భాస్కర్ నాయక్, ఈ సందర్భంగా డ్రైవర్లకు బ్రహ్మోత్సవాల సమయంలో పాటించాల్సిన ట్రాఫిక్, రవాణా మరియు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు.

## నకిలీ బంగారం తాకట్టు

**తిరుపతి, ఆగస్టు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** యాత్రాస్థలం తిరుపతినగరంలో ముగ్గురు కేటుగాళ్ళు కుదువవ్యాపారులను నమ్మించి నకిలీ బంగారం పెట్టి పెద్ద మొత్తంలో నగదుతో ఉడాయించారు. ఈ ఉదంతం మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వెలుగుచూసింది. తిరుపతిలో వివిధ ప్రాంతాల్లో కేటుగాళ్ళు మూడు కుదువ దుకాణాల్లో దాదాపు 60 గ్రాముల నకిలీ బంగారం పెట్టి రూ. 5.24లక్షలు నగదు తీసుకున్నారు. తిరుపతి లక్ష్మీ ్మపురం సర్కిల్లో ఉన్న భవాని పాన్ బ్రోకర్, దేవేంద్ర పాన్ బ్రోకర్, ఎల్ ఎస్ నగర్ లోని వినాయక కుదువ దుకాణాల్లో వ్యాపారులు మోస పోయారు. అంకిత, భాస్కర్ నాయుడు పేర్లతో ఉన్న ఆధార్ కార్డులు చూపించి నగదు పొందినట్లు పోలీసుల ఫిర్యాదులో ఉంది. ఆ బంగారు నగల హాల్ మార్క్ నమ్మి నగలు తీసుకొని కుదువ పెట్టుకున్న వ్యాపారస్తులు. సాధారణంగా నగలను చూసి డబ్బులు తీసుకోవడం పరిపాటి. అయితే తిరుపతిలో కుదువ వ్యాపారులు (పాన్‌బ్రోకర్స్) చిరునామాల కోసం ఆధార్‌కార్డులు, తెలిసిన నమ్మకైన వ్యక్తులతోనే వ్యాపార లావాదేవీలు సాగిస్తారు.

# మండలాల విలీనంపై డీపీఓతో చర్చించిన గంటా



**విశాఖపట్నం, ఆగస్టు 25, ప్రభాతవార్త :**

జిల్లాలోని 4 మండలాలను జీవీఎంసీలో కలిపేందుకు నిర్వహిస్తున్న గ్రామసభల వివరాలు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆరా తీశారు. ఎంవీపీ కాలనీ క్యాంప్ కార్యాలయంలో జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ మంగళవారం ఆయన్ను కలిశారు. విలీన ప్రక్రియలో భాగంగా గ్రామ సభల్లో చేసిన తీర్మానాలు ప్రభుత్వానికి పంపుతామని తెలిపారు. కోర్టు కేసుల వివరాలు కూడా గంటా అడిగి తెలుసుకున్నారు. అలాగే మధురవాడ జోన్ లో హౌసింగ్ గురించి జోనల్ కమిషనర్ అయ్యప్ప నాయుడుతో చర్చించారు. ప్రభుత్వం కేటాయించిన ఫ్లాట్ లలో నివాసముంటున్న అనర్హుల వివరాలు సేకరించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## కళ్యాణమండపాలను పరిశీలించిన గంటా

### పెండింగ్ పనుల పూర్తికి ఆదేశం



**విశాఖపట్నం, ఆగస్టు 25, ప్రభాతవార్త :**

కొమ్మాది, సాయిరాం కాలనీ కళ్యాణమండపాలలో పెండింగ్ పనులను పూర్తి చేసి ప్రారంభోత్సవాలకు సిద్ధం చేయాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదేశించారు. మంగళవారం అధికారులు, స్థానిక నాయకులతో కలిసి ఈ రెండు మండపాలను ఆయన సందర్శించారు. అసంపూర్ణ నిర్మాణాల కోసం గంటా చొరవ తీసుకుని రూ.1.66 కోట్లు నిధులు మంజూరు చేయించగా, అన్ని హంగులతో కళ్యాణ మండపాలను సిద్ధం చేశారు. అయితే ఫాల్ (తరువాయి 8వ పేజీలో)

## 88వ వార్డు నరవలో కోటి రూపాయల అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే పంచకర్ల

### కార్యక్రమంలో పాల్గొన్న కూటమి పార్టీల నేతలు



**విశాఖపట్నం, ఆగస్టు 25 ప్రభాత వార్త :**

పెందుర్తి నియోజకవర్గం జివిఎంసి 88 వ వార్డు నరవ గ్రామంలో కోటి రూపాయల జీవీఎంసీ నిధులుతో నిర్మించిన రోడ్లు కాలువలు నిర్మాణ పనులను జనసేన పార్టీ ఉమ్మడి విశాఖపట్నం రూరల్ జిల్లా అధ్యక్షులు పెందుర్తి నియోజకవర్గం శాసనసభ సభ్యులు పంచకర్ల రమేష్ బాబు మంగళవారం ఉదయం (తరువాయి 8వ పేజీలో)

## సర్ ప్రక్రియను పరిశీలించిన రోల్ అబ్జర్వర్ భార్గవి

### విశాఖ పార్లమెంట్ పరిధిలో క్షేత్ర స్థాయి పర్యటన



**విశాఖపట్నం, ఆగస్టు 25, ప్రభాతవార్త :**

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్.ఐ.ఆర్.) ప్రక్రియలో భాగంగా భారత ఎన్నికల సంఘం నియమించిన రోల్ అబ్జర్వర్ ఎస్. భార్గవి మంగళవారం క్షేత్రస్థాయిలో పర్యటించి పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించిన ఆమె, మంగళవారంవిశాఖ పార్లమెంట్ పరిధిలో ని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఎస్.ఐ.ఆర్. ప్రక్రియ పురోగతిని పరిశీలించారు. విశాఖ (తరువాయి 8వ పేజీలో)

## ఏయూ విద్యార్థులకు మూడు క్రీడామైదానాలు, జిమ్నాజియంలు అభివృద్ధి చేయాలి

### క్రీడా బోర్డు వార్షిక సమావేశంలో ఏయూ వీసీ ఆచార్య జీపీ రాజశేఖర్ వెల్లడి



**ఆంధ్ర యూనివర్సిటీ, ఆగస్టు 25, ప్రభాత వార్త :**

ఆంధ్ర విశ్వవిద్యాలయంలో చదువుతున్న విద్యార్థులకు అధునాతన మైన మూడు క్రీడా మైదానాలు అభివృద్ధి చేయాలని ఏయూ వైస్ ఛాన్స లర్ ఆచార్య జీ.పీ.రాజశేఖర్ సూచించారు. మంగళవారం ఏయూ పరిపాలన విభాగం వద్ద ఉన్న ఈ.సీ సెంట్రల్ హాల్లో వైస్ ఛాన్సలర్ అధ్యక్షతన స్పోర్ట్స్ బోర్డు వార్షిక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వైస్ చాన్సలర్ ఆచార్య జీపీ రాజశేఖర్ (తరువాయి 8వ పేజీలో)

## వై.ఎస్. జగన్‌ని కలిసిన కె.కె రాజు

**విశాఖపట్నం, ఆగస్టు 25 ప్రభాతవార్త :**



వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్య మంత్రి వై.యస్ జగన్మోహన్ రెడ్డి ని మంగళవారం తాడేపల్లి కేంద్ర పార్టీ కార్యాలయంలో విశాఖపట్నం జిల్లా వైకాపా అధ్యక్షులు కె.కె రాజు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విశాఖపట్నం జిల్లా రాజకీ పరిణామాలు,వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ బలోపేతం, పార్టీ కమిటీలు నిర్మాణం, ఐడి కార్డుల వెరిఫికేషన్ గురించి ఆయన జగన్ తో చర్చించారు.

# విశాఖ మేయర్ టికెట్‌కై

# కూటమిలో పోటా.. పోటీ..!



**రేసులో గంటా రవితేజ, మురళి, పీలా గోవింద్, గండి బాబ్జి, బండారు అప్పలనాయుడు, ఆడారి ఆనంద్, మౌర్య**

**(ప్రభాతవార్త–విశాఖపట్నం)**

విశాఖ మేయర్ టిక్కెట్ కోసం 'కూటమి'లో ఆసక్తికరమైన పోటీ నెలకొంది. రేసులో పలువురు నేతలు వారి అదృష్టాన్ని పరీక్షించుకునే పనిలో నిమగ్నమైనట్టు తెలుస్తుంది. పార్టీ అధిష్టానం ఎవరి నాయకత్వంపై ఆసక్తి కనబరుస్తుందనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. శాసనసభ్యులు వారి వారసులకు అవకాశాలు కల్పించాలన్న డిమాండ్ పెట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. టిడీపీ నుంచి అత్యధిక నేతలు కీలకమైన 'మేయర' టిక్కెట్‌ను ఆశిస్తున్నట్టు తెలుస్తోంది. మేయర్ టిక్కెట్ తమకే కేటాయించాలంటూ బీజేపీ నేతలు పట్టుపడుతున్నట్టు సమాచారం. జనసేన నుంచి మాత్రం మేయర్ టిక్కెట్‌కై పెద్దగా ఆసక్తిలేనట్టు కనిపిస్తోంది. టీడీపీ నుంచి గంటా రవితేజ, పీలా గోవింద్, గండి బాబ్జి, ఆడారి ఆనంద్, బండారు అప్పలనాయుడు, మురళిలతో పాటు గణబాబు తనయుడు మౌర్య కూడా పోటీ పడుతున్నట్టు తెలుస్తోంది. వీరిలో పార్టీ అధిష్టానం ఎవరివైపు ఆసక్తి కనబరుస్తుందనేది తెలియాల్సి ఉంది. గంటా కుమారునిగా గుర్తింపు ఉన్న గంటా రవితేజ గట్టి పోటీ ఇస్తున్నట్టు సమాచారం. అయితే రవితేజకు తండ్రి గంటా శ్రీనివాస్ రాజకీయ చతురత అందిపుచ్చుకున్నట్టు కనిపిస్తోంది. నగరంపై మంచి పట్టు వున్న నాయకునిగా రవితేజకు పేరుంది. తండ్రి ఓటమి ఎరుగని నాయకుడు కావడం , ఆర్థికంగా ఎలాంటి ఇబ్బంది లేకపోవడం, అందరినీ కలుపుకుపోయే మనస్తత్వం కలిగిఉండటం, ఎన్నో ఏళ్లుగా ఎన్నికలు నిర్వహించిన అనుభవం ఉండటం, అధిష్టానం వద్ద మంచి పేరు, ప్రఖ్యాతలు కలిగిఉండటం వంటి అదనపు అర్హతలుగా ఉన్నాయి. మున్సిపల్ మంత్రి నారాయణ అల్లుడు కావడం కూడా మరో అదనపు బలం.

తెలుగుదేశం పార్టీకోసం ఎంతో శ్రమించిన నాయకుల్లో మురళీ ప్రదమునిగా నిలుస్తున్నారు. ఎంఎలఎ పల్లా శ్రీనివాస్ బంధువు , వ్యాపార వేత్తగా మురళికి పేరుంది. పార్టీతో సంబంధం లేకుండా ప్రతి వారిని ప్రేమతో అన్నా , తమ్ముడు అంటూ వరుసలతో పలుకరించే మంచి నైజం ఇతని సొంతం. పోర్టుతో మంచి సంబందాలు నెలకొనదంతో పర్యావరణ సమతుల్యతపై పనిచేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. విశాఖ భీమిలిలో జన్మించడంతో భీమిలి నియోజకవర్గం అంతా ఇతని వెనకాలే ఉండే అవకాశాలు న్నాయి. అలాగే పల్లా శ్రీనివాస్‌తో పనిచేయడంతో గాజువాక నియోజకవర్గం కూడా మురళికి పెట్టనికోటగా ఉంది. 20 ఏళ్ళుగా పల్లా శ్రీనివాస్‌తో పార్టీ కోసం పని చేయడం, ఎన్నికల నైపుణ్యం, కార్యకర్తలతో అనుసంధానం వంటివన్నీ మురళీ సొంతం. మురళికి యాదవ సామాజిక వర్గం బలం అదనపు ఆకర్షణగా నిలవనుంది. మురళీ కుటుంబం విదేశాల్లో స్థిరపడటంతో ఆర్థికంగా కూడా బలంగా ఉన్నట్టు తెలుస్తోంది. 2024 ఎన్నికల్లో పల్లా శ్రీనివాసరావుకు గాజువాకలో అత్యధిక మెజార్టీ రావడంలో మురళి కీలక పాత్ర వహించారు . కాగా, చంద్రబాబు, లోకేష్ దృష్టిలో మంచి పేరున్న నాయకుని గా. జర్నలిస్ట్‌గా మంచి అనుభవం ఉండటంతో సమస్యల ను పరిష్కరించే అవకాశాలున్నాయి. అలాగే సతీమణి కమ్మ సామాజిక వర్గం కావడంతో కమ్మ సామాజిక వర్గం కూడా మద్దతు ప్రకటించే అవకాశాలున్నట్టు తెలుస్తుంది. ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ వెనుక ఉండటంతో గత మూడేళ్లగా పార్టీని నడిపించడంలో కీలకంగా ఉండటం ఎలాంటి ఆరోపణలు లేకపోవడం కూడా అదనపు బలం.

మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద్‌పై అనకాపల్లిలో మక్కువ చూపించే నాయకత్వం. గత ఎమ్మెల్యే సీటును వదులుకోవడంతో గోవింద్‌పై అదిష్టానం మొగ్గు చూపించాలన్న డిమాండ్ పెరుగుతుంది. ఆర్థికంగా ఎలాంటి ఇబ్బందులు లేవు, పార్టీకి వినియవిదేయతగా పనిచేసే నాయకునిగా గుర్తింపు ఉంది. విశాఖలో గవర సామాజిక వర్గం కూడా పీలాకు మద్దతుగా నిలిచే అవకాశాలున్నాయి.

మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జిపై అదిష్టానం వద్ద మంచి పేరుంది. దక్షిణ నియోజకవర్గం ఇన్‌చార్జిగా పనిచేసిన అనుభవం, ప్రస్తుతం దక్షిణ నియోజకవర్గం జనసేన ఎమ్మెల్యే ఎన్నిక కావడం వెనుక బాబ్జి పనితనం ఎంతో వుందన్న నమ్మకంతో అధిష్టానం ఉన్నట్టు సమాచారం. ప్రస్తుతం పెందుర్తి నియోజక నియోజకవర్గంలో పని చేస్తున్న బాబ్జీ దక్షిణ, పెందుర్తి నియోజకవర్గాల్లో మంచి పేరుంది. ఆర్థికంగా కూడా పరవాలేదన్న వాదన లేకపోలేదు. ఇప్పటికే పార్టీ ముఖ్యులతో మేయర్ పీటం కోసం మంతనాలు జరుపుతున్నట్టు సమాచారం.

బండారు అప్పలనాయుడు కూడా మేయర్ బరిలో వున్నట్టు తెలుస్తుంది. ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ తనయు డు కావడం ఈయనకు కొంత ఉపయోగపడే అంశంగా ఉంది. బండారుకు పెందుర్తితో అనుబంధం ఉండటంతో కాస్తా ఉపకరించే అంశమే. వెలమ కమ్యూనిటీ బండారు వెనుక (తరువాయి 8వ పేజీలో)

# విశాఖ మేయర్ పీఠమే లక్ష్యం!

**(ప్రభాతవార్త –విశాఖపట్నం)**



- సమన్వయంతో పనిచేయాలి
- వైఎస్సార్సీపీ శ్రేణులకు వైఎస్ జగన్ దిశానిర్దేశం
- అభ్యర్థి ఎవరైనా గెలుపే లక్ష్యంగా పనిచేయాలి
- అసెంబ్లీ నియోజకవర్గాల సమన్వయకర్తలు, ముఖ్య నేతలు, మాజీ కార్పొరేటర్లతో తాడేపల్లిలో సమావేశం

విశాఖపట్నం మహానగర పాలక సంస్థ(జీవీఎంసీ) మేయర్ పీఠాన్ని తిరిగి కైవసం చేసుకోవడమే లక్ష్యంగా పనిచేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. మేయర్ అభ్యర్థి ఎవరనే అంశం కంటే పార్టీ అభ్యర్థి విజయమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని నాయకులు, మాజీ కార్పొరేటర్లు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జీవీఎంసీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని మంగళవారం తాడేపల్లిలో విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల పరిధిలోని జీవీఎంసీకి సంబంధించిన (తరువాయి 8వ పేజీలో)

## ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ సుడిగాలి పర్యటన

- మున్సిపాలిటీ పరిధిలో 6:30 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న కాలవలో డ్రైనేజీలు, రోడ్లు పరిశీలన
- మరో 50 కోట్లు మంజూరు

**ఎలమంచిలి, ఆగస్టు 25, ప్రభాతవార్త :**



మున్సిపాలిటీలోని 6:30 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న రోడ్లు, డ్రైనేజీలు, కలవర్టులను ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ సహకారంతో మున్సిపాలిటీని అభివృద్ధి దిశగా పయనిస్తున్నామని, ఇప్పటికే సుమారు 6.8 కోట్లు వ్యయంతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని మరొక 50 కోట్లతో అభివృద్ధి పనులు కూడా చేపడతామని తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీలోని 25 వార్డులను ఎమ్మెల్యే ద్విచక్ర వాహనంపై పర్యటించారు.పట్టణంలోని ధర్మవారం వీధిలోను డ్రైనేజీ నిర్మాణానికి అడ్డంగా ఉన్న సమస్యను పరిష్కరించి యధావిధిగా (తరువాయి 8వ పేజీలో)

## సమ్మెను తాత్కాలికంగా విరమించిన జూడాలు

**హై కోర్టు ఆదేశాలను గౌరవిస్తూ అర్ధరాత్రి నుంచి అత్యవసర సేవలకు హాజరు**

**రెండు వారాల కోర్ట్ గడువు తర్వాత భవిష్యత్తు కార్యాచరణ**

**ఏపీ జూడా రాష్ట్ర ప్రధాన, సంయుక్త కార్యదర్శులు డాక్టర్ దినకర్, డాక్టర్ రవీంద్ర వెల్లడి**

**విశాఖపట్నం, ఆగస్టు 25, ప్రభాతవార్త :**

రాష్ట్రంలో గత రెండు వారాలకుపైగా కొనసాగుతున్న జూనియర్ డాక్టర్ల సమ్మెను ఎట్టకేలకు మంగళవారం హైకోర్ట్ జోక్యంతో తాత్కాలికంగా విరమించారు. తమ న్యాయమైన ఉపకార వేతనపెంపు తదితర డిమాండ్లను సానుభూతితో సానుకూలంగా రెండు వారాలులోగా పరిష్కరించాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వంను ఆదేశించిన నేపథ్యంలో హైకోర్టు గడువు మీద గౌరవంతో తాము సమ్మెను తాత్కాలికంగా విరమిస్తున్నట్టు ఏపీ జూనియర్ డాక్టర్ల సంఘం రాష్ట్ర ప్రధాన, సంయుక్త కార్యదర్శులు డాక్టర్ బలగం దినకర సాయి శ్రీనివాస్ డాక్టర్ కె.రవీంద్రలు మంగళవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. హైకోర్టు ఆదేశాలు, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖా మంత్రి హామీ మేరకు మంగళవారం అర్ధరాత్రి నుంచి సమ్మెను విరమించి అత్యవసర వైద్య సేవలకు హాజరుకావాలని ఏపీ జూడా రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు వారు (తరువాయి 8వ పేజీలో)

## గోదావరి జలాలతో ఉత్తరాంధ్రకు కొత్త వెలుగు

- రాష్ట్ర హోం మంత్రి అనిత
- పోలవరం ఎడమ కాలువ జలహారతి కార్యక్రమానికి సీఎం చంద్రబాబు రాక..!
- ఏర్పాట్లను పరిశీలించిన హోం మంత్రి అనిత.. అధికారులకు పలు సూచనలు..

**(నక్కపల్లి, ప్రభాతవార్త)**

పోలవరం ఎడమ కాలువ ద్వారా గోదావరి జలాలను ఉత్తరాంధ్రకు అందించే చారిత్రాత్మక ఘట్టానికి ప్రభుత్వం సర్వం సిద్ధం చేస్తోంది. పోలవరం ఎడమ కాలువ జలహారతి కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లను ముమ్మరం చేసింది. పాయకరావుపేట మండలం సీతారాంపురం నుంచి పీఎల్‌పురం, పాయకరావుపేట ప్రాంతాల వరకు పోలవరం ఎడమ కాలువ ద్వారా నీటి విడుదలకు సంబంధించిన ప్రాంతాలను రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత మంగళవారం జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ తో పాటు పలువురు జిల్లా అధికారులతో కలసి పరిశీలించారు. జలహారతి కార్యక్రమానికి చేపడుతున్న ఏర్పాట్లపై అధికారులతో (తరువాయి 8వ పేజీలో)



## కార్పొరేషన్ ఎన్నికల్లో కూటమిదే విజయం

- ఎమ్మెల్యే గంటా
- విశాఖ అభివృద్ధి కూటమితోనే
- అనుమతులకు మించి డేటా సెంటర్లు విశాఖలో అనుమతించం



**బిజ్జానాపురం, ఆగస్టు 24, ప్రభాతవార్త :**

విశాఖ జీవీఎంసీ ఎన్నికల్లో అన్ని కార్పొరేటర్ స్థానాలతో పాటు మేయర్ పీఠాన్ని కూటమి కైవసం చేసుకుంటుందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ విశాఖపట్నం తెలుగుదేశం పార్టీకి కంచుకోటని, దీంతో పాటు మిత్రపక్షాలైన జనసేన, బిజెపి సహకారం మెండుగా ఉందన్నారు. విశాఖ ప్రజలు సీఎం చంద్రబాబు నాయుడిని అమితంగా అభిమానిస్తారని, 2019లో రాష్ట్రమంతా వైసీపీ హవా నడిచినప్పటికీ విశాఖలోని నాలుగు దిక్కులు ఆయన వెంట నడిచాయన్నారు. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో విశాఖ నాలుగు నియోజకవర్గాలతో పాటు గాజువాక, భీమిలి, పెందుర్తి అసెంబ్లీ స్థానాలు కూటమి కైవసం చేస్తుందన్నారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేష్ సారధ్యంలో రాష్ట్రంలో ఐటీ, టూరిజం, రియల్ ఎస్టేట్ రంగాల్లో శరవేగంగా అభివృద్ధి చేస్తోందని తెలిపారు. జీవీఎంసీలో విలీనానికి భీమిలి రూరల్, ఆనందపురం, పద్మనాభం, పెందుర్తి (తరువాయి 8వ పేజీలో)

## అభివృద్ధి పనుల్లో అవినీతి లేదని నిరూపిస్తారా.. లేకపోతే ప్రజాక్షేత్రంలో తేల్చుకునేందుకు సిద్ధం

**మట్టి, గ్రావెల్ తవ్వకాలపై సమగ్రమైన విచారణ చేయాలి**

**రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి వీసం**



**నక్కపల్లి, ఆగస్టు 25, ప్రభాతవార్త :**

నక్కపల్లి మండలంలో వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో అవినీతి లేదని టిడిపి నాయకులు నిరూపిస్తే దేనికైనా సిద్ధమేనని లేకపోతే ప్రజాక్షేత్రంలో తేల్చుకుందామని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి విశాఖ దక్షిణ నియోజకవర్గం ఇన్చార్జి వీసం రామకృష్ణ సవాల్ విసిరారు. మంగళవారం నక్కపల్లి పార్టీ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలవరం మట్టి కొల్లగొట్టి, గ్రావెల్ దందా పెద్ద ఎత్తున కొనసాగిస్తున్నారని ఆది ఏమీ తెలియనట్లు మాట్లాడటం విడ్డూరంగా ఉందని అన్నారు. మండలంలోని చెరువులు, కొండలు, ప్రభుత్వ భూములు, పోలవరం కాలువకు సంబంధించిన మట్టి, గ్రావెల్ విషయంలో జరుగుతున్న అక్రమాలపై సమగ్ర దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. దోసలపాడు – దొంకాడ ప్రాంతంలో పోలవరం కాలువ గ్రావెల్ వ్యవహారంలో అవినీతి జరిగిందని, (తరువాయి 8వ పేజీలో)

# కళ్యాణమండపాలు పరిశీలించిన గంటా

(7వ పేజీ తరువాయి)

సీలింగ్, నీటి వసతి వంటి చిన్నపాటి పనులు పెండింగ్ లో ఉన్నందున వాటిని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ వి.అయ్యప్ప నాయుడు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు వెంకట వాసు, స్థానిక నాయకులు నాగోతి సత్యనారాయణ, మొల్లి లక్ష్మణరావు, గరే గుర్నాథ్, లొడగల జానకిరామ్, గడ్డి శ్రీను, కానూరు అచ్యుతరావు, బోయి శ్రీను, నాగోతి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

**ఇంటింటి ప్రచారంలో గంటా**

జీవీఎంసీ 5వ వార్డులోని సాయిరాం కాలనీలో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాస రావు ఇంటింటికి తెలుగుదేశం ప్రచారం నిర్వహించారు. కర పత్రాలు పంచి రెండేళ్లలో అభి వృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన సాగించామని తెలియ జేశారు. మహిళల కోసం స్త్రీ శక్తి, తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలిండర్లు వంటి పథకాలు అమలు చేస్తున్నామన్నారు. ప్రభుత్వం ఆర్థిక పరిస్థితి బాగోకపోయినా ప్రతినెల 1 వ తేదీన క్రమం తప్పకుండా పెన్షన్లు ఇస్తున్నామని చెప్పారు. అన్నసమారాధన చంద్రంపాలెంలోని బంగారమ్మ తల్లి ఉత్సవాల సందర్భంగా భీమిలి ఎమ్మెల్యే గంటా ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నసమారాధన ప్రారంభించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పిల్లా వెంకట్రావు, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

### 88 వ వార్డు నరవ లో కోటి రూపాయల అభివృద్ధి పనులను

# ప్రారంభించిన ఎమ్మెల్యే పంచకర్ల

(7వ పేజీ తరువాయి)

ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే .పారిశుద్ధ్యం కోసం ఇంటి ఇంటికి వెళ్లి తడి చెత్త పొడి చెత్త సేకరణ కొరకు మంజూరు చేసిన 7 వాహనాల ను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు మాట్లాడుతూ రెండేళ్ల కాలంలో ఒక నరవ గ్రామంలోనే కోట్లు రూపాయలు ఖర్చుపెట్టి అభివృద్ధి చేసామని, మరో రెండు కోట్ల నిధులు మంజూరుకు హామీ ఇచ్చారు. త్వరలోనే ఆ నిధులు కూడా మంజూరు అవుతాయని ప్రకటించారు వచ్చే స్థానిక సంస్థలు ఎన్నికల నాటికి మరిన్ని నిధులతో నరవ గ్రామాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తామని హామీఇచ్చారు.

**కూటమి నేతలు విభేదాలుకు తావివ్వవద్దు.**

మరోవైపు కూటమి నాయకులు అభిప్రాయ భేదాలకు తావివ్వరాదని అలా ఎవరైనా కూటమి ధర్మాన్ని ధిక్కరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జనసేన పార్టీ నాయకులు తప్పు చేస్తే పార్టీ నుండి సస్పెండ్ చేస్తానని అదే నిబంధన ఇతర ఇతర పక్షాలు కూడా వర్తిస్తుందని ఎమ్మెల్యే రమేష్ బాబు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో పెందుర్తి జోన్ జోనల్ కమిషనర్ శంకర్రావు , జీవీఎంసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ దిలీప్ , డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ లంక ప్రవీణ్ కుమార్ , జీవీఎంసీ ఏ ఎమ్ హెచ్ ఓ బండారు అప్పలనాయుడు, మాజీ కార్పొరేటర్ మొల్లి ముత్యాల నాయుడు, సీనియర్ నాయకులు ఇందల రమణ, వార్డు అధ్యక్షులు ఒబ్బిన జనార్దన్ శ్రీకాంత్ , గంతుకోరు శివ ,ఏఎంసీ డైరెక్టర్ గల్లా శ్రీనివాసరావు , సీనియర్ నాయకులు ఇల్లపు శ్రీనివాస రావు గారు, గవర సత్తిబాబు , ఎంపీటీసీ నందవరపు అప్పలరాజు ,లింగం అప్పలరాజు తదితర 88 వ వార్డు ఉమ్మడి ఎన్ డి ఏ మహాకూటమి నాయకులు ముస్లిం మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

# సర్ ప్రక్రియను పరిశీలించిన రోల్ అబ్జర్వర్ భార్గవి

(7వ పేజీ తరువాయి)

పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని పోలింగ్ స్టేషన్ నంబర్ 228ను, గాజువాక నియోజకవర్గ పరిధిలో 132, 143, 189 పోలింగ్ కేంద్రాలను, భీమిలి నియోజకవర్గ పరిధిలో 189, 374, 278, 377 పోలింగ్ కేంద్రాలను ఆమె సందర్శించారు. ఆయా కేంద్రాల్లో ఎస్.ఐ.ఆర్. ప్రక్రియ అమలు తీరును, సంబంధిత రికార్డులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.ఎస్.ఐ.ఆర్. ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా, సజావుగా నిర్వహించాలని, ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రక్రియలో నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూ, నిర్దేశిత గడువులోగా పనులను పూర్తి చేయాలని సూచించారు. ఈ పర్యటనలో ఆయా నియోజకవర్గాల ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, ఇతర ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

# జీవీఎంసీలో మళ్లీ పంచాయతీల విలీనం..

### ఎన్నికలకు మళ్లీ బ్రేకులేనా?



విశాఖపట్నం, ఆగష్టు 25, ప్రభాతవార్త :

జీవీఎంసీలో పంచాయతీల విలీన ప్రక్రియ మరోసారి తెరపైకి రావడంతో నగరపాలక సంస్థ ఎన్నికలపై అనిశ్చితి నెలకొంది. ఈసారి ఏకంగా 79 పంచాయతీలను జీవీఎంసీలో విలీనం చేసే ప్రక్రియ ప్రారంభమవుతుండటంతో రాజకీయ, పరిపాలనా వర్గాల్లో చర్చ మొదలైంది. ఇప్పటికే జీవీఎంసీ పరిధిలో వార్డుల పునర్విభజన ప్రక్రియ దాదాపు పూర్తయింది. ఈ తరుణంలో కొత్తగా పంచాయతీలు విలీనమైతే వాటిని పరిగణనలోకి తీసుకుని మళ్లీ వార్డుల పునర్విభజన చేపట్టాల్సి వచ్చే అవకాశం ఉంది. అనంతరం ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరించడం, అధికారుల పరిశీలన, ప్రభుత్వానికి నివేదిక, తుది నిర్ణయం వంటి ప్రక్రియలు కొనసాగాల్సి ఉంటుంది.

**గతంలోనూ ఇదే పరిస్థితి**

గతంలో పంచాయతీలను జీవీఎంసీలో విలీనం చేసే సమయంలో న్యాయపరమైన వివాదాలు తలెత్తడంతో ఎన్నికలు సుదీర్ఘకాలం వాయిదా పడ్డాయి. 2012 నుంచి 2021 వరకు దాదాపు తొమ్మిదేళ్ల పాటు జీవీఎంసీ ప్రత్యేక అధికారుల పాలనలోనే కొనసాగింది. ప్రస్తుతం 79 పంచాయతీల విలీన ప్రక్రియ మొదలవడంతో గత పరిణామాలు మళ్లీ పునరావృతమవుతాయా అన్న అనుమానాలు వ్యక్తమవుతు న్నాయి. విలీనంపై అభ్యంతరాలు, కోర్టు కేసులు తలెత్తితే ఎన్నికలు మరింత ఆలస్యం కావచ్చన్న చర్చ సాగుతోంది. విలీనం పూర్తయిన తర్వాతే వార్డుల పునర్విభజన.. ఆపై అభ్యంతరాలు, తుది ప్రక్రియ.. ఇవన్నీ పూర్తయితేనే ఎన్నికలకు మార్గం సుగమం కానుంది. దీంతో జీవీఎంసీ ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయన్నది ప్రస్తుతం ప్రశ్నార్థకంగా మారింది.

# ఆగస్టు 31న నేవీలోకి 'నిపుణ్'

### విశాఖ హెచ్ఎస్ఎల్ నిర్మించిన డైవింగ్ సపోర్ట్ వెసల్



విశాఖపట్నం, ఆగష్టు 25, ప్రభాతవార్త :

భారత నౌకాదళంలోకి మరో స్వదేశీ అధునాతన డైవింగ్ సపోర్ట్ వెసల్ 'నిపుణ్' చేరనుంది. నిస్తార్ తరగతికి చెందిన రెండో డైవింగ్ సపోర్ట్ వెసల్గా రూపొందిన నిపుణ్ను ఆగస్టు 31న ముంబై నేవల్ డాక్యార్డ్లో నౌకాదళంలోకి అధికారికంగా ప్రవేశపెట్టనున్నారు. విశాఖపట్నంలోని హిందుస్థాన్ షిప్యార్డ్ లిమిటెడ్ (హెచ్ఎస్ఎల్) స్వదేశీ పరిజ్ఞానంతో ఈ నౌకను రూపొందించి నిర్మించింది. విస్తృత స్థాయిలో ఔట్ఫిటింగ్, ట్రయల్స్ పూర్తిచేసిన అనంతరం జూలై 30న భారత నౌకాదళానికి అప్పగించారు. లోతైన సముద్రంలో డైవింగ్, నీటి అడుగున వివిధ రకాల కార్యకలాపాలకు సహకరించేలా నిపుణ్ను రూపొందించారు. ఆధునిక డైవింగ్ వ్యవస్థలు, నీటి అడుగున జోక్య సామర్థ్యాలతో పాటు అత్యవసర పరిస్థితుల్లో జలాంతర్గామి రక్షణ చర్యలకు కూడా ఈ నౌక కీలకంగా ఉపయోగపడనుంది. నావిగేషన్, ప్లాట్ఫాం నిర్వహణ, ఖచ్చితమైన స్థిర స్థాన నిర్వహణతో పాటు డైవింగ్, అండర్వాటర్ ఆపరేషన్లు, వైద్య సహాయానికి ప్రత్యేక సదుపాయాలు నిపుణ్లో ఉన్నాయి. స్వదేశీ నౌకా నిర్మాణ రంగం సాంకేతికంగా అభివృద్ధి చెందుతున్నదానికి నిపుణ్ మరో నిదర్శనంగా నిలుస్తుందని నేవీ పేర్కొంది. దీని చేరికతో భారత సముద్ర పరిధిలో ప్రత్యేక డైవింగ్, నీటి అడుగున కార్యకలాపాలను నిర్వహించే నౌకాదళ సామర్థ్యం మరింత బలోపేతం కానుంది.

# గోదావరి జలాలతో ఉత్తరాంధ్రకు కొత్త వెలుగు

(7వ పేజీ తరువాయి)

సమీక్ష నిర్వహించారు. కార్యక్రమానికి వచ్చే ప్రజలు, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమ నిర్వహణ, నీటి విడుదల ప్రాంతం, భద్రత, ప్రజల సౌకర్యాలు తదితర అంశాలపై హోం మంత్రి అధికారులకు పలు సూచనలు చేశారు. పోలవరం ఎడమ కాలువ ద్వారా నీటిని విడుదల చేయడం ఉత్తరాంధ్ర రైతాంగానికి ఎంతో మేలు చేసే చారిత్రాత్మక ఘట్టమని మంత్రి అనిత పేర్కొన్నారు. ఎన్నో సంవత్సరాలుగా రైతులు ఎదురుచూస్తున్న కల సాకారం కాబోతోం దన్నారు. పాయకరావుపేట నియోజకవర్గం లో సుమారు 35 వేల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఏర్పడుతుందని తెలిపారు. గోదావరి జలాల రాకతో ఉత్తరాంధ్రలో సాగు విస్తీర్ణం మరింత పెరగడంతో పాటు రైతులకు సాగునీటి భద్రత కలుగుతుంద న్నారు. ప్రస్తుతం సూపర్ ఎల్నినో వంటి వాతావరణ పరిస్థితులను ఎదుర్కొంటున్న నేపథ్యంలో సాగునీటి లభ్యత రైతాంగానికి ఎంతో ఊరటనిస్తుందని హోం మంత్రి తెలిపారు. పోలవరం ఎడమ కాలువ ద్వారా గోదావరి జలాలు అందుబాటులోకి వస్తే తాండవ, వరాహ, శారదా నదులకు కూడా నీటి లభ్యత పెరిగే పరిస్థితులు ఏర్పడతాయని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబుని 'అపర భగీరథుడు'గా అభివర్ణించిన అనిత.. ఎన్నో సంవత్సరాలుగా సాధ్యం కాని పనిని ఆయన సంకల్పంతో సాకారం చేస్తున్నారన్నారు. గోదావరి జలాలు ఉత్తరాంధ్ర పంట పొలాలకు చేరడం చరిత్రలో నిలిచిపోయే ఘట్టమని పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర ప్రజలు గోదావరి జలాలకు ఘన స్వాగతం పలకాలని ఆమె పిలుపునిచ్చారు.గోదావరి జలాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని హోం మంత్రి అనిత కోరారు. మంత్రితోపాటు జాయింట్ కలెక్టర్ శౌర్య మాన్ పటేల్,పోలవరం ఇరిగేషన్ ఎస్ ఈ ఏసుబాబు, అడురోడ్డు ఆర్డీవో రామలక్ష్మి, పాయకరావుపేట నియోజకవర్గం టిడిపి కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ , రాష్ట్ర పార్టీ నాయకులు గుర్రం రామకృష్ణ, మండల పార్టీ అధ్యక్షులు గింజల లక్ష్మణరావు, అమల కంటి అబద్దం, చింపెలపు పద్దుతో పాటు పలువురు పార్టీ నాయకులు రమా కుమారి, పెద్దిరెడ్డి చిట్టిబాబు ,వరహాలు తదితరులు ఉన్నారు.

# విశాఖ మేయర్ పీఠమే లక్ష్యం!

(7వ పేజీ తరువాయి)

అసెంబ్లీ నియోజకవర్గాల సమన్వయకర్తలు, మాజీ కార్పొరేటర్లు, ముఖ్య నాయకులతో జగన్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రానున్న ఎన్నికల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహం, క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితి, నాయకులు-- కార్యకర్తల మధ్య సమన్వయం, స్థానిక సమస్యలపై ప్రజల్లోకి వెళ్లే విధానంపై చర్చించినట్లు సమాచారం.

విశాఖ నగరంలో పార్టీకి ఉన్న పాత బలాన్ని తిరిగి సమీకరించుకోవాల్సిన అవసరాన్ని జగన్ నాయకులకు వివరించినట్లు తెలుస్తోంది. ఎన్నికల సమయంలో మాత్రమే ప్రజల్లోకి వెళ్లకుండా ఇప్పటి నుంచే ప్రతి డివిజన్లో పార్టీ శ్రేణులు చురుకుగా పనిచేయాలని, స్థానిక సమస్యలను గుర్తించి వాటిపై ప్రజల తరఫున పోరాడాలని సూచించినట్లు సమాచారం.

**అభ్యర్థి ఎవరైనా.. గెలుపే లక్ష్యం..**

మేయర్ పదవికి పార్టీ తరఫున ఎవరిని బరిలోకి దింపినా, అభ్యర్థి విషయంలో నాయకులు, కార్యకర్తలు సమష్టి నిర్ణయంతో ముందుకు సాగాలని జగన్ స్పష్టం చేసినట్లు తెలిసింది. వ్యక్తిగత అభిప్రాయాలు, అంతర్గత విభేదాలు పార్టీ విజయానికి అడ్డంకిగా మారకుండా ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని సూచించినట్లు సమాచారం. మాజీ కార్పొరేటర్లు తమకు ఉన్న స్థానిక పరిచయాలు, ప్రజలతో ఉన్న సంబంధాలను ఉపయోగించుకుని పార్టీకి అనుకూల వాతావరణాన్ని ఏర్పరచాలని, నియోజకవర్గాల సమన్వయకర్తలు నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయానికి వారధిగా వ్యవహరించాలని చెప్పినట్లు తెలుస్తోంది.

**డివిజన్ స్థాయి నుంచి పునర్వ్యవస్థీకరణ..**

జీవీఎంసీ ఎన్నికల్లో ప్రతి డివిజన్ కీలకమని, ఒక డివిజన్లో వచ్చిన ఫలితం మొత్తం మేయర్ ఎన్నికలపై ప్రభావం చూపే అవకాశం ఉన్నందున క్షేత్రస్థాయి వ్యవస్థను పటిష్టం చేయాలని జగన్ సూచించినట్లు సమాచారం. డివిజన్ల వారీగా పార్టీ బలాబలాలను అంచనా వేసి, బలహీనంగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి పెట్టాలని నాయకులకు సూచించినట్లు తెలిసింది. స్థానిక సమస్యలు, మౌలిక వసతుల లోపాలు, తాగునీరు, రహదారులు, పారిశు ధ్యం, డ్రైనేజీ, ట్రాఫిక్ తదితర ప్రజా సమస్యలను గుర్తించి వాటిపై ప్రజలతో కలిసి పోరాటాలు నిర్వహించాలని పార్టీ శ్రేణులకు సూచించినట్లు సమాచారం.

**నేతల మధ్య సమన్వయానికి ప్రాధాన్యం**

విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల పరిధిలోని జీవీఎంసీ ప్రాంతాల్లో పార్టీకి చెందిన వివిధ స్థాయి నాయకుల మధ్య సమన్వయం మరింత పెరగాలని సమావేశంలో చర్చించినట్లు తెలుస్తోంది. అసెంబ్లీ నియోజకవర్గాల సమన్వయకర్తలు, మాజీ కార్పొరేటర్లు, పార్టీ ముఖ్య నాయకులు కలిసి పనిచేస్తేనే మేయర్ పీఠాన్ని దక్కించుకునే అవకాశం ఉంటుందని జగన్ పేర్కొన్నట్లు సమాచారం. ఎన్నికల సమయంలో టికెట్ కోసం పోటీ సహజమే అయినప్పటికీ, అభ్యర్థిత్వం ఖరారైన తర్వాత అందరూ ఒకే లక్ష్యంతో పనిచేయాలని, పార్టీ అభ్యర్థి విజయానికి ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని సూచించినట్లు తెలుస్తోంది.

**విశాఖపై ప్రత్యేక దృష్టి..**

రాష్ట్ర రాజకీయాల్లో విశాఖపట్నానికి ఉన్న ప్రాధాన్యత దృష్ట్యా జీవీఎంసీ ఎన్నికలను పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నట్లు సమావేశం ద్వారా స్పష్టమవుతోంది. నగరంలోని అన్ని నియోజకవర్గాల్లో పార్టీ శ్రేణులను సమన్వయం చేసి, ప్రజల్లో పార్టీకి ఉన్న మద్దతును మరింత బలోపేతం చేయడంపై నాయకత్వం దృష్టి సారించినట్లు సమాచారం.

మొత్తంగా జీవీఎంసీ ఎన్నికల్లో మేయర్ పీఠాన్ని లక్ష్యంగా పెట్టుకుని ఇప్పటి నుంచే పార్టీ యంత్రాంగాన్ని సిద్ధం చేయాలని జగన్ ఇచ్చిన దిశానిర్దేశం వైఎస్సార్సీపీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపినట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. అభ్యర్థి ఎవరైనా సరే పార్టీ గెలుపు కోసం అందరూ సమన్వయంతో ముందుకు సాగాలన్న సందేశం సమావేశంలో ప్రధానంగా నిలిచింది.

### పెందుర్తి కూటమిలో ముదురుతున్న విభేదాలు..

# ఎమ్మెల్యే పంచకర్లను నిలదీసిన టీడీపీ నేతలు





విశాఖపట్నం, ఆగష్టు 25, ప్రభాతవార్త:

పెందుర్తి నియోజకవర్గంలో కూటమి పార్టీల మధ్య విభేదాలు మరోసారి బహిర్గతమ య్యాయి. మిత్రపక్షాలైన టీడీపీ, జనసేన నేతలు, కార్యకర్తల మధ్య నెలకొన్న విభేదాలు రోజురోజుకూ ముదురుతున్నాయనే సంకే తాలు తాజాగా చోటుచేసుకున్న పరిణామా లతో స్పష్టమవుతున్నాయి.

జీవీఎంసీ 88వ వార్డు పరిధిలోని మంగళ వారం నరవలో అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా శంకుస్థాపన కార్యక్రమానికి జన సేన పార్టీకి చెందిన పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానిక టీడీపీ నేతలు ఎమ్మెల్యేను నిలదీశారు. నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ తమకు కనీస సమాచారం ఇవ్వడం లేదంటూ ప్రశ్నించారు.

"కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పుడు మాకు సమాచారం ఎందుకు ఇవ్వడం లేదు?" అంటూ టీడీపీ నేతలు ఎమ్మెల్యేను ప్రశ్నించడంతో అక్కడ కొంతసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. టీడీపీ, జనసేన కార్య కర్తల మధ్య మాటామాటా పెరిగి అరుపులు, కేకలతో వాగ్వాదానికి దారితీసినట్లు సమాచారం.

**ఒకరోజు ముందే సఖ్యతపై ఎమ్మెల్యే హెచ్చరికలు..**

ఇదిలా ఉండగా, ఈ ఘటనకు ఒకరోజు ముందే జనసేన కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే పంచకర్ల రమేష్బాబు కీలక వ్యాఖ్యలు చేశారు. మిత్రపక్షమైన టీడీపీతో ఎలాంటి విభేదాలు లేకుండా సఖ్యతతో ముందుకు సాగాలని పార్టీ శ్రేణులకు సూచించారు. కూటమి పార్టీల మధ్య సమన్వయం దెబ్బతినేలా ఎవరైనా వ్యవహరిస్తే చర్యలు తప్పవని, అవసరమైతే సస్పెండ్ చేయడానికైనా వెనుకాడబోమని హెచ్చరించినట్లు సమాచారం.

అయితే, మరుసటి రోజే టీడీపీ, జనసేన శ్రేణుల మధ్య బహిరంగంగా వాగ్వాదం చోటుచేసుకోవడం చర్చనీయాంశంగా మారింది. అంతేకాకుండా కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యేను సైతం టీడీపీ నేతలు నిలదీయడంతో కూటమిలో అంతర్గత విభేదాలు ఏ స్థాయిలో ఉన్నాయనే చర్చ నియోజకవర్గంలో మొదలైంది.

**సమన్వయం మాటల్లోనేనా?**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మిత్రపక్షాల మధ్య సమన్వయంతో పనిచేయాలని అధిష్ఠానం పదేపదే సూచిస్తున్నప్పటికీ, పెందుర్తిలో మాత్రం పరిస్థితులు అందుకు భిన్నంగా కనిపిస్తున్నాయి. స్థానిక స్థాయిలో కార్య క్రమాల నిర్వహణ, సమాచారం ఇవ్వడం, రాజకీయ ప్రాధాన్యత వంటి అంశాలు టీడీపీ-జనసేన శ్రేణుల మధ్య విభేదాలకు కారణమవుతున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తాజా పరిణామాలతో పెందుర్తి నియోజకవర్గంలో కూటమి నేతల మధ్య నెలకొన్న విభేదాలు నాలుగు గోడల మధ్య నుంచి బహిరంగ వేదికలపైకి వచ్చాయా? అనే చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది. ఈ విభేదాలకు అధిష్ఠానం ఎలా చెక్ పెడుతుందన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

### అభివృద్ధి పనుల్లో అవినీతి లేదని నిరూపిస్తారా..

# లేకపోతే ప్రజాక్షేత్రంలో తేల్చుకునేందుకు సిద్ధం

(7వ పేజీ తరువాయి)

దీనిపైనా విచారణ జరపాలని కోరారు. విచారణలో ఎవరైనా తప్పు చేసినట్లు గుర్తిస్తే బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని, ఆరోపణలు నిరాధారమని తేలితే రాజకీ యంగా బాధ్యత వహించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని రామకృష్ణ పేర్కొన్నారు. పాయకరావుపేట నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో అవినీతి జరగలేదని మేము అభివృద్ధి చేస్తున్నా మని నిరూపించేందుకు టిడిపి నాయకులు సిద్ధమైతే ప్రజాక్షేత్రంలో నిలబడేందుకు సిద్ధంగా ఉన్నామని రామకృష్ణ అన్నారు. పాయకరావుపేట నియోజకవర్గం లో పోలవరం కాలువ మట్టిని యథేచ్ఛగా అమ్ముకుం టున్నారని, ఈ విషయం అందరికీ తెలుసు అని దీనిపై సమగ్ర విచారణ జరిపిస్తే వాస్తవాలను తెలియజేయ డానికి సిద్ధంగా ఉన్నామని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ అన్నారు.

నియోజకవర్గం నక్కపల్లి మండలంలో పోలవరం ఎడమ కాలువ కోసం తవ్వుతున్న వందలాది టన్నుల గ్రావెల్ని కొంతమంది నాయకులు అక్రమంగా లే-అవుట్లకు అమ్ముకుంటున్నారని ఇది నగ్నసత్యం అని చెప్పారు. నక్కపల్లి మండలంలో ఉన్న కొండలను కూడా వదిలిపెట్టడం లేదని, నక్కపల్లి పోలీసులు అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న లారీలను పట్టుకున్నారని ఈ విషయం కూడా తెలిసి మాట్లాడటం విడ్డూరంగా ఉందని అన్నారు. ఆ లారీలు ఎవరివి తవ్వుకుంటున్న నాయకులు ఎవరు అనే విషయాలపై విచారణ చేసి ప్రభుత్వ ఆస్తులను కాపాడాలని రామకృష్ణ కోరారు. పోలవరం కాలువ గ్రావెల్ అక్రమంగా తరలింపు వ్యవహారాన్ని రాష్ట్ర, జిల్లా వైస్సార్సీపీ నాయకుల దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని, ప్రభుత్వం స్పందించకపోతే భవిష్యత్తులో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. మండలంలోని పెద్ద బోధి గల్లం వద్ద ఉన్న ఆర్ అండ్ ఆర్ కాలనీలో నిర్మాణంలో ఉన్న వాటర్ ట్యాంక్ స్లాబ్ కూలడంపై సమగ్రమైన విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఆర్ఆర్ కాలనీలో నిర్మించిన వాటర్ ట్యాంక్ స్లాబ్ కూలిన ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని వైసీపీ నేత వీసం రామకృష్ణ డిమాండ్ చేశారు. నిర్మా ణంలో నాణ్యతా ప్రమాణాలు కాంట్రాక్టర్ తో సహా అధికారులు నిరంతర పర్యవేక్షణ లేకపోవడం పుచ్చి పోయిన కర్రలను సెంట్రింగ్కి వాడడం కనీస నిబంధన లు పాటించకపోవడం, అధికారుల పర్యవేక్షణ లేకపో వడం వల్లే స్లాబ్ కూలిపోయిందని ఆయన ఆరోపిం చారు. మండలంలో జరిగే ప్రతి అభివృద్ధి కార్యక్రమాన్ని ప్రతిపక్ష పార్టీగా ప్రశ్నించే హక్కు వైసీపీకి ఉందన్నారు. వాటర్ ట్యాంక్ నిర్మాణానికి సంబంధించి కాంట్రాక్టర్ ఎవరు తాను ఏ విధంగా పనులు చేపట్టారు అనేది తెలియచేయాలని కోరారు. నిర్మాణానికి సంబంధించి డీఈ, ఏఈల అనుమతులు ఉన్నాయా? నిబంధనల ప్రకారం నిర్మాణం జరిగిందా? నిరంతరం వారి పర్య వేక్షణ ఉందా అనే విషయాలను అధికారులు తక్షణమే ప్రజలకు వెల్లడించాలని కోరారు. స్లాబ్ కూలిపోయిన సందర్భంలో స్థలానికి ఎవరు వచ్చారు అందరికీ తెలుసు అని వారు పూర్తిస్థాయిలో చూశారని వారిని అడిగితే నాణ్యత ప్రమాణాలు ఎలా ఉన్నాయో చెబుతారని చెప్పారు.వాటర్ ట్యాంక్ నిర్మాణంలో నాసిరకం కలపను ఉపయోగించారని, ఇసుక, పిక్క, సిమెంట్ తదితర నిర్మాణ సామగ్రి నాణ్యతను ఇంజనీరింగ్ అధికారులు పరిశీలించారా అని ప్రశ్నించారు. క్వాలిటీ కంట్రోల్ సిబ్బంది, సంబంధిత అధికారులు నిర్మాణ సమయంలో పర్యవేక్షణ చేశారా అనే అంశంపై కూడా విచారణ జరపాలని డిమాండ్ చేశారు. 30 అడుగుల వాటర్ ట్యాంకు రెండు లక్షల పైబడి లీటర్ల సామర్థ్యం కలిగినది అటువంటి ఈ ట్యాంక్ విషయంలో డీఈలు, ఏఈలు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి నిర్మాణ పనులను పర్యవేక్షిం చాల్సి ఉండగా, దూర ప్రాంతాల్లో పనిచేసే అధికారు లను ఇన్చార్జిలుగా ఉంచడం వల్ల పర్యవేక్షణ ఎలా సాధ్యమవుతుందని రామకృష్ణ ప్రశ్నించారు. సంఘటన జరిగి నాలుగు రోజులు గడుస్తున్నా కాంట్రాక్టర్పై పైన ఎలాంటి చర్యలు తీసుకున్నారు ఇంతవరకు వెల్లడించలేదని అన్నారు. ఆ కాంట్రాక్టర్కు లైసెన్స్ రద్దు చేశారా? సంబంధిత అధికారులపై చర్యలు తీసుకున్నారా? అనే వివరాలను ప్రజలకు వెల్లడించాలని కోరారు. ఎస్ రాయవరం మండలం పిట్టగోళ్ళపల్లిలో వాటర్ ట్యాంక్ లీకేజ్ జరిగిందని డి ఈ ని సస్పెండ్ చేసిన అధికారులు నాలుగు రోజులు అవుతున్న ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు.

ఈ వ్యవహారంలో విచారణకు మేము వస్తాం, అందరం కూర్చుని చర్చిద్దాం లేదా బహిరంగ విచారణ చేయించండి అని రామకృష్ణ అన్నారు. ప్రజా సమస్యలపై వైసీపీ నిరంతరం పోరాడుతుందని, ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని రామకృష్ణ అన్నారు. స్థానిక ఎన్నికలకు భయపడే ప్రసక్తే లేదని ప్రజలకు అన్ని విషయాలు తెలుసని వారే తీర్పు చెప్తారని ఎవరు సందేహ పడాల్సిన అవసరం లేదని రామకృష్ణ అన్నారు. ఈ సమావేశంలో మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గొర్ల గోవిందరావు, మాజీ సర్పంచ్ తల్లా భార్గవ్, మాజీ వార్డు సభ్యులు అల్లాడ కొండబాబు తదితరులు ఉన్నారు.

# కార్పొరేషన్ ఎన్నికల్లో కూటమిదే విజయం

(7వ పేజీ తరువాయి)

మండలాల్లోని 79 గ్రామ పంచాయతీల గ్రామ సభలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేస్తుందన్నారు. భీమిలి నియోజకవర్గానికి చెందిన 3 మండలాలు విలీన నిర్ణయాన్ని లేఖ రూపంలో ఇచ్చినట్టు ఆయన పేర్కొన్నారు. భోగాపురం మండలాన్ని జీవీఎంసీలో కలపాలన్న ప్రతిపాదన కోసం నెల్లిమర్ల ఎమ్మెల్యే మాధవి తదితర నాయకులతో చర్చించనున్నట్టు ఆయన తెలిపారు. భోగాపురం జీవీఎంసీలో కలిస్తే బాగుంటుందనేది తన వ్యక్తిగత అభిప్రాయమని చెప్పారు. గంట కుమారుడు రవితేజ మేయర్ రేసులో ఉన్నారా అని మీడియా ప్రశ్నించగా.. నేను పోటీ చేయవద్దా? అని సరదాగా వ్యాఖ్యానించారు. అభ్యర్థి ఎంపికకు ఇంకా చాలా సమయముందని, మేయర్ అభ్యర్థి నిర్ణయాన్ని అధిష్టానం చూసుకుంటుందన్నారు. ప్రభుత్వం నిర్దేశించుకున్న లక్ష్యానికి మించి డేటా సెంటర్ల ప్రతిపాదనలు వచ్చినా అంగీకరించేది లేదని మంత్రి నారా లోకేష్ ఇప్పటికే స్పష్టం చేశారని తెలిపారు. డేటా సెంటర్లకు అవసరమైన నీరు, విద్యుత్తు కోసం ప్రభుత్వ ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తుందన్నారు. విశాఖ మేయర్ ఎన్నికల్లో తెలుగుదేశం కూటమి నాయకులు సమిష్టిగా పనిచేసే ఎట్టి పరిస్థితుల్లో మేయర్ స్థానంలో కూటమి అభ్యర్థి ఆసీనులవుతారని ఆయన అన్నారు.

# విశాఖ మేయర్ టిక్కెట్కై.. 'కూటమి'లో పోటా పోటీ!

(7వ పేజీ తరువాయి)

నిలిచే అవకాశాలున్నాయి. బిజెపి నుంచి ఆడారి ఆనంద్ గట్టి పోటీ ఇచ్చే అవకాశాలు న్నాయి. బిజెపి నుంచి గట్టిగానే ప్రయత్నలు చేస్తున్నట్టు తెలుస్తుంది. అవసరమైతే కేంద్ర పెద్దల నుంచి కూడా రాష్ట్ర అధిష్టానంపై ఒత్తిడి పెంచేలా పరిస్థితులు మారనున్నట్టు సమాచారం. ఆనంద్కు ఆర్థికంగా ఇబ్బందులు లేవన్న సమాచారం. విశాఖ డైరీ దివంగత చైర్మన్ తులసీరావు తనయుడు కావడం ఆడారికి అదనపు అర్హతగా ఉంది. పెందుర్తి, అనకాపల్లి రూరల్ ప్రాంతాలన్నీ ఆనంద్ వెనుక నిలిచే అవకాశాలున్నాయి. గవర కమ?యనిటీ ఆడారి వెనక నిలిచే పరిస్తితి కనిపిస్తోంది. వైసీపీ నుంచి బిజెపికి పార్టీకి మారడంతో వైసీపీ నేతలతో మంచి సంబందాలు ఉన్నాయి. కూటమితో పాటు వైసీపీ కూడా కొంత మేరకు ఆడారికి పనిచేసే అవకాశాలున్నట్టు తెలుస్తుంది. శాసనసభ్యులు గణబాబు తనయుడు మౌర్య కూడా మేయర్ రేసులో ఉన్నట్టు సమాచారం. ఎంబిఏ పూర్తి చేసిన మౌర్య రాజకీయాల్లో చురుకుగా పాల్గోనడం, తండ్రి ఎన్నికల్లో విశేషమైన రాజకీయ అనుభవం కలిగిఉన్నారు. గవర సామాజిక వర్గం ఇటు పశ్చిమ నియోజక వర్గంతో పాటు అనకాపల్లి నియోజకవర్గం కూడా దన్నుగా నిలిచే అవకాశాలున్నాయి.

# ఏయూ విద్యార్థులకు మూడు క్రీడామైదానాలు, జిమ్నాజియంలు అభివృద్ధి చేయాలి

(7వ పేజీ తరువాయి)

మాట్లాడుతూ క్రీడల్లో పాల్గొనే విధంగా జిమ్నాజియంలు తోపాటు మౌళిక సదుపాయాలు కల్పించాల న్నారు. శతాబ్ది ఉత్సవాలు కంటిన్యూ చేస్తూ క్యాంపస్లో క్రీడలు నిర్వహించాలని, ఎఫిలియేషన్ కళాశాలలు,క్యాంపస్ ఫ్యాకల్టీ, నాన్ టీచింగ్ ఉద్యోగులుకు క్రీడలు నిర్వహించాలని డైరెక్టర్ ఆచార్య ఎన్. విజయమోహన్కు తెలియజేసారు. నూతన క్రీడామైధానాలు అభివృద్ధి చేసేందుకు క్యాంపస్లో స్థలం వినియోగించుకోవాలన్నారు. ప్రతిభ సాదించిన కారులకు నగదు అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఏయూ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి ఆచార్య ఎన్ విజయమోహన్ మాట్లాడుతూ ఇంజనీరింగ్, సైన్స్ అండ్ టెక్నాలజీ, న్యాయ కళాశాల, ఆర్ట్స్ కళాశాల తదితర కళాశాలల విద్యార్థులకు క్రీడలు నిర్వహించే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. సౌత్ ఇండియా యూనివర్శిటీ, ఆల్ ఇండియా యూనివర్శిటి క్రీడల్లో ప్రతిభ సాధించిన క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్, టీఏ, డి.ఎ ఇచ్చి క్రీడల్లో పాల్గొనే విధంగా ఏర్పాట్లు చేసామన్నారు. యూనివర్శిటి క్రీడలకు 80 క్రీడాంశాల్లో మహిళలు, పురుషుల విభాగంలో పాల్గొంటున్నారన్నారు. ఈ సమావేశంలో స్పోర్ట్స్ బోర్డులో 2026-27 క్రీడా బడ్జెట్ ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా హాజరైన ఫిజికల్ డైరెక్టర్లు, ప్రిన్సిపల్ను ఎఫిలియేషన్ కళాశాలలో క్రీడా సదుపాయాలు కల్పనపై అడిగి వీసీ తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్, స్పోర్ట్స్ బోర్డు కోశాధికారి, ఆచార్య కె.రాంబాబు, వ్యాయామ విద్యా విభాగం హెడ్ ఆచార్య ఎ.పల్లవి. డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల పిడి డాక్టర్ బి.ఆర్.ఎస్.ఎల్ లక్ష్మణరెడ్డి, ఐఐపీఈ స్పోర్ట్స్ కోఆర్డినేటర్ డాక్టర్ జి.వెంకటేశ్వరరావు, జి.వి.పి కొమ్మాది, పి.డి ఎన్. మంగళగౌరీ, ఎవి ఎన్ కళాశాల వ్యాయామ విద్యా విభాగం పి.డి డాక్టర్ ఎస్. గోపీకృష్ణ, అరకు గవర్నమెంట్ డిగ్రీ కళాశా పి డి ఎస్. అప్పారావు, పీడీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ సుడిగాలి పర్యటన

(7వ పేజీ తరువాయి)

డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం శేషుకొండ కాలనీ, కొక్కిరాపల్లి, రాంనగర్, పెద్దపల్లి రోడ్డు గాంధీనగరం ప్రాంతాలలో నిర్మిస్తున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. అధికారులతో పనులను పూర్తిస్థాయిలో పర్యవేక్షించాలని ఎక్కడ ఎటువంటి లోపాలు లేకుండా నిర్మాణాలు చేపట్టాలని ఆదేశించారు. ఏదైనా సమస్య వచ్చిన లోపాలు గుర్తించిన తీవ్రమైన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. అనంతరం మున్సిపాలిటీలోని ప్రభుత్వం నుండి సుమారు 50 కోట్లు నిధులు మంజూరయ్యాయని ఈ నిధులతో ఎక్కడైనా కాలువలు కానీ రోడ్లు కానీ వేయకుండా ఉన్నచోట వెంటనే పనులను చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు ఊటకూటి రమేష్ నాయుడు, కొటారి శ్రీనివాసరావు, పిట్టా శ్రీనివాసరావు,లంక ఉదయ్ కుమార్, మున్సిపల్ ఏ ఈ నానాజీ, శానిటేషన్ అధికారి పల్లా శ్రీనివాసరావు,మున్సిపల్ అధికారులు జనసేన నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టణంలో గల ప్రజలు స్వయంగా ఎమ్మెల్యే క్షేత్రస్థాయిలో పర్యటించి పనులను పర్యవేక్షించడం పట్ల తమ సంతోషాన్ని వ్యక్తపరిచారు.

# సమ్మెను తాత్కాలికంగా విరమించిన జూడాలు

(7వ పేజీ తరువాయి)

పేర్కొన్నారు. రెండు వారాల లోగా మా మూడు ప్రధాన డిమాండ్ లను ప్రభుత్వం పరిష్కారించని పక్షంలోమళ్ళీ తదుపరి కార్యాచరణ ను రూపొందిస్తామని వారు తెలిపారు.సమ్మె విరమణ నేపథ్యంలోగత 15 రోజులు గా సమ్మె చేస్తున్న రాష్ట్రము లోని అన్ని వైద్య కళాశాల ల పరిధిలోని అన్ని భోధనాసుపాత్రులలోనూ జూనియర్ వైద్యులు గురువారం నుంచి యధావిధిగా విధులకు హాజరు కానున్నారు.

vsp9:vsp9.qxd 25-08-2026 21:34 Page 1






## ఆదివాసీ గిరిజనులకు ఐటిడిఏ ఆర్థిక భరోసా : కిడారి

**పాడేరు,ఆగస్టు25,(ప్రభాతవార్త):**



అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు మండలం, గుత్తులపుట్టు పంచాయతీ సంతబయలులో ఐటిడిఏ నిధులతో ఏర్పాటు చేసిన ఆదివాసీ కిరాణా జనరల్ స్టోర్‌ను కిల్లో రాజేశ్వరి ఆహ్వానం మేరకు రాష్ట్ర గిరిజన సహకార సంస్థ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా కిడారి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ, గిరిజన ప్రాంతాల్లో స్థానిక ప్రజలకు నిత్యావసర సరుకులు అందుబాటులో ఉండటంతో పాటు, గిరిజనులకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఇటువంటి దుకాణాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. గిరిజనుల ఆర్థిక స్వావలంబన, జీవనోపాధి మెరుగుదలకు ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.గిరిజన ప్రాంతాల్లో స్థాని కంగా వ్యాపార అవకాశాలను ప్రోత్సహించడం ద్వారా కుటుంబాల ఆదాయం పెరగడంతో పాటు, గ్రామీణ ప్రాంత ప్రజలకు నిత్యావసర వస్తువులు సులభంగా అందుబాటులోకి వస్తాయని ఆయన పేర్కొన్నారు. మాజీ సర్పంచులు, ఏఎంసి వైస్ చైర్మన్ జ్ఞాన ప్రకాశ్, ఎంపీటిసి కొమ్మురామ, బకురు వెంకట రమణ రాజు, శశి భూషణ్ నాయుడు, రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి సుబ్బారావు, టీడీపీ నాయకులు కంబిడి రాంబాబు, త్రినాథ్, మహేష్, అచ్చిబాబు, శంకరరావు, మండ్యగురు స్వామి, జక్కయ్య, కోడ రాంబాబు, అశోక్ పెదబయలు మహిళా అధ్యక్షురాలు మహేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక రంగాల అభివృద్ధిపై కలెక్టర్ సమీక్ష

**పాడేరు,ఆగస్టు25,(ప్రభాతవార్త):**



జిల్లాలో వ్యవసాయం, ఉద్యానవనం, పశుసంవర్ధకం, కాఫీ, మత్స్య, ఏపీసీఎన్ యాఫ్, సీరికల్చర్, ఏపీఎంఐపీ తదితర ప్రాథమిక రంగాల అభివృద్ధి, అమలులో ఉన్న ప్రభుత్వ సంక్షేమ పథకాల పురోగతిపై జిల్లా కలెక్టర్ టి. నిశాంతి మంగళవారం కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రాథమిక రంగాలకు సంబంధించి అమలవుతున్న వివిధ ప్రభుత్వ పథకాల ద్వారా రైతులు, లబ్ధిదారులకు అందుతున్న ప్రయోజనాలపై శాఖల వారీగా సమీక్షించారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై అధికారులతో చర్చించారు.ప్రభుత్వ పథకాల అమలులో సాంకేతిక, పరిపాలనాపరమైన సమస్యలను గుర్తించి, వాటిని తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు సమయానుకూలంగా, పారదర్శకంగా అందేలా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.ప్రాథమిక రంగాలను మరింత బలోపేతం చేసేందుకు శాఖల వారీగా కార్యాచరణ రూపొందించి, క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని కలెక్టర్ సూచించారు. రైతులు, లబ్ధిదారులకు పథకాలపై పూర్తి అవగాహన కల్పిస్తూ, వారికి అందాల్సిన ప్రయోజనాలు ఎలాంటి జాప్యం లేకుండా అందేలా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎస్.బి. నంద్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి బి. కర్ణ, జిల్లా సీరికల్చర్ అధికారి రాజేంద్ర ప్రసాద్ బాబు, కాఫీ బోర్డు ఏ.డి. ఆయంత్, పశు సంవర్ధక శాఖ అధికారి కరుణాకర్, మత్స్య శాఖ అధికారి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి, సైబర్ నేరాలపై అవగాహన ర్యాలీ

**పాడేరు,ఆగస్టు25,(ప్రభాతవార్త):**



గంజాయి రవాణా, వినియోగం అరికట్టడం, పెరుగుతున్న సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు అల్లూరి సీతారామరాజు జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ మంగళవారం నిర్వహిం చారు."గంజాయి జోలికి పోవద్దు – వ్యసనంగా మారవద్దు – "సే నో టు గాంజాక్ అనే నినాదంతో నిర్వహిం చిన ఈ ర్యాలీలో యువత గంజాయికి దూరంగా ఉండాలని, గంజాయి సేవించడం, కలిగి ఉండడం, రవాణా చేయడం ఎం డి పి ఎస్ చట్టం ప్రకారం నేరమని, 20 సంవత్సరాల వరకు జైలు శిక్ష మరియు జరిమానా విధించబడుతుందని పోలీసు అధికారులు హెచ్చరించారు. అదేవిధంగా సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, గుర్తు తెలియని వ్యక్తుల నుండి వచ్చే లింకులను క్లిక్ చేయవద్దని,ఓటిపిలు, బ్యాంక్ వివరాలను ఎవరికీ చెప్పవద్దని, ఆన్లైన్ ఉద్యోగాలు, పెట్టుబడుల పేరుతో మోసపోకుండా ఉండాలని సూచించారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే ళి1930ళి నంబర్ కు కాల్ చేయాలని, ఫిర్యాదు చేయాలని, అలాగే గంజాయి సంబంధిత సమాచారం తెలిస్తే 1972 కు తెలియజేయాలని కోరారు.ర్యాలీలో అల్లూరి జిల్లా అదనపు ఎస్పీ, అడ్మిన్ వై. శృతి,ఎస్ డి పి అష్రఫ్ అలీ, రంపచోడవరం సబ్ డివిజన్ ఎస్ డి పి ఓసిహెచ్. తిరుపతి రావు, చింతపల్లి సబ్ డివిజన్ ఎస్‌డిపిఓ పాడేరు సబ్ డివిజన్ ఎస్ డి పి ఓవి. రాజ సింహా రెడ్డి, జిల్లాలోని అన్ని సర్కిళ్ల ఇన్స్పెక్టర్లు, సబ్‌ఇన్స్పెక్టర్లు , సిబ్బంది పాల్గొన్నారు.గంజాయి రహిత జిల్లాగా, సైబర్ నేర రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రజలందరూ పోలీసు శాఖకు సహకరించాలని ఈ సందర్భంగా అధికారులు విజ్ఞప్తి చేశారు.

## జాతీయ రహదారి మట్టితో తగ్గిన నీటి సామర్థ్యం.. నివేదిక ఆధారంగా చర్యలు

**గూడెంకొత్తవీధి, ఆగస్టు 25, ప్రభాతవార్త :**



జాతీయ రహదారి నిర్మాణం కారణంగా భారీగా మట్టి పేరుకుపోయి నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోయిన పెదవలస పెద్ద చెరువును ఇరిగేషన్ శాఖ మండల జూనియర్ ఇంజనీర్ నాగరాణి మంగళవారం పరిశీలించారు. ఈ నెల 3న నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో గ్రామస్తులు చెరువు సమస్యను ప్రధాన సమస్యగా అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. జాతీయ రహదారి నిర్మాణ సమయంలో చెరువులోకి భారీగా మట్టి చేరడంతో చెరువు లోతు తగ్గి , నీటి నిల్వ సామర్థ్యం గణనీయంగా పడిపోయిందని తెలిపారు. చెరువులో పేరుకుపోయిన పూడికను తొలగించడంతో పాటు నీటిని నిల్వ చేసుకునేందుకు అవసరమైన చోట డయాఫ్రం వాల్ లేదా అనకట్టు నిర్మించాలని కోరుతూ ఎంపీడీవోకు గ్రామస్తులు వినతిపత్రం సమర్పించారు. గ్రామస్తుల వినతిపై స్పందించిన ఇరిగేషన్ శాఖ అధికారులు చెరువు పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జేఈ నాగరాణి చెరువు విస్తీర్ణం, ప్రస్తుత పరిస్థితి, పూడిక పేరుకుపోయిన ప్రాంతాలను పరిశీలించారు. రెవెన్యూ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుని చెరువు విస్తీర్ణాన్ని పూర్తిస్థాయిలో పరిశీలించిన అనంతరం అవసరమైన మరమ్మతులు, అభివృద్ధి పనులు చేపట్టాల్సిన ప్రాంతాలపై నివేదిక సిద్ధం చేస్తామని గ్రామస్తులకు తెలిపారు. అలాగే జాతీయ రహదారి నిర్మాణం వల్ల చెరువులోకి చేరిన మట్టిని తొలగించి నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచేలా చర్యలు తీసుకునేందుకు ఉన్నతాధికారులకు నివేదిక సమర్పిస్తామని ఆమె వివరించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ చెరువులో పూడిక తొలగించి నీటి నిల్వ సామర్థ్యాన్ని , వర్షాకాలంలో నీటిని సమృద్ధిగా నిల్వ చేసుకోవచ్చని తెలిపారు. తద్వారా ఏడాది పొడవునా వ్యవసాయానికి నీటి సౌకర్యం అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. పెదవలస గ్రామానికి వ్యవసాయపరంగా ఎంతో కీలకమైన ఈ పెద్ద చెరువును పునరుద్ధరించి, పూర్తి స్థాయిలో నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచేలా సంబంధిత శాఖలు సమన్వయంతో చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ ప్రభంజనం కొనసాగిస్తాం

**గూడెంకొత్తవీధి, ఆగస్టు 25, ప్రభాతవార్త :**




పాడేరు నియోజకవర్గంలోని గూడెంకొత్తవీధి మండలంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పాడేరు ఎమ్మెల్యే, అల్లూరి జిల్లా వైసీపీ అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు సారథ్యంలో సర్పంచ్, ఎంపీపీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాల్లో శతశాతం విజయం సాధిస్తామని రాష్ట్ర వైసీపీ పంచాయతీరాజ్ విభాగం కార్యదర్శి బొబ్బిలి లక్ష్మణ్ తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను గిరిజనులు ఇప్పటికీ గుర్తు పెట్టుకున్నారని పేర్కొన్నారు. పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు నాయకత్వంలో నియోజకవర్గంలో వైసీపీ ప్రభంజనం కొనసాగుతుందని, గత రెండు ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పే ఇందుకు నిదర్శనమని తెలిపారు. అదే ప్రభంజనాన్ని రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కొనసాగించి అన్ని స్థానాల్లో వైసీపీ అభ్యర్థులను గెలిపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. వైసీపీ శ్రేణులన్నీ ఐక్యంగా, కలిసికట్టుగా పనిచేసి అన్ని స్థానాల్లో విజయం సాధించి వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి, పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజుకు విజయాన్ని కానుకగా అందించాలని బొబ్బిలి లక్ష్మణ్ పిలుపునిచ్చారు.

## రీ-సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలి : కలెక్టర్

**పాడేరు,ఆగస్టు 25,(ప్రభాతవార్త):**



భూముల రీ-సర్వే ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ సమస్యలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అల్లూరి సీతారామరాజు కలెక్టర్ టి.నిశాంతి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ ఛాంబర్ నుంచి రాష్ట్ర స్థాయి రెవెన్యూ అధికారులు నిర్వహించిన వర్చువల్ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో రెవెన్యూ శాఖకు సంబంధించిన అంశాలపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రజలకు రెవెన్యూ సేవలను మరింత పారదర్శకంగా, జవాబు దారీతనంతో, నిర్ణీత సమయంలో అందించేందుకు అధికార యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తోం దన్నారు.జిల్లాలోని మొత్తం 1,400 గ్రామాల్లో మూడు విడతలుగా రీ-సర్వే ప్రక్రియ చేపడుతున్నామని, ఇప్పటికే మొదటి విడత సర్వే పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. రీ-సర్వే ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులకు ప్రత్యేక శిక్షణ కూడా అందిస్తున్నట్లు వెల్లడించారు.ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అందుతున్న భూ సంబంధిత దరఖాస్తులను క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.ప్రభుత్వ, అసైన్డ్ భూముల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వి.ఎస్. లోకేశ్వరరావు, మండల రెవెన్యూ అధికారులు, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## చింతపల్లిలో 27న మెగా జాబ్‌మేళా

**పాడేరు,ఆగస్టు25,(ప్రభాతవార్త):**



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 27వ తేదీన గురువారం చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారులు తెలిపారు.ఈ మెగా జాబ్ మేళాలో సుమారు 10 ప్రముఖ కంపెనీలు పాల్గొని వివిధ రంగాల్లో ఉద్యోగ అవకాశాలను కల్పించనున్నాయి. 10వ తరగతి నుంచి పీజీ వరకు విద్యార్హతలు కలిగిన నిరుద్యోగ యువత ఈ జాబ్ మేళాలో పాల్గొని, తమ విద్యార్హతలు, నైపుణ్యాలకు అనుగుణంగా ఉద్యోగ అవకాశాలను పొందవచ్చని తెలిపారు.జాబ్ మేళా పోస్టర్ ఆవిష్కరణమెగా జాబ్ మేళాకు సంబంధించిన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ టి. నిశాంతి, మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఇటువంటి జాబ్ మేళాలు మంచి అవకాశాలను కల్పిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి జి. ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ, నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ భవిష్యత్తుకు మంచి ఉద్యోగ అవకాశాలను పొందాలని కోరారు.

## స్థానిక ఎన్నికల అభ్యర్థుల డేటా సేకరణకు సమన్వయ కమిటీలు

**గూడెంకొత్తవీధి, ఆగస్టు 25, ప్రభాతవార్త :**



రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పాడేరు నియోజకవర్గంలోని ప్రతి మండలానికి ఏడుగురు సభ్యులతో సమన్వయ కమిటీలను ఏర్పాటు చేసినట్లు జనసేన పార్టీ పాడేరు అసెంబ్లీ అరకు పార్లమెంట్ నియోజక వర్గం ఇంచార్జ్ , ఆంధ్రప్రదేశ్ జానపద కళలు సృజనాత్మకత అకాడమీ చైర్మన్ డా. వంపూరి గంగులయ్య తెలిపారు. కమిటీ సభ్యులు తమ పరిధిలో సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు పోటీ చేయాలనుకుంటున్న ఆశావహ అభ్యర్థుల వివరాలను రెండు, మూడు రోజుల్లోగా సేకరించి సమర్పించాలని సూచించారు. పార్టీ కోసం, పార్టీ బలోపేతం కోసం పనిచేసే వారికి ప్రాధాన్యతనిస్తూ పంచాయతీల వారీగా పూర్తి వివరాలను సిద్ధం చేయాలని కోరారు. సేకరించిన డేటాపై కమిటీ సభ్యులతో ప్రత్యేకంగా చర్చించి, అనంతరం పార్టీ అధిష్టానానికి నివేదిక అందజేయనున్నట్లు తెలిపారు.

**పాడేరులో 27న సమన్వయ కమిటీ సమావేశం**

మండలాల వారీగా నియమించిన సమన్వయ కమిటీ సభ్యులతో ఈ నెల 27న పాడేరులోని జనసేన పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశం నాటికి సేకరించిన అభ్యర్థుల వివరాలతో సభ్యులు హాజరు కావాలని సూచించారు. సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన తదుపరి కార్యాచరణపై దిశానిర్దేశం చేయనున్నట్లు పేర్కొన్నారు.

## గన్నెలలో ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 64 అర్జీలు

**అరకు రూరల్, ఆగస్టు 25, ప్రభాతవార్త:**



ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలోనే గుర్తించి, వాటికి త్వరితగతిన పరిష్కారం చూపించేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' (పీజీఆర్ఎస్) కార్యక్రమం మంగళవారం అరకులోయ మండలం గన్నెల స్వర్ణ గ్రామ సచివాలయంలో నిర్వహించారు. జిల్లా కలెక్టర్ నిశాంతి.టి ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామస్తుల నుంచి 64 అర్జీలను అధికారులు స్వీకరించారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీపూజ మాట్లాడుతూ.గ్రామీణ ప్రాంత ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి నేరుగా తీసుకువచ్చేందుకు పీజీఆర్ఎస్ చక్కటి వేదికగా ఉపయోగపడుతుందన్నారు. వచ్చిన ప్రతి అర్జీని క్షేత్రస్థాయిలో పరిశీలించి, వీలైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. గన్నెల గ్రామస్తులు రెవెన్యూ, తాగునీరు, రహదారులు, పాఠశాలలు, అంగన్‌వాడీ భవనాలు, విద్యుత్, డ్రైనేజీ, పింఛన్లు, వ్యక్తిగత సమస్యలు, సంక్షేమ పథకాలకు సంబంధించిన వినతులను సమర్పించారు. పాఠశాలలు, అంగన్‌వాడీ భవనాలకు సంబంధించిన పనులు ఏ దశలో ఉన్నాయో క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక సిద్ధం చేయాలని సూచించారు. వివిధ శాఖలకు అందిన అర్జీలను సంబంధిత అధికారులు సమన్వయంతో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని తెలిపారు.పీజీఆర్ఎస్‌లో స్వీకరించిన సమస్యలకు తదుపరి రోజు జరిగే కార్యక్రమంలో పరిష్కార వివరాలను ప్రజలకు తెలియజేసేలా చర్యలు తీసుకుంటామని జేసీ పేర్కొన్నారు. చదువుకున్న యువత స్వయం ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల వైపు దృష్టి సారించాలని, విద్యార్హతలకు అనుగుణంగా ప్రభుత్వ శిక్షణ కార్యక్రమాలను వినియోగించుకుని ఉపాధి పొందాలని సూచించారు.గన్నెల గ్రామపంచాయతీ పరిధిలోని ప్రజలు పీజీఆర్ఎస్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలపై వినతిపత్రాలు అందజేయాలని అధికారులు కోరారు. కార్యక్రమంలో ఆర్డీఓ భుజంగరావు, ఐటీడీఏ ఏపీఓ ఎం.వెంకటేశ్వరరావు, డీపీఓ కె.పి.చంద్రశేఖర్, డీడీ ట్రైబల్ వెల్ఫేర్ అధికారి పి.బి.కె.పరిమళ, పీడీ డీఆర్‌డీఏ, ఏడీ సర్వే, డీఎల్‌పీఓ పి.ఎస్.కుమార్, డీఎం అండ్ హెచ్ఓ రియాజ్ బైగ్, డీసీహెచ్ఎస్, అదనపు డీఎంహెచ్ఓ, పీడీ ఐసీడీఎస్, జిల్లా అటవీశాఖ అధికారి ఉమామహేశ్వరి, స్వర్ణ గ్రామ నోడల్ అధికారి సత్యనారాయణ, ఈఈ ఆర్‌డబ్ల్యూఎస్, ఈఈ పీఆర్, డీఎం ఆర్టీసీ, డీఎం సివిల్ సప్లై, జిల్లా మలేరియా అధికారి, వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు, మండల తహసీల్దార్, ఎంపీడీఓ, పోలీసు అధికారులు, జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## బస్కి పంచాయతీలో బురదమయంగా రహదారులు

**అరకు రూరల్, ఆగస్టు 25, ప్రభాత వార్త:**



బస్కి పంచాయతీలోని గిరిజన గ్రామాల్లో మౌలిక వసతుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఎం మండల కార్యదర్శి కిండంగి రామారావు విమర్శించారు. మంగళవారం బస్కి, జాకరవలస గ్రామాల్లో పర్యటించిన ఆయన స్థానిక సమస్యలను పరిశీలించారు. పంచాయతీ పరిధిలోని గ్రామాల వీధులు బురదమయంగా మారాయని, అడుగడుగునా నీరు నిల్వ ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పారిశుధ్య సమస్యల కారణంగా దోమల బెడద పెరిగి, మలేరియా, టైఫాయిడ్ వంటి అనారోగ్య సమస్యలు అధికమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యాధుల సీజన్ ప్రారంభమైనప్పటికీ ఇప్పటివరకు దోమతెరలు పంపిణీ చేయకపోవడం విచారకరమన్నారు.ప్రతి కుటుంబానికి నాలుగు జతల దోమతెరలు వెంటనే పంపిణీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బస్కి పంచాయతీలో సీసీ రోడ్లు, మంచినీటి సరఫరా, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. బస్కి పంచాయతీలోని మొర్రిగూడలో మంచినీటి సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్‌ను మంజూరు చేయాలని కోరారు. గ్రామంలోని సుమారు 150 కుటుంబాలకు తాగునీటి సమస్య లేకుండా అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని కిండంగి రామారావు డిమాండ్ చేశారు.

## ఫార్మర్ రిజిస్ట్రీ నమోదుకు ఈనెల 31 వరకు గడువు

**గూడెంకొత్తవీధి, ఆగస్టు 25, ప్రభాతవార్త :**



మండలంలోని రైతులందరూ ఫార్మర్ రిజిస్ట్రీ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సురేష్ సూచించారు. ఆసరాడ గ్రామపంచాయతీలో నిర్వహించిన ఫార్మర్ రిజిస్ట్రీ డ్రైవ్‌లో ఆయన మాట్లాడుతూ మండలంలో మొత్తం 15,905 మంది రైతులు ఉండగా ఇప్పటివరకు 9,132 మంది మాత్రమే ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకున్నారని తెలిపారు. గతంలో ఆర్.ఓ.ఎఫ్.ఆర్ పట్టా భూములు పొందిన రైతుల్లో చాలామంది ఇంకా నమోదు చేసుకోలేదని, వారంతా తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకోవాలని సూచించారు. మండలంలో 9,233 మంది రైతులకు పీఎం కిసాన్ పథకం అందుతుండగా, ఇప్పటివరకు 5,708 మంది మాత్రమే ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకున్నారని తెలిపారు. ఫార్మర్ ఐడీ ఉన్న రైతులు మాత్రమే పంట బీమా, సబ్సిడీ విత్తనాలు, సంక్షేమ పథకాలు, ఇన్‌పుట్ సబ్సిడీ వంటి ప్రయోజనాలకు అర్హులని వివరించారు. వచ్చే విడత పీఎం కిసాన్ నగదు సాయం కూడా ఫార్మర్ ఐడీ ఉన్న రైతులకే అందుతుందని పేర్కొన్నారు. కాబట్టి రైతులంతా ఈ నెల 31వ తేదీలోపు సమీప రైతు సేవా కేంద్రంలో ఫార్మర్ ఐడీతో పాటు పీఎం కిసాన్ వార్షిక ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏ సౌందర్య, వీఏహెచ్ఏ సింహాచలం, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి శిక్షణ

**పాడేరు,ఆగస్టు25,(ప్రభాతవార్త):**



అంగన్వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమం ఆరు రోజుల పాటు పాడేరు శ్రీకృష్ణాపురం పాఠశాలలో నిర్వహించారు. పాడేరు సీడీపీఓ అధికా రిని జి. శారదా దేవి మాట్లాడుతూ బాలలకు బాల్య విద్య, అవగాహన కోసం శిక్షణ తరగతులు నిర్వహించడం, శిక్షణ పొందిన ఉపాధ్యాయులు అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు ప్రాథమిక విద్య అందించాలని ఆమె సుచించారు. ఈ శిక్షణ ద్వారా అంగన్వాడీ వర్కర్స్ అందరు కూడా తమ అంగన్వాడీ కేంద్రాలలో మంచి విద్య నేర్పించి, ప్రతి ఒక్క పిల్లలు చాలా ఉత్సాహంగా అంగన్వాడీ కేంద్రాలకు రావాలని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, ఐసీడీస్ సూపర్‌వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

## అరకు పంచాయతీ కేంద్రంలో అక్రమ కట్టడాలకు అడ్డుకట్ట ఎక్కడ ?

### ఆదివాసీ గిరిజన సంఘం.. అధికారులకు సూటి ప్రశ్న

**డుంబ్రిగుడ, ఆగస్టు 25, ప్రభాతవార్త:**



అరకు పంచాయతీ కేంద్రంలో గిరిజనేతరులు పాల్పడుతున్న అక్రమ కట్టడాలకు అడ్డుకట్ట వెయ్యడంలో అధికారులు దేనికి జాప్యం చేస్తున్నారని, ఆదివాసి గిరిజన సంఘం మండల కార్యదర్శి తామర్ల సూర్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు పాంగి. సురేష్ కుమార్ ప్రశ్నించారు.అరకు పంచాయతీ కేంద్రానికి కూతవేటు దూరంలో నేషనల్ హైవే రోడ్డుకు ఇరువైపులా గిరిజనేతరులు, బినామీ దారులు అక్రమ కట్టడాలు నిర్మాణం చేసుకుంటున్నారనీ, 1/70చట్టాన్ని పూర్తిగా విస్మరించి ప్రభుత్వ భూములు, గ్రామ కంఠం భూములు ఆక్రమణలు చేసుకొని దర్జాగా షాపింగ్ కాంప్లెక్స్ లు నిర్మాణం చేసుకుంటున్నారనీ వారు తెలిపారు. తూతూ మంత్రంగా పంచాయతీ, రెవెన్యూ అధికారులు నోటిసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారనీ విమర్శించారు. నేరేడు వలస ప్రభుత్వ పాఠశాలకు సంబందించిన స్థలం కబ్జా చేసి గిరిజనేతరుడు అయినా ఏరుబంటి. శ్రీను, కోరుకొండ. రమేష్ ఇద్దరు గిరిజనేతరులు కలిసి బినామీ పేర్లతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేసుకుంటున్న కూడా ఎటువంటి చర్యలు తీసుకో కుండా అధికారులు నిద్ర పోతున్నారనీ మండిపడ్డారు.అలాగే కొయ్యల. నంధీశ్వరరావు వెల్డింగ్ షాపు యజమాని ఇప్పటికే అనేక భవనాలు నిర్మాణం చేసుకున్నారనీ, అతని పై ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదనీ చెప్పారు. అలాగే తలారి. అప్పలనాయుడు అనేగిరిజనేతరుడు నేషనల్ హైవే, హనుమాన్ జంక్షన్ దగ్గర పెద్ద రెస్టారెంట్ నిర్మాణం చేసుకున్నారనీ, సాక్షాత్తు జాయింట్ కలెక్టర్ తిరుమణీ శ్రీపూజ ఎంక్వరీ చేసిన ఎటువంటి చర్యలు లేదని తెలిపారు.అరకు పంచాయితీలో పూర్తిగా 1/70చట్టం దురాక్రమణ జరుగుతుందనీ, జిల్లా కలెక్టర్, ఐటిడిఏ, పీఓ, జాయింట్ కలెక్టర్ వెంటనే స్పందించి గిరిజనేతరులు నిర్మాణం చేస్తున్న భవనాలు, షాపింగ్ కాంప్లెక్స్ లు కూల్చలన్నారు. వారిపై ఎల్టీఆర్ కేసులు నమోదు చేయాలనీ డిమాండ్ చేశారు. నిర్లక్ష్యంగా ఉన్న పంచాయతీ సెక్రటరీ, వీఆర్వో లపై కఠిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. లేకపోతే ప్రజా ఆగ్రహానికీ ప్రభుత్వ అధికారులు భాధ్యత వహించవలసిన అవసరం ఉంటుందని చెప్పారు.1/70చట్టం పటిష్టంగా అమలు చేయాలనీ పెద్ద ఎత్తున ఆదివాసీ ప్రజాసంఘాలు, ఆదివాసులు పోరాడుతుంటే, కూటమి ప్రభుత్వం కనీసం వాటి అమలు కోసం చర్యలు తీసుకోపోవడం శోచనీయం అన్నారు. ఇప్పటికైనా అధికార యంత్రం కలిసి స్పందించి అక్రమ దారులకు అడ్డుకట్ట వేసి 1/70 చట్టాన్ని కాపాడాలని వారు కోరారు.

## అంబేద్కర్ ఇండియా మిషన్ మండల అధ్యక్షుడుగా రామనాయుడు

**డుంబ్రిగూడ, ఆగస్టు 25 ,ప్రభాతవార్త:**



దళిత బహుజన సమాజ ఆశాజ్యోతి మాన్య పి.వి. సునీల్ కుమార్ (ఐపీఎస్ )ఆదేశాల మేరకు, అంబేద్కర్ ఇండియా మిషన్ అల్లూరి జిల్లా అధ్యక్షులు తేడబారికి సురేష్ కుమార్ ఆధ్వర్యంలో డుంబ్రిగూడ మండల అధ్యక్షుడిగా హరిబారికి రామునాయుడిని మంగళ వారం నియమించారు. ఈ సందర్భంగా నూతన మండల అధ్యక్షులు మాట్లాడుతూ, అంబేద్కర్ ఇతర మహనీయుల ఆశయాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లడానికి, సామాజిక న్యాయం, సమానత్వం, హక్కుల పరిరక్షణ కోసం అంకితభావంతో పని చేస్తానని ఆయన తెలిపారు. మండలంలో అంబేద్కర్ ఇండియా మిషన్ మరింత బలోపేతం చేయడానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. తమపై నమ్మకంతో బాధ్యతలను అప్పగించిన వ్యవస్థాపక అధ్యక్షులకు జిల్లా అధ్యక్షులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

## ప్రజల ముంగిటకే కూటమి ప్రభుత్వ సంక్షేమం, అభివృద్ధి

### అరకు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి సియ్యారి దొన్నుదొర

**ముంచంగిపుట్టు, ఆగస్టు 25, (ప్రభాతవార్త):**



ప్రజల ముంగిటకే సంక్షేమం అభివృద్ధే కూటమి ప్రభుత్వం లక్ష్యం అని, అరకు నియోజకవర్గము ఇంచార్జ్ ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్ సియ్యారి. దొన్ను దొర, అరకు పార్లమెంట్ అధ్యక్షురాలు మోజరు. తేజోవతి అన్నారు. అల్లూరిసితారరాజు జిల్లా, అరకు నియోజకవర్గం ముంచంగిపుట్టు మండలం,మండల కేంద్రం లో పార్టీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం నిర్వహించిన,రెండేళ్ల నమ్మకం – సంక్షేమం, అభివృద్ధి ఇంటింటి ప్రచార కార్యక్రమంలో అరకు నియోజకవర్గం ఇంచార్జ్ ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్ సియ్యారి దొన్ను దొర అరకు పార్లమెంట్ అధ్యక్షురాలు మోజురు తేజోవతి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రతి ఇంటి ముందూ ఆప్యాయంగా ఆగి, కుటుంబ సభ్యుల యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటూ, ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరును అడిగితెలుసుకొన్నారు, కూటమి ప్రభుత్వం రెండేళ్ల కాలంలో సాధించిన అభివృద్ధి, సంక్షేమ వివరాలతో కూడిన కరపత్రాలను ప్రతి కుటుంబానికి అందజేశారు. అరకు మార్కెటింగ్ చైర్మన్ బోరిబోరి లక్ష్మి, ముంచంగిపుట్టు మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు కిల్లో సన్యాసమ్మ (సంధ్య), కార్యదర్శి కొంతేరి జాగ్రాయ్, అరకు పార్లమెంట్ ఆర్గనైజేషన్ సెక్రటరీ పాంగి కామేష్, పిఎసిఎస్ చైర్మన్ సామల బాబుజి, పాంగి శాస్త్రి బాబు, నీలకంఠం పాత్ర, మాజీ మండల పార్టీ అధ్యక్షు కిల్లో. బలరాం, జోలా పుట్టు మాజీ సర్పంచ్ హ్యాట్రిక్ సర్పంచ్ వంతల రామస్వామి, మజ్జి చిన్ని, బొగడాయిత్తు. రామారావు కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## గన్నెల, కృష్ణానగర్ ప్రాంతాల్లో జెసి ముమ్మర తనిఖీలు

**అరకులోయ, ఆగస్టు 25, ప్రభాతవార్త:**



రాష్ట్ర ముఖ్యమంత్రి రాబోయే పర్యటనను పురస్కరించుకుని అరకులోయ మండలం, గెన్నెల పంచాయతీ పరిధిలోని గెన్నెల, రామకృష్ణ నగర్ గ్రామాల్లో అధికారులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. మంగళవారం జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీపూజ అధికారులతో కలసి ముఖ్యమంత్రి పర్యటనకు ఎలాంటి అసౌకర్యాలు, అవాంచనీయ సంఘటనలు జరగకుండా, అలాగే పర్యటనను విజయవంతం చేసేందుకు గాను స్థానిక పరిపాలనా యంత్రాంగం, వివిధ శాఖల అధికారులు ముందస్తు ఏర్పాట్లను పరిశీలించారు. అలాగే గన్నెల, కృష్ణ నగర్ గ్రామస్తులతో మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామంలోని హెలిప్యాడ్ స్థలాలు, సభా ప్రాంగణాలు, విఐపి రూట్లు ముఖ్యమంత్రి ప్రజాప్రతినిధులతో మాట్లాడేందుకు కేటాయించిన ప్రాంతాలను అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. తాహిశీల్దార్ శ్రీధర్ రాజు , ఎంపీడీఓ ప్రసాద్, మండల్ రెవిన్యూ అధికారి, పలువురు మండల స్థాయి అధికారులు, రెవెన్యూ, పంచాయతీ రాజ్ శాఖసిబ్బంది , స్వర్ణ గ్రామ సెక్రటరీ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## జ్ఞానజ్యోతి - అంగన్వాడీ టీచర్లకు శిక్షణ ముగింపు

**ముంచింగిపుట్టు, ఆగస్టు 25, (ప్రభాతవార్త):**




అంగన్వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యా బోధనను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో నిర్వహించిన జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమం చివరి రోజు శిక్షణతో విజయవంతంగా ముగిసిందని ముంచంగిపుట్టు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిని యు విమల కుమారి తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచింగిపుట్టు మండల కేంద్రంలోని జి టి డబ్ల్యూ ఏ బాలుర పాఠశాల-1 పాఠశాలలో ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ యు. విమల కుమారి ఆధ్వర్యంలో అంగన్వాడీ టీచర్లకు శిక్షణ నిర్వహించారు.శిక్షణలో భాగంగా 3 నుంచి 6 సంవత్సరాల చిన్నారులకు ఆటపాటలు, కథలు, కార్యకలాపాలు, బోధనా--అభ్యసన సామగ్రి (టి ఎల్ ఎం) ద్వారా ఆసక్తికరంగా విద్యను అందించే విధానాలపై అంగన్వాడీ టీచర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి. లింగన్న, కె. లోకేష్, పి. పుండరి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఎస్. రాజేశ్వరి, సి.హెచ్. వరహాలమ్మ, ఎస్. కొండమ్మ, సి.హెచ్. స్వర్ణ, ప్రాజెక్టు బ్లాక్ కోఆర్డినేటర్ వి. సురేష్ పాల్గొన్నారు. ముంచింగిపుట్టు ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ టీచర్లు శిక్షణకు హాజరయ్యారు.

**శిక్షకులకు ఘన సన్మానం**

జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమం విజయవంతంగా పూర్తయిన సందర్భంగా సీడీపీఓ యు. విమల కుమారి, ఎంఈఓ కృష్ణమూర్తి, జి టి డబ్ల్యూ ఏ బాలుర పాఠశాల-1పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు శిక్షణ అందించిన డీఆర్పీలను సన్మానించి అభినందించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాలను అంగన్వాడీ కేంద్రాల్లో సమర్థవంతంగా అమలు చేసి, చిన్నారులకు నాణ్యమైన పూర్వ ప్రాథమిక విద్య అందించాలని సూచించారు. జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమం విజయవంతంగా పూర్తవడంతో అంగన్వాడీ టీచర్లు ఆనందం వ్యక్తం చేశారు.

## ఏటికొప్పాకలో హస్తకళాకారుల హబ్ పార్కు స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్



ఎలమంచిలి, ఆగస్ట్ 25, ప్రభాతవార్త

మండలంలోని ఏటికొప్పాక గ్రామంలో ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ పర్యటించారు. రెవెన్యూ అధికారులు సంబంధిత శాఖల అధికారులతో కలిసి గ్రామంలో హస్తకళాకారుల కోసం ఏర్పాటు చేయనున్న హస్తకళాకారుల హబ్ పార్కు స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జిల్లా కలెక్టర్‌కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఏటికొప్పాక కళాకారులకు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉందని అన్నారు. సంప్రదాయ హస్తకళలను కాపాడటంతో పాటు, కళాకారులకు మెరుగైన వసతులు, మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించేందుకు ఈ హబ్ పార్కు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. హస్తకళాకారుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అనువైన స్థలాన్ని ఎంపిక చేసి, అవసరమైన మౌలిక వసతులు కల్పించేలా అధికారులతో సమన్వయం చేస్తామని పేర్కొన్నారు. ఏటికొప్పాక కళకు మరింత ప్రాచుర్యం తీసుకురావడంతో పాటు, స్థానిక కళాకారులకు ఉపాధి, ఆదాయ అవకాశాలు పెంచేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ వరహాలరావు, సంబంధిత శాఖల అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, హస్తకళాకారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

### స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో సీఎం చంద్రబాబుని కలిసిన

## యలమంచిలి తెలుగు యువత అధ్యక్షులు నమ్మి రమణ

ఎలమంచిలి, ఆగస్టు 25, ప్రభాతవార్త




మాడుగుల నియోజకవర్గం, కె.కోటపాడు మండలం, ఆలమండ కోడూరు గ్రామంలో నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమానికి విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడుని మర్యాదపూర్వకంగా ఎలమంచిలి తెలుగు యువత అధ్యక్షులు నమ్మి రమణ కలిశారు. ఎలమంచిలి పార్టీ సమస్యలపై సీఎం దృష్టికి తీసుకువెళ్లడం జరిగింది. దీనికి ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని ఇది చాలా సంతోషంగా ఉంది నమ్మి రమణ తెలిపారు.

## ఎలమంచిలి క్రీడాకారుల ప్రతిభ.. రాష్ట్రస్థాయి టైక్వాండో పోటీల్లో తొమ్మిది పతకాలు



ఎలమంచిలి, ఆగస్టు 25, ప్రభాతవార్త

రాష్ట్రస్థాయి టైక్వాండో పోటీల్లో పట్టణానికి చెందిన క్రీడాకారులు సత్తా చాటి తొమ్మిది పతకాలు సాధించారు. ఈ నెల 21వ తేదీ నుంచి 23వ తేదీ వరకు శ్రీకాకుళంలోని వైఎస్సార్ కళ్యాణ మండపంలో జరిగిన రాష్ట్రస్థాయి టైక్వాండో పోటీల్లో అన కాపల్లి జిల్లా తరపున సత్య స్పోర్ట్స్ అకాడమీకి చెందిన క్రీడాకా రులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో జూనియర్ బాలికల అండర్-46 కేజీల విభాగంలో ఎం.హర్షిత బంగారు పతకం సాధించగా, పి.సింహాద్రి రజత పతకం సాధించారు. సబ్ జూనియర్ బాలికల అండర్-35 కేజీల విభాగంలో ఎం.రిత్విక, క్యాడెట్ బాలికల ఓవర్-59 కేజీల విభాగంలో రిజ్వానా బేగం, అండర్-68 కేజీల విభాగంలో పి.గాయత్రి వర్షిణి, జూనియర్ బాలుర అండర్-55 కేజీల విభాగంలో ఆర్.విష్ణువర్ధన్, సీనియర్ విభాగంలో పి.రవితేజ, వి.జగన్, టి.సాయికుమార్ కాంస్య పతకాలు సాధించారు. క్రీడాకారుల ప్రతిభపై సత్య స్పోర్ట్స్ అకాడమీ ఫౌండర్ నగిరెడ్డి సత్యనారాయణ హర్షం వ్యక్తం చేశారు. విజేతలను టైక్వాండో సంఘం అధ్యక్షుడు జగదీష్ పాల్, ఉపాధ్యక్షుడు రాయవరపు సుధాకర్, టీమ్ మేనేజర్లు పి.వి.రమణ, ఎం.గోపి అభినందించారు. భవిష్యత్ పోటీల్లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## సైకిల్ పాలెంలో ఇంటింటికి తెలుగుదేశం ప్రచారం - పాల్గొన్న ప్రగడ నాగేశ్వరరావు

ఎలమంచిలి, ఆగస్టు 25, ప్రభాతవార్త



మండలంలోని సైకిల్ పాలెం గ్రామంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఇత్తంశెట్టి సన్యాసి నాయుడు అధ్యక్షతన రెండేళ్ల కూటమి పాలనపై అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల భాగంగా నిర్వహించిన ఇంటింటి తెలుగుదేశం ప్రచార కార్యక్రమంలో రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్, నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ ప్రగడ నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రగడ నాగేశ్వరరావు ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంచి, ప్రజలతో నేరుగా మాట్లాడి ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రగడ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేరు స్తోందని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంత్రినారా లోకేష్ దేశవ్యాప్తంగా పెట్టుబడులు ఆకర్షిస్తున్నారని అన్నారు. దేశంలో ఎక్కడా లేనటువంటి సంక్షేమ పథకాలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందని, సూపర్ సిక్స్ హామీలను దశలవారీగా అమలు చేస్తున్నామని తెలిపారు. తల్లికి వందనంపథకం ద్వారా ఒక కుటుంబంలో పిల్లలు ఎంతమంది ఉన్నా ఒక్కొక్కరికి రూ.15,000 చొప్పున అందజేస్తున్నామని, గత ప్రభుత్వంలో అమ్మఒడిని పరిమితం చేశారని విమర్శించారు. అన్నదాత సుఖీభవ కింద రైతులకు కేంద్ర సహాయంతో కలిపి ఏడాదికి రూ.20,000 అందిస్తున్నామని, మహిళలకు ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు. తల్లికి వందనం, దీపం పథకం, ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు, అన్నా క్యాంటీన్ల పునరుద్ధరణ, యువతకు ఉద్యోగాల కల్పన వంటి హామీల అమలుతో కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఇత్తంశెట్టి రాజా వెంకటరమణారావు, క్లస్టర్ ఇంచార్జ్ ఊడి రామకృష్ణ, యూనిట్ ఇంచార్జ్ రాజన వెంకు నాయుడు, దాడి లోకేష్, సీనియర్ నాయకులు వరహాలు, గ్రామ శాఖ అధ్యక్షులు శ్రీను, అప్పల నాయుడు, ప్రకాష్, అప్పారావు, చిరంజీవి పాల్గొన్నారు.

## కొత్తపేట ఎంపీపీ పాఠశాలలో జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమం ముగింపు



ఎలమంచిలి, ఆగస్టు 25, ప్రభాతవార్త

పట్టణములోని కొత్తపేట ఎంపీపీ పాఠశాలలో నిర్వహించిన రెండవ విడత 6 రోజుల జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. చివరి రోజున మొదటి రోజు నుంచి నిర్వహించిన శిక్షణ అంశాలను పునశ్చరణ చేసుకుని, అంగన్ వాడీ కేంద్రాల్లో చేపట్టాల్సిన కార్యాచరణపై వివరంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని ప్రాజెక్ట్ అధికారి ఇందిరాదేవి సందర్శించి, ప్రీ-స్కూల్ విద్య, గర్భిణీలు, బాలింతలు, సమ్మిళిత విద్య తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాలను ప్రణాళికాబద్ధంగా నిర్వహిస్తూ, లబ్ధిదారులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. శిక్షణ కార్యక్రమంలో డిఆర్పిఎస్ రమ్య, అపరంజిని, శ్రీనివాస్, ప్రేమ్‌కుమార్, వినోద్‌కుమార్‌లి పాల్గొని, ఆరు రోజుల శిక్షణ అంశాలను పునశ్చరణ చేయించి కార్యక్రమాన్ని విజయవంతంగా ముగించారు.

## గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2వ సెమిస్టర్ ఫలితాలు విడుదల - 83.26% ఉత్తీర్ణత

ఎలమంచిలి, ఆగస్టు 25, ప్రభాతవార్త



పట్టణంలో గల శ్రీ గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి)లో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి జూలై 2026లో నిర్వహించిన రెండవ సెమిస్టర్ పరీక్షా ఫలితాలను ప్రిన్సి పల్ డా.ప్రేమ చంద్రశేఖర్ విడుదల చేశారు. ఈ పరీక్ష లలో 83.26%మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినందుకు ఆనందం వ్యక్తం చేశారు. కోర్సుల వారీగా ఉత్తీర్ణత శాతం, బిఎ-61.54%-బీకాం 72.31%-బీఎస్సీ-90.51% పరీక్షల వివరాలను పరీక్షల నిర్వహణ అధి కారి ఎం.కిషోర్ తెలియజేశారు. ప్రతిభావంతు లైన విద్యార్థులు ప్రథమ స్థానం జి.నాగ సృజన (కంప్యూటర్ సైన్స్-9.37 జిపిఎ) ద్వితీయ స్థానం కె.లావణ్య (కంప్యూటర్ సైన్స్- 9.35 జిపిఎ) తృతీయ స్థానం ఎం.దుర్గ (బోటనీ-8.93 జిపిఎ) ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం అభినందించింది. కళాశాల వైస్ ప్రిన్సిపల్ వి.ఏ.సత్యనారాయణ, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ జి.శ్రీనివాసరావు, ఐ క్యూ ఏసి కోఆర్డినేటర్ డా. కె.వెంకన్న, కెమిస్ట్రీ హెచ్ఓడి టి.అప్పారావు, వివిధ విభాగాల హెచ్ఓడిలు పాల్గొన్నారు. పరీక్షలను విజయవంతంగా నిర్వహించి, ఫలితాలను త్వరితగతిన విడుదల చేయడంలో సహకరించిన ఎగ్జామినేషన్ సెల్ సిబ్బంది పి.విశ్వేశ్వరరావు, కె.ధనలక్ష్మిలను ప్రిన్సిపల్ సిబ్బందిని అభినందించారు.

## ఘనంగా మరిడిమాంబ అమ్మవారికి సారె ఊరేగింపు



అనకాపల్లి, ఆగస్టు 25, ప్రభాతవార్త

పట్టణంలో ఎన్నో సంవత్సరాల చరిత్ర కలిగిన కోట్ని వీధిలో వెలిసిన శ్రీ మరిడి మాంబ అమ్మవారి ఈనెల 27 పండగ మహోత్సవాలను భాగంగా మంగళవారం ఆలయ చుట్టుపక్కల అన్ని వీధుల్లో మహిళలు వివిధ రకాల పిండివంటలు తయారుచేసి అమ్మవారి వారికి సారె సమర్పించారు. అమ్మవారి సారె ఊరేగింపు ఘనంగా జరిగింది. ఆలయ పాలకమండ సభ్యులు ప్రారంభించారు. కోట్ని వీధి, మల్ల వీధి, పెద్దవీధి, తాకాశి వీధి, భీముని గుమ్మం, నాయి బ్రాహ్మణ వీధిగా, సరసవారవీధి, కొణతాల వారి వీధి, లక్ష్మీనారాయణ నగర్‌లో ఊరేగింపు ఘనంగా జరిగింది. ఆలయ ఈవో కె.చందర్ తేజ, ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ గుర్రాల శ్రీనివాస్, 84 వార్డ్ టిడిపి ఇన్చార్జ్ తలారి లక్ష్మీప్రసాద్, కోట్నిరామకృష్ణ, ఆలయ చైర్మన్ గుర్రాల శ్రీనివాస్, ధర్మకర్తలు, ఇల్లపు పరమేశ్వరరావు, కోట్ని సాయికుమార్, చెట్టుపల్లి సత్యనారాయణ కుమార్, వడ్డాది వంశీ, ఇందుగబిల్లి కవితా రాణి, కోట్నిఅయ్యన్న దొర పాల్గొన్నారు.

## ఆగస్టు 28న 5, 7, 9 తరగతుల విద్యార్థులకు రాష్ట్ర స్థాయి అభ్యసన సాధన సర్వే



కశింకోట, ఆగస్టు 25, ప్రభాతవార్త

రాష్ట్ర స్థాయి అభ్యసన సాధన సర్వే 2026లో భాగంగా అనకాపల్లి జిల్లాలోని 20 మండలాల్లో ఎంపిక చేసిన 139 పాఠశాలల్లో ఆగస్టు 28వ తేదీన సర్వే నిర్వహించనున్నారనీ విద్యశాఖ అధికారులు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాలకు చెందిన ఎంపికైన పాఠశాలల్లో ప్రస్తుతం 5వ, 7వ, 9వ తరగతులు చదువుతున్న విద్యార్థులకు ఈ సర్వే నిర్వహించనున్నారన్నారు. ఈ సర్వేను విజయవంతంగా నిర్వహించేందుకు ఫీల్డ్ ఇన్విజిలేటర్లకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని కశింకోట మండలంలోని డిపీఎన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 7 మండలాలకు సంబందించి 139మంది ఫీల్డ్ ఇన్విస్టిగేటర్స్ శిక్షణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. శిక్షణా కార్యక్రమంలో సర్వే ఉద్దేశ్యం, ప్రాధాన్యత, నిర్వహణ విధానం, మార్గదర్శకాలు, ప్రశ్నాపత్రాల నిర్వహణ, విద్యార్థుల పట్ల నిష్పాక్షిక వైఖరి, సమయపాలన, సమాచార నమోదు తదితర అంశాలపై సమగ్ర అవగాహన కల్పించామని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా డీఈఓ జి.జి.ఈ.నాగేశ్వరరావు మాట్లాడుతూ స్లాష్--2026ను కేవలం ఒక పరీక్షగా కాకుండా విద్యార్థుల వాస్తవ అభ్యసన స్థాయిని తెలుసుకునే ముఖ్యమైన విద్యా సాధనంగా చూడాలని సూచించారు. విద్యార్థులు తమ తరగతి స్థాయికి అనుగుణంగా సాధించాల్సిన అభ్యసన ఫలితాలను ఎంతవరకు సాధించారో తెలుసుకోవడం, వారి బలాలు, అభ్యసన లోపాలను గుర్తించ డం ఈ సర్వే ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. సర్వే ద్వారా లభించే సమాచారాన్ని విశ్లేషించి విద్యార్థులకు అవసరమైన అభ్యసన మెరుగుదల కార్యక్రమాలను రూపొందించేందుకు, బోధనా పద్ధతులను మరింత సమర్థ వంతంగా మార్చేందుకు ఉపయోగించుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. ఫీల్డ్ ఇన్విజిలేటర్లు సర్వే సమయంలో పూర్తి నిష్పక్షికతను పాటించాలని, విద్యార్థులకు ఎలాంటి సమాధానాలను సూచించకుండా మార్గదర్శకాలను ఖచ్చితంగా అమలు చేయాలని సూచించారు. ఈ శిక్షణా కార్యక్రమానికి కశింకోట విద్యాశాఖాధికారి పివి సురేష్, పాఠశాల డీసీసీబీ సెక్రటరీ నూకరాజు సంబంధిత 7 మండలాల ప్రధాన మండల విద్యాశాఖ అధికారులు హాజరై కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. కార్యక్రమాన్ని పరిశీలించేందుకు డైట్ లెక్చరర్ సి.హెచ్. శ్రీధర్ పరిశీలకులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో ఏ.వి.రాజగోపాల్ మాస్టర్ ట్రైనర్‌గా వ్యవహరించారు. ఆయన స్లాస్-2026 సర్వే నిర్వహణలో పాటించాల్సిన విధానాలు, సర్వే నిబంధనలు, ఫీల్డ్ ఇన్విజిలేటర్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విద్యార్థులకు ప్రశాంతమైన వాతావరణం కల్పించడం, సర్వే సామగ్రిని సక్రమంగా వినియోగించడం తదితర అంశాలపై శిక్షణ అందించారు. సర్వేలో పాల్గొనే ప్రతి విద్యార్థికి సమాన అవకాశం కల్పించి, ఎలాంటి పక్షపాతం లేకుండా సర్వే నిర్వహించినప్పుడే విద్యార్థుల వాస్తవ అభ్యసన స్థాయికి సంబం ధించిన నాణ్యమైన సమాచారం లభిస్తుందని అధికారులు తెలిపారు. సంబంధిత అధికారులు, ప్రధానోపాధ్యా యులు, ఉపాధ్యాయులు, ఫీల్డ్ ఇన్విజిలేటర్లు సమన్వయంతో పనిచేసి ఆగస్టు 28న నిర్వహించే స్లాష్-2026ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. "సరైన సర్వే-నాణ్యమైన డేటా- సమర్థవంతమైన విశ్లేషణ-మెరుగైన అభ్యసనం" అనే లక్ష్యంతో అనకాపల్లి జిల్లాలో స్లాష్-2026ను సమర్థవంతంగా నిర్వహిం చేందుకు విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు చేస్తోందన్నారు.

## ఉత్తరాంధ్ర బాడీ బిల్డింగ్ విజేత సంతోష్‌కు సత్కారం

అనకాపల్లి, ఆగస్టు 25,ప్రభాతవార్త



ఇటీవల అనకాపల్లి గౌరీ వ్యాయామ సంఘం, నందు జరిగిన ఉత్తరాంధ్ర బాడీ బిల్డింగ్ పోటీలలో అనకాపల్లి అవినాష్ పవర్ జిమ్ సభ్యుడు పి.సంతోష్ ఓవరాల్ ఛాంపియన్షిప్ సాధించడం పట్ల జిమ్ చైర్మన్ ఐ.ఆర్.గంగాధర్ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం జిమ్ ఆవరణలో జరిగిన సమావేశంలో గంగాధర్ మాట్లాడుతూ ఇప్పటికే అనేక మంది అవినాష్ పవర్ జీవన్ నుండి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని అనేక విజయాలు సాధించారని అన్నారు. ఓవరాల్ ఛాంపియన్షిప్ సాధించిన జిమ్ సభ్యుడు పి. సంతోష్‌ని జిమ్ చైర్మన్ న్యాయవాది ఐ.ఆర్.గంగాధర్ సత్కరించారు. జిమ్ మేనేజర్ గొర్లి స్వామి గౌడ్, యువ న్యాయవాది ఇళ్ల అవినాష్,జిమ్ సభ్యులు శ్రీరామ్ మూర్తి, నాగేశ్వరరావు, మోహన్, కృష్ణ, జస్వంత్, శంకర్ పాల్గొన్నారు.



## ఈనెల 27న మరిడిమాంబ జాతర

### జాతర గోడ పత్రికను ఆవిష్కరించిన ఉత్సవ కమిటీ సభ్యులు

అనకాపల్లి, ఆగస్టు 25, ప్రభాతవార్త

గవరపాలెం, శతకంపట్టు వద్ద వెలసి వున్న మరిడిమాంబ అమ్మవారి ఈనెల 27న అత్యంత ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు కేయం నాయుడు తెలియజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిధులు గా విచ్చేసిన గౌరీపరమేశ్వరి కమిటీ అధ్యక్షులు కొణతాల సంతోష్ అప్పారావు నాయుడు, కనకదుర్గ అమ్మవారి ఆలయం శాశ్వత చైర్మన్ కాండ్రేగుల నాయుడు, మద్దాల శంకర్రావు, కనకదుర్గ అమ్మవారి ఆలయ కమిటీ వ్యవస్థాపకులు పి.వి.రమణ, దాడి కృష్ణ, సూరిశెట్టి నరసింగరావు, కొణతాల నూక మహాలక్ష్మినాయుడులు అమ్మవారి ఉత్సవ కరపత్రికని మంగళవారం ఆవిష్కరించారు. ఆలయ గౌరవ అధ్యక్షులు కొణతాల మురళీకృష్ణ ఆలయ కమిటీ నూతన కార్యదర్శులుగా గండేపల్లి మురళీకృష్ణ, పెంటకోట లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులుగా బుద్ధ సంతోష్ తో పాటు దాడి కిరణ్, మళ్ల రాజులు ఎంపిక అయినట్టుగా ప్రకటించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ గతంలో కార్యదర్శిగా వ్యవహరించిన స్వర్గీయ పొలిమేర శ్రీను సేవలను కొనియాడారు. ఉత్సవ నిర్వాహకులు ఈనెల 26 రాత్రి అమ్మవారి గుడి వద్ద దొడ్డి మల్లయ్య పర్యవేక్షణలో పుట్టుక - కథా కాలక్షేపం 27వ సాయంత్రం మద్దాల చిరంజీవి, శరగడం పరుశురాంలు బహుకరించిన 54 ఇత్తడి ఘటాలు, శ్రీ గౌరీపరమేశ్వరి, శ్రీ కనకదుర్గ ఆలయాల కమిటీల ఆధ్వర్యంలో చిన్నారి దేవతల బండ్ల వేషాలు, మరిడిమాంబ కమిటీ ఆధ్వర్యంలో చిటికెలభజన, కోలాటం, కె ఎం డీజే తదితర జానపద కళారూపాలతో ఊరేగింపు అత్యంత వైభవంగా జరగనుంది అన్నారు. రాత్రి భీశెట్టి అప్పారావు కళ్యాణమండపం వద్ద డాన్స్ బేబీ డాన్స్, శతకంపట్టు వద్ద మళ్ల సత్యవతి స్మృత్యర్థం మధురం ఆర్కెస్ట్రా ఉంటాయని తెలియజేసారు.

## ఆటపాటలతో చదువుపై ఆసక్తి కలిగించాలి: సిడిపిఓ రమణి

మాకవరపాలెం, ఆగస్టు 25, ప్రభాతవార్త



జ్ఞాన జ్యోతి శిక్షణలో భాగంగా ఆటపాటల ద్వారా చిన్నారులకు విద్యపై ఆసక్తి కలిగించాలని ఐసిడిఎస్ సిడిపిఓ రమణి అన్నారు. ఈమేరకు మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో అంగన్వాడీ కార్యకర్తలకు ఆరు రోజులపాటు "జ్ఞానజ్యోతి" 6రోజుల శిక్షణా ముగింపు కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సిడిపిఓ రమణి అంగన్వాడీ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. శిక్షణలో ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం ద్వారా నేర్చుకున్న అంశాలను, అంగన్వాడి కేంద్రాల్లో అమలు చేయాలన్నారు. ఇంగ్లీషు భాషపై ప్రత్యేక శ్రద్ధ వహించి, ఆటపాటలతో చిన్నారులకు చదువు నేర్పించాలన్నారు. అంగన్వాడి కేంద్రాలకు తూచా తప్పకుండా చిన్నారులు వచ్చే విధంగా ఆసక్తికరమైన ఆటపాటలతో కార్యకర్తలు కేంద్ర పరిసరాలను ఆహ్లాదకరంగా ఉంచాలని సిడిపిఓ తెలిపారు. మండల విద్యాశాఖ అధికారి-2 పిఎస్ఎన్ మూర్తి, రిసోర్స్ పర్సన్‌గా వి.ప్రసాద్, జి.కరుణ, సూపర్వైజర్స్ బి.రమణమ్మ, జి.సరోజినీ, కె.సత్యవతి, మాకవరపాలెం మండలం సెక్టార్ పరిధిలోని అందరూ అంగన్వాడీ కార్యకర్తలు హాజరయ్యారు.

## కళాకారుల సమస్యల పరిష్కారం చేయాలి : ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి డిమాండ్




అనకాపల్లి, ఆగస్టు 25, ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా కళాకారుల సమస్యల పరిష్కారం కోరుతూ మంగళవారం అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ ధర్నా కార్యక్రమాన్ని ఉద్దేశించి రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్.అప్పన్న జిల్లా ప్రధాన కార్యదర్శి జి.దేవుడుబాబు మాట్లాడుతూ గ్రామీణ కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని దానిలో భాగంగానే రాష్ట్ర సాంస్కృతిక శాఖకు ప్రత్యేక రూ.500 కోట్లు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. కూటమి ప్రభుత్వం అర్హత కలిగిన 50 సంవత్సరాలు నిండిన ప్రతి పేద కళాకారునికి పదివేల రూపాయలు పెన్షన్ ఇవ్వాలని, ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక సారథిని ఏర్పాటు చేసి కళాకారులకు ఉద్యోగాలు కల్పించాలని. ప్రతి కళాకారునికి గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని నెలలో కనీసం 15 రోజుల పాటు కళాకారులకు వేతనంతో కూడిన కళా ప్రదర్శనకు అవకాశాలు కల్పించాలని అన్నారు. నంది నాటకోత్సవాలలో గ్రామీణ జానపద కళారూపాల విభాగాలను పోటీలలో చేర్చాలి, ప్రతి యేట తప్పనిసరిగా నంది నాటకోత్సవాలు నిర్వహించాలని, ఏడాదిలో నిర్దిష్టమైన క్యాలెండర్‌ను రూపొందించి కళారంగాన్ని అభివృద్ధి పరచాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి జిల్లా గౌరవ అధ్యక్షులు రాజాన దొరబాబు, జిల్లా అధ్యక్షులు ఎం.రాజునాయుడు, జిల్లా సహాయ కార్యదర్శి కె.వి.రమణ, జిల్లా నాయకులు పొంత పల్లి రామారావు, వేచలపు కాసుబాబు, వైఎస్ భద్రం, రెడ్డి అప్పలనాయుడు, వియ్యపు రాజు, కండే పెల్లి త్రినాథ్, తప్పుడు గుళ్ళు, కోలాటం, నాటిక కళాకారులు పాల్గొన్నారు.

## రేబాక గూడుపమ్మ తల్లికి కుంకుమ పూజలు



(నక్కపల్లి, ప్రభాతవార్త)

మండలంలోని రేబాక గూడుపమ్మ తల్లిని మంగళవారం వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి దగ్గుపల్లి సాయిబాబా, పాయకరావుపేట పంచాయతీ మాజీ ఉప సర్పంచ్ జగతా శ్రీనులు దర్శించుకున్నారు. ఆలయంలో అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. వారి గోత్రనామాలతో ఆలయంలో పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త గొట్టుముక్కల శ్రీహరి రాజు ఆధ్వర్యంలో దగ్గుపల్లి సాయిబాబా, జగతా శ్రీనులను ఘనంగా సత్కరించారు. అనేక ప్రాంతాల నుంచి భక్తులు మంగళవారం అమ్మవారి ఆలయానికి వచ్చారు. కొంతమంది కుటుంబ సభ్యులు వంటలు చేసుకుని భోజనాలు చేసి సందడిగా గడిపారు.




## కాఫీ పొడి తయారీ కేంద్రానికి స్పీకర్ శంకుస్థాపన

మాకవరపాలెం, ఆగస్టు 25, ప్రభాతవార్త



మాకవరపాలెం మండలం శెట్టిపాలెం సమీపంలో రూ.10 కోట్లు మంజూరైన కాఫీ పొడి తయారీ కేంద్రానికి స్పీకర్ అయ్యన్న చేతుల మీదుగా శంకుస్థాపన చేయనున్నట్లు శెట్టిపాలెం మాజీ తాజా సర్పంచ్ అల్లు రామునాయుడు తెలిపారు. ఈమేరకు మంగళవారం శెట్టిపాలెం కాఫీ పొడి తయారీ కేంద్రాన్ని శంకుస్థాపన చేసే ప్రాంతాన్ని గిరిజన కార్పొరేషన్ జనరల్ మేనేజర్ దేవరాజు విశ్వనాథం, తన సిబ్బందితో కలిసి స్థల పరిశీలన చేశారు. జిసిసి అధికారులతో స్పీకర్ శంకుస్థాపన చేయనున్న స్థలాన్ని అధికారులతో కలిసి పరిశీలించిన రామునాయుడు ఈసందర్భంగా మాట్లాడారు. నర్సీపట్నం నియోజవర్గంలో స్పీకర్ అయ్యన్న పాత్రుడు కృషితో మాకవరపాలెం పారిశ్రామిక అభివృద్ధిలో భాగంగా తొలి అడుగుగా శెట్టిపాలెంలో సెప్టెంబర్ 4వ తేదీ శంకుస్థాపన చేయనున్నట్లు ఆయన తెలిపారు. రూ,10కోట్ల వ్యయంతో నిర్మించ తలపెట్టిన కాఫీ పొడి తయారీ కేంద్రం శెట్టిపాలెం-భీమబోయినపాలెం గ్రామాల పరిధిలో శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించనున్న అయ్యన్నపాత్రుడుకి ఈప్రాంత ప్రజలు ఆజన్మాంతం రుణపడి ఉంటారన్నారు. కార్యక్రమంలో జిసిసి సిబ్బంది భీమబోయినపాలెం తాజా మాజీ సర్పంచ్ రుత్తల నందకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## పోలవరం జలహారతి కార్యక్రమంపై హోం మంత్రి అనిత సమీక్ష



(నక్కపల్లి, ప్రభాతవార్త)

పోలవరం ఎడమ కాలువ ద్వారా నీటి విడుదల సందర్భంగా వచ్చే నెల మొదటి వారంలో నిర్వహించనున్న జలహారతి కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరు కానున్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో నక్కపల్లి మండలం సారిపల్లిపాలెంలోని హోం మంత్రి వంగలపూడి అనిత, తన నివాసం వద్ద అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, జాయింట్ కలెక్టర్‌తో పాటు రెవెన్యూ, ఇరిగేషన్, అగ్రికల్చర్ శాఖల అధికారులతో చర్చించారు. పోలవరం ఎడమ కాలువ ద్వారా నీరు ఏ విధంగా రానుంది, కాలువ పరిధిలోని ప్రాంతాలకు నీటి సరఫరా ఎలా ఉండనుందనే అంశాలను అధికారులు మ్యాప్ ద్వారా హోం మంత్రి అనితకు వివరించారు. పోలవరం ఎడమ కాలువ ద్వారా పాయకరావుపేట నియోజకవర్గంలో సుమారు 35 వేల ఎకరాలకు సాగునీరు అందనుందని మంత్రి అనిత తెలిపారు. జలహారతి కార్యక్రమంలో రైతులను భాగస్వామ్యం చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటనకు సంబంధించి అన్ని ఏర్పాట్లను పక్కాగా పూర్తి చేయాలని, అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని హోం మంత్రి అనిత సూచించారు. సీఎం పర్యటనలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆమె ఆదేశించారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు కొండంత భరోసా

అనకాపల్లి, ఆగస్టు 25, ప్రభాతవార్త



అనారోగ్యానికి గురై ఖరీదైన వైద్య చికిత్సలు చేయించుకోలేని నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఒక వరంగా నిలుస్తోందని కూటమి నాయకులు పేర్కొన్నారు. మాజీ మంత్రి, అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ ఆదేశాల మేరకు, అనకాపల్లి జనసేన పార్టీ ఇంచార్జ్ బీమర శెట్టి రామ్కి సూచనలతో అనకాపల్లి నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాలకు చెందిన చికిత్స పొందిన లబ్ధిదారులకు సుమారు రూ.3,19,201 విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను కూటమి నాయకులు మంగళవారం లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి స్వయంగా అందజేశారు. అనకాపల్లి మండలం దిబ్బపాలెం, సంపత్‌పురం పంచాయతీ తమ్మయ్య పేట, వేట జంగాలపాలెం, బగులవాడ, పిసినికాడ పంచాయతీ బీఆర్టీ కాలనీ, అనకాపల్లి పట్టణం 82వ వార్డుకు చెందిన లబ్ధిదారులకు ఈ చెక్కులను అందజేశారు. నాయకులు మాట్లాడుతూ, ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఖరీదైన వైద్య చికిత్సలు చేయించుకోలేని పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో గొప్ప భరోసాగా నిలుస్తోందన్నారు. గత 25 నెలల కాలంలో అనకాపల్లి నియోజకవర్గంలో వందలాది మంది లబ్ధిదారులకు సహాయ నిధి చెక్కులు అందించినట్లు తెలిపారు. భవిష్యత్తులో కూడా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా సహాయం అందేలా కృషి కొనసాగిస్తామని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి నియోజకవర్గ కూటమి నాయకులు ఆళ్ల రామచంద్రరావు, మల్ల శ్రీనివాసరావు, చదరం నాగేశ్వరరావు, బర్నికాన రాము, పాల్గొన్నారు.

## సమస్యలపై బిసి కమిషన్ ఛైర్‌పర్సన్‌కు వినతిపత్రం అందజేసిన అశోక్ చక్రవర్తి



(నక్కపల్లి, ప్రభాతవార్త)

మండలంలోని పాల్మన్ పేట గ్రామానికి చెందిన మత్స్యకార నాయకుడు మైలపల్లి అశోక చక్రవర్తి మంగళవారం న్యూ ఢిల్లీలోని మోతీబాగ్ బంగ్లా నంబర్ 14లో జాతీయ బిసి కమిషన్ ఛైర్ పర్సన్ సాధ్వి నిరంజన్ జ్యోతిని కలిశారు. రాష్ట్రంలోని వివిధ బిసి కులాల సామాజిక, ఆర్థిక పరిస్థితులను వివరిస్తూ బిసి వర్గాలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అంద జేశారు. బిసిలకు విద్య, ఉపాధి, ఆర్థిక రంగాల్లో మరిన్ని అవకాశాలు కల్పించాల్సిన ఆమె దృష్టికి తీసుకు వెళ్లారు. రాష్ట్రంలోని బిసిల ఎదుర్కొంటున్న సమస్యలపై తాను అందజేసిన వినతిపత్రాన్ని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని బిసి కమీషన్ ఛైర్ పర్సన్ సాధ్వి నిరంజన్ జ్యోతి హామీ ఇచ్చారని అశోక్ చక్రవర్తి తెలిపారు.

## అగనంపూడి సమస్యలపై జీవీఎంసీ అదనపు కమిషనర్ డివి రమణమూర్తికి బలిరెడ్డి వినతి

అగనంపూడి, ప్రభాతవార్త



జీవీఎంసీ అదనపు కమిషనర్ డివి రమణమూర్తిని ఎడిసి చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ కలిసి వినతిపత్రం అందజేశారు. జీవీఎంసీ 79, 85 వార్డులకు అనుసంధానంగా ఉన్న జాతీయ రహదారి ఇరుపక్కల ఉన్న షాపుల్లోపనిచేసే వారికి, బ్యాంకు, నెట్ షాపులకు వచ్చేవారికి, వినియోగదారులు, ప్రయాణికులకు, ఏరియా ఆసుపత్రి పేషెంట్స్ సహాయకులకు సౌకర్యంగా అగనంపూడి సెంటర్లో ఉన్న పాత పంచాయత్ ఆఫీస్ వద్ద ప్రజా మరుగుదొడ్డు నిర్మాణం చేయాలని, అగనంపూడి నిర్వాసిత కాలనీ ప్రజలకు మానసిక వికాసానికి విజ్ఞానానికి దోహదపడే విధంగా అగనంపూడి జాతీయ రహదారి ప్రక్కన ఉన్న ఎన్టీఆర్ పార్కు డిజిటల్ లైబ్రరీగా ఉపయోగించాలని, లంకెలపాలెం నుండి కూర్మన్నపాలెం వరకు జాతీయ రహదారికి ఇరు ప్రక్కల సర్వీసు రోడ్లు తక్షణమే వేసి రోడ్డు ప్రమాదాలు నివారించాలని, 84వ వార్డు ఏలేరు కాలువ లోనికి కొప్పాక పరిసర ప్రాంతాల మురికి నీరు వెళ్లి త్రాగే మంచినీటిని కలుషితం అవుచున్నది మంచినీరు నీరుకలుషితం కాకుండా చర్యలు తీసుకోవాల్సిందిగా వినతి పత్రంలో కోరారు.

## మాకవరపాలెంలో విజయవంతంగా జాబ్ మేళా



మాకవరపాలెం, ఆగస్టు 25, ప్రభాతవార్త

మండల కేంద్రంలో మాకవరపాలెంలో మాజీ ఉపసర్పంచ్ లాలం రాము ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా ఉద్యోగమేళా విజయవంతంగా జరిగింది. ఈ మేరకు మంగళవారం స్థానిక గ్రంథాలయం ఆవరణలో నిర్వహించిన జాబ్-మేళాలో పలు కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. జాబ్ మేళా నిర్వాహకులు లాలం రాము మాట్లాడుతూ మాకవరపాలెంలో నిర్వహించిన జాబు మేళ కార్యక్రమానికి యువత నుంచి విశేషమైన స్పందన వచ్చిందని వివిధ గ్రామాల నుంచి యువతీ యువకులు 97మంది హాజరైనట్టు రాము తెలిపారు. కియా, వాట్సన్, ఐటిసి, క్విజ్ కార్పొరేషన్ లిమిటెడ్, స్కినే డర్ కంపెనీలు హాజరైనట్లు తెలిపారు. జాబ్ మేళా కార్యక్రమానికి 82 మంది యువకులు, 15మంది యువతులు హాజరైనట్లు తెలిపారు. వీరిలో వివిధ కంపెనీలకు చెందిన ప్రతినిధులు 42మందిని ఎంపిక చేసినట్లు లాలం రాము తెలిపారు. పైల విక్రమ్, పలువురు, యువకులు పాల్గొన్నారు.

## ఆమె.. ధైర్యానికి హ్యాట్సాఫ్

(నక్కపల్లి, ప్రభాతవార్త)



పాయకరావుపేట మండలం శివారు గ్రామాల పరిధిలో పోలవరం ఎడమ కాలువ పనులు ప్రారంభించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వస్తున్న నేపథ్యంలో ఏర్పాట్లు పరిశీలించడానికి వచ్చిన రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ఆ కాలువ గట్టుపై ధైర్యంగా ఎక్కి హ్యాట్సాఫ్ అనిపించారు. ఆమెతో వచ్చిన అధికారులు ప్రజాప్రతినిధులు ఒకసారిగా ఆశ్చర్యపోయారు. ఆ కాలువ పనులు చూసిన ఆమె సంతోషం వ్యక్తం చేశారు. ఇది తన జీవితంలో మర్చిపోలేనిదని అభివర్ణించారు.

# విశాఖలో ఘనంగా 'ఆంధ్రప్రదేశ్ జానపద కళా వైభవం - 2026'

**జానపద కళాకారులకు వెన్నుదన్నుగా ఉంటాం: జీవీ రామచంద్రరావు -ఘనంగా పురస్కారాల ప్రదానం, సావనీర్ ఆవిష్కరణ**




విశాఖపట్నం, ప్రభాతవార్త

అంతర్జాతీయ జానపద దినోత్సవాన్ని పురస్కరించుకుని అభయ్ ప్రొడక్షన్స్ ఆధ్వర్యంలో సిరిపురంలోని వుడా చిల్డ్రన్స్ థియేటర్‌లో "ఆంధ్ర ప్రదేశ్ జానపద కళా వైభవం - 2026" వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన 35 ప్రసిద్ధ జానపద కళారూపాల బృందాలు, సుమారుగా 700మంది కళాకారులకు అభినందన పురస్కారాలు, ప్రశంసా పత్రాలు, మెమొంటోస్, ముఖ్య అతిథులు చేతుల మీదుగా అందజేశారు. ఇదే వేదికపై జానపద కళారూపాల ప్రత్యేక వెబ్‌సైట్‌తో పాటు సావనీర్ బుక్‌ను ప్రముఖులు ఆవిష్కరించారు.

### హాజరైన ప్రముఖులు

ఈ వేడుకల్లో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, పూర్వ ఫిల్మ్ సెన్సార్ బోర్డు మెంబర్ జీవీ రామచంద్రరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. గౌరవ అతిథులుగా మాజీ రాజ్యసభ సభ్యులు, పద్మభూషణ్ ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, ఎస్.ఆర్.కె.పి గ్రూప్ చైర్మన్ ఎమ్.ఎస్.ఎన్. రాజు, లీడర్ పత్రిక అధినేత వి.వి. రమణమూర్తి, తెలుగు పౌరాణిక పద్యనాటక కళాశారది మంగాదేవి తదితరులు విచ్చేశారు. కళారంగ సేవలకు గుర్తింపుగా పలువురు ప్రముఖులకు నిర్వాహకులు ప్రత్యేక పురస్కారాలను అందజేశారు.

### 700 మంది కళాకారులకు భోజన సదుపాయం - జీవీ రామచంద్రరావుకు ప్రశంసలు

కార్యక్రమానికి విచ్చేసిన దాదాపు 700 మంది జానపద కళాకారులకు మాజీ ఫిల్మ్ సెన్సార్ బోర్డు మెంబర్ జీవీ రామచంద్రరావు స్వయంగా భోజన సదుపాయాలను సమకూర్చారు. కళాకారుల పట్ల ఆయన చూపిన ఔదార్యాన్ని వేదికపై ఉన్న అతిథులందరూ కొనియాడారు. అనంతరం జీవీ రామచంద్రరావు మాట్లాడుతూ ప్రాచీన జానపద కళలను కాపాడుతున్న కళాకారులకు ఎల్లప్పుడూ తనవంతు సహాయ సహకారాలు ఉంటాయని, వారికి ఆర్థికంగా, ఆరోగ్యపరంగా అన్నివేళలా వెన్నుదన్నుగా నిలుస్తానని భరోసా ఇచ్చారు.

### అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ట్రస్టీ చెరువు రామకోటయ్య చీఫ్ కన్వీనర్‌గా, మేడా మస్తాన్ రెడ్డి ఆహ్వాన కమిటీ తరపున వ్యవహరించగా, ధనుంజయ్ – అభయ్ ప్రొడక్షన్స్ ఆధ్వర్యంలో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. వివిధ ప్రాంతాల కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

# ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్ల ముసాయిదా జాబితా ప్రకటన

(నక్కపల్లి, ప్రభాతవార్త)



రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశాల మేరకు మండలంలోని 33 పంచాయతీలకు ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు సంబంధించిన ఓటర్ల ముసాయిదాను స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం ఎంపీడీవో కే.చలపతిరావు ఆధ్వర్యంలో ప్రచురించారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో విడుదల చేయడం జరిగిందని 25వ తేదీ నుంచి వాటిపై ప్రజల అభ్యంతరాలు ఏమైనా ఉంటే తెలియజేయవచ్చని పేర్కొన్నారు. ఆయనతోపాటు ఏవో దెందుకూరు సీతారామరాజు, కార్యదర్శి చిన్నం నాయుడు తదితరులు ఉన్నారు.

# నాటు వైద్యం నమ్మి.. యువకుడి ప్రాణం బలి!

**పాముకాటుకు గురైన యువకుడు మృతి.. తండ్రి ఆవేదనతో కన్నీటి పర్యంతం**



బుచ్చయ్యపేట, ఆగష్టు 25 ప్రభాతవార్త

అనకాపల్లి జిల్లా బుచ్చయ్యపేట మండలం చిన్నప్పన పాలెం గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. పాముకాటుకు గురైన యువకుడిని సకాలంలో ఆస్పత్రికి తరలించకుండా నాటు వైద్యం చేయించడంతో ప్రాణాలు కోల్పోయిన ఘటన గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది.గ్రామానికి చెందిన లిలిపైలా ప్రసాద్ తన పొలంలో ఆవును తోలుకెళ్తున్న సమయంలో పాముకాటుకు గురయ్యాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెంటనే సమీప ఆస్పత్రికి తరలించాల్సింది పోయి స్థానిక నాటు వైద్యుడిని ఆశ్రయించినట్లు సమాచారం. బాధితుడి కాలికి పసరు మందు రాసి ఇంటికి పంపించినట్లు తెలిసింది.అయితే రాత్రి గడిచేకొద్దీ విషం శరీరంలో వ్యాపించడంతో ప్రసాద్ పరిస్థితి మరింత విషమించింది. తెల్లవారుజామున కుటుంబ సభ్యులు హుటాహుటిన అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే అతడు మృతి చెందినట్లు సమాచారం. సకాలంలో నా కొడుకును ఆస్పత్రికి తీసుకెళ్లి ఉంటే బతికేవాడు.. నా అనాలోచిత నిర్ణయమే నా కొడుకు ప్రాణం తీసింది"అంటూ తండ్రి రోదించడం అక్కడున్న వారిని కంటతడి పెట్టించింది.ప్రసాద్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. పాముకాటు వంటి అత్యవసర పరిస్థితుల్లో నాటు వైద్యాలను నమ్మకుండా వెంటనే సమీప ప్రభుత్వ లేదా సరైన ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

# రైతు ఐడీ నమోదు చేసుకోవాలి : తహసీల్దార్ చిన్నికృష్ణ

(నక్కపల్లి,ప్రభాతవార్త)



తహసీల్దార్ కార్యాలయంలో విఆర్ఓ, ఆర్ఎస్ కే సిబ్బందికి తాసిల్దార్ చిన్ని కృష్ణ సమన్వయ సమీక్ష నిర్వహించారు. మండలంలోని సుమారు పిఎం కిసాన్ రైతులు 15107 ఉండగా 11826 మందికి రైతు ఐడి నమోదు చేసుకోవడం జరిగిందని, ముఖ్యంగా 1351 రైతులకి పి ఎం కిసాన్ లబ్ధి చేరుతూ రైతు ఐడి నమోదు చేసుకో లేదని, తక్షణమే రైతు ఐడి నమోదు చేసుకోకపోతే వారికి పి ఎం కిసాన్ నిధులు జమ ఆగిపోతాయి అని సూచించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతుల వివరాలను డిజిటల్‌గా నమోదు చేసేందుకు రైతు ఐడీ కార్యక్రమాన్ని అమలు చేస్తుందని, ప్రతి రైతు తప్పనిసరిగా రైతు ఐడీ నమోదు చేసుకోవాలని వ్యవసాయ అధికారి సూచించారు.వివిధ గ్రామాల్లో మిగిలిపోయిన రైతులు అందరికీ రైతు ఐడి నమోదు చేయించాలని విఆర్ఓల, ఆర్ ఎస్ కే సిబ్బందికి తహసీల్దార్ ఆదేశాలు ఇచ్చారు. ఈ సమీక్షా కార్యక్రమంలో ఏ ఈ ఓ లు సత్యనారాయణ, సాయి, శ్రీనివాస్, ఆర్ఐలు ,వి ఆర్ ఓ లు,ఆర్ ఎస్ కే సిబ్బంది పాల్గొన్నారు.

# జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమం విజయవంతం

(రాంబిల్లి ఆగస్టు 25 ప్రభాతవార్త)



జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల రాంబిల్లిలో అంగన్వాడీ టీచర్లకు నిర్వహించిన జ్ఞానజ్యోతి శిక్షణా కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. శిక్షణలో అంగన్వాడీ టీచర్లు ఎంతో ఆసక్తిగా పాల్గొని బాల్యదశ ప్రాముఖ్యత, చిన్నారుల అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను నేర్చుకున్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు యం.సూర్యారావు, సూర్యనారాయణ, ప్రధానోపాధ్యాయులు ఖగేశ్వరరావు పాల్గొని విలువైన సూచనలు అందించారు. రిసోర్స్ పర్సన్స్ అంగన్వాడీ సూపర్‌వైజర్ రాణి, బి.మనోహర్, బి. రాజుబాబు బాల్యదశ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. శిక్షణ కార్యక్రమం విజయవంతంగా ముగియడంతో నిర్వాహకులు, అంగన్వాడీ టీచర్లు హర్షం వ్యక్తం చేశారు.

# స్కూల్ పిల్లల ఆటోపైకి దూసుకెళ్లిన బోర్వెల్స్ లారీ..

**తప్పిన పెను ప్రమాదం!**

గాజువాక,ఆగష్టు 25,ప్రభాతవార్త



జీవీఎంసీ 63వ వార్డు జై ఆంధ్ర కాలనీలో మంగళవారం సాయంత్రం వేళ తీవ్ర భయాందోళనకర ఘోర ప్రమాదం తృటిలో తప్పింది. స్కూలు పిల్లలతో వెళ్తున్న ఒక ఆటోపైకి బోర్వెల్స్ లారీ బ్రేకులు ఫెయిల్ అయి వేగంగా దూసుకెళ్లింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండ ప్రాంతంలో బోరు బావి తవ్వకం పూర్తి చేసుకుని తిరిగి కిందకు వస్తున్న బోర్వెల్స్ వాహనానికి అకస్మాత్తుగా బ్రేకులు ఫెయిల్ అయ్యాయి. అదే సమయంలో పాఠశాల ముగిసిన తర్వాత పిల్లలతో ఇంటికి వెళ్తున్న ఆటోపైకి ఆ వాహనం నియంత్రణ కోల్పోయి వేగంగా దూసుకొచ్చింది. అయితే, ఆటో వెంటనే పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొని దానికి ఆనుకుని ఆగిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో ఆటోలోని విద్యార్థులు స్వల్ప గాయాలతో బయటపడటంతో తల్లిదండ్రులు, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. గాయపడిన పిల్లలకు వెంటనే స్థానికులు ప్రథమ చికిత్స అందించారు. ఘటన పై మల్కాపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# సమస్యల పరిష్కారానికి హోం మంత్రి అనితకు కాంట్రాక్టర్ వైద్య సిబ్బంది వినతి



**నల్ల బ్యాడ్జీలతో నిరసన..**

(నక్కపల్లి, ప్రభాతవార్త)

రాష్ట్రంలోని వైద్య ఆరోగ్య శాఖ కాంట్రాక్టు కార్మికుల జాయింట్ యాక్షన్ కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు నక్కపల్లి సెక్టార్ పరిధిలో ఉన్న కాంట్రాక్టర్ కార్మికులు నల్ల బ్యాడ్జీలతో వారి దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం పై ఆందోళనలు చేపట్టారు. మండలానికి వచ్చిన రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనితను మర్యాదపూర్వకంగా కలిసిన కాంట్రాక్ట్ వైద్య సిబ్బంది వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులను తక్షణమే రెగ్యులర్ చేయాలని ,ప్రక్రియ పూర్తి చేసి ఉద్యోగులందరికీ నూటికి నూరు శాతం గ్రాస్ వేతనం ఇవ్వాలని, మరణించిన ప్రతి కాంట్రాక్టు ఉద్యోగికి 50 లక్షలు ఇవ్వాలని, కుటుంబంలో ఒకరు ఉద్యోగ అవకాసం కల్పించాలని, హెల్త్ కార్డు మంజూరు చేయాలని ఈపీఎఫ్ కల్పించాలని పూర్తి వేతనంతో కూడిన సెలవులు మంజూరు చేయాలని తదితర సమస్యలతో కూడిన వినతపత్రాన్ని ఎం.సౌమ్య, ఆర్.వరలక్ష్మి, జి.వనిత, కె.రాముతాలు, ఎన్ఏఎస్‌కే కే.భవాని,జీవనజ్యోతి, ఉమాదేవి, ఎస్సైఈడి ఇమామ్, శివప్రసాద్ వర్మ తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. స్పందించిన రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ముందుగా సమస్యలు పరిష్కారం కోసం రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపిన కాంట్రాక్టర్ వైద్య సిబ్బంది స్థానిక నక్కపల్లి సర్కిల్లో ఎస్సై సన్నిబాబుకు ఆందోళన విషయాన్ని తెలియజేశారు. సమస్యల పరిష్కారంపై రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు పరిష్కారం అయ్యేంతవరకు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలియజేస్తామని విధులకు హాజరు అవుతామని కాంట్రాక్ట్ ఉద్యోగ సంఘాలు తెలిపారు.




# జీవీఎంసీలో గ్రామాల విలీనానికి గ్రామసభలు



ఆనందపురం, ఆగష్టు 25, ప్రభాతవార్త

జీవీఎంసీలో విలీనం చేసేందుకు ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాల మేరకు ఆనందపురం మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం అధికారులు గ్రామసభలు నిర్వహించారు. గిడిజాల, రామవరం, వెల్లంకి, చందక, శొంట్యాం, బోని, ముకుందపురం, భీమన్నదొరపాలెం, శిర్లపాలెం, పాలవలస, కుసులువాడ గ్రామాల్లో గ్రామసభలు జరిగాయి. ఈ సందర్భంగా జీవీఎంసీ పాలనలోకి వచ్చిన అనంతరం గ్రామాల్లో చేపట్టనున్న అభివృద్ధి పనులు, మౌలిక వసతుల కల్పన, ప్రజలకు అందే పౌర సేవలు తదితర అంశాలను అధికారులు ప్రజలకు వివరించారు. అనంతరం గ్రామాల విలీనానికి సంబంధించి ప్రజల నుంచి ఆమోదాలను స్వీకరించారు. మండలంలోని మిగిలిన 15 పంచాయతీల్లో గురువారం గ్రామసభలు నిర్వహించి, విలీన ప్రక్రియపై ప్రజల అభిప్రాయాలు, ఆమోదాలను తీసుకోనున్నట్లు అధికారులు తెలిపారు. దీంతో ఆనందపురం మండలంలోని గ్రామాల జీవీఎంసీ విలీన ప్రక్రియలో గ్రామసభలు కీలక దశగా మారాయి.

# పోర్ట్ డిప్యూటీ చైర్‌పర్సన్‌కు 68వ వార్డు సమస్యలను పరిష్కరించాలని మాజీ కార్పొరేటర్ గుడివాడ అనూష లతీష్ వినతి

గాజువాక,ఆగష్టు 25,ప్రభాతవార్త



జీవీఎంసీ 68వ వార్డు పరిధిలోని మింది, పంచవటి టౌన్‌షిప్, అక్కిరెడ్డిపాలెం ప్రాంత సమస్యలపై విశాఖ పోర్ట్ అథారిటీ డిప్యూటీ చైర్‌పర్సన్ రోష్ని అపరంజి కొరటికి వార్డు మాజీ కార్పొరేటర్ గుడివాడ అనూష, రాష్ట్ర వైకాపా సంయుక్త కార్యదర్శి గుడివాడ లతీష్ లు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మింది సమీపంలోని గోడౌన్లలో బొగ్గు, గ్రీన్ పెట్రో కోక్ నిల్వల వల్ల ఎగిసిపడుతున్న దుమ్ముతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కాలుష్య నివారణకు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. మింది-పంచవటి టౌన్‌షిప్ మధ్య ఉన్న పోర్ట్ ఖాళీ స్థలంలో బొటానికల్ గార్డెన్ నిర్మించాలని, అక్కిరెడ్డిపాలెం టోల్‌గేట్ వద్ద కొత్తగా కాలుష్యకారక గోడౌన్లకు అనుమతులివ్వొద్దని విజ్ఞప్తి చేశారు. అలాగే మింది గ్రామ డ్రైనేజీ సమస్య పరిష్కారానికి జీవీఎంసీకి అవసరమైన పోర్ట్ స్థల అనుమతులు ఇవ్వాలని లేదా పోర్ట్ యాజమాన్యమే స్వయంగా డ్రెయిన్ పనులు చేపట్టాలని కోరుతూ వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు.

# గాజువాక సమగ్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తోడ్పడాలి



**-ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు**

గాజువాక,ఆగష్టు 25,ప్రభాతవార్త

కూటమి ప్రభుత్వంలో ఇప్పటివరకు రూ 250 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని, మరో రూ 300 కోట్లతో నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని గాజువాక ఎమ్మెల్యే, తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తెలిపారు. గాజువాక జీవీఎంసీ జోనల్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గాన్ని సుందరంగా తీర్చిదిద్దడమే తన ప్రథమ లక్ష్యమని తెలిపారు. పాత గాజువాక నుంచి శ్రీనగర్ వరకు సర్వీస్ రోడ్డు నిర్మాణానికి త్వరలోనే శంకుస్థాపన చేస్తామని వెల్లడించారు. పెదగంట్యాడ ప్రధాన రహదారి 150 అడుగుల వెడల్పు ఉండేలా చూడాలని, జగ్గు జంక్షన్ నుంచి గంగవరం పోర్ట్ మార్గంలో కాలుష్య నివారణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నియోజకవర్గంలో 6 అధునాతన స్టేడియంలు, వార్డుల్లో బాక్స్ క్రికెట్ మైదానాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రజలకు సేవలు అందించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ సమావేశంలో జోనల్ కమిషనర్ శేషాద్రి నాయుడు, ఈఈ రాయల్ బాబు, తెదేపా నాయకుడు ప్రసాదుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బి.పి. మండల్ జయంతి

గాజువాక,ఆగష్టు 25,ప్రభాతవార్త



బీసీల అభ్యున్నతికి, రిజర్వేషన్ల సాధనకు కృషి చేసిన బి.పి. మండల్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. గాజువాక టిడిపి కార్యాలయంలో బీసీ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల్ జయంతి వేడుకల్లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ... వెనుకబడిన వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించేందుకు మండల్ చేసిన పోరాటం అభినందనీయమన్నారు. నాడు ఎన్టీఆర్, నేడు సీఎం చంద్రబాబు నాయుడు బీసీలకు 34శాతం రిజర్వేషన్లు కల్పించి అక్కున చేర్చుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రసాదుల శ్రీనివాస్, బోండా జగన్, ఎల్లపు ప్రసాద్, తమ్మిరే శివప్రసాద్, డి.వి. సత్యారావు, సువర్ణపుడి రాంబాయి, విజయరామరాజు, బుట్ట ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# మెప్మా ఆర్పీల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి

**ఏపీ మెప్మా ఆర్.పి ఉద్యోగుల సంఘం (సిఐటియు) డిమాండ్**

విశాఖపట్నం, ఆగష్టు 25, ప్రభాతవార్త



మెప్మా ఆర్పీ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏపీ మెప్మా ఆర్.పి ఉద్యోగుల సంఘం (సిఐటియు) నేతలు డిమాండ్ చేశారు. మెప్మా ఆర్పీ ఉద్యోగుల 3నెలల బకాయి జీతాలు చెల్లించాలని, పనికి తగ్గ వేతనం పెంచాలని, దీర్ఘకాలికంగా పెండింగ్లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో వారు మాట్లాడుతూ మెప్మా ఆర్పీ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల కోసం గాంధీ విగ్రహం వద్ద నిరసనకు దిగాల్సిన పరిస్థితి రావడం బాధాకరం అన్నారు. కనీస వేతనం రూ.26,000 అమలు చేసి, జీతాలు సకాలంలో చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. ఆర్పీలపై రాజకీయ వేధింపులను తక్షణమే ఆపాలన్నారు. అవసరం లేని యాప్‌లు, అదనపు ఆన్‌లైన్ పనులను రద్దు చేసి ఆర్పీలకు పని ఒత్తిడిని తగ్గించాలని కోరారు. సచివాలయ ఉద్యోగులు చేయాల్సిన పనులను ఆర్పీలపై మోపడం సరికాదన్నారు. లాగిన్‌లు నిలిపివేసిన ఆర్పీలకు వెంటనే లాగిన్ సౌకర్యం కల్పించాలన్నారు. లాగిన్‌లు ఆపడం ద్వారా వారి విధులను, ఉపాధిని అడ్డుకోవడం తగదని చెప్పారు. ఆర్పీల సేవలను ప్రభుత్వం గుర్తించాలన్నారు. పట్టణ పేదల సంక్షేమం, మహిళా సంఘాల బలోపేతం, ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో వారు కీలకంగా పనిచేస్తున్నారని తెలిపారు. విశాఖలో ఆర్పీలు చేస్తున్న నిరసనను ప్రభుత్వం సానుకూలంగా తీసుకుని, చర్చలు జరిపి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు.

# రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



ఆరిలోవ,ఆగష్టు 25, ప్రభాతవార్త

సాగర్ నగర్ రాడిసన్ బ్లూ హోటల్ లో పనిచేస్తున్న మిధు బారుయి అనే మహిళ రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు ఆరిలోవ సిఐ ఎస్. శ్రీనివాస్ తెలిపారు. ఈ ప్రమాదంపై సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. నరవ నరేంద్ర, మిధు బారుయి అనే ఈ ఇద్దరూ రాడిసన్ బ్లూ హోటల్ లో పనిచేస్తున్నారు. ఎండాడ వైభవ్ రెసిడెన్సీ లో నివాసం ఉంటున్నారు.మంగళవారం ఉదయం గం. 6. 10 లకు డ్యూక్ మోటారు సైకిల్ పై ఖాళీ మాత ఆలయం వైపు అతివేగంగా ప్రయాణిస్తూ సన్ కళాశాల ఎదురుగా వచ్చేటప్పటికి వేగాన్ని అదుపు చేయలేక గేట్ ఎదురుగా అవతల వైపు ఉన్న తాడి చెట్టుని డీకొని క్రింద లోతుగా ఉన్న పల్లం లోకి పడిపోయారు.చెట్టును గుద్దిన వేగనికి కింద ఉన్న రాళ్ల వలన మిధు బారుయి అనే మహిళకు బలంగా గాయాలయ్యాయి.నరేంద్రకు కొన్ని గాయాలు అయ్యాయి. ఉదయపు నడక నడిచే ఒక వ్యక్తి ఈ ఘటనను చూసి 108కు సమాచారం అందించారు. అప్పటికే మిధు బారుయి అనే మహిళ మృత్యువాత పడింది. గాయపడిన నరేంద్రను స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనకు కారణం ద్విచక్ర వాహనం అతివేగంగా నడపడం వల్లనేనని ప్రాథమిక దర్యాప్తులో తెలిసిందన్నారు. మృతదేహాన్ని కేజీహెచ్ కు తరలించి రాడిసన్ బ్లూ హోటల్ అసోసియేటివ్ డైరెక్టర్ (పీపుల్ అండ్ కల్చర్) రత్నకుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ శ్రీనివాస్ వెల్లడించారు.అతివేగం మహిళ ప్రాణాన్ని బలిగొంది..!

# ప్రమాదంలో మృతి చెందిన రాడిసన్ బ్లూ ఉద్యోగిని

ఆరిలోవ,ఆగష్టు 25, ప్రభాతవార్త

సాగర్ నగర్ రాడిసన్ బ్లూ హోటల్ లో పనిచేస్తున్న మిధు బారుయి అనే మహిళ రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు ఆరిలోవ సిఐ ఎస్. శ్రీనివాస్ తెలిపారు. ఈ ప్రమాదానికి సంబంధించి ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. నరవ నరేంద్ర, మిధు బారుయి అనే ఈ ఇద్దరూ రాడిసన్ బ్లూ హోటల్ లో పనిచేస్తున్నారు. ఎండాడ వైభవ్ రెసిడెన్సీ లో నివాసం ఉంటున్నారు.మంగళవారం ఉదయం గం. 6.10లకు డ్యూక్ మోటారు సైకిల్ పై ఖాళీ మాత ఆలయం వైపు అతివేగంగా ప్రయాణిస్తూ సన్ కళాశాల ఎదురుగా వచ్చేటప్పటికి వేగాన్ని అదుపు చేయలేక గేట్ ఎదురుగా అవతల వైపు ఉన్న తాడి చెట్టుని డీకొని క్రింద లోతుగా ఉన్న పల్లం లోకి పడిపోయారు.చెట్టును గుద్దిన వేగనికి కింద ఉన్న రాళ్ల వలన మిధు బారుయి అనే మహిళకు బలంగా గాయాలయ్యాయి.నరేంద్రకు కొన్ని గాయాలు అయ్యాయి. ఉదయపు నడక నడిచే ఒక వ్యక్తి ఈ ఘటనను చూసి 108కు సమాచారం అందించారు. అప్పటికే మిధు బారుయి అనే మహిళ మృత్యువాత పడింది. గాయపడిన నరేంద్రను స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనకు కారణం ద్విచక్ర వాహనం అతివేగంగా నడపడం వల్లనేనని ప్రాథమిక దర్యాప్తులో తెలిసిందన్నారు. మృతదేహాన్ని కేజీహెచ్ కు తరలించి రాడిసన్ బ్లూ హోటల్ అసోసియేటివ్ డైరెక్టర్ ( పీపుల్ అండ్ కల్చర్) రత్నకుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ శ్రీనివాస్ వెల్లడించారు.

# దువ్వాడలో డోర్ టూ డోర్ 'మీకోసం- మీ పోలీస్'

గాజువాక,ఆగష్టు 25,ప్రభాతవార్త



విశాఖపట్నం సిటీ పోలీస్ కమిషనర్ శంఖబ్రత బ్యాగచి ఆదేశాల మేరకు దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో 'మీకోసం- మీ పోలీస్' క్రైమ్ అవేర్‌నెస్ డోర్ టు డోర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. డీసీపీ (క్రైమ్స్) లతా మాధురి, ఏసీపీ వెంకట్రావు సూచనలతో పోలీస్ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి 'దొంగలు ఉంటారు.. జాగ్రత్త' అనే నినాదంతో నేర నివారణపై అవగాహన కల్పించారు. మహిళలు, వృద్ధులు అప్రమత్తంగా ఉండాలని, వాకింగ్ సమయంలో విలువైన ఆభరణాలు ధరించవద్దని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే 112 లేదా దువ్వాడ ఇన్‌స్పెక్టర్ జి.డి.బాబు (9490617922)కు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దువ్వాడ క్రైమ్ ఎస్ఐ సత్తిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

# సైబర్ నేరాలు..డ్రగ్స్‌పై అవగాహన ఉండాలి

**గాజువాక డబ్ల్యూఎస్ఐ హరిచందన**



గాజువాక,ఆగష్టు 25,ప్రభాతవార్త

ప్రస్తుత సమాజంలో సురక్షిత జీవనానికి విద్యార్థులు చట్టాలు, సైబర్ నేరాలు, డ్రగ్స్ దుష్ప్రభావాలపై అవగాహన కలిగి ఉండాలని గాజువాక డబ్ల్యూఎస్ఐ జి.హరిచందన పేర్కొన్నారు. ఇన్‌స్పెక్టర్ సీహెచ్.వాసు నాయుడు ఆదేశాల మేరకు షీలానగర్‌లోని ఎంపీఈవీ ఈఎం పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. హరిచందన మాట్లాడుతూ సోషల్ మీడియా, మొబైల్ వినియోగంలో అప్రమత్తత అవసరమన్నారు. గుర్తుతెలియని లింకులు, యాప్‌లను నమ్మవద్దని.. ఓటీపీలు, బ్యాంక్ వివరాలు, వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికీ చెప్పవద్దని సూచించారు. డ్రగ్స్‌కు అలవాటుపడితే జీవితాలు నాశనమవుతాయని, చెడు స్నేహాలకు దూరంగా ఉండి చదువుపై దృష్టి పెట్టాలని పిలుపునిచ్చారు. సమాజంలో మహిళల భద్రతకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ఏవైనా సమస్యలు ఎదురైతే ధైర్యంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులకు తెలియజేయాలన్నారు. యువత, విద్యార్థుల రక్షణకు గాజువాక పోలీస్ స్టేషన్ పరిధిలో నిరంతరం ఇటువంటి కార్యక్రమాలు చేపడతామని వివరించారు.

# గంజాయి తాగుతూ పట్టుబడ్డ ఇద్దరు యువకులు

**గాజువాకలో టాస్క్ ఫోర్స్ దాడులు.. ర్యాపిడ్ టెస్టులో పాజిటివ్**

గాజువాక,ఆగష్టు 25,ప్రభాతవార్త



నగరంలో గంజాయి వినియోగంపై విశాఖ పోలీసులు కఠిన చర్యలు వేగవంతం చేశారు. నగర పోలీస్ కమిషనర్ సంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు గాజువాక పోలీసులు, సిటీ టాస్క్ ఫోర్స్ (సీటీఎఫ్) సిబ్బందితో కలిసి సంయుక్తంగా దాడులు నిర్వహించారు. గాజువాక సర్దార్ నెస్ట్ వెనుక భాగం, గంగారం పోర్ట్ రోడ్ సమీపంలో గంజాయి సేవిస్తున్న ఇద్దరు యువకులను పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 5 గ్రాముల గంజాయి, 2 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అదుపులోకి తీసుకున్న బాదం హేమంత్ కుమార్ (26), చట్ల శ్యామంత్ రెడ్డి (31)లకు అక్కడికక్కడే ర్యాపిడ్ గంజాయి టెస్ట్ నిర్వహించగా పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. దీంతో వారిద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గంజాయి విక్రయించినా, రవాణా చేసినా, చివరకు సేవించినా ఉక్కుపాదం మోపుతామని పోలీసులు స్పష్టం చేశారు. అనుమానితులకు వెంటనే ర్యాపిడ్ టెస్టులు చేస్తామని, మాదకద్రవ్యాల సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలపాలని కోరారు.

# పాటలతో ఒత్తిడికి చెక్..

**ఎల్‌పీ మెలోడీస్ నూతన బ్యానర్ ఆవిష్కరణ**

**-తొలి ఈవెంట్‌లోనే 20 వేల మందికి పైగా ప్రేక్షకుల ఆదరణ**

విశాఖపట్నం, ఆగష్టు 25, ప్రభాతవార్త:

నేటి ఉరుకుల పరుగుల జీవితంలో ఒత్తిడిని తగ్గించుకునేందుకు సంగీతం, పాటలు ఎంతో దోహదపడతాయని ఎల్‌పీ మెలోడీస్ అధినేత బి.లీలా ప్రసాద్ అన్నారు. దొండపర్తిలోని ఆర్ఆర్ స్టూడియోలో ఆదివారం ఎల్‌పీ మెలోడీస్ నూతన బ్యానర్ ప్రారంభోత్సవం ఘనంగా నిర్వహించారు. మెగాస్టార్ చిరంజీవి జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన సినీ సంగీత విభావరిలో గాయనీ గాయకులు చిరంజీవి హిట్ పాటలను ఆలపించి ప్రేక్షకులను అలరించారు. స్టూడియోలో ప్రత్యక్షంగా వీక్షించిన వారితో పాటు యూట్యూబ్ లైవ్ ద్వారా 20 వేల మందికి పైగా ప్రేక్షకులు కార్యక్రమాన్ని వీక్షించారని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా లీలా ప్రసాద్ మాట్లాడుతూ గాయనీ గాయకులకు అవసరమైన సౌండ్ సిస్టమ్, ట్రాక్‌లు, యూట్యూబ్ లైవ్ వంటి సదుపాయాలను ఆర్ఆర్ స్టూడియో అధినేత రంజిత్ అందించడం అభినందనీయమన్నారు. తొలి కార్యక్రమానికే విశేష స్పందన రావడం ఆనందంగా ఉందన్నారు. గాయనీ గాయకులు మాట్లాడుతూ ఎల్‌పీ మెలోడీస్ తొలి కార్యక్రమానికే 20 వేల మందికి పైగా ప్రేక్షకులు ఆన్‌లైన్‌లో వీక్షించడం విశేష విజయమని పేర్కొంటూ లీలా ప్రసాద్‌ను అభినందించారు. కార్యక్రమంలో గాయనీలు భానుమతి, శారద, ఉమాదేవి, శ్రీలలిత, నీలిమ, రామదుర్గ, గాయకులు లీలా ప్రసాద్, శ్రీనుబాబు బొత్స, చలపాక అప్పారావు, కోటేశ్వరరావు, చరణ్, అప్పలరాజు, రంజిత్, సౌండ్ సిస్టమ్ ఆపరేటర్ అభి తదితరులు పాల్గొన్నారు.



## రైతులకు పూర్వ అభ్యాస గుర్తింపుపై శిక్షణ



మెలియాపుట్టి, ఆగస్టు 25, ప్రభాతవార్త :

మండలం రంగడు గాటి గ్రామంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో రైతులకు పూర్వ అభ్యాసం గుర్తింపు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆత్మ డిప్యూటీ ప్రాజెక్టు డైరెక్టర్ రవికృష్ణ హాజరయ్యారు. పలాస వ్యవసాయ సంచాలకులు వై .శారద హాజరై రైతులకు పలు సలహాలు సూచనలు తెలియజేశారు.ఆత్మ డిప్యూటీ డైరెక్టర్ రవికృష్ణ మాట్లాడుతూ రైతులు ముఖ్యంగా పశువుల పెంపకంలో సరైన జాగ్రత్త తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా సరైన సమయంలో టీకాలు వేయించుకోవాలని తెలియజేశారు. అలాగే రైతులకు పశుగ్రాసం పెంపకంలో యాజమాన్య పద్ధతులు పశువుల్లో వచ్చే వివిధ వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. అనంతరం వ్యవసాయంతో పాటుగా పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రతిఒక్క రైతు కూడా తోడ్పాటుగా ఉండాలని కోరారు. పలాస వ్యవసాయ సాహ సంచాలకులు శారద మాట్లాడుతూ కార్యక్రమంలో రైతుల వద్ద నుంచి వ్యవసాయ రంగంలో ఎదుర్కొంటున్న సమస్యలు అలాగే ఆచరిస్తున్న పద్ధతుల గురించి వివరణ తీసుకున్నారు. అనంతరం రైతులకు ప్రస్తుత పరిస్థితుల్లో ఎలినినో ప్రభావం ఉన్నందువలన రైతులందరూ కూడా పంటల బీమా కచ్చితంగా నమోదు చేసుకోవాలి అని తెలియజేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎస్. దానకర్ణుడు కూటమి నాయకులు జాడిపల్లి ఎంపీటీసీ రాజు, వ్యవసాయ సహాయకులు పుష్ప పల్లవి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, అభ్యుదయ రైతులు పాపారావు, పలువురు రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## ఓవర్ లోడ్‌తో పేలిపోయిన విద్యుత్ ట్రాన్స్ఫార్మర్



వీరఘట్టం, ఆగస్టు 25, ప్రభాతవార్త:

పాలకొండ మండలం బెజ్జి సమీపం, వీరఘట్టం మండలం తలవరం హైస్కూల్ పక్కన మంగళవారం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఓవర్‌లోడ్‌కు గురై ఒక్కసారిగా పేలిపోవడంతో భారీగా మంటలు చెలరేగాయి. స్థానిక లైన్‌మెన్ గుడివాడ రాము సమాచారం మేరకు పాలకొండ అగ్నిమాపక అధికారి జామి సర్వేశ్వరరావు ఆధ్వర్యంలో సిబ్బంది ఫైర్ ఇంజన్‌తో వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాద తీవ్రతను గమనించిన అధికారులు, ముందుగా విద్యుత్ సరఫరాను నిలిపివేయించి, అనంతరం శ్రమించి మంటలను పూర్తిగా అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో ట్రాన్స్‌ఫార్మర్ పూర్తిగా దెబ్బతింది, సుమారు రూ. 5 లక్షల మేర నష్టం వాటిల్లిందని ఏపీఈపీడీసీఎల్ పాలకొండ ఏఈ నిమ్మల యోగి తెలిపారు. ఫైర్ సిబ్బంది సకాలంలో స్పందించి మంటలు అదుపు చేయడంతో సమీప ప్రాంతాలకు మంటలు వ్యాపించలేదని స్థానికులు తెలిపారు.

## వరుస బంగారం దొంగతనం కేసుల్లో డిగ్రీ విద్యార్థి అరెస్ట్

ఇచ్ఛాపురం, ఆగస్టు 25, ప్రభాతవార్త :

ఆన్‌లైన్ బెట్టింగులకు పాల్పడి చెడు అలవాట్లకు లోనైన డిగ్రీ చదువుతున్న ఓ 20 ఏళ్ల యువకుడు వరుసగా 7 కేసుల్లో దొంగతనానికి పాల్పడుతూ పోలీసులకు చిక్కాడు. ఇతని వద్ద నుండి పెద్ద ఎత్తున బంగారం రికవరీ చేశారు. కాశీబుగ్గ డిఎస్పి టి. భవాని విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ నెలలో డొంకురులో జరిగిన ఓ దొంగతనం కేసులో 24 వేల రూపాయలు నగదు ఒక బంగారం కాసు చోరీ కి గురైనట్లు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు అందింది. ఈ కేసు దర్యాప్తుల భాగంగా విచారణ చేస్తుండగా సోంపేట మండలం ఇసుకల పాలెం చెందిన వాసుపల్లి తాతారావు అనే 20 అనే యువకుడు ని లొద్దపుట్టి జంక్షన్ వద్ద రూరల్ ఎస్సై జనార్దన్ రావు అరెస్ట్ చేసినట్లు డిఎస్పీ చెప్పారు .నిందితుడు బారువలో డిగ్రీ చదువుతున్నాడని చెప్పారు. ఇచ్ఛాపురం, కవిటి ,బారువ, తదితర ప్రాంతాల్లో ఏడు కేసుల్లో చోరీకి పాల్పడినట్లు చెప్పారు.సోంపేట నుండి బరంపురం వెళ్తుండగా ఇతను వద్దనుండి 16 తులాల పావు బంగారం రికవరీ చేయగా వాటి విలువ 28.43 లక్షల రూపాయలు కాగా మరో 39 వేల రూపాయలు నగదును సీజ్ చేశామని చెప్పారు . మొత్తం విలువ 28 లక్షల 82 వేల రూపాయలు అని చెప్పారు. సమావేశంలో సిఐ ఎం. చిన్ననాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## బాహుదా నదిలో వ్యక్తి గల్లంతు



ఇచ్ఛాపురం, ఆగస్టు 25, ప్రభాతవార్త:

మండలం పాయితారి పంచాయతీ సైదాలపుట్టుగకి చెందిన నారద గంగయ్య (55) అనే వ్యక్తి బహుదా నదిలో పడి గల్లంతయ్యాడు. పొలం పని నిమిత్తం బి.తోటూరు వద్ద నది దాటుతుండగా నీటి ప్రవాహం ఎక్కువ కావడంతో గల్లంతయ్యాడు. సిఐ ఎం.చిన్నంనాయుడు టౌన్, రూరల్ ఎసఐలు ముకుందరావు, జనార్ధనరావులు ఆధ్వర్యంలో ఫైర్ సిబ్బంది పోలీసులు గజ ఈతగాళ్ళు నదిలో ఆచూకీ కోసం గాలిస్తున్నారు. ఇంకా జాడ తెలియరాలేదు. ఇతనికి భార్య జానకమ్మ ఉన్నారు. సంఘటన స్థలంలో మండల తెలుగుదేశం అధ్యక్షుడు లోపింటి పద్మనాభం, దక్కత శ్రీనివాస్ రెడ్డి, గిరి రెడ్డిలు సహాయ సహకారాలు అందిస్తున్నారు.

## కూచిపూడి నృత్యంతో అలరించిన చిన్నారులు



నరసన్నపేట, ఆగస్టు 25, ప్రభాతవార్త :

స్థానిక బంది వీధిలోని శ్రీ కూచిపూడి నృత్య విద్యాలయ అనే కూచిపూడి నృత్య శిక్షణ సంస్థ నందు, నిర్వాహకులు, నాట్యాచార్యులు కీర్తిప్రియ వద్ద కూచిపూడి నృత్యాన్ని అభ్యసిస్తున్న విద్యార్థులు స్థానిక ఓ కళ్యాణ మండపంలో పలు సాంప్రదాయ పాటలకు మంచి అభినయంతో నాట్యం చేసి అలరించారు. ఈ విద్యాలయం 14వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో చిన్నారులు చేసిన నాట్య ప్రదర్శనలు పలువురిని ఆకట్టుకున్నాయి. భారతీయ సంస్కృతి సాంప్రదాయాలకి, సనాతన కళారంగానికి ప్రత్యేకమైన గుర్తింపు కలిగిన కూచిపూడి నృత్యాన్ని అలవోకగా చేస్తున్న తమ పిల్లలను చూసి తల్లిదండ్రులు గర్వంగా ఆనందించారు. కార్యక్రమంలో ఎన్నో అవార్డులు పొంది, అనేక దేశాల్లో నృత్య ప్రదర్శనలు చేసిన కీర్తిప్రియ మేడం కూడా విద్యార్థులతో నాట్యం చేయడం ప్రత్యేకంగా నిలిచింది. ఆమెతో పాటు అనిల్, స్రవంతి, ఉదయ, సాయి సింధు, విశ్వ, లాస్య, హాసిని, సమత, బిందుప్రియ, ప్రణవి, తనూజ, చిన్న స్రవంతి, రెనీషా శ్రీ, చరిష్మా, ఉమా, గౌతమి, సునయన, జాన్విక, హన్విక, దోలాక్షి, పురుషోత్తం, కుందన్, గోవెల్‌తో పాటు అనేక మంది చిన్నారులు పాల్గొన్నారు. ఇటీవలే సామూహిక గజ్జ పూజ కూడా ఘనంగా నిర్వహించారు.

## జ్యోతి కుటుంబానికి రూ.20 వేలు ఆర్థిక సహాయం



కవిటి, ఆగస్టు 25, ప్రభాతవార్త :

పోడియా జ్యోతి కుటుంబానికి 20వేల ఆర్థిక సహాయం రాజపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు మంగళవారం అందించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న రేష్మ, అలానే ఆరో తరగతి చదువుతున్న అఖిల వాళ్ల నాన్న కిడ్నీ వ్యాధితో ఇటీవల చిన్న వయసులో మరణించారు. ఆయనకు భార్య జ్యోతితో పాటు నలుగురు కుమార్తెలు. శ్రమిస్తే గాని పూట గడవని పరిస్థితి. దీంతో ఆ చిన్నారుల చదువులు మధ్యలో ఆగిపోకుండా ఆ కుటుంబానికి ఆదుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివరాం ప్రసాద్ పాడి, ఉపాధ్యాయులు తల్లి జ్యోతికి 20వేల ఆర్థిక సహకారం తొత్తిడిపుట్టుగ గ్రామానికి వెళ్లి అందించడంతోపాటు ఆ పిల్లల చదువులకు భవిష్యత్తులో ఎటువంటి అవసరం ఉన్న సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

## నేడు ఐతంకు ఒడిశా గవర్నర్ కంభంపాటి రాక

టెక్కలి, ఆగస్టు 25, ప్రభాతవార్త :

ఐతం ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం నిర్వహించనున్న 10వ సిల్వర్ జూబ్లీ గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమానికి ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా జేఎన్‌టీయూ విజయనగరం ఉపకులపతి వి.వి. సుబ్బారావు హాజరు కానున్నట్లు తెలిపారు. కళాశాల సిల్వర్ జూబ్లీ వేడుకల్లో భాగంగా నిర్వహిస్తున్న 10వ గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమానికి విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డైరెక్టర్ తెలిపారు.

## జూనియర్ కళాశాలకు పూర్వ విద్యార్థుల వితరణ



కవిటి, ఆగస్టు 25, ప్రభాతవార్త :

కవిటి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు 2004-2006వ సంవత్సరంకు చెందిన పూర్వ విద్యార్థులు 30వేలు రూపాయలు విలువచేసే బీరువాతో పాటు కుర్చీలను అందించారు. మంగళవారం పూర్వ విద్యార్థులైన బార్ల సతీష్, పుల్లటి మణిబాబు, సత్యానందరావు, పూడి సందీప్, బల్లెడ దిలీప్ కుమార్, బడే వెంకటేష్‌లు ప్రిన్సిపాల్ సింహాచలం నాయుడుకు ఈ వస్తువులను అందించారు. సందర్భంగా ప్రిన్సిపాల్ సింహాచలం నాయుడు మాట్లాడుతూ ఈ కళాశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు అందరూ సహకరిస్తే ఈ కళాశాల ఉత్తమ కళాశాలగా తీర్చిదిద్దపడుతుందని అన్నారు. ఆయనతోపాటు ఉపాధ్యాయులు ఝాన్సీ రాణి, గుండ్యాల విష్ణుమూర్తి, ఈ.హరి, కే.ఉగాది నాయుడు, డి.అనసూయ, బి.శ్రీను బాబు, జే.పాపారావు, కరుణశ్రీ, ఈ.రమేష్, బి.అంజన, డి.జనార్ధనరావు, తదితరులు పాల్గొన్నారు.

## సిర్తలిలో 'పొలం పిలుస్తోంది'



కంచిలి, ఆగస్టు 25, ప్రభాతవార్త :

కంచిలి మండలం మఠం సరియాపల్లి పంచాయితీ సిర్తలి గ్రామంలో వ్యవసాయ అధికారి కొంకేన సురేష్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఫార్మర్ ఐడీ తప్పనిసరి అని, ధాన్యం సేకరణ ఫార్మర్ ఐడీతో అనుసంధానం కానుందని, రైతులందరూ అన్ని సర్వే నెంబర్లతో ఐడీ పొందాలని సూచించారు.

## పోలీస్ ఉద్యోగులకు అండగా ఆర్థిక భరోసా

### మృతి చెందిన కానిస్టేబుల్ కుటుంబానికి కోటి రూపాయల చెక్కు అందించిన ఎస్పీ



వీరఘట్టం, ఆగస్టు 25, ప్రభాతవార్త :

వీరఘట్టం పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తూ, ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పి.రవి (పిసి-602) కుటుంబానికి స్టేట్ బ్యాంకు పోలీసు శాలరీ ప్యాకేజ్ ప్రయోజనంగా మంజూరు చేసిన రూ.కోటి రూపాయల చెక్‌ను రవి సతీమణి లలితకు స్టేట్ బ్యాంకు అధికారుల సమక్షంలో మంగళవారం ఎస్పీ ఎస్.వి. మాధవ్ రెడ్డి చేతుల మీదుగా జిల్లా పోలీసు కార్యాలయంలో అందజేసారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి మాట్లాడుతూ జిల్లా పోలీసు శాఖలో పని చేస్తున్న పోలీసు ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని, అందరికీ స్టేట్ బ్యాంకు పోలీసు శాలరీ ప్యాకేజ్‌ను ఇప్పటికే ప్రారంభించామన్నారు. ఈ ప్యాకేజ్ ప్రయోజనంలో భాగంగా ఎవరైనా పోలీసు ఉద్యోగి విధి నిర్వహణలో భాగంగా ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కుటుంబానికి ప్రస్తుతం రూ.కోటి, సాధారణ మరణం సంభవిస్తే 10 లక్షలు ఆర్థిక సహాయంను స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా అందించనుందన్నారు. ఇందులో భాగంగా వీరఘట్టం పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పి.రవి పని చేస్తూ, రోడ్డు ప్రమాదంలో జనవరి 17వ తేదీన మరణించారు. ఇదే విషయమై స్టేట్ బ్యాంకు అధికారులతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరపగా స్టేట్ బ్యాంకు అధికారులు మరణించిన రవి సతీమణి లలితకు పోలీస్ శాలరీ ప్యాకేజీ ప్రకారం ప్రయోజనంగా కోటి రూపాయలను మంజూరు చేసారన్నారు. బ్యాంకు అధికారుల సమక్షంలో లలితకు కోటి రూపాయల చెక్‌ను అందజేశామన్నారు. జిల్లా పోలీసుశాఖ ఎల్లప్పుడూ అందుబాటులో అండగా ఉంటుందని, ఎటువంటి సమస్యలు ఉన్న నేరుగా వచ్చి కలవవచ్చునని ఇతర బెనిఫిట్‌లను అందేటట్లు అన్ని చర్యలు తీసుకుంటామని బాధిత కుటుంబానికి జిల్లా ఎస్పీ భరోసా కల్పించారు. ఎస్.బి.ఐ. ద్వారా వచ్చిన డబ్బులను వృదాగా ఖర్చు చేయవద్దని జిల్లా ఎస్పీ లలితకు సూచించారు. అదనపు ఎస్పీ వెంకటేశ్వరరావు, ఏఆర్ డిఎస్పీ థామస్ రెడ్డి, ఆరఐలు నాయుడు, రాంబాబు, ఆదినారాయణ, విజయనగరం కంటోన్మెంట్ ఎస్బిఐ బ్రాంచ్ చీఫ్ మేనేజర్ రఘురామ్ పాల్గొన్నారు.

## పాఠశాలల్లో విద్యుత్ భద్రతపై తనిఖీలు

### జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మాజీరావు



వీరఘట్టం, ఆగస్టు 25, ప్రభాతవార్త :

పాఠశాలల్లో విద్యుత్ భద్రతపై ఏపీఈపీడీసీఎల్ అధికారులతో కలసి సమగ్ర తనిఖీలు చేపట్టనున్నట్లు పార్వతీపురం మన్యం జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మాజీరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ సూచనల మేరకు విద్యార్థులు, సిబ్బంది భద్రతను దృష్టిలో ఉంచుకొని జిల్లాలోని అన్ని యాజమాన్యాల ప్రభుత్వ పాఠశాలల్లో ఈ ప్రమాదకర పరిస్థితుల గుర్తింపు ప్రక్రియ ప్రారంభమైందన్నారు. ఇందులో భాగంగా దెబ్బతిన్న లేదా వంగిన విద్యుత్ స్తంభాలు, వేలాడుతున్న తీగలు, పాఠశాల భవనాలు, ఆట స్థలాల మీదుగా వెళ్లే ఓవర్ హెడ్ లైన్లతో పాటు అంతర్గత వైరింగ్, స్విచ్ బోర్డుల లోపాలను అధికారులు ప్రత్యేకంగా పరిశీలిస్తారన్నారు. అలాగే 3-ఫేజ్ విద్యుత్ సరఫరా లేదా సామర్థ్యం పెంపు అవసరమున్న పాఠశాలలను గుర్తించి నివేదికలు రూపొందిస్తారు. ఈ ప్రక్రియను అత్యంత ప్రాధాన్యతతో పరిగణించి ప్రమాదకర పరిస్థితులను వెంటనే సరి చేయాలని జిల్లాలోని ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓలు మరియు డెప్యూటీ ఈఓలను ఆయన ఆదేశించారు. 'జీరో ఎలక్ట్రికల్ అజార్డ్స్' లక్ష్యంతో అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని, విద్యుత్ సమస్యలకు సంబంధించి ఏపీఈపీడీసీఎల్ (ఎసఈ) అధికారులను 7382585443 నంబరులో సంప్రదించవచ్చని డీఈవో తెలిపారు.

## పెద్దలకు ఒక రూల్... పేదలకు ఇంకో రూలా?

### దళిత, గిరిజన ప్రజలకు పునరావాసం కల్పించండి



వీరఘట్టం, ఆగస్టు 25, ప్రభాతవార్త :

పెద్దలకు ఒకరూల్... పేదలకు మరొక రూలా అంటూ ధ్వజమెత్తారు కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం. వీరఘట్టంలో చెరువు సుందరీకరణ పేరుతో దళిత, గిరిజన పేదలను నిలువ నీడ లేకుండా చేయడం అన్యాయమనీ , వెంటనే వారికి పునరావాసం కల్పించాలని మండల కార్యదర్శి ఎన్.సింహాచలం డిమాండ్ చేశారు. మంగళవారం ఆందోళన చేసిన అనంతరం తహశీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 70 ఏళ్లుగా కోనేటి గట్టుపై నివసిస్తున్న ఏడు దళిత కుటుంబాల ఇళ్లను నోటీసులు ఇవ్వకుండా కూల్చివేయడంపై సమగ్ర విచారణ జరపాలన్నారు. సుందరీకరణ పేరుతో కోనేరు చుట్టూ ఉన్న చెట్లను తొలగించడంతో పాటు, అక్కడ నివసిస్తున్న పేదల ఇళ్లను కూడా తొలగించినట్లు బాధిత కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ఒకవైపు చుట్టుపక్కల ఉన్న పెద్దల ఇళ్లు, నిర్మాణాలను అలాగే ఉంచి, మరోవైపు పేద దళిత కుటుంబాల ఇళ్లను మాత్రమే లక్ష్యంగా చేసుకుని కూల్చివేయడం వివక్షపూరిత చర్యగా కనిపిస్తోందని ఆయన దుయ్యబట్టారు. ఇల్లు కోల్పోయిన వారికి న్యాయం చేయాలని ఆయన కోరారు. అలాగే పెద్దలు నిర్మించుకున్న అక్రమ కట్టడాలపై కూడా తగు చర్యలు చేపట్టాలని కెవిపిఎస్ డిమాండ్ చేశారు. పల్లిచెట్టు రాములు, మంగమ్మ, రాముడమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ అభివృద్ధిపై బహిరంగ చర్చకు వైసీపీ సిద్ధమా?

### జిల్లా టిడిపి అధ్యక్షుడు రమేష్



ఆమదాలవలస, ఆగస్టు 25, ప్రభాతవార్త :

మున్సిపాలిటీలో అన్ని రంగాల్లో జరిగిన అభివృద్ధిపై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బహిరంగ చర్చకు సిద్ధమా అని జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మొదలవలస రమేష్ వైసిపి నాయకులను ప్రశ్నించారు. మంగళవారం పట్టణంలోని పారిశ్రామికవాడలో ఉన్న ఎమ్మెల్యే విజన్ కార్యాలయంలో మున్సిపాలిటీ టిడిపి నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా టిడిపి అధ్యక్షులు మొదలవలస రమేష్, పట్టణ టిడిపి అధ్యక్షులు సంపదరావు మురళీధర్ మాట్లాడుతూ నియోజకవర్గ వైసీపీ నాయకుల చేస్తున్న అసత్య ప్రచారాలపై ధ్వజమెత్తారు. ఆమదాలవలస నియోజకవర్గంలో ఏర్పడిన తర్వాత ఎమ్మెల్యేలుగా పైడి శ్రీరామమూర్తి తమ్మినేని సీతారాం, బొడ్డేపల్లి సత్యవతి, కూన రవికుమార్ నలుగురు పాలన చేపట్టడం జరిగిందని వీరిలో ఏ ఎమ్మెల్యే పనితీరుతో నియోజకవర్గ అభివృద్ధి సాధించిందో ప్రజలకు తెలుసు అన్నారు. ఆమదాలవలస మున్సిపాలిటీ 23 వార్డుల్లో కృషితో సమగ్ర అభివృద్ధి సాధించడంతోపాటు ఇటీవల దళిత వాడల అభివృద్ధికి ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు రూ.1.57 కోట్ల రూపాయలు మంజూరు చేయించడం జరిగిందన్నారు. కనీస అవగాహన లేని వైసిపి నాయకులు ఎమ్మెల్యే రవికుమార్‌ని విమర్శించే స్థాయి లేనప్పటికీ అసత్య ప్రసారాలతో ప్రజలను మభ్య పెడతామనుకోవడం అవివేకమని టిడిపి నాయకులు అన్నారు కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో రాష్ట్రంతో పాటు ఆమదాలవలస నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిపై వైసిపి నాయకులు చర్చకు రావడానికి సిద్ధంగా ఉంటే తాము పూర్తి వివరాలతో ఎక్కడికైనా రావడానికి సిద్ధంగా ఉన్నామని టిడిపి నాయకులు సవాల్ విసిరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఇంజరాపు విశ్వనాథం, తోట రాము, జీడి ప్రసాద్, పాతిన రమణమూర్తి, నాగళ్ళ మురళీధర్, దవల అప్పలనాయుడు, తంగి గురయ్య, బగాది భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

## పిలకల దశలో వరిసాగుకు యూరియా, పోటాష్ వేసుకోవాలి



కోటబొమ్మాళి, ఆగస్టు 25, ప్రభాతవార్త :

ప్రస్తుతం వరి పంట పిలకలు పెట్టే దశలో ఉన్నందున ఒక ఎకరాకు 25 కేజీల యూరియాతో పాటు 20కేజీల పోటాష్‌ను కలిపి వేసుకోవాలని ఏవో ఎస్.గోవిందరావు అన్నారు. ఆయన మంగళవారం మాసాహెబ్‌పేట, తాటిపర్తి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఈ గ్రామాల్లో వరి సాగు పిలకలు పెట్టే దశలో ఉన్నందున యూరియా, పోటాష్ వేసుకోవడం వలన పిలకలు సమృద్ధిగా పెట్టి చీడపీడలను తట్టుకునే శక్తి ఉంటుందని కనుక యూరియా, పోటాష్ వేసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో వీఏఏ దుర్గాప్రసాద్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికలకు సిద్ధం కండి



ఇచ్ఛాపురం, ఆగస్టు 25, ప్రభాతవార్త:

త్వరలో నగారా మోగనున్న స్థానిక ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ కొండ శంకర్ రెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని స్వేచ్ఛవతి అమ్మవారి ఆలయ మండపంలో టిడిపి ముఖ్య నాయకులు, కార్యకర్తల సమన్వయ సమావేశం నిర్వహించారు. బూత్ స్థాయిలో కమిటీల సమన్వయం మరియు పార్టీ బలోపేతంపై చర్చించారు. స్థానికంగా ఉన్న సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేయాలని శ్రేణులకు సూచించారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంపై దిశానిర్దేశం చేశారు. సమావేశంలో ఇచ్ఛాపురం పట్టణ టిడిపి నాయకులు, స్థానిక కార్యకర్తలు పాల్గొన్నారు.

## కృష్ణాష్టమి వేడుకలకు సన్నద్ధం



కంచిలి, ఆగస్టు 25, ప్రభాతవార్త :

సెప్టెంబర్ 4న జరగనున్న కృష్ణాష్టమి వేడుకలకు అందరూ సన్నద్ధంగా ఉండాలని ఎమ్మెల్సీ నర్తు రామారావు పిలుపునిచ్చారు. మంగళవారం కంచిలి స్థానిక రాధాకృష్ణ మందిరంలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్సీ రామారావు మాట్లాడుతూ, కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు యాదవ కులస్తులందరూ సమన్వయంతో కలిసి పని చేయాలని కోరారు. కార్యక్రమంలో బంగారు కురయ్య, కొల్లి ఈశ్వరరావు, గుమ్మడి రాందాస్, డొక్కరి నారాయణ, కొర్రాయి కురయ్య, దుబ్బ లోకనాథం, శాలిన మోహనరావు, మట్ట తేజేశ్వరరావు , తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకాకుళం వార్త



## జోరుగా సిమెంట్ కాలువల నిర్మాణం

### పూజారిపేట గ్రామ ప్రజలు హర్షం



ఆమదాలవలస, ఆగస్టు 25, ప్రభాతవార్త :

మున్సిపాలిటిలో 17వ వార్డు పూజారిపేట గ్రామంలో సిమెంటు కాలువ పనులు జోరుగా సాగుతున్నాయి. స్థానిక ఎమ్మెల్యే కూన రవికుమార్ కృషితో అభివృద్ధి పనులకు నిధులు మంజూరయ్యాయి. పురపాలక సంఘం అభివృద్ధి ధ్యేయంగా నిధులను ఎమ్మెల్యే మంజూరు చేశారు. గ్రామాల్లో అభివృద్ధి పనుల కోసం రూ.20 లక్షల రూపాయలు నిధులు మంజూరు చేశారు. ఆంధ్రప్రదేశ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ నిధులతో రహదారుల నిర్మాణం చేపడుతున్నారు. ఇరుక సందుల్లో కాలువలు వేయడంతో గ్రామస్తుల ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ పనులను ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకులు పీవీకే రాజు మంగళవారం పరిశీలన చేపట్టారు. నాణ్యత ప్రమాణాలతో పనులు జరుగుతున్నాయని ఆయన తెలిపారు. ఇరువైపులా రోడ్లు వెడల్పులో భాగంగా ఆక్రమణలను తొలగించి నిర్మాణాలు చేపడుతున్నారు. ఏఈ మనోహర్, ఇంజనీర్ అసిస్టెంట్ ఎస్.శ్రీనివాసరావు, కాంట్రాక్టర్ కూన ఆంజనేయులు, పైడి వసంత, గ్రామస్తులు ఉన్నారు.

## చిన్నారుల్లో సృజనాత్మకతను పెంపొందించాలి



రణస్థలం, ఆగస్టు 25, ప్రభాతవార్త :

చిన్నారుల్లో సృజనాత్మకతను పెంపొందించేలా బోధన చేయాలని మండల విద్యాశాఖాధికారి త్రినాధరావు సూచించారు. మండలంలోని కొండములగాం మోడల్ స్కూల్‌లో అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహించిన సర్టిఫైడ్ కోర్సు శిక్షణ మంగళవారం విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో సమగ్ర శిశు అభివృద్ధి సేవలను మరింత సమర్థవంతంగా అందించే లక్ష్యంతో ఈ శిక్షణా కార్యక్రమం రూపుదిద్దుకుందన్నారు. పిల్లలకు సమగ్ర అభివృద్ధి కోసం ఆటల ద్వారా విద్య, పాటల ద్వారా అభ్యసనం, మరియు క్రీడల ద్వారా చిన్నారుల్లో సృజనాత్మకతను ఏ విధంగా పెంపొందించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ రూపలత, ఎంఈఓ-1 శ్రీనివాసరావు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీధర్, డిఆర్పీలు బుచ్చిబాబు, రమేష్, రవికుమార్, శ్రీలక్ష్మి, మంగమ్మ, డిఆర్పీ ఓజేన్ష్ , తదితరులు పాల్గొన్నారు.

## బాధితులకు అండగా కూటమి ప్రభుత్వం : ఎమ్మెల్యే



ఆమదాలవలస, ఆగస్టు 25, ప్రభాతవార్త :

ఆముదాలవలస నియోజకవర్గంలో పొందూరు మండలం మజ్జిలిపేట గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ సువ్వారి రమణ ఇటీవల మృతి చెందారు. మంగళవారం ఎమ్మెల్యే రవికుమార్ స్వయంగా మజ్జిలిపేటలో సువ్వారి రమణ ఇంటికి వెళ్లి ఆయన భార్య లక్ష్మికి ఒక లక్ష రూపాయలు సీఎం సహాయ నిధి చెక్కును అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి కార్యకర్తకు తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని అన్నారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి ధ్యేయంగా పని చేస్తుందని అన్నారు. ప్రభుత్వం చేపడుతున్న పలు సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకుని వెళ్లవలసిన బాధ్యత ప్రతి టిడిపి కార్యకర్తపై ఉందని అన్నారు. సీఎంఆరఎఫ్ సహాయం అందడంతో లబ్ధిదారుల కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే రవికుమార్‌కు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు చిగురుపల్లి రామ్మోహన్‌రావు, తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఛలో విజయవాడను విజయవంతం చేయండి



రాజాం, ఆగస్టు 25, ప్రభాత వార్త:

రాజాం నందు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సెప్టెంబర్ 1వ తారీఖు నాడు విజయవాడలో జరిగే ర్యాలీ మహాసభకు చెందిన గోడ పత్రికను ఆవిష్కరించారు. ఏపీసిపిఎసఈఏ సంఘం విజయనగరం జిల్లా ప్రధాన కార్యదర్శి మొయ్యి శ్రీరాములు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి దాదాపుగా రెండున్నర సంవత్సరాల పూర్తయినప్పటికీ సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయుటలో రూట్ మ్యాప్‌ను ప్రకటిస్తామని చెప్పి మేనిఫెస్టోలో పెట్టడం జరిగినది. కానీ నేటికీ ఆ దిశగా ఎటువంటి ప్రక్రియ చేయడం లేదు. అందుకు నిరసనగా ఏపీసిపిఎసఈఏ సంఘం ఆధ్వర్యంలో ఛలో విజయవాడకు పిలుపునివ్వడం జరిగినది. కనుక సంబంధిత గోడ పత్రికలను విజయనగరం జిల్లాలోని అన్ని ప్రభుత్వ సంస్థలు, పాఠశాలల యొక్క ఆవరణలో ఆవిష్కరణ చేయాలని విజయవాడ సెప్టెంబర్ 1వ తేదీన జరిగే ర్యాలీడమహాసభకు సిపిఎస్ ఉద్యోగ ఉపాధ్యాయులు అన్ని డిపార్ట్మెంట్ల నుండి భారీ సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రతి ఒక్క సిపిఎస్ ఉద్యోగిని కోరడమైనది. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాంప్రసాద్ ఇతర ఉద్యోగులు పాల్గొనడం జరిగినది.

## దూబ రాంబాబుకు 'డాక్టరేటు' ప్రదానం



రాజాం, ఆగస్టు 25, ప్రభాతవార్త :

మానవత్వం పరిమలించే మంచి మనిషి, నిష్కలంక హృదయుడు, నిస్వార్థపరుడు, నిజాయితీ కలిగిన మానవతా మూర్తి, నిరంతర శ్రామికుడు, నిత్య కృషివలుడు ఇన్ని మంచి సుగుణాలు కలిగిన వ్యక్తి మన దూబ రాంబాబు. డాక్టర్ ఎన్.టి.ఆర్ వైద్య సేవ సంక్షేమ పథకంలో విజయనగరం, పార్వ తీపురం జిల్లాల మేనేజర్‌గా పేద ప్రజలకు సేవలు అందిస్తున్న వ్యక్తి దూబ రాంబాబు. ఎక్కడ పని చేస్తే అక్కడ తన కంటూ ఒక గుర్తింపు సంపాదించి ఆ జిల్లా అధికారులు దగ్గర మన్ననలుతో పాటుప్రశంసలు పొంది జిల్లా కలెక్టర్ చేతులు మీదుగా అవార్డులు పొందడం అయనకి అనవాయితీగా వస్తుంది. స్వశక్తిగా ఎదుగుతున్న దూబ రాంబాబు ఎన్నో అవార్డులు అయనను వెతుకుంటూ చేరి వాటి విలువలను మరింతా పెంచుకున్నాయి. రాంబాబుకి డాక్టరేట్ రావడం చాలా సంతోషంగా ఉందని అయన కుటుంబ సభ్యులు, స్నేహితులు, అభిమానులు, శ్రీ విజయ మల్టీ హాస్పిటల్ సిబ్బంది అభినందనలు తెలిపారు.

## వింతదూడ జననం

కోటబొమ్మాళి, ఆగస్టు 25, ప్రభాతవార్త :

కవిటి మండలం శవసానపుట్టుగకి చెందిన ఈగల త్రినాధకు సంబంధించిన ఆవు ప్రసవ వేదనతో ఇబ్బంది పడతుండడంతో అక్కడి వైద్యుల సూచనల మేరకు మండలం నిమ్మాడ పశువైద్యాధికారి డాక్టర్ లఖినేని కిరణ్కుమార్ వద్దకు సోమవారం తీసుకురాగా ఆయన అవును శస్త్రచికిత్స చేసి వింత దూడని తీయటం జరిగింది. ఈ దూడకు తలలేక, ఒక మెడ, రెండు చెవుళ్లు, ఎముకులు అతుక్కొని నాలుగు కళ్లు, ఎక్కువ రోమాలతో వింతగా ఉంది. ఇలాంటి పరిస్థితిలో పుట్టిన దూడను ఎసెఫాలిక్ఫేటస్ లేదా ఫీటల్ మానస్టర్ అంటారని, ఇది పిండి ఎదుగుదల జరిగినపుడు జరిగిన జన్యుమార్పిడిలో లోపాల వల్ల ఇలాంటివి పుడతాయని డాక్టర్ అన్నారు. అయితే సకాలంలో శస్త్ర చికిత్స చేయడం వల్ల ఆవు బతికి ఉందన్నారు.

## జనతా వారధి... ప్రజల సమస్యలకు తక్షణ స్పందన

టెక్కలి, ఆగస్టు 25, ప్రభాతవార్త :

ప్రతి శుక్రవారం టెక్కలి బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జనతా వారధి కార్యక్రమానికి వచ్చిన ఓ కుటుంబం తమ ఆర్థిక ఇబ్బందులను తెలియజేశారు. తండ్రి డయాలసిస్ పేషెంట్ కాగా, తల్లికి ఆరోగ్య సమస్యలతో పాటు కాలు సరిగా లేకపోవడంతో కుటుంబం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. రేషన్ కార్డు, పెన్షన్ లేకపోవడంతో నిత్యావసరాలు కూడా సమకూర్చుకోవడం కష్టంగా ఉందని వారి కుమార్తెలు వినతిపత్రం అందించారు. వారి సమస్యను వెంటనే ఆర్డీవో కార్యాలయం దృష్టికి తీసుకెళ్లగా, అధికారులు సానుకూలంగా స్పందించి బాధిత కుటుంబాన్ని పిలిపించి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజల సమస్యను విని.. అధికారుల దృష్టికి తీసుకెళ్లి.. పరిష్కారం దిశగా అడుగులు వేయడం జనతా వారధి లక్ష్యం.

## ఎంపీపీ పరామర్శ



కంచిలి, ఆగస్టు 25, ప్రభాతవార్త :

కంచిలి మండలం, బోగాబెణి పంచాయతీ, బోగాబెణి కాలనీ గ్రామ నివాసి బుడ్డెపు దుర్యోధన మాతృమూర్తి కీ.శే. బుడ్డెపు చంద్రమ్మ (67) ఇటీవల అనారోగ్య కారణంగా స్వర్గస్తులయ్యారు. మంగళవారం వారి చిత్రపటానికి ఎంపీపీ పైల దేవదాసు రెడ్డి నివాళులు అర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గణప సింహాచలం, బుడ్డెపు సూర్యనారాయణ రెడ్డి, గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

# పిల్లలకు సొంత వైద్యమా?



సాధారణంగా చిన్న వయసులో పిల్లలు ఆడుకోవడానికి వివిధ రకాల ఆట వస్తువులను తాకుతుంటారు. వీటి నుంచి సోకే క్రిముల కారణంగా జలుబు వచ్చే అవకాశం ఉంటుంది. అలాగే వాతావరణంలో వచ్చే మార్పులు, కొత్తగా ఏదైనా ఆహార పదార్థాన్ని అలవాటు చేసినప్పుడు కూడా జలుబు చేయడం సహజం. జలుబు ఉన్నా కానీ సాధారణంగా ఆడుకుంటారు. ఎదుగుదలలో ఎలాంటి సమస్యా లేదు అంటే అది అలర్జీ వల్ల వచ్చిన జలుబుగా భావించాలి. ఇతర ఇన్ఫెక్షన్ల వల్ల జలుబు వచ్చినప్పుడు జ్వరం రావడం, సరిగా నిద్రపోకపోవడం.. వంటి లక్షణాలు కనిపిస్తుంటాయి. మొదటి రకం జలుబుకి అలర్జీకి సంబంధించిన మందులు వాడితే సరిపోతుంది. ఏదైనా ఇన్ఫెక్షన్ వల్ల జలుబు వచ్చినప్పుడు ఊపిరితిత్తుల్లో తెమడ చేరుతుంది. ఇలాంటప్పుడు శ్వాస తీసుకోవడానికి పిల్లలు ఇబ్బంది పడుతుంటారు. దానివల్ల వాంతులు చేసుకోవడం, నిద్రపట్టకపోవడం, ఆయాసపడడం.. వంటి లక్షణాలు కనిపిస్తాయి. అలాగే ఎక్కువసేపు ఏడుస్తుంటారు కూడా .ఇలాంటప్పుడు ఈ రకం నెబ్యులైజర్ వాడాల్సి ఉంటుంది. కానీ కొంతమంది ముక్కు దిబ్బడ తగ్గుతుందని జలుబు నుంచి వేగంగా ఉపశమనం పొందచ్చని సొంతం గానే నెబ్యులైజర్ వాడుతుంటారు. కానీ అది సరికాదు. డాక్టర్ సలహా మేరకు మాత్రమే నెబ్యులైజర్‌ని ఉపయోగించాలి. ఒకవేళ బాబుకి తరచుగా అలర్జీ సమస్య ఉంటే అత్యవసర సమయంలో నెబ్యులైజర్ వాడచ్చు. అయితే ప్రతిసారీ జలుబుకి నెబ్యులైజర్ ప్రత్యామ్నాయ చికిత్స కాదన్న విషయం మాత్రం గుర్తుపెట్టుకోండి. □

# మోకాలిచిప్ప సమస్యకు 'జిగురు' !

మన శరీరంలోని కీళ్లన్నింటిలో ఓ మెత్తటి ఎముక ఉంటుంది. కీలు దగ్గర కలిసే రెండు ఎముకలు ఒకదానికొకటి తగిలి రాపిడి ఏర్పడకుండా ఇది కాపాడుతుంది. దీన్నే మృదులాస్థి (కార్టిలేజ్) అంటారు. మిగతావాటికన్నా మోకాలి చిప్పదగ్గర ఉన్న ఈ మృదులాస్థి తొందరగా అరిగిపోతుంటుంది. అందువల్లే ఎక్కువమంది మోకీలు



సమస్యతో బాధపడుతుంటారు. ఈ మృదులాస్థి శరీరంలోని మిగతా ఎముకల్లా తనని తాను మరమ్మతు చేసుకోలేదు. పునఃసృష్టించు కోలేదు. రక్తం దీనికి నేరుగా అందకపోవడం ఇందులో కారణం. వైద్యులు మెకాలి చిప్ప శస్త్రచికిత్స చేసినప్పుడు అరిగిపోయిన ఆ మృదులాస్థిలోని కొంతభాఘాన్ని తొలగిస్తారు. దానికిందున్న పెద్ద ఎముకకి రంధ్రాలు చేసి.. వాటి నుంచి రక్తం వచ్చేలా చూస్తారు. నేరుగా వచ్చే ఆ రక్తంతో మృదులాస్థి చాలా పెళుసుగా ఉంటుంది. చిన్న శ్రమకే విరిగిపోతుంది. ఈ సమస్య పరిష్కారానికే ఓ జిగురులాంటి పదార్థాన్ని కనిపెట్టారు అమెరికాలోని నార్త్ వెస్టర్న్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు. ఆ జిగురుని మెకాలిచిప్పలోకి నేరుగా ఇంజెక్ట్ చేస్తారు. జిగురు లోపలికెళ్లాక అందులోని ప్రొటీన్ ఆ ప్రాంతంలో టిజిఎఫ్ బీ 1 అనే రసాయనాన్ని ప్రేరేపిస్తుంది. ఆ రసాయనం అక్కడికక్కడే మృదులాస్థిని మరమ్మతు చేసి గట్టిగా ఎదిగేలా చేస్తోందట. ఇంకే సర్జరీ దీనికి అక్కర్లేదట. ఈ కొత్త విధానంతో త్వరలోనే క్లినికల్ ట్రయల్స్‌కి వెళ్తామంటున్నారు శాస్త్రవేత్తలు. □

# అల్మారాలో సర్దేద్దాం !



బ్రాండెడ్ దుస్తులకు ప్రత్యేకంగా ట్యాగ్ ఉంటుంది. అందులో వాటిని శుభ్రపరిచే విధానం నుంచి ఆరబెట్టడం , ఇస్త్రీ తదితర విషయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలన్నీ పొందుపరచి ఉంటాయి. వాటిని పాటిస్తే ఎక్కువకాలం ఆ వస్త్రం మన్నుతుంది. ఎంబ్రాయిడరీ, ఫ్యాబ్రిక్ పెయింటింగ్ చేసిన దుస్తులైతే నాణ్యత తగ్గకుండా జాగ్రత్తపడితే మరిన్ని రోజులు ఆకర్షణగా కనిపిస్తాయి. చిన్న మరక పడినా ఘాటైన రసాయ నాలున్న లిక్విడ్స్‌తో మొత్తం డ్రెస్‌ను శుభ్రపరిస్తే కాలక్రమేణా అది కళను కోల్పోతుంది. కొన్నిరకాల వస్త్రాలైతే త్వరగా చిరిగిపోయే ప్రమాదమూ ఉంది. దీనికి బదులుగా మరకలు పడిన ప్రాంతంలో మాత్రం సున్నితమైన డిటర్జెంట్ లేదా సహజమైన స్టెయిన్ రిమూవర్‌ని ఉపయోగించి శుభ్రపరచి ఆరనివ్వాలి. ఆ తర్వాత వస్త్రం మొత్తాన్ని సాధారణంగా ఉతికితే సరిపోతుంది. దుస్తులను చల్లనినీటిలో శుభ్రపరచాలి. ముదురు వర్ణంలో ఉన్నవాటిని మొదటిసారి ఉతికే ముందు అరబకెట్ నీళ్లలో రెండుచెంచాల కల్లుప్పు వేసి అయిదు నిమిషాలపాటు నాననివ్వాలి. దాంతో రంగు దిగకుండా ఉంటుంది. ఆ తర్వాత తేలికపాటి డిటర్జెంట్‌తో శుభ్రపరిచి ఆరనిస్తే చాలు. కొన్ని డ్రెస్‌లకు అదనంగా బొత్తాలుంచిన చిన్న కవర్ అటాచ్ చేసి ఉంటుంది. బయటపడేయకుండా దాన్ని భద్రపరచాలి. బటన్ ఊడినప్పుడు ఆ డ్రెస్‌ను పక్కన పడేయ కుండా, ఆ చోట కొత్తదాన్ని కుట్టుకోవాలి. చిన్నగా కుట్టు ఊడినప్పుడు లేదా మరేదైనా మరమ్మతు ఉంటే నేర్చుకుని బాగు చేసుకోవాలి. ఇస్త్రీకి ముందుగా ఆ వస్త్రానికి తగ్గ వేడిని చెక్ చేయాలి. అలాగే అలమరలో కుక్కేయకుండా మడిచి వరసగా సర్దడం లేదా హ్యాంగర్లకు వేయడం అలవరుచుకుంటే దుస్తులు ఎక్కువ కాలం మన్నుతాయి. అలమరలలో దుస్తుల స్థానాన్ని అప్పుడ ప్పుడు మార్చుతూ ఉండాలి. లేదంటే కంటికి కనిపించేవాటిని మాత్రమే ధరిస్తాం. మిగతా వన్నీ అడుగుకు వెళుతుంటాయి. నెలకొకసారి లేదా సీజన్ మారినప్పుడల్లా దుస్తులను బయటకు తీసి వినియోగించేవీ లేదా అనవసరమైన వాటిని విడదీసి తిరిగి సర్దాలి. కొన్నింటిని రీసైకిల్ చేయొచ్చు. అలాగే వాడనివాటినివిరాళంగా ఎన్జీవోలకు అందించడం అలవరచుకోవాలి.□

# బీరపొట్టు పొడి

లేత బీరకాయ పొట్టు- అరకేజీ, వాము- చెంచా,



ఎండుమిర్చి-12, మినపప్పు- రెండు చెంచాలు, పసుపు-పావుచెంచా, వెల్లుల్లి రెబ్బలు-ఏడు, చింతపండు-10గ్రా.

**తయారీ :** బీరకాయపొట్టులో చెమ్మలేకుండా చేసుకుని అరచెంచా ఉప్పు వేసి మక్సిలో బరకగా ఆడించుకోవాలి. పొయ్యిమీద పాన్ పెట్టుకుని చెంచా నూనె వేసుకుని ఎండు మిరపకాయల్ని రంగు మారేంతవరకూ వేడి చేసి పక్కనపెట్టేయాలి. ఆ తర్వాత అదేపాన్‌లో మినపప్పుని ఎర్రగా వేయించుకుని పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు పాన్‌లో చెంచా నూనె వేసుకుని వేడెక్కాక బీరకాయ పొట్టుని వేసి పొడిపొడిగా అయ్యేంతవరకూ వేయించుకోవాలి. ఇందులోనే పసుపు, వాము కూడా వేసుకుని మరికాసేపు వేయించుకోవాలి. మక్సిలో వేయించిన ఎండుమిర్చి, మనిపప్పు, వెల్లుల్లిపాయ రెబ్బలు, చింతపండు వేసి పొడి చేసుకోవాలి. ఆ తర్వాత బీరకాయపొట్టు, ఉప్పు కూడా వేసి పొడి చేసుకోవాలి. యాంటీ ఆక్సిడెంట్లు నిండుగా ఉండే ఈ పొడి.. వాముమవల్ల జీర్ణప్రక్రియ సజావుగా సాగేట్టు చేస్తుంది. □

# మెడ నలుపుకిలా..!



**అందంగాకనిపించాలని..** ఎక్కువమంది ముఖ సౌందర్యంపైనే శ్రద్ధ పెడతారు. కాళ్లు, చేతులు, మెడ వంటి భాగాలను పట్టించుకోరు. దాంతో ఆయా ప్రదేశాలు నల్లగామారి.. అందవిహీనంగా కనిపిస్తాయి. కాళ్లు, చేతులను కవర్ చేసినా.. మెడపై ఉండే నలుపు (డార్క్ నెక్)తో ఎక్కువ ఇబ్బంది పడుతుంటారు. అందంగా కనిపించాలని.. ఎక్కువమంది ముఖ సౌందర్యం పైనే శ్రద్ధ పెడతారు. కాళ్లు, చేతులు, మెడ వంటి భాగాలను పట్టించుకోరు. దాంతో ఆయా ప్రదేశాలు నల్లగా మారి.. అంద విహీనంగా కనిపిస్తాయి. కాళ్లు, చేతులను కవర్ చేసినా.. మెడపై ఉండే నలుపు (డార్క్ నెక్)తో ఎక్కువ ఇబ్బంది పడుతుంటారు. ఈక్రమంలో కొన్ని చిట్కాలు పాటిస్తే.. డార్క్ నెక్ సమస్యను ఇట్టే దూరం చేసుకోవచ్చని సౌందర్య నిపుణులు అంటున్నారు. నల్లగా మారిన చర్మాన్ని తెల్లగా మార్చడంలో టమాట, నిమ్మరసంలో ఉండే విటమిన్ సి సాయపడు తుంది. తేనెలో ఉండే సుగుణాలు.. చర్మాన్ని మృదువుగా మారుస్తాయి. ఒక చిన్న గిన్నెలో కొద్దిగా టమాటా రసం, రెండుమూడు చుక్కల నిమ్మరసం, కొంచెం తేనె వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని మెడపై నల్లగా మారిన ప్రదేశంలో అప్లయి చేయాలి. అర గంటపాటు అలాగే వదిలేసి.. ఆ తర్వాత చల్లటి నీటితో కడిగేయాలి. ఆలుగడ్డలు క్లెన్సర్‌గా పనిచేస్తాయి. నిమ్మ రసం.. అద్భుతమైన బ్లీచింగ్ ఏజెంట్ కూడా. డార్క్ నెక్‌ను తగ్గించడంలో ఈ రెండిటి మిశ్రమం సమర్థంగా పనిచేస్తుంది.□

# సుదర్శన చక్రత్తాళ్వార్



దుష్ట శిక్షణ .. శిష్ట రక్షణ కోసం శ్రీమహా విష్ణువు అనేక అవతారాలను ధరించాడు. లోక కల్యాణం కోసం స్వామివారు అవతరిస్తున్నప్పుడల్లా, ఆయన ఆజ్ఞను పాటించడానికి సుదర్శన చక్రత్తాళ్వార్ కూడా వెన్నంటే వున్నాడు. ఒక్కో అవతారంలో మానుష రూపంలోనూ ఒక్కో సమయంలో ఆయుధ రూపంలోను ఆయన స్వామి ఆదేశాలను పాటిస్తూ వచ్చాడు. శ్రీమహా విష్ణువు రామావతారాన్ని ధరించినప్పుడు, ఆయన తమ్ముడు భరతుడిగా సుదర్శన చక్రత్తాళ్వార్ అవతరించాడు. కృష్ణావతారంలో సుదర్శనుడుగానే స్వామిని అంటిపెట్టుకుని వున్నాడు. పరశురామావతారంలో గొడ్డలిఖిగా అవతరించాడు. నరసింహ స్వామి అవతారంలో ఆ స్వామి 'గోళ్ల'గా ఆవిర్భవించాడు. ఇలా స్వామివారు ఆయా అవతారాలను ధరిస్తూ ఉండగా, ఆ అవతారాల్లో స్వామివారు అప్పగించే బాధ్యతలను సుదర్శనుడు నెరవేరుస్తుంటాడు. లోక కళ్యాణం కోసం స్వామి వారు తలపెట్టిన కార్యాన్ని పూర్తి చేయడంలో తనవంతు కర్తవ్యాన్ని నిర్వహిస్తుంటాడు.



# దివ్యమైన ఆహార్యం



యామదొంగలో యముడిగా కనిపించిన 20 ఏళ్ల తర్వాత జూనియర్ ఎన్టీఆర్ మళ్లీ మైథలాజికల్ టచ్ ఉన్న పాత్ర చేయబోతున్నారు. ఈ చిత్రంలో ఆయన కుమారస్వామి (లార్డ్ మురుగన్) ఆధారిత దివ్యమైన పాత్రలో కనిపించబోతున్నారనేది టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ప్రచారంలో ఉన్న పవర్‌ఫుల్ టైటిల్స్ ఈ చిత్రానికి గాడ్ ఆఫ్ వార్ లేదా దేవసేనాపతి అనే పవర్‌ఫుల్ టైటిల్స్ పరిశీలనలో ఉన్నాయి. కథలోని దివ్యత్వం మరియు యాక్షన్ ఎలిమెంట్స్‌కు అనుగుణంగా త్రివిక్రమ్ టీమ్ స్పెషల్ ఎఫెక్ట్స్, లుక్ టెస్ట్‌లను సిద్ధం చేస్తోంది. వరుస పాన్‌ఇండియా ప్రాజెక్ట్‌లుఎన్టీఆర్ ప్రస్తుతం ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న డ్రాగన్ షూటింగ్ పూర్తి చేసిన వెంటనే ఈ త్రివిక్రమ్ ప్రాజెక్ట్ సెట్స్‌లోకి అడుగుపెట్టనున్నారు. త్రివిక్రమ్ శ్రీనివాస్ ప్రస్తుతం వెంకటేష్‌తో ఆదర్శకుటుంబం సినిమా పూర్తి చేసిన తర్వాత ఈ ప్రాజెక్ట్‌పై దృష్టి పెట్టనున్నారు. సంగీతం: అనిరుధ్ రవిచందర్. నిర్మాణం: హారిక అండ్ హాసిని క్రియేషన్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంయుక్తంగా భారీ బడ్జెట్‌తో నిర్మించనున్నాయి.

## సంగీత వారసత్వాన్ని..
# కోల్పోతానేమోనన్న భయం



కర్ణాటక సంగీతం, కుటుంబ వారసత్వం, స్వీయ అన్వేషణల సమ్మేళనంగా రూపొందిన కొత్త తెలుగు వెబ్ సిరీస్ జగమే సంగీతం ట్రైలర్ విడుదలైంది. ప్రముఖ నటుడు ప్రకాశ్ రాజ్ ప్రధాన పాత్ర పోషిస్తున్న ఈ సిరీస్ సెప్టెంబర్ 4 నుంచి ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా ట్రైలర్ విడుదలైంది. హిందీలో విశేష ఆదరణ పొందిన బందిష్ బాండిట్స్ సిరీస్ స్ఫూర్తితో ఈ వెబ్ సిరీస్‌ను తెరకెక్కించారు. వైకుంఠపురం అనే దేవాలయ పట్టణం నేపథ్యంలో ఈ కథ సాగుతుంది. ప్రముఖ సంగీత విద్వాంసుడైన శాస్త్రి (ప్రకాశ్ రాజ్) కుటుంబ వారసత్వాన్ని కాపాడుకునేందుకు తాపత్రయపడుతుంటాడు. ఆయన మనవడు బాలు (అక్షయ్ లగుసాని) తాత వారసత్వాన్ని నిలబెడుతూనే, తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు ఎంచుకునే క్రమంలో ఎదుర్కొనే వైరుధ్యాలు, కుటుంబ సంబంధాల చుట్టూ కథ తిరుగుతుంది. ఈ సందర్భంగా ప్రకాశ్‌రాజ్ మాట్లాడుతూ.. శాస్త్రి పాత్రలోని క్రమశిక్షణ, నమ్మకాలు తనను బాగా ఆకట్టుకున్నాయి. తరతరాల సంగీత వారసత్వాన్ని ఎక్కడ కోల్పోతానేమోనన్న భయంతో ఉండే ఒక తండ్రి పాత్ర ఇది. సంగీతం మనుషులను ఎలా కలుపుతుందో అన్వేషించే అవకాశం దక్కింది. నటి మధుబాల మాట్లాడుతూ ఈ కథలోని కుటుంబ సంబంధాలు, నిజాయతీ తనను ఆకట్టుకున్నాయన్నారు. సంగీతం కథకు ఆత్మ అయితే, మానవ సంబంధాలు ప్రేక్షకులతో ఉండిపోతాయని పేర్కొన్నారు. గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై సుస్మిత కొణిదెల ఈ సిరీస్‌ను నిర్మించగా, పల్నాటి సూర్య ప్రతాప్ దర్శకత్వం వహించారు.

# దిల్ రాజుతో వచ్చే సంక్రాంతికి..




ఇరుముడి ఘనవిజయంతో బాక్సాఫీస్ వద్ద రికార్డు కలెక్షన్లు కొల్లగొడుతున్న మాస్ మహారాజా రవితేజ, తన అభిమానులకు మరో భారీ తీపి కబురు అందించారు. థియేటర్లలో రూ. 200 కోట్ల మైలురాయి వైపు దూసుకెళ్తున్న ఇరుముడి గ్రాండ్ సక్సెస్‌ను ఎంజాయ్ చేస్తున్న తరుణంలోనే, రవితేజ తన తదుపరి చిత్రాన్ని అధికారికంగా ప్రకటించారు. ఈ క్రేజీ ప్రాజెక్ట్ కోసం టాలీవుడ్ ప్రముఖ నిర్మాత దిల్ రాజుతో రవితేజ చేతులు కలిపారు. రాజ రాజ చోర చిత్రంతో తన మార్క్ వినోదాన్ని అందించి ప్రేక్షకులను మెప్పించిన యంగ్ డైరెక్టర్ హసిత్ గోలి ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై ప్రొడక్షన్ నంబర్ 64గా ఈ చిత్రం రూపొందనుంది. ఇరుముడి విజయం సందర్భంగా నిర్మాత దిల్ రాజు స్వయంగా రవితేజను కలిసి అభినందనలు తెలియజేశారు. ఇదే సమయంలో ఈ కాంబినేషన్‌కు సంబంధించిన అనౌన్స్‌మెంట్ పిక్స్‌ను విడుదల చేశారు. రవితేజ ఎనర్జీకి హసిత్ గోలి మార్క్ కామెడీ టైమింగ్ తోడైతే థియేటర్లలో నవ్వుల పండగ ఖాయమని చిత్రబృందం ధీమా వ్యక్తం చేస్తోంది. పక్కా ఫన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కనున్న ఈ చిత్రాన్ని రాబోయే సంక్రాంతి కానుకగా థియేటర్లలోకి తీసుకురావడానికి ప్లాన్ చేస్తున్నారు.

**కన్నీళ్లు ఆపుకోవడం నా వల్ల కాలేదు**

రవితేజ కథానాయకుడిగా, శివ నిర్వాణ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించిన ఇరుముడి చిత్రం ఘన విజయం సాధించడంతో హైదరాబాద్‌లో చిత్ర బృందం సక్సెస్ మీట్ నిర్వహించింది. ఈ సందర్భంగా రవితేజ మాట్లాడుతూ భావోద్వేగానికి గురయ్యారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..'స్క్రీన్ మీద నన్ను చూసి మీరంతా నవ్వుతారు, ఈలలు వేస్తారు. నేను కూడా సాధారణంగా దేనికీ అంతగా ఎమోషనల్ అవ్వను. కానీ ఇరుముడి సినిమా చూశాక నా కన్నీళ్లు ఆపుకోవడం నా వల్ల కాలేదు. నా కూతురు మోక్ష కూడా సినిమా చూసి బాగా ఎమోషనల్ అయ్యింది. ఒక నటుడిగా నన్ను ఇంతలా కదిలించిన కథ ఇది. హిందీలో రాజ్‌కుమార్ హిరాణీ గారు తీసే సినిమాలు గుండెలను పిండేస్తూనే ఒక మంచి అనుభూతిని ఇస్తాయి. తెలుగులో శివ నిర్వాణ ఇరుముడితో సరిగ్గా అలాంటి అనుభూతినే అందించాడు. జీవీ ప్రకాశ్ ఇచ్చిన మ్యూజిక్ ఈ సినిమాకి నిజమైన ఆత్మ. థియేటర్‌లో ప్రతీ సన్నివేశాన్ని ఆయన తన సంగీతంతో నెక్స్ట్ లెవెల్‌కి తీసుకెళ్లాడు. ప్రేక్షకులు కంటతడి పెట్టడానికి ఆ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ప్రధాన కారణం. నాకు అత్యంత సంతోషాన్నిచ్చిన విషయం ఏంటంటే... దాదాపు 20 సంవత్సరాలుగా థియేటర్ వైపే రాని ఎంతో మంది పెద్దవాళ్లు, కుటుంబాలు ఈ సినిమా చూడటానికి మళ్లీ థియేటర్లకు వస్తున్నారు. ఒక నటుడికి అంతకంటే పెద్ద అవార్డు, ఆనందం ఇంకేం ఉంటుంది?' అని పేర్కొన్నారు. దర్శకుడు శివ నిర్వాణ మాట్లాడుతూ గతంలో నా నిన్ను కోరి, మజిలీ చిత్రాలు నన్ను తెలుగువారి ఇళ్లలోకి తీసుకెళ్తే, ఇరుముడి ఏకంగా వారి హృదయాల్లో స్థానం సంపాదించిపెట్టిందని రవితేజ గారు అన్నారు. కేవలం కమర్షియల్ లెక్కల కోసమే కాకుండా, ప్రేక్షకులను భావోద్వేగపరంగా మెప్పించాలనే ఉద్దేశంతోనే ఈ చిత్రాన్ని రూపొందించామని పేర్కొన్నారు. సినిమా విడుదలైన అతి తక్కువ కాలంలోనే లాభాల బాట పట్టిందని మైత్రీ మూవీ మేకర్స్ తెలిపారు. గత 50 ఏళ్లలో ఇలాంటి అద్భుత రికార్డులు చూడలేదని డిస్ట్రిబ్యూటర్లు అంటున్నారని హర్షం వ్యక్తం చేశారు. బేబీ నక్షత్ర, నటుడు సాయికుమార్ తదితరులు మాట్లాడారు.

# హిట్ మెషీన్‌కు గ్రీన్ సిగ్నల్..



సూపర్ స్టార్ మహేష్ బాబు, సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి కాంబినేషన్ మరోసారి వెండితెరపై సందడి చేయబోతోందనే వార్త ప్రస్తుతం టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి దర్శకత్వంలో మహేష్ నటిస్తున్న పాన్‌వరల్డ్ విజువల్ వండర్ వారణాసి షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. టైమ్ ట్రావెల్, గ్లోబ్‌ట్రాటింగ్ అడ్వెంచర్ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ భారీ చిత్రంపై ప్రపంచవ్యాప్తంగా అంచనాలు పరాకాష్టకు చేరాయి. అయితే ఈ ప్రాజెక్ట్ పూర్తికాగానే ఎక్కువ విరామం తీసుకోకుండా, తన తదుపరి చిత్రాన్ని వెంటనే పట్టాలెక్కించే దిశగా మహేష్ బాబు పక్కా ప్లాన్ వేస్తున్నారు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. వారణాసి విడుదల కాకముందే మహేష్ తన నెక్స్ట్ సినిమాకు సంబంధించిన కాల్‌షీట్లను కేటాయించడానికి సిద్ధమవుతున్నారు. రాజమౌళి సినిమా ప్రమోషన్ల కోసం కేవలం ఒక నెల రోజులు మాత్రమే గ్యాప్ తీసుకుని, ఆ వెంటనే కొత్త చిత్రాన్ని సెట్స్‌పైకి తీసుకెళ్లాలని భావిస్తున్నారు. ఈ క్రమంలోనే అనిల్ రావిపూడి చెప్పిన ఓ సరికొత్త స్పోర్ట్స్ డ్రామా కథాంశానికి మహేష్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చే ఆలోచనలో ఉన్నారు. వీరిద్దరి కాంబినేషన్‌లో గతంలో వచ్చిన సరిలేరు నీకెవ్వరు భారీ బాక్సాఫీస్ విజయాన్ని సాధించడంతో ఈ కొత్త ప్రాజెక్ట్‌పై చర్చలు ముమ్మరంగా సాగుతున్నాయి. తక్కువ సమయంలోనే నాణ్యమైన వినోదాన్ని అందిస్తూ విజయాలు సాధించడంలో అనిల్ రావిపూడి దిట్ట. దీంతో రాజమౌళి సినిమా తర్వాత ఆయనతో ప్రాజెక్ట్ చేయడం సరైన నిర్ణయమని విశ్లేషకులు భావిస్తున్నారు. అంతేకాకుండా, రాజమౌళితో సినిమా చేసిన తర్వాత కథానాయకులకు ఫ్లాపులు ఎదురవుతాయనే సినీ పరిశ్రమలోని పాత సెంటిమెంట్‌ను బ్రేక్ చేయడానికి కూడా హిట్ మెషీన్ అనిల్ రావిపూడి సరైన ఎంపిక అని మహేష్ బాబు భావిస్తున్నట్లు టాలీవుడ్ టాక్. ఈ చిత్రాన్ని 2028 సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చేలా ప్రణాళికలు రచిస్తున్నారు.



# ఒక్క అమ్మాయీ లేకుండా కొత్త సినిమా

సినిమా అనేది కేవలం పట్టణాలకే పరిమితం కాదని, పల్లెల్లోనూ ప్రతిభ దాగి ఉందనే ఆలోచనతో కొత్త దర్శకుడు అజర్ రూపొందించిన చిత్రం కొత్త సినిమా. ఏకంగా 100 మంది కొత్త మగ నటులతో, ఒక్క మహిళా పాత్ర కూడా లేకుండా తెరకెక్కించిన ఈ సినిమా ప్రీరిలీజ్ ప్రమోషన్ ఈవెంట్ వై ఇన్ హైదరాబాద్.. వై నాట్ ఇన్ అవర్ ప్లేస్ పేరుతో హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ దర్శకనిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ చిత్ర యూనిట్‌ను అభినందిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సినిమా గురించి తమ్మారెడ్డి భరద్వాజ మాటల్లో.. 'దర్శకుడు అజర్ టైటిల్ కొత్త సినిమా అని పెట్టడమే కాకుండా, ఒక వైవిధ్యమైన ప్రయత్నం చేశాడు. అందరూ మేల్ ఆర్టిస్టులతోనే సినిమా తీయడం బహుశా ఇదే మొదటిసారి కావచ్చు. ప్రస్తుతం సినిమా మేకింగ్ అంటే చాలా ఖర్చుతో కూడుకున్నది, నటులు దొరకడం కూడా కష్టమే. అలాంటిది అజర్ తన సొంత ఊరికి వెళ్ళి, అక్కడి లోకల్ టాలెం ట్‌ను ఎంపిక చేసుకుని, వారికి తగిన ట్రెనింగ్ ఇచ్చి ఈ సినిమా రూపొందించడం విశేషం. అయితే 100 మందిని పెట్టి ఒక్క అమ్మాయికి కూడా అవకాశం ఇవ్వక పోవడం కాస్త బాధగా ఉంది. అయినా ఈ కొత్త ప్రయత్నం మంచి విజయం సాధించి, దర్శకుడికి మంచి పేరు తీసుకురావాలని కోరుకుంటున్నాను' అన్నారు. డీవోపీ జానీ బాషా, మ్యూజిక్ డైరెక్టర్ పెద్దపల్లి రోహిత్, నటులు రాకేష్, సురేష్, క్రిటిక్ చల్లా శ్రీనివాస్, డైరెక్టర్లు అజర్, వీరశంకర్, వీఎన్ ఆదిత్య, దర్శక నిర్మాత ఎన్ శంకర్ తదితరులు మాట్లాడారు.

# ...ఇది వెయ్యి మాస్ బీట్స్‌తో సమానం



దసరా వంటి భారీ విజయం తర్వాత నేచురల్ స్టార్ నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్లో తెరకెక్కుతున్న పాన్‌ఇండియన్ చిత్రం ది ప్యారడైజ్. ఈ సినిమా మ్యూజిక్ సెషన్స్ నుంచి తాజాగా లీకైన పిక్ సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అవుతోంది. జాతీయ పురస్కార గ్రహీత, పాటల రచయిత కాసర్ల శ్యామ్ కాళ్లకు నమస్కరించి అనిరుధ్ రవిచందర్ ఆశీస్సులు తీసుకుంటున్న ఒక ప్రత్యేకమైన ఫొటోను నిర్మాణ సంస్థ ఎస్ఎల్‌వి సినిమాస్ నెట్టింట పంచుకుంది. "ఒక చిత్రం వెయ్యి పదాలతో సమానం.. కానీ ఇది వెయ్యి మాస్ బీట్స్‌తో సమానం " అనే క్యాప్షన్‌తో పాటు ఈ చిత్రం నుంచి సెకండ్ సింగిల్ త్వరలోనే విడుదల కాబోతోందని మేకర్స్ అధికారికంగా వెల్లడించడంతో సినిమాపై అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. హైదరాబాద్ మురికివాడల నేపథ్యంలో, సామాజిక వివక్షకు వ్యతిరేకంగా పోరాడే జడల్ అనే పవర్ ఫుల్ పాత్రలో నాని నటిస్తున్న యాక్షన్ డ్రామా ది ప్యారడైజ్.

# స్పెషల్ షోకు అదనంగా రూ. 600



కన్నడ రాకింగ్ స్టార్ యశ్ హీరోగా గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో తెరకెక్కిన భారీ యాక్షన్ థ్రిల్లర్ టాక్సిక్. కేవీఎన్ ప్రొడక్షన్స్, మాన్స్టర్ మైండ్ క్రియేషన్స్ బ్యానర్లపై వెంకట్ కే నారాయణ, యశ్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 26న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదలకు సిద్ధమైంది. ఈ నేపథ్యంలో సినిమా టికెట్ ధరల పెంపుతో పాటు ప్రత్యేక షోల ప్రదర్శనకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు అనుమతులు మంజూరు చేస్తూ జీవోలు జారీ చేశాయి. సింగిల్ స్క్రీన్స్ పై రూ. 50, మల్టీప్లెక్స్ లలో రూ. 100 చొప్పున (జీఎస్టీతో కలిపి) పెంచుకోవడానికి రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు అనుమతిచ్చాయి. ఈ పెంపు విడుదలైన నాటి నుంచి 10 రోజుల పాటు అమల్లో ఉంటుంది. ఏపీలో ఆగస్టు 26 ఉదయం 6 గంటల నుంచే స్పెషల్ ప్రీమియర్ షోల ప్రదర్శనకు గ్రీన్ సిగ్నల్ లభించింది. ఈ ప్రత్యేక షోలకు జీఎస్టీతో కలిపి టికెట్ ధరపై అదనంగా రూ. 600గా నిర్ణయించారు. థియేటర్లలో రోజుకు ఐదు షోలు వేసుకునే వెసులుబాటు కల్పించారు. తెలంగాణలో టికెట్ రేట్ల పెంపు వల్ల వచ్చే ఆదాయంలో 20 శాతం నిధిని తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ వర్కర్ల సంక్షేమానికి కేటాయించాలనే ప్రభుత్వ నిబంధన మేరకు, టాక్సిక్ నిర్మాతలు రూ. 1 కోటి ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ కమిటీలో డిపాజిట్ చేసినట్లు తెలుస్తోంది. ఒక కన్నడ పాన్‌ఇండియా/డబ్బింగ్ చిత్రానికి తెలుగు రాష్ట్రాల్లో ఈ స్థాయిలో టికెట్ రేట్ల పెంపు లభించడం ట్రేడ్ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది.

26vzm15:26vzm15.qxd 25-08-2026 23:18 Page 1



విజయనగరం పార్వతీపురం మన్యం వార్త 25

## విజయనగరం సబ్ జైల్ తనిఖీ



**విజయనగరం, ఆగస్టు 25, ప్రభాతవార్త:**

జాతీయ న్యాయ సేవా అధికార సంస్థ న్యూఢిల్లీ వారి యొక్క ఉత్తర్వులు మేరకు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి డాక్టర్ ఏ కృష్ణ ప్రసాద్ విజయనగరం సబ్ జైలును సందర్శించి తనిఖీ చేసినారు. జాతీయ న్యాయ సేవా అధికార సంస్థ వారు ఏర్పాటు చేసిన స్పృహ పథకం గురించి తెలియజేశారు. ఈ పథకానికి సంబంధించి జైల్లో ఉన్న ముద్దాయిల యొక్క కుటుంబ నికి ఏ విధమైన సహాయ సహకారాలు కావాల్సింది ఎడల ఈ స్పృహ పథకం ద్వారా అందించడం జరుగుతుందని తెలియజేశారు. కారాగారంలో ఉన్న ఖైదీలకు న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించినారు. వీరికి పలు చట్టాలపై అవగాహన కల్పించినారు.ఖైదీల పట్ల సిబ్బంది గాని తోటి ఖైదీలు గాని ఎటువంటి వివక్షత చూపించరాదని గౌరవ సుప్రీంకోర్టు ఇచ్చిన జడ్జిమెంట్ ను గూర్చి తెలియజేశారు. ఆ విధంగా ఖైదీల పట్ల వివక్షత చూపించిన యెడల కఠినమైన చర్యలు ఉంటాయని, ఆ విషయమై జైలు సూపరింటెంట్ ని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా సబ్ జైల్లో కొనసాగుతున్న జైల్ లీగల్ ఎయిడ్ క్లినిక్‌లను తనిఖీ చేశారు. జైలు లీగల్ ఎయిడ్ క్లినిక్స్ నిర్వహిస్తున్న విధులను పర్యవేక్షించారు .జైల్ క్లినిక్లను సందర్శించే న్యాయవాదులు మరియు పారా లీగల్ వాలంటీర్లు నిర్వహిస్తున్న విధులను గురించి ఆరా తీశారు. జైలులో ఉన్న ఖైదీల వివరాలను ప్రతి ఒక్కరిని అడిగి తెలుసు కున్నారు ఖైదీలను ఉద్దేశించి వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నేర ప్రవృత్తిని విడనాడాలని మారుమనస్సు పొంది మంచి పౌరులుగా మెలగాలని హితవు పలికారు. సకాలంలో న్యాయ సహాయము అందించడానికి జైల్ లీగల్ ఎయిడ్ క్లినిక్లను ఏర్పాటు చేశామని వాటిని సక్రమంగా కొనసాగించాలని తెలియజేశారు. జైల్లో ఉన్న ముద్దాయిలకు ఉచిత న్యాయ సహాయము అందించడమే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ముఖ్య కర్తవ్యం అని తెలియజేశారు.రిమాండ్‌లో ఉన్న ముద్దాయిలకు ఎవరు న్యాయవాది లేకుండా ఉండకూడదని అట్టివారికి జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ న్యాయవాదిని ఉచితంగా అందిస్తుందని ఈ సందర్భంగా తెలియజేశారు. జైలులో అమలవుతున్న సౌకర్యాలు గురించి ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. వంటగదిని భోజనశాలను పరిశీలించారు. స్టోర్ రూమ్ సందర్శించి వంట సరుకులను పప్పు దినుసులను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. సబ్ జైలు సూపరింటెండెంట్ సంపత్ కుమార్ పాల్గొన్నారు.

## కృష్ణాపురంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం



**బొబ్బిలి, ఆగస్టు 25, ప్రభాతవార్త:**

పొలం పిలుస్తోంది కార్యక్రమం కృష్ణాపురం గ్రామంలో నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో జాగాను సత్యనారాయణ పొలములో జీవామృతం తయారీ చేయించి వాటిని సేంద్రియ వ్యవసాయ పద్ధతిలో పిచికారి చేయడానికి అవగాహన కల్పించడం జరిగింది. అలాగే నూతన విధానములో వరిలో సేంద్రీయంగా కలుపు నివారణ కోసం బియ్యపు నూకను ఎకరానికి 50 కేజీలు చొప్పున నోట్లు వేసిన వారం రోజులు లోపు చల్లించడం జరిగినది దీనివలన వరి పొలంలో కలుపు నివారణ సమర్థవంతంగా చేయవచ్చునిది ప్రధాన ఉద్దేశం కాబట్టి కార్యక్రమాన్ని రైతులందరూ ముందుకు తీసుకెళ్లాలని కోరుకుంటూ రసాయన ఎరువులు పురుగుమందులు లేకుండా వ్యవసాయం చేసే విధానములో ఇది ముఖ్యమైన కార్యక్రమాన్ని రైతులకు వివరిస్తూ రసాయన విధానంలో కూడా కలుపు మందులు వాడకుండా కలుపు నివారణ కోసం ఎకరానికి 50 కేజీలు బియ్యపు నూకలు వరి నాట్లు వేసిన వారం రోజులు లోపు చల్లుకున్నచో కలుపు నివారించవచ్చు అనేది రైతులకు తెలియజేయడం జరిగింది. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు స్వర్ణలత ప్రకృతి సేద్య సిబ్బంది బురిటి శంకర్రావు శ్రీరామ్ గ్రామ పెద్దలు పాల్గొనడం జరిగినది.

## రాజేష్ మాస్టార్‌ను అభినందించిన కలెక్టర్



**నెల్లిమర్ల, ఆగస్టు 25,ప్రభాతవార్త:**

జాతీయ ఉపాధ్యాయ అవార్డు - 2026కు ఎంపికైన మండలంలోని చనమల్లుపేట ఎంపీపీ పాఠశాల సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడు కౌలూరి రాజేష్ ను జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి ఘనంగా సత్కరించి అభినందించారు. జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన రాజేష్ జిల్లా కలెక్టర్ రామ సుందర్ రెడ్డిని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు.విద్యార్థులకు వినూత్న పద్ధతుల్లో బోధన అందిస్తూ, సాంకేతికతను విద్యాబోధనలో సమర్థవంతంగా వినియోగిస్తున్న రాజేష్ సేవలను జిల్లా కలెక్టర్ అభినందించారు. చిన్న చిన్న పాఠాలుగా బోధనా అంశాలను విభజించి విద్యార్థులకు సులభంగా అర్థమ య్యేలా చేయడంతో పాటు, కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత విధానాలను వినియోగించడం అభినందనీయ మన్నారు. రాజేష్ రూపొందించిన వెబ్ ఆధారిత ఇంటరాక్టివ్ ఏ ఐ లెర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ద్వారా వేలాది మంది విద్యార్థులకు ప్రయోజనం కలుగుతున్న విషయాన్ని కలెక్టర్ ప్రస్తావించారు. అలాగే 'హలో ధృతి' వంటి ఉచిత ఇంటరాక్టివ్ ఫౌండేషనల్ లెర్నింగ్ యాప్, విద్యార్థులకు పోటీ పరీక్షలకు ఉపయోగపడేలా ఏఐ ఆధారిత సహాయక విధానాలను రూపొందించడం ద్వారా ఆయన విద్యారంగంలో వినూత్న మార్పులకు కృషి చేస్తున్నారని తెలిపారు."విజయనగరం జిల్లాకు జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడం గర్వకా రణమని కలెక్టర్ కొనియాడారు. రాజేష్ సేవలు ఇతర ఉపాధ్యాయులకు స్ఫూర్తిదాయకమన్నారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేలా మరిన్ని వినూత్న కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. ఆయనకు భవిష్యత్తులో మరిన్ని విజయాలు లభించాలని జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు.ఈ సందర్భంగా రాజేష్ రూపొందించిన యాప్ ను, ఆయన రాసిన పుస్తకాలను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి యు. మాణిక్యం నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## మొండెంఖల్లులో ఇంటింటికీ ప్రచారంలో ఎమ్మెల్యే జగదీశ్వరి



**కురుపాం, ఆగస్టు 25, ప్రభాత వార్త:**

ప్రజల సంక్షేమము అభివృద్ధి కూటం ప్రభుత్వం ముఖ్య లక్ష్యము అని ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి అన్నారు. మంగళవారం మండలం మొండెంకల్ గ్రామంలో రెండేళ్ల నమ్మకం-సంక్షేమం, అభివృద్ధి' కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీ ఆదేశాల మేరకు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కె.వి.కొండయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వంపై ప్రజలు చూపిస్తున్న విశ్వాసం తమపై మరింత బాధ్యతను పెంచుతోందని, ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రంజిత్ కుమార్ నాయకో, రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి కోలా రంజిత్, రాష్ట్ర ట్రైకర్ బోర్డ్ డైరెక్టర్ పువ్వల లావణ్య, మాజీ సర్పంచ్ గుడారి లక్ష్మి, నాయకులు రామకృష్ణ, వెంకట్రావు, సీతారాం, తిరుపతి, జివిరావు, దినేష్, చంటి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సేవే పరమావధిగా వాసవీ క్లబ్ సేవలు



**శృంగవరపుకోట,ఆగస్టు25,ప్రభాతవార్త :**

ప్రజాసేవే పరమావధిగా వాసవి క్లబ్ సేవలు కొనసాగుతున్నాయని వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ గవర్నర్ కళ్యాణ్ రాజు తెలిపారు.మంగళవారం మండలంలోని పోతనపల్లి పంచాయతీ ఎరుకలపేటలో కొట్టాం పిహెచ్ సి ఆధ్వర్యంలో బొడ్డవర వాసవి వనిత క్లబ్ అధ్యక్షురాలు పూసర్ల రవి కుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన మెడికల్ క్యాంపులో ఆయన పాల్గొన్నారు. వైద్య శిబిరంలో పిహెచ్ సీ వైద్యాధికారిణి హారిక రోగులను పరీక్షించి వారికి మందులు అందజేశారు.అనంతరం క్లబ్ గవర్నర్ కళ్యాణ్ రాజు,వైస్ గవర్నర్ నానాజీ మాట్లాడుతూ బొడ్డవర వాసవి వనితా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు ప్రతి ఒక్కరికి ఆదర్శంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు.ముఖ్యంగా సంఘ అధ్యక్షురాలు రవికుమారి సంఘ ప్రతినిధులు ఆధ్వర్యంలో వైద్యంతో పాటు ఇతర కార్యక్రమాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిని ఇస్తున్నాయని తెలిపారు. ఇదేవిధంగా రానున్న రోజులలో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో ఏఎన్ఎం ఉదయలక్ష్మి , ఆశాలు పాల్గొన్నారు.

## ముగిసిన అంగన్వాడీ టీచర్ల జ్ఞానజ్యోతి శిక్షణ



**ప్రభాతవార్త -భోగాపురం:**

స్థానిక ఉన్నత పాఠశాలలో గత ఆరు రోజులుగా అంగన్వాడీ టీచర్లకు రోజులుగా నిర్వహించిన 'జ్ఞానజ్యోతి' మూడో సంవత్సరం శిక్షణ కార్యక్రమాలు మంగళవారంతో విజయవంతంగా ముగిశాయి. కార్యక్రమానికి భోగాపురం ఐసీడీఎస్ సీడీపీఓ లావణ్య, ఎంఈఓ చంద్ర మౌళి, భోగాపురం జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం శ్రీను వాసరావు హాజరై మాట్లాడారు. ఆరు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ అంగన్వాడీ టీచర్ల బోధనా సామర్థ్యాలను పెంపొందించడంతో పాటు పూర్వ ప్రాథమిక విద్యలో పిల్లల సమగ్ర వికాసానికి ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు.విద్యాశాఖ తరపున హాజరైన రిసోర్స్ పర్సన్ టీచర్లు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సమన్వయకర్తలుగా వ్యవహరించి శిక్షణను విజయవంతంగా నిర్వహించారు. ఆరు రోజుల పాటు ఉత్సాహంగా పాల్గొని శిక్షణను పూర్తి చేసిన అంగన్వాడీ టీచర్లను అధికారులు అభినందించారు.

## పేదలు,మహిళలకు ఉచితంగా న్యాయ సేవలు పొందే హక్కు



**శృంగవరపుకోట,ఆగష్టు25,ప్రభాతవార్త :**

పేదలు,మహిళలు,దివ్యాంగులు, వృద్ధులకు ఉచితంగా న్యాయ సేవలు పొందే హక్కు ఉందని న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి,సీనియర్ సివిల్ జడ్జి ఏ.కృష్ణ ప్రసాద్ తెలిపారు.ఎస్.కోట మేజరు పంచాయతీ కార్యాలయం ఎదుట మంగళవారం చట్టాలపై న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు.ఇక ఉచిత న్యాయ సహాయంతో పాటు అవసరమైన న్యాయ సలహాలు కూడా అందిస్తామని స్పష్టం చేశారు.బాల్య వివాహాలు చేయడం నేరమని బాల్య వివాహాలు చేసిన వారితో పాటు అటువంటి వివాహం చేసుకున్న వారు కూడా శిక్షకు గురవుతారని హెచ్చరించారుమద్యం తాగి వాహనాలు నడుపరాదని ఇలా వాహనాలు నడిపే క్రమంలో ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని వారి కుటుంబాలు రోడ్డున పడతాయని తెలిపారు. సదస్సులో డిప్యూటీ తహశీల్దార్ కీర్తన,డిప్యూటీ ఎంపీడీఓ విష్ణుమూర్తి,ఈఓ చంద్రశేఖర్, పంచాయతీ,సచివాలయ సిబ్బంది,స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో చోరీ.. దొంగ అరెస్ట్



**గరుగుబిల్లి, ఆగస్టు 25, ప్రభాతవార్త :**

గరుగుబిల్లి మండలం సన్యాసి రాజుపేట గ్రామంలోని శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 19వ తారీఖున రాత్రి సమయంలో ఒక దొం గతనం జరిగింది. గుర్తుతెలియని వ్యక్తులు ఆలయంలో చొరబడి ఆలయంలో శివలింగానికి ఉన్న నాగభరణం, వినాయక విగ్రహానికి ఉన్న కిరీటం పార్వతి దేవి విగ్రహానికి ఉన్న కిరీటం, శఠగోపం వంటి వెండి వస్తువులను దొంగతనంగా కాజేసి పారిపోవడం జరిగింది. ఈ కేసులో విశాఖపట్నం పోతిన మల్లయ్య పాలెం నకు చెందిన అవసరాల సత్య సూర్య కుమార్ అనబడే వ్యక్తి గత మూడు రోజులుగా గాలించి, పట్టుకొని అతని వద్ద నుంచి 90 శాతం వస్తువులను రికవరీ చేసి అతనిని అరెస్టు చేసి ఈరోజు పార్వతీపురం కోర్టు వారి ముందు ప్రవేశపెట్టడం జరిగింది. ఈ కేసులో ప్రధానంగా విశాఖపట్నం పోతిన మల్లయ్య పాలెం పోలీస్ స్టేషన్ క్రైమ్ బ్రాంచ్ వారి సహకారంతో నేరస్థుని వివరాలు సేకరించి అతని కదలికలపై నిఘా ఉంచి, చిన్న మేరంగి తిరుపతిరావు దిశానిర్దేశంలో ఈ కేసును ఛేధించడం జరిగిందని గరుగుబిల్లి ఎస్ఐ తెలిపారు.

## దూబ రాంబాబుకు డాక్టరేట్ ప్రదానం



**పార్వతీపురం, ఆగస్టు25, ప్రభాతవార్త:**

డాక్టర్ ఎన్.టి.ఆర్ వైద్యా సేవ సంక్షేమ పథకం లో విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల మేనేజర్ గా పేద ప్రజలకు సేవలు అందిస్తున్న దూబ రాంబాబు కు డాక్టరేటు అవార్డు ప్రధానం ఉద్యోగం పట్ల ఆయనకున్న అంకితభావానికి నిదర్శనమని వక్తలు కొనియాడారు. 80 వ స్వతంత్ర దినోత్సవ సందర్భంగా ఈయన చేసిన సేవలను కొనియాడుతూ అమెరికాకు చెందిన డే స్ప్రింగ్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ కి చెందిన చాన్సర్ డాక్టర్. అమోస్ చేతులు మీదుగా మంగళ వారం విశాఖపట్నం పబ్లిక్ లైబ్రరీ హాల్ లో డాక్టరేట్ అవార్డు ప్రదానంతో పాటు దుసాల్వ్‌తో సన్మానం చేసి ఆయన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ నిష్కలంక హృదయుడు, మానవత్వానికి మరో రూపం, ఆపదలో ఉన్నవారు అన్నా అని పిలిస్తే నేనున్నాను అనే భరోసా కల్పించే బాంధ వ్యుడు, నిరంతర శ్రామికుడు అయినా రాంబాబుకు డాక్టర్ బిరుదు రావడం ఎంతో ఆనంద కలిగిస్తుందని అన్నారు. ఈయన ఎక్కడ పని చేస్తే అక్కడ తన కంటూ ఒక గుర్తింపు సంపాదించి ఆ జిల్లా అధికారులు దగ్గర మన్ననలుతో పాటుప్రశంసలు వందనంలోనే ఆయనకి వృత్తిపట్ల ఉన్న అంకిత భవాని తెలియజేస్తుందన్నారు. ఎన్నో అవార్డులు అయనను వెతుకు కుంటూ ఆయన చెంతకు చేరి వాటి విలువలను మరింత పెంచి కున్నయి అని అన్నారు. డాక్టరేట్ రావడం చాలా సంతోషంగా ఉందని అయన కుటుంబ సభ్యులు, స్నేహితులు, అభిమానులు, శ్రీ విజయ మల్టీ హాస్పిటల్ సిబ్బంది రాంబాబుకి అభినందనలు తెలిపారు.

## చిన్నారుల వికాసమే ప్రధాన లక్ష్యం : సీడీపీఓ మంగమ్మ



**సాలూరు, ఆగస్టు 25, ప్రభాతవార్త :**

అంగన్వాడీ సెంటర్ల ద్వారా చిన్నారులకు అభ్యసన ఇంకా వారి వికాసమే ప్రధాన లక్ష్యమని సీడీపీఓ కె.మంగమ్మ అన్నారు. మంగళవారం అంగన్వాడీలకు "జ్ఞానజ్యోతి" మూడో ఏడాది చివరరోజు శిక్షణ కార్యక్రమం స్థానిక గర్ల్స్ హైస్కూల్లో నిర్వహించారు.ఈ శిక్షణలో భాగంగా సీడీపీఓ అంగన్వాడీలకు మార్గదర్శకాల దిశా నిర్దేశం చేశారు.అలాగే చిన్నారుల ఏజ్ ప్రకారం వారి మేధస్సు ఇంకా శారీరక సామాజిక భావోద్విగ వికాశాన్ని ప్రోత్సహించడం వంటి అంశాలపై ప్రత్యేక అవగాహన కల్పించారు.అంతేకాకుండా బాలలకు బోధన మరింత సులభంగా అర్థమయ్యే రీతిలో ప్రయోగాత్మక అభ్యాసన ఇంకా ఆటల ద్వారా నేర్పించే పద్ధతులు తదితర అంశాలగురించి శిక్షణలో వివరించారు.సూపర్వైజర్లు అనురాధ,ధనలక్ష్మి,హైమాతి, తిరుపతమ్మ,లీలా,డీఆర్పీలు ధనలక్ష్మి,సాయి,కిశోర్, నాయుడు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## గ్రామాల్లో మండల ప్రత్యేక అధికారి పర్యటన

**ప్రభాతవార్త - భోగాపురం :**

మండలలోని వివిధ గ్రామాల్లో మంగళవారం ప్రత్యేక అధికారి వెంకటేశ్వరరావు పర్యటించారు. ముంజేరు, చేపల కంచేరు, ముక్కాం, రామచంద్రపేట స్వర్ణ గ్రామాలను సందర్శించిన ఆయన గ్రామాల్లో అమలవుతున్న కార్యక్రమాలు, అభివృద్ధి పనులను పరిశీలించారు. ముంజేరులోని ఆర్ఎస్‌కే కేంద్రాన్ని సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. తదుపరి భోగాపురం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సందర్శించారు. కార్యాల యంలో ప్రజా సానుకూల స్పందన (పీపీపీ -పబ్లిక్ పాజిటివ్ పర్సెప్షన్) ఆశించిన స్థాయిలో లేదని గుర్తించి, ఈ అంశంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సంబంధిత అధికారులకు సూచించారు.అనంతరం భోగాపురం పీఏసీఎస్ (పీఏసీఎస్ )ను సందర్శించి అక్కడి కార్యకలాపాలను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ సచివాలయాల్లో పనిచేసే పాటి ఉద్యోగి ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు.ప్రజలకు మెరుగైన సేవలు అందించి ఉన్నతాధికారులు మన్ననలు పొందాలని సూచించారు.

## కిచ్చాడలో మన్యంతో మమేకం : ఎస్ఐ నారాయణరావు



**కురుపాం,ఆగస్టు 25, ప్రభాతవార్త :**

మన్యంతో మమేకం కార్యక్రమంలో భాగంగా కిచ్చాడ గ్రామంలో పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించినట్లు ఎస్ఐ నారాయణరావు తెలిపారు. మంగళవారం పార్వతీ పురం మన్యం జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఎస్.వి. మాధవరెడ్డి ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న "మన్యంతో మమేకం" కార్యక్రమంలో భాగంగా కురుపాం పోలీస్ స్టేషన్ సబ్-ఇన్‌స్పెక్టర్ పి. నారాయణరావు సిబ్బంది కిచ్చాడ గ్రామంలో పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ ప్రజలతో మమేకమై, వారి సమస్యలను తెలుసుకుని, ప్రజలకు అందుబాటులో ఉన్న పోలీస్ సేవలు మరియు వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. డ్రగ్స్, మాదకద్రవ్యాల నివారణ, వాటి వినియోగం వల్ల కలిగే అనర్థాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా వినియోగానికి దూరంగా ఉండాల్సిన ఆవశ్యకతపై అవగాహన కల్పించారు.మహిళలు, బాలికలపై జరిగే నేరాల నివారణ, మహిళల భద్రత, వేధింపులు, గృహహింస వంటి సమస్యలు ఎదురైనప్పుడు వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు. పోక్సో చట్టం బాలల రక్షణకు సంబంధించిన చట్టాలపై కూడా ప్రజలకు అవగాహన కల్పించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలనిన్నారు, గుర్తుతెలియని వ్యక్తులకు మెసేజ్‌లు, లింకులు మరియు ఆన్‌లైన్ మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100/112నువినియోగించుకోవాలని, గ్రామంలో ఏదైనా నేరం జరిగినా, అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలతో మమేకమైన పోలీసులు.. శివ్వంలో పల్లెనిద్ర



**గరుగుబిల్లి, ఆగస్టు 25, ప్రభాత వార్త:**

ప్రజలకు మరింత చేరువగా వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని భద్రతపై అవగాహన కల్పించేందుకు చేపట్టిన "మన్యంతో మమేకం- పల్లెనిద్ర" కార్యక్రమంలో భాగంగా సోమవారం రాత్రి గరుగుబిల్లి మండలం శివ్వం గ్రామంలో పోలీసులు పల్లెనిద్ర నిర్వహించారు. సీఐ టీ.వీ. తిరుపతిరావు, ఎస్ఐ షేక్ ఫక్రుద్దీన్, ఎస్బీ ఎస్ఐ రాంబాబు, స్టేషన్ సిబ్బంది గ్రామంలో పర్యటించి ప్రజలతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో సమావేశమై గ్రామంలో నెలకొన్న సమస్యలు, శాంతిభద్రతలకు సంబంధించిన అంశాలపై చర్చించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలు, పోలీసుల సహకారం పొందే విధానాలను వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీసులు, సంబంధిత అధికారులను సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లను గ్రామస్తులకు తెలియజేశారు.అలాగే మాదకద్రవ్యాల వినియోగం, అసాంఘిక కార్యకలాపాలు, మహిళలు-బాలికల భద్రత, సైబర్ నేరాలు తదితర అంశాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలు ఎలాంటి సమస్య ఎదురైనా పోలీసుల దృష్టికి తీసుకురావాలని, సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. పోలీసులు గ్రామంలో కరపత్రాలు పంపిణీ చేసి, "ఇంటింటికి మన్యం పోలీస్" కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికలను ఏర్పాటు చేశారు. అనంతరం గ్రామంలోని రచ్చబండ వద్దే పోలీసులు రాత్రి బస చేయడం ద్వారా ప్రజలతో మరింత సాన్నిహిత్యాన్ని పెంచారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల భద్రత, సమస్యల పరిష్కారానికి పోలీసులు నిరంతరం అందుబాటులో ఉంటారని అధికారులు తెలిపారు.

## ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించడమే ధ్యేయం



**కొమరాడ ,ఆగస్టు 25, ప్రభాతవార్త :**

ప్రతి పేదవాని ఇంటికి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందించడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని మండల తెదేపా కన్వీనర్ ఎస్. ఉదయ శేఖర్ పాత్రుడు అన్నారు డోర్ టు డోర్ కార్యక్రమాన్ని మార్కొండ పుట్టి గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి నుంచి పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందన్నారు. అమరావతి పోలవరం వంటి ప్రాజెక్టులను ముందుకు తీసుకు వెళ్లడంతో పాటు ప్రతి పేదవాని ఇంటికి సంక్షేమ పథకాలు చేరవేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఏఎంసి వైస్ చైర్మన్ గౌరీ శంకర్ క్లస్టర్ ఇంచార్జ్ లు త్రినాధం రాఘవేంద్రరావు భానోజీ రావు తెదేపా నాయకులు డి వెంకట్ నాయుడు మురళి బత్తిలి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## నారం నాయుడు వలసలో పల్లెనిద్ర

**బలిజిపేట, ఆగస్టు 25, ప్రభాతవార్త :**

బలిజిపేట మండలం నాయుడు వలస లో పార్వతిపురం మన్యం జిల్లా అడిషనల్ ఎస్పి ఎం వెంకటేశ్వర్లు మరియు బలిజిపేట పోలీస్ శాఖ ఎస్సై కే రాజేష్ మరియు సిబ్బంది కలిసి పల్లెనిద్ర కార్యక్రమాన్ని నారం నాయుడు వలస లో నిర్వహించారు మరియు ఇంటింటికి మన్యం పోలీస్ కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రతి ఇంటికి టోల్ ఫ్రీ నెంబర్లతో కలిగిన స్టిక్కర్లు ఇంటి గోడలకు అతికించి మరియు కరపత్రాలు ప్రజలకు అందజేశారు ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం ప్రజల్లో చైతన్యం రావాలని అడిషనల్ ఎస్పీ తెలిపారు గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనకు త్రావ ఇవ్వకూడదని యువకులు మేలుకోవాలని తెలిపారు ముఖ్యంగా యువకులు గంజాయి మరియు మాదకద్రవ్యాలు బారిన పడకూడదని తెలిపారు బాల్యవివాహాలు ప్రోత్సహించరాజని తెలిపారు మైనర్ డ్రైవింగ్ చేయించరాదని తెలిపారు. మహిళలపై అత్యాచారం పంటి సంఘటన చర్యలు చేపడితే జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు ప్రజలకు ఎటువంటి ఆపద వచ్చిన మన్యం పోలీస్ మీ ముందు ఉంటుందని వెంటనే టోల్ ఫ్రీ నెంబర్లకు ఫోన్ చేసి మాకు తెలియపరచగలరని విజ్ఞప్తి చేశారు. ఎస్సై కే రాజేష్ ఏఎస్ఐ రవణ, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం మండలంలో ఉన్న ఫైర్ వర్క్ ప్రాంతాలను పరిశీలించియాజమాన్యానికి భద్రత కలిగినచర్యలు పొట్టదిట్టంగా తీసుకోవాలని హెచ్చరించారు.

## నా ప్రయాణం విద్య నుంచి ప్రజాసేవ వైపు



**పార్వతీపురం, ఆగస్టు 25, ప్రభాతవార్త:**

నా ప్రయాణం విద్య నుంచి ప్రజాసేవ వైపు, నా లక్ష్యం ప్రజలతో కలిసి అభివృద్ధి వైపు అని డా. రంగుముద్రి శివ నరేంద్ర నాయుడు అన్నారు. ఈయన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన విద్యావేత్త, పారిశ్రామికవేత్త, మేనేజ్‌మెంట్ ప్రొఫెషనల్ మరియు విద్యాసంస్థల అభివృద్ధికి కృషి చేస్తున్న యువ నాయకత్వ ప్రతినిధి. విద్య, యువత సాధికారత, గ్రామీణాభివృద్ధి, ఉపాధి కల్పన మరియు ప్రజాసేవను తన భవిష్యత్ కార్యాచరణకు ప్రధాన అంశాలుగా భావిస్తారు. రంగుముద్రి గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ అభివృద్ధి మరియు నిర్వహణలో కీలకంగా పనిచేస్తూ, ముఖ్యంగా గ్రామీణ మరియు వెనుకబడిన ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన విద్య, వృత్తి విద్య మరియు మెరుగైన అవకాశాలు అందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారు. విద్యారంగం మరియు పారిశ్రామిక రంగంలో తన అనుభవాన్ని ప్రజాసేవకు ఉపయోగించాలనే సంకల్పంతో డా. శివ నరేంద్ర నాయుడు కొత్త రాజకీయ ప్రయాణానికి సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం ఈయన వైఎస్ఆర్సీపి రాష్ట్ర యువజన విభాగ సంయుక్త కార్యదర్శి గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. విలేకరులతో మాట్లాడుతూ ప్రజాసేవ వైపు కొత్త అడుగులు వేస్తున్నానని ప్రజల సమస్యలను దగ్గరగా అర్థం చేసుకుని, వాటికి ఆచరణాత్మక పరిష్కారాలను చూపించే అభివృద్ధి ఆధారిత, యువతా కేంద్రిత మరియు ప్రజా సంక్షేమ రాజకీయాలకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు అన్నారు. తన ప్రధాన లక్ష్యాలు యువతకు ఉపాధి మరియు నైపుణ్యాభివృద్ధి, గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధి, మహిళల విద్య మరియు ఆర్థిక సాధికారత, పారదర్శకత, జవాబుదారీతనం, ప్రజా భాగస్వామ్య పాలన అని అన్నారు.

## సామరోతు రామారావు పార్ధివదేహానికి నివాళులు



**రామభద్రపురం, ఆగష్టు 25,ప్రభాత వార్త,:**

రొంపిల్లి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు మరియు బొబ్బిలి రాజుల వీరాభిమాని సామరోతు రామారావు స్వర్గస్తులయ్యారని తెలిసి ఎమ్మెల్యే ఆర్.వీ.ఎస్.కె.కె. రంగారావు (బేబీనాయన) ఈరోజు రామారావు పార్థివ దేహానికి నివాళులు అర్పించి, వారి కుటుంబస్తులతో మాట్లాడి, పార్టీ ఎల్లవేళలా వారి కుటుంబానికి అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. ఎమ్మెల్యే వెంట విజయనగరం జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు మడక తిరుపతి రావు , మాజీ సర్పంచ్ బవిరెడ్డి శంకర్రావు , టీడీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు .

## అంగన్వాడి కార్యకర్తలకు ముగిసిన జ్ఞానజ్యోతి శిక్షణ

**దత్తిరాజేరు, ఆగస్టు 25, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో అంగన్వాడీలకు జ్ఞానజ్యోతి అభ్యాసం ద్వారా ఆరురోజు ముగింపు శిక్షణ ఇవ్వడం జరిగిందని, .సూపర్వైజర్ శ్యామలత ఇందిరా భవాని తెలిపారు, శిక్షణ తరగతులలో నేర్చుకున్న ప్రతి అంశాన్ని చిన్నారులకు ఆటపాటలు ద్వారా నేర్పించాలన్నారు. పిల్లల్లో శారీరక మానసిక అభివృద్ధిని గుర్తించాలన్నారు,3 సంవత్సరాల నుండి.6 సంవత్సరాల్లోపు పిల్లలకు, మెదడు వేగంగా పనిచేస్తుందన్నారు. చిన్నారులకు విద్యా బోధన బొమ్మల ద్వారాచదువు నేర్పించాలన్నారు, శిక్షకులు బోధించిన ప్రతి అంశాన్ని అంగన్వాడి టీచర్లు నేర్చుకోవడం జరిగిందన్నారు, కార్యక్రమంలో శిక్షకులు త్రినాధ సత్తిబాబు సురేష్ అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

## పట్టాలమ్మ తల్లికి కుంకుమ పూజలు

**లక్కవరపుకోట,ఆగస్టు 25, ప్రభాత వార్త :**

మండలంలోని లక్కవరపుకోట మేజర్ పంచాయతీ సంఘం వీధిలోగల గ్రామ దేవత శ్రీ పట్టాలమ్మ తల్లికి మంగళవారం వేదపండితులు అక్కా జోష్యుల శ్రీహరి శర్మ ఆధ్వర్యంలో వైభవంగా సామూహిక కుంకుమ పూజలు అలాగే కాత్యాని వ్రతం మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు ఈ సందర్భంగా పట్టాలమ్మ తల్లికి ప్రత్యేక పుష్పాలంకరణ భక్తుల అందజేసిన వివిధ రకాల పుష్పాలతోఅలంకరణ చేయడం జరిగింది ఈ సందర్భంగా భక్తులకు శ్రీహరి శర్మ అమ్మవారి లీలా విశేషాలు కాత్యాయనీ వ్రతం చేయడం వల్ల అవివాహతులకు కలిగే ఉపయోగాలు వివరించారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ ద్వారా జామి కొండమ్మకు రూ.4.5 లక్షలు



**లక్కవరపు కోట, ఆగస్టు 25 ప్రభాత వార్త :**

తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ వైద్య ఖర్చులను భరించలేని నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తెలిపారు. మండల కేంద్రమైన ఎల్.కోట గ్రామానికి చెందిన జామి కొండమ్మ తీవ్ర అనారోగ్య సమస్యతో బాధపడుతూ చికిత్స పొందుతున్నారు. కుటుంబ ఆర్థిక పరిస్థితి దృష్ట్యా వైద్య ఖర్చులు భరించడం భారంగా మారడంతో, బాధితురాలి పరిస్థితిని తెలుసుకున్న ఎమ్మెల్యే ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ ఎఫ్ ) నుంచి ఆర్థిక సహాయం మంజూరు చేయాలని ప్రభుత్వానికి సిఫార్సు చేశారు.ఈ మేరకు ప్రభుత్వం నుంచి మంజూరైన రూ. 4.5 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ లెటర్ ఆఫ్ కంఫర్ట్ (ఎల్ఓసీ) పత్రాన్ని ఎల్.కోట క్యాంప్ కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే స్వయంగా అందజేశారు.

## సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం : కర్రోతు

**నెల్లిమర్ల, ఆగస్టు 25, ప్రభాతవార్త**

రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధికి తమ కోటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదని ఏపీ మార్క్ ఫెడ్ చైర్మన్ టిడిపి నెల్లిమర్ల నియోజకవర్గం ఇంచార్జ్ కర్రోతు బంగారు రాజు అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు పూసపాటిరేగ మండలం చింతపల్లి, కుమిలి గ్రామాల్లో మంగళవారం సాయంత్రం చేపట్టిన రెండేళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమంలో భాగంగా బంగార్రాజు ఆయా గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకుని కూటమి ప్రభుత్వం గత రెండేళ్లలో అమలు చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు, ప్రజలకు అందించిన సేవలను వివరించారు.జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు రౌతు సోమినాయుడు, ఎంపీటీసీ కొమర దేవుడమ్మ ,టీడీపీ నాయకులు దల్లి గౌతంరెడ్డి ,రామ్మోహన్ రెడ్డి, కొమర అశోక్ , తదితరులు పాల్గొన్నారు.

ఆట



## నెక్కో ఛాంపియన్‌షిప్.. శుభంకర్ 46వ స్థానం

**స్కాట్లాండ్‌బి:** ట్రంప్ ఇంటర్నేషనల్ గోల్ఫ్ లింక్స్‌లో జరిగిన 2026 నెక్సో ఛాంపియన్‌షిప్ చివరి రౌండ్‌లో ఈవెన్‌పార్ 72 స్కోరు సాధించిన భారత గోల్ఫ్ క్రీడాకారుడు శుభంకర్ శర్మ, 46వ స్థానంలో నిలిచాడు. మూడు బర్డీలు, మూడు బోగీలు నమోదు చేసిన శర్మ, 73, 72, 75, 72 రౌండ్ల తర్వాత నాలుగు ఓవర్ 292 స్కోరుతో టోర్నమెంట్‌ను ముగించాడు. తోటి భారత ఆటగాడు యువరాజ్ సంధు ఈ వారం ప్రారంభంలో కట్ మిస్ అయ్యాడు. స్కాట్లాండ్‌కు చెందిన స్కాట్ జేమీసన్ తన స్వదేశంలో రెండవ డీపీ వరల్డ్ టూర్ టైటిల్‌ను గెలుచుకోవడానికి, చివరి రౌండ్‌లో 67 స్కోరుతో అద్భుతమైన ప్రదర్శన కనబరిచాడు. 42 ఏళ్ల అతను 11అండర్ పార్ స్కోరుతో ముగించి, ఇంగ్లాండ్‌కు చెందిన మాథ్యూ జోర్డాన్ కంటే రెండు షాట్లు ముందున్నాడు. జామీసన్ చివరి రౌండ్‌ను రాత్రికి అగ్రస్థానంలో ఉన్న షాన్ నారిస్ కంటే మూడు షాట్లు వెనుకబడి ప్రారంభించినప్పటికీ, ఫ్రంట్ నైన్‌లో మూడు బర్డీలతో ఆ లోటును త్వరగా పూడ్చాడు. స్ట్రోక్‌ను ప్రభావితం చేసే పరిస్థితులను మెరుగుపరిచే చర్యలకు సంబంధించిన రూల్ 8.1ను ఉల్లంఘించినందుకు నారిస్‌కు తదనంతరం రెండుస్ట్రోక్ పెనాల్టీ విధించబడింది, దీంతో జామీసన్ టర్న్ వద్ద స్పష్టమైన ఆధిక్యాన్ని సాధించాడు.



## దులీప్ ట్రోఫీ.. సెమీఫైనల్‌కు ఈస్ట్ జోన్

**న్యూఢిల్లీ:** ఈస్ట్ జోన్, నార్త్ ఈస్ట్ జోన్‌ను ఒక ఇన్నింగ్స్ మరియు 210 పరుగుల తేడాతో చిత్తుగా ఓడించి దులీప్ ట్రోఫీ సెమీఫైనల్స్‌లో స్థానం సంపాదించింది. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ గ్రౌండ్‌లో మంగళవారం జరిగిన ఈ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో ఈస్ట్ జోన్ భారీగా 467 పరుగులు చేయడంతో ఈ ఘన విజయం సాధ్యమైంది. ఆ తర్వాత వారు తమ ప్రత్యర్థులను రెండు ఇన్నింగ్స్‌లలో 111 మరియు 146 పరుగులకే ఆలౌట్ చేశారు. షాబాజ్ అహ్మద్ అద్భుతమైన 167 పరుగులతో విజయాన్ని నిలబెట్టగా, రెండో ఇన్నింగ్స్‌లో అనుకుల్ రాయ్ ఐదు వికెట్లు పడగొట్టి మ్యాచ్‌ను ఖరారు చేశాడు. ఈస్ట్ జోన్ తొలుత తడబడి, ఐదు వికెట్ల నష్టానికి 138 పరుగులకే పరిమితమై, ఆ తర్వాత పుంజుకుంది. వారు చివరికి 112.5 ఓవర్లలో 467 పరుగులు సాధించారు. షాబాజ్ 244 బంతుల్లో 17 ఫోర్లు, నాలుగు సిక్సర్లతో 167 పరుగులు చేసి, జట్టును పునరుద్ధరించాడు. సుదీప్ కుమార్ ఘరామి క్రీజులో అద్భుతమైన సహకారం అందించాడు. అతను 185 బంతుల్లో 25 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 146 పరుగులు చేశాడు. ఈ జోడీ ఇన్నింగ్స్‌ను పునర్నిర్మించడానికి విలువైన భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. బౌలింగ్ దాడిని ఎదుర్కోవడంలో తడబడిన నార్త్ ఈస్ట్ జోన్, తమ తొలి ఇన్నింగ్స్‌లో 42.5 ఓవర్లలో 111 పరుగులకే ఆలౌట్ అయింది.

# భారీ ఆధిక్యం దిశగా భారత్

## 236 రన్స్‌తో వెనుకబడిన శ్రీలంక





**కొలంబో:** శ్రీలంకతో రెండో టెస్ట్‌లో టీమిండియా పట్టు బిగించి భారీ ఆధిక్యంతో విజయానికి చేరువులో ఉంది. బ్యాటింగ్ తరహాలోనే బౌలింగ్‌లోనూ సత్తా చాటింది. దాంతో మంగళవారం మూడో రోజు ఆట ముగిసే సమయానికి శ్రీలంక 83.4 ఓవర్లలో 8 వికెట్లకు 265 పరుగులు చేసి, టీమిండియా కంటే 236 పరుగులు వెనకబడి ఉంది. క్రీజులో లాహిరు కుమార(8 బ్యాటింగ్)తో పాటు సోనాల్ దినుషా(85 బ్యాటింగ్) ఉన్నాడు. ఇక 8/2 ఓవర్‌నైట్ స్కోర్‌తో మూడో రోజు ఆటను కొనసాగించిన శ్రీలంకకు ఆదిలోనే గట్టి షాక్ తగిలింది. కామిల్ మిషారా(19)ను ప్రసిధ్ కృష్ణ ఔట్ చేయగా, కామిందు మెండిస్‌తో కలిసి పసిందు సూర్య బండార ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. ఈ క్రమంలో అతను 76 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. 87 పరుగుల భాగస్వామ్యంతో క్రీజులో పాతుకు పోయిన ఈ జోడీని ప్రసిధ్ కృష్ణ విడదీసాడు. కామిందు మెండిస్(32)ను క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. దాంతో శ్రీలంక 130/4 స్కోర్‌తో లంచ్ బ్రేక్‌కు వెళ్లింది. ఈ సమయంలో వర్షం అంతరాయం కలిగించడంతో రెండో సెషన్ ఆలస్యంగా ప్రారంభమైంది. సెకండ్ సెషన్ ఆరంభంలోనే ధనంజయ డిసిల్వా(8)ను మానవ్ సుతార్ పెవిలియన్ చేర్చాడు. దాంతో శ్రీలంక 137 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ పరిస్థితుల్లో సోనాల్ దినుషాతో కలిసి పసిందు జట్టును ఆదుకునే ప్రయత్నం చేశారు. సెంచరీ దిశగా సాగిన పసిందును జడేజా క్లీన్ బౌల్డ్ చేశాడు. ఆ వెంటనే నిరోషన్ డిక్‌వెల్లా(0)ను సిరాజ్ డకౌట్‌గా పెవిలియన్ చేర్చాడు. కేశర నువాంతతో కలిసి సోనాల్ దినుషా పోరాడాడు. తొలి టెస్ట్ ఫామ్‌ను కొనసాగిస్తూ 82 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. దాంతో శ్రీలంక 216/7 స్కోర్‌తో టీ బ్రేక్‌కు వెళ్లింది. ఆఖరి సెషన్‌లోనూ ఈ జోడీ ఆచితూచి ఆడింది. 57 పరుగుల భాగస్వామ్యంతో ప్రమాదకరంగా మారిన ఈ జోడీని మానవ్ సుతార్ విడదీసాడు. లాహిరు కుమారా ఆచితూచి ఆడగా, సోనాల్ దినుషా తనదైన శైలిలో బ్యాటింగ్ చేశాడు. మరోవికెట్ పడకుండా ఈ ఇద్దరూ జాగ్రత్త పడటంతో శ్రీలంక 265/8 స్కోర్ వద్ద మూడో రోజు ఆటను ముగించింది. భారత బౌలర్లలో ప్రసిధ్ కృష్ణ(3/47), మానవ్ సుతార్(3/83) మూడేసి, మహమ్మద్ సిరాజ్, రవీంద్ర జడేజా తలో వికెట్ పడగొట్టారు. కాగా తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 503/9 స్కోర్ వద్ద డిక్లేర్డ్ చేసిన సంగతి తెలిసిందే.



## డబ్ల్యూటిఎ టోర్నీ కోకో గాఫ్‌కు టైటిల్

**సిన్సినాటి:** యూఎస్ ఓపెన్ సమీపిస్తున్న తరుణంలో, సిన్సినాటిలో జరుగుతున్న డబ్ల్యూటీఏ 1000 టోర్నమెంట్‌లో జెస్సికా పెగులాపై 6-2, 6-4 తేడాతో కోకో గాఫ్ ఆధిపత్యం చెలాయించి, 2026లో తన తొలి టైటిల్‌ను కైవసం చేసుకుంది. ప్రపంచ నంబర్ ఫోర్ గాఫ్, ఈ ఏడాది మయామి, రోమ్‌లలో జరిగిన ఫైనల్స్‌లో ఓటమిపాలైన తర్వాత, గత అక్టోబర్‌లో వుహాన్‌లో తన మొదటి డబ్ల్యూటిఎ టైటిల్‌ను కైవసం చేసుకుంది. మూడవ ర్యాంక్ క్రీడాకారిణి పెగులాపై 75 నిమిషాల్లో విజయంతో టోర్నమెంట్‌ను ముగించిన గాఫ్ రెండవ సిన్సినాటి కిరీటాన్ని అందించింది. గాఫ్, పెగులా సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేసి 4-0 ఆధిక్యం సాధించింది. పెగులా తన సర్వీస్‌ను నిలబెట్టుకుని, ఒక బ్రేక్‌ను తిరిగి సాధించి స్కోరుబోర్డుపైకి రాకముందే గాఫ్ 5-0తో ఆధిక్యంలో ఉంది. 34 నిమిషాల తర్వాత గాఫ్ మళ్లీ బ్రేక్ చేసి తొలి సెట్‌ను కైవసం చేసుకోవడంతో అది ఒక స్వల్ప ఉపశమనంగా నిలిచింది. రెండవ సెట్ కూడా అదే విధంగా సాగింది, గాఫ్ 3-0 ఆధిక్యం సాధించే క్రమంలో బ్రేక్ చేయగా, పెగులా ఆమెను అందుకోవడానికి ప్రయత్నించింది. అయితే గాఫ్ తన మొదటి మ్యాచ్ పాయింట్‌తో విజయాన్ని ఖాయం చేసుకుంది. గాఫ్ విజయంతో ఇద్దరి మధ్య కెరీర్ సిరీస్ చెరో ఐదు విజయాలతో సమమైంది. వింబుల్డన్ క్వార్టర్‌ఫైనల్‌లో తన స్వదేశీయురాలిని ఓడించిన తర్వాత, ఈ సీజన్‌లో పెగులాపై గాఫ్ తన రెండవ మ్యాచ్‌ను గెలుచుకుంది.



## వరల్డ్ ర్యాంకింగ్స్‌లో.. 12 స్థానాలు ఎగబాకిన ట్రీసా-గాయత్రి

**న్యూఢిల్లీ:** బిడబ్ల్యూఎఫ్ ప్రపంచ ర్యాంకింగ్స్‌లో భారత బ్యాడ్మింటన్ మహిళల డబుల్స్ జోడీ ట్రీసా జాలీ, గాయత్రి గోపీచంద్ 12 స్థానాలు ఎగబాకి ప్రపంచ 27వ ర్యాంకును సాధించారు. ఈ మేరకు మంగళవారం విడుదలైన ర్యాంకింగ్స్‌లో ఈ భారత్ మహిళల డబుల్స్ జోడీ అనూహ్యంగా పాయింట్లుతో పై పైకి చేరింది. ఇటీవల జరిగిన బిడబ్ల్యూఎఫ్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం సాధించిన కొద్ది రోజులకే ట్రీసా, గాయత్రిల ఎదుగుదల చోటుచేసుకుంది. స్వదేశంలో జరిగిన ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లలో, భారత జంట ప్రపంచ ర్యాంకింగ్‌లో 39వ స్థానంలో ఉండి, అన్‌సీడెడ్‌గా బరిలోకి దిగింది. ఈ టోర్నమెంట్‌లో వారు రెండు పెద్ద సంచలనాలు సృష్టించారు. వరుస రౌండ్లలో జపాన్‌కు చెందిన ఏడవ సీడ్ రిన్ ఇవానగాకీ నకానిషిని, నాలుగవ సీడ్ జియా యి ఫాన్‌జాంగ్ షు జియాన్‌ను ఓడించి సెమీఫైనల్స్‌కు చేరుకున్నారు. సెమీఫైనల్స్‌లో చైనాకు చెందిన ప్రపంచ నంబర్1 జోడీ లియు షెంగ్ షు మరియు టాన్ నింగ్‌లతో తలపడిన ట్రీసాగాయత్రి, 18-21, 21-13, 8-21 తేడాతో ఓడిపోయి కాంస్య పతకంతో సరిపెట్టుకున్నారు. కాంస్య పతకం సాధించడం ద్వారా వారికి మొత్తం 10,500 ర్యాంకింగ్ పాయింట్లు లభించి, తాజా ర్యాంకింగ్స్‌లో వారు ప్రపంచ 27వ స్థానానికి చేరుకున్నారు. ఒకప్పుడు ప్రపంచ 9వ ర్యాంకు వరకు చేరుకున్న భారత జంట, గాయాల సమస్యలు మరియు నిలకడలేని ఫామ్ కారణంగా ఇటీవలి కాలంలో ర్యాంకింగ్‌లో గణనీయంగా వెనుకబడ్డారు. వారు ఈ ఏడాది మార్చిలో ప్రపంచ ర్యాంకింగ్‌లో 30వ స్థానం కంటే దిగువకు పడిపోయి, జూన్‌లో 58వ స్థానానికి కూడా దిగజారారు. మళ్లీ ఇప్పుడు పైకి ఎదిగారు.

## ఈ యేడాది దీపమ్ ఓఎఫ్ఎస్ లక్ష్యం రూ.80వేల కోట్లు!

**న్యూఢిల్లీ, ఆగస్టు 25:** ప్రభుత్వ డిజిన్వెస్ట్‌మెంట్ కార్యక్రమం కొనసాగింపు ఆర్థిక సంవత్సరం మిగిలిన కాలంలోనూ ప్రభుత్వ డిజిన్వెస్ట్‌మెంట్ కార్యక్రమం చురుగ్గా కొనసాగనున్నట్లు కేంద్రం సంకేతాలు ఇచ్చింది. ఈ ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన రూ.80వేల కోట్ల డిజిన్వెస్ట్‌మెంట్ లక్ష్యాన్ని సాధిస్తామని పెట్టుబడులు, ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ విభాగం ప్రకటించింది. ఇప్పటికే ప్రభుత్వం ఎల్ఐసీ ఆఫర్ ఫర్ సేల్, తాజా హిందుస్థాన్ కాపర్ వాటాల విక్రయం తదితర లావాదేవీల ద్వారా సుమారు రూ.52 వేల కోట్లను సమీకరించింది. లక్ష్యాలను చేరుకోవడంతో పాటు ఫలితాలపై కూడా ప్రభుత్వం దృష్టి సారిస్తోందని తెలుస్తోంది. తదుపరి ఏ ప్రభుత్వ రంగ సంస్థ వాటాలను మార్కెట్‌లో విక్రయించనున్నారనే విషయాన్ని వెల్లడించేందుకు దీపమ్ కార్యదర్శి నిరాకరించారు. మరిన్ని మార్కెట్ ఆఫర్లు కొనసాగుతాయని సూచించారు. పెద్ద మొత్తంలో ఓఎఫ్ఎస్‌లావాదేవీలకు సంబంధించి ప్రభుత్వం సిద్ధం చేస్తున్న ప్రణాళికపై ప్రశ్నించగా, మార్కెట్ ఆఫర్లతో ప్రభుత్వం ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు. దీంతో తాజా హిందుస్థాన్ కాపర్ ఒక్కటే కాకుండా, రాబోయే రోజుల్లో మరిన్ని ప్రభుత్వ సంస్థల వాటాల విక్రయాలు ఉండే అవకాశం కనిపిస్తోంది. మార్కెట్ పరిస్థితులను అంచనా వేసేందుకు దీపమ్‌లో ప్రత్యేక మార్కెట్ రీసెర్చ్ యూనిట్‌తో పాటు కురుక్షేత్ర పేరుతో అంతర్గత ఆపరేషన్స్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు కార్యదర్శి తెలిపారు. వాటాల విక్రయాలను ప్రారంభించే ముందు మార్కెట్ పరిస్థితులను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటుందని చెప్పారు.




వాణిజ్యం




## నివాస గృహాల మార్కెట్‌లో మందగమనం!

**న్యూఢిల్లీ, ఆగస్టు 25:** దేశంలో నివాస గృహాల మార్కెట్ ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో వృద్ధి బాటలో కొనసాగింది. అయితే గత త్రైమాసికంతో పోలిస్తే వార్షిక ప్రాతిపదికన ఇళ్ల ధరల పెరుగుదల వేగం కొంత మందగించినట్లు భారతీయ రిజర్వ్ బ్యాంక్ వెల్లడించింది. ఆర్‌బీఐ ఆల్ ఇండియా హౌస్ ప్రైస్ ఇండెక్స్ ప్రకారం, ఈఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో గృహ ధరల సూచీ వార్షికంగా 3.6 శాతం పెరిగింది. అంతకుముందు త్రైమాసికంలో నమోదైన 4.5 శాతం వృద్ధితో పోలిస్తే ఇది తక్కువ. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో నమోదైన వృద్ధి రేటు కూడా 3.6 శాతమే కావడం గమనార్హం. జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో ఆల్ ఇండియా ఇండెక్స్ 117.5కి చేరింది. గత త్రైమాసికంలోని 116.2తో పోలిస్తే ఇది 1.1 శాతం పెరుగుదల. గత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో సూచీ 113.4గా ఉంది. వార్షిక ప్రాతిపదికన గృహ ధరల పెరుగుదలకు ప్రధానంగా చండీగఢ్, జైపూర్, కాన్పూర్, లక్నో, తిరువనంతపురం నగరాల్లో నమోదైన ధరల పెరుగుదల దోహదపడింది. త్రైమాసిక ప్రాతిపదికన సూచీ 1.1 శాతం పెరగడానికి ముఖ్యంగా చండీగఢ్, లక్నో, తిరువనంతపురం నగరాల్లో అధిక ధరలు కారణమయ్యాయి. 2022-23ను బేస్ ఇయర్‌గా తీసుకుని దేశంలోని 18 ప్రధాన నగరాల్లో నివాస గృహాల ధరల మార్పులను ఈ సూచీ ప్రతిబింబిస్తుంది. ఈ సూచీలో ముంబై, ఢిల్లీ, చెన్నై, కోల్‌కతా, బెంగళూరు, లక్నో, అహ్మదాబాద్, జైపూర్, కాన్పూర్, కొచ్చి, హైదరాబాద్, తిరువనంతపురం, పుణె, ఘజియాబాద్, థానే, గౌతమ్ బుద్ధ నగర్, చండీగఢ్, నాగ్‌పూర్ నగరాలు ఉన్నాయి.

## బ్రెంట్ క్రూడ్ ధరలు 3 శాతం పతనం



**న్యూఢిల్లీ, ఆగస్టు 25:** మధ్యప్రాచ్యంలో మరోసారి పూర్తిస్థాయి ఉద్రిక్తతలు చెలరేగుతాయన్న సంకేతాలతో మంగళవారం అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ ఫ్యూచర్స్ ధరలు దాదాపు 3 శాతం పడిపోయాయి. బ్యారెల్‌కు సుమారు 87 డాలర్లకు చేరాయి. బ్రెంట్ ఫ్యూచర్స్ 2.92 శాతం క్షీణించి 87.90 డాలర్ల వద్ద ట్రేడయ్యాయి. అమెరికా పలు మధ్యప్రాచ్య దేశాల్లోని రాయబార కార్యాలయాల నుంచి తరలించిన దౌత్య సిబ్బందిని తిరిగి విధుల్లోకి పంపించే అవకాశం ఉందన్న వార్తల క్రమంలో మార్కెట్లలో ధరలు తగ్గాయి. అమెరికా విదేశాంగ సిబ్బంది ఈ వారంలోనే తమ పోస్టులకు తిరిగి వెళ్లే అవకాశం ఉందని పేర్కొంది. ఇరాన్‌తో మరోసారి పూర్తిస్థాయి సైనిక ఘర్షణలు చెలరేగే అవకాశాన్ని ట్రంప్ ప్రభుత్వం ప్రస్తుతం అంచనా వేయడం లేదనే సంకేతంగా ఈ నిర్ణయాన్ని మార్కెట్లు భావిస్తున్నాయి. ఇజ్రాయెల్, లెబనాన్, సౌదీ అరేబియా, ఖతార్, జోర్డాన్, ఒమన్, ఇరాక్, కువైట్‌లలోని అమెరికా దౌత్య కార్యాలయాల్లో సిబ్బందిని తిరిగి నియమించే ప్రక్రియ చేపట్టనున్నట్లు సమాచారం. వీటిలో బీరుట్‌లోని అమెరికా రాయబార కార్యాలయంలో తొలుత సిబ్బంది తిరిగి విధుల్లో చేరే అవకాశం ఉంది.

## హెచ్చుతగ్గులున్నా చివరికి లాభాలే!

**ముంబయి, ఆగస్టు 25:** దేశీయ ఈక్విటీ మార్కెట్లు మంగళవారం తీవ్ర ఒడిదుడుకుల మధ్య చివరకు లాభాలతో ముగిశాయి. ప్రారంభంలో నష్టాల్లో ట్రేడైన సూచీలు, చివరి గంటల్లో కొనుగోళ్లు పెరగడంతో కోలుకున్నాయి. భారీగా పడిపోయిన షేర్లలో ఇన్వెస్టర్లు కొనుగోళ్లు జరపడం, అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు తగ్గడం మార్కెట్‌కు ఊరటనిచ్చాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 286.98 పాయింట్లు లాభపడి 77,656.09 వద్ద ముగిసింది. నిఫ్టీ50 115.50 పాయింట్లు పెరిగి 24,334.55 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్ సమయంలో నిఫ్టీ 24,115.45 కనిష్ఠ స్థాయికి పడిపోయినా, తిరిగి పుంజుకుని 24,300 మార్క్‌ను తిరిగి అధిగమించింది. హెల్త్‌కేర్, పీఎస్‌యూ బ్యాంకులు, ఐటీ రంగాల షేర్లు మంచి ర్యాలీ తీసాయి. ప్రైవేట్ బ్యాంకులు, మెటల్ రంగ షేర్లు ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. ఇన్ఫోసిస్ - 1.24 లాభం రిలయన్స్ ఇండస్ట్రీస్ - 0.55 పెరుగుదఐసీఐసీఐ బ్యాంక్ - 0.54 లాభం



నెలవారీ డెరివేటివ్స్ ఎక్స్‌పైరీకి ముందు ట్రేడర్లు తమ పొజిషన్లను సర్దుబాటు చేసుకోవడంతో మార్కెట్లో అధిక అస్థిరత కనిపించింది. కొత్త క్లోజింగ్ ఆక్షన్ సెషన్ విధానంలో నిర్వహించిన తొలి నెలవారీ నిఫ్టీ ఎక్స్‌పైరీ కావడంతో, చివరి గంట ట్రేడింగ్ మరింత హెచ్చుతగ్గులకు లోనైంది. బీఎస్ఈ 150 మిడ్‌క్యాప్ సూచీ 0.37 పెరిగింది. బీఎస్ఈ 250 స్మాల్‌క్యాప్ సూచీ 0.17 తగ్గింది. బీఎస్ఈలో మొత్తం 2,007 షేర్లు లాభపడగా, 2,330 షేర్లు నష్టపోయాయి. 196 షేర్లు మార్పులేకుండా ముగిశాయి. కమోడిటీలు, రూపాయిఅక్టోబర్ 2026 డెలివరీ బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 2.73 డాలర్లు (2.96 ) తగ్గి 89.44 డాలర్లకు చేరింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి స్వల్పంగా బలపడింది. రూపాయి విలువ 95.4350 వద్ద ట్రేడవగా, గత ముగింపు 95.7000. భారత 10 ఏళ్ల ప్రభుత్వ బాండ్ రాబడులు 6.872 నుంచి 6.854 కు తగ్గింది. ఎంసీఎక్స్‌లో అక్టోబర్ 5 గోల్డ్ ఫ్యూచర్స్ 0.18 తగ్గి రూ.1,62,936 వద్ద ముగిశాయి. శంకేష్ జువెలర్స్ షేరు బీఎస్ఈలో రూ.95.03 వద్ద లిస్ట్ అయి, ఇష్యూ ధర రూ.93పై 2.18 ప్రీమియం నమోదు చేసింది. సన్‌షైన్ పిక్చర్స్ షేరు రూ.368.90 వద్ద లిస్ట్ అయి, రూ.360 ఇష్యూ ధరపై 2.47 ప్రీమియంతో ముగిసింది. నీలి ఫైనాన్స్, 4.74 ఎంటెరో హెల్త్‌కేర్ సొల్యూషన్స్ 6.39 నెట్‌వెబ్ టెక్నాలజీస్ ఇండియా 2.92, లార్సెన్ అండ్ టూబ్రో 0.71, సిగ్మా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్5 (అప్పర్ సర్క్యూట్)పురవంక 1.73 అఫ్కాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ 2.42 గ్రేట్ ఈస్టర్న్ షిప్పింగ్ 0.68చొప్పున పెరిగాయి. ఐపీఓలకు పెట్టుబడిదారుల నుంచి మంచి స్పందన లభించింది. అన్నూ ప్రాజెక్ట్స్0.34 రెట్లు, ఆగ్‌మాంట్ ఎంటర్‌ప్రైజెస్ 105.7 రెట్లు, స్కైవేస్ ఎయిర్ సర్వీసెస్ 2.46 రెట్లు, సింబయోటెక్ ఫార్మాల్యాబ్ 1.85 రెట్లు, హైటెక్ ఇంజినీర్స్ 19.31 రెట్లుమొత్తంగా, అంతర్జాతీయ ఉద్రిక్తతలు కొనసాగుతున్నప్పటికీ ముడి చమురు ధరలు తగ్గడం, దిగువ స్థాయిల్లో కొనుగోళ్లు పెరగడం వల్ల దేశీయ మార్కెట్లు మంగళవారం సానుకూలంగా మార్కెట్లు ముగిసాయి.




Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 1 -187, Kushalpuram, Srikakulam Dist. PIN: 532005 Ph. 270684, 271144, 9848387562 Fax : 08942–271146, RNI No. AP TEL/2004/13708 Editor :*Damerla Sai Baba *Responsible for selection of News under the PRB Act. Regd.: No.J/RNP/VM111 Air Surcharge: Delhi : 40 Ps.